ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ


తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
విజయవాడ
: fb.com/vaartha Digital

డ్వాక్రాతో మహిళల ఆర్థిక ప్రగతికి బాటలు 3లో

చిత్తూరు కోర్టుకు బాంబు బెదిరింపు

Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
9-1-2026 శుక్రవారం సంపుటి: 31 సంచిక: 339 పేజీలు: 12 వెల: 6.50

# లాజిస్టిక్స్‌లో మనమే పోటీ




గురువారం జరిగిన మంత్రిమండలి సమావేశంలో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

కృష్ణా తీరంలో మెరీనా ప్రాజెక్ట్ గేమ్ ఛేంజర్

పర్యాటకం అభివృద్ధి చెందితే ఆర్థికంగా బలపడతాం

జలరవాణా పెంచుకునే దిశగా కార్యాచరణ రూపకల్పన

కేబినెట్ భేటీలో సిఎం చంద్రబాబు

లాజిస్టిక్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఏర్పాటుకు ఓకే

ఎపి క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంకు గ్రీన్‌సిగ్నల్

రూ.19,391 కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలకు మంత్రి వర్గం ఆమోదం

జల్‌జీవన్‌కు రూ.5 వేల కోట్ల రుణానికి గ్యారెంటీ

**విజయవాడ,జనవరి8,ప్రభాతవార్తప్రతినిధి:**ఏపీలో జల రవాణా పెంచుకునే దిశగా కార్యాచరణ రూపొందించాలని సీఎం చంద్రబాబు సూచించారు. కేబినెట్ భేటీలో అజెండా అంశాలు ముగిశాక రాజకీయ, తాజా పరిణామాలపై మంత్రులతో సీఎం చర్చించారు. లాజిస్టిక్స్ వినియోగంలో ప్రపంచ స్థాయిలోపోటీ పడాలని చెప్పారు. జల రవాణా మెరుగు పరుచుకుంటే మనం అభివృద్ధి పథంలో ముందుంటామని వెల్లడించారు. ఇందుకు అనుగుణంగా ప్రతీ తీరప్రాంత జిల్లాలో ఓ పోర్టు ఏర్పాటు కావాలని స్పష్టం చేశారు. జగన్ హయాంలో విధించిన రూ.4490 కోట్లు ట్రూ అప్ చార్జీలు ప్రజలపై పడకుండా ప్రభుత్వమే భరిస్తోందని సీఎం తెలిపారు. యూనిట్ విద్యుత్ చార్జీ రూ.5.19 నుంచి రూ.4.90కి తగ్గించామని గుర్తు చేశారు. దీనిని మార్చి నాటికి రూ.4.80కి తగ్గించాలని సీఎం మంత్రులకు సూచించారు. 2029 నాటికి యూనిట్ విద్యుత్ ఛార్జి రూ.1.19 తగ్గేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉత్పత్తి పెంచుకుని, ట్రాన్స్ మిషన్ లాస్ తగ్గించాలని అలానే ధాన్యం సేకరణ ఈసారి రికార్డు స్థాయిలో చేశామని అన్ని రకాల పంటలు కొనుగోలు చేస్తున్నామని వెల్లడించారు. రైతులను కూడా ప్రత్యామ్నాయ పంటల వైపు ప్రోత్సహించాలని తెలిపారు. పర్యాటకరంగం ఓ గేమ్ ఛేంజర్ అని ఈ రంగంలో అన్ని అవకాశాలను అందిపుచ్చుకోవాలని సీఎం చంద్రబాబు సూచించారు.సముద్రంలో కలిసే జలాలు 2 తెలుగు రాష్ట్రాలు ఉపయోగించుకుంటే మేలు కదా అని సీఎం చంద్రబాబు మంత్రులతో అన్నారు. నీరు ఊరికే సముద్రం పాలవుతే ఎవరికీ ఉపయోగం ఉండదని, నీటి లభ్యత ఉంటే రైతులు కొత్త పంటలు వేసుకోవచ్చని తెలిపారు. పోలవరం పూర్తయితే కృష్ణా జలాల్ని విశాఖకు తీసుకెళ్లవచ్చని స్పష్టం చేశారు. జగన్ హయాంలోనే రాయలసీమ లిఫ్ట్ ఆగిపోతే మనపై నిందలు వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల సమన్వయంతో ప్రతీ ప్రాజెక్టు గ్రౌండ్ అవ్వాలని తేల్చిచెప్పారు. ఫెర్రో ఎల్లాయిస్ యూనిట్లు 70వేల మందికి ఉపాధి కల్పిస్తున్నాయని అభిప్రాయపడ్డారు. ఫెర్రో ఎల్లాయిస్ యూనిట్లకు ఏడాది పాటు విద్యుత్ రాయితీలు కల్పిస్తే, తర్వాత అవేవిద్యుత్ ఉత్పత్తి చేసుకుంటాయని తెలిపారు. చీరాల టూరిజం హబ్‌గా మారుతోందని పర్యాటక రంగాన్ని అక్కడ మరింత ప్రోత్సహించాలని సూచించారు. ఇక దాదాపు 35కు పైగా అజెండా అంశాలను ఆమోదించేందుకు సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గం సమావేశం కీలకం చర్చించింది. ఏపీలాజిస్టిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఏర్పాటుకు క్యాబినెట్ ఆమోదం తెలిపినట్లు తెలుస్తోంది. ఎంఎస్‌ఎంఈ పరిధిలో ఏపీ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంను ఆమోదించినట్లు సమాచారం. దాదాపు రూ. 200కోట్లతో 45 ఎంఎస్ ఎంఈ కామన్ ఫెసిలిటీ కేంద్రాల ద్వారా వచ్చే 5 ఏళ్లలో 500 మందికి ఉపాధి కల్పనే లక్ష్యంగా క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ >>2



# వైసిపి కుట్రలను తిప్పికొట్టండి

సుపరిపాలన మన విధానం

అందరూ సమన్వయంతో ముందుకెళ్లండి

ప్రజా ఫిర్యాదులను పరిష్కరించండి

పార్టీ బలోపేతం కోసం కృషి చేయండి

సిఎం నివాసంలో అల్పాహార భేటీలో టిడిపి మంత్రులతో నారా లోకేష్

**విజయవాడ, జనవరి 8 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే ప్రభుత్వం తమది కాదని విద్య, ఐటి శాఖ మంత్రి నారా లోకేశ్ వ్యాఖ్యానించారు. ప్రజలు ఎంతో నమ్మకంతో తమకు అప్పగించిన బాధ్యతను నిర్వహిస్తామన్నారు. గత ప్రభుత్వ దుర్మార్గపు చర్యల గుణపాఠం చెప్పి సుపరిపాలన అందిస్తామనే ప్రజలు తమకు అధికారం ఇచ్చారన్నారు. వైఎస్సార్‌సిపి మాదిరి రప్పా రప్పా మన విధానం కాదన్నారు. జగన్ లా ప్రజల్ని భయపెట్టడం, బెదిరించడం, దౌర్జన్యాలకు పాల్పడటం వంటివి తెలుగుదేశం సంస్కృతి కాదన్నారు. ఉండవల్లి సిఎం క్యాంపు కార్యాలయంలో తెలుగుదేశం మంత్రులతో నారా లోకేశ్ అల్పాహార విందులో పాల్గొన్నారు. ఈ క్రమంలో ఆయన వారితో వివిధ అంశాలపై చర్చించారు. ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తూ ఎంత మేర సేవ చేశామన్నదే తమ అజెండా కావాలని మంత్రులకు నారా లోకేశ్ సూచించారు. అభివృద్ధి- సంక్షేమం రెండింటినీ సమన్వయం చేస్తూ ప్రజలకు ఎంత ప్రయోజనం చేకూర్చామన్నదే కూటమి విధానమని స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ కుట్రలను పార్లమెంటు వారీగా నేతలు సమర్థంగా తిప్పికొట్టాలని మంత్రి లోకేశ్ పునరుద్ఘాటించారు. పార్లమెంట్ కేంద్రాల్లో నేతలు ఏకతాటిపై నడుస్తూ వైఎస్సార్‌సీపీ అసత్య ప్రచారాలకు దీటుగా బదులివ్వాలన్నారు. ప్రజావేదికలో తమకు వచ్చే ఫిర్యాదులు పరిష్కారమయ్యేలా మంత్రులు బాధ్యత తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. తమ శాఖలకు సంబంధించిన అర్జీల పరిష్కారానికి మంత్రులు చొరవ చూపాలని వివరించారు. పార్టీ మరింత బలో పేతమే లక్ష్యంగా క్యాడర్‌ని >>2



# ప్రధాని మోడీ ఆస్తులెన్నంటే!

2014లో రూ.1.65 కోట్లు

2026లో రూ.3.02 కోట్లు

80శాతం పెరిగిన సంపద

రాహుల్ ఆస్తుల్లోనూ భారీ మార్పులు

ఎంపిల ఆస్తులు పదేళ్లలో 110 శాతం పెరుగుదల

2లో



# అంతరిక్షంలో డేటా సెంటర్లు

ఇస్రో ముమ్మర కసరత్తు

ఛైర్మన్ నారాయణన్ వెల్లడి

## పరకామణి కేసులో బాధ్యులపై చర్యలు తీసుకోండి

సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ముందుకెళ్లండి

ఎసిబి డిజి, సిఐడి అధికారులకు హైకోర్టు ఆదేశం

సతీష్‌కుమార్ మృతి దర్యాప్తును పర్యవేక్షిస్తాం

సిఐడి అధికారులకు ధర్మాసనం స్పష్టీకరణ

**విజయవాడ, జనవరి 8 ప్రభాతవార్త ప్రతినిధి:** పరకామణి కేసులో సుప్రీంకోర్టు ఆదేశాలను పరిగణనలోకి తీసుకుని చట్టప్రకారం ముందుకెళ్లాలని ఎసిబి డిజి, సిఐడి అధికారులకు ఏపీ హైకోర్టు ఆదేశించింది. అలాగే బాధ్యులైన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని టిటిడి, పోలీసు, సంబంధిత శాఖల ఉన్నతాధికారులకు హైకోర్టు స్పష్టం చేసింది. టిటిడి పరకామణి కేసు విచారణ సందర్భంగా గురువారం ఈ మేరకు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసులో నిందితుడు రవికుమార్‌తో కుమ్మక్కై పరకామణి కేసును.. టిటిడి, పోలీసులు బలహీన పరిచారని పేర్కొంది. నిందితుడు రవికు మార్‌తోపాటు అతడి >>2

## టైమ్ స్లాట్ టోకెన్ల జారీ షురూ! 

3లో

## పిఠాపురానికి సంక్రాంతి శోభ

నేడు ప్రారంభించనున్న డిప్యూటీ సిఎం పవన్

రూ.212కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం



**ఉమ్మడి తూర్పుగోదావరి బ్యూరో, జనవరి8 ప్రభాతవార్త :** కాకినాడ జిల్లా పిఠాపురం వేదికగా ఈనెల 9 నుంచి 11వతేదీ వరకు నిర్వహించనున్న పీఠికాపుర సంక్రాంతి మహోత్సవాల ఏర్పాట్లు పూర్తయ్యాయి. రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శుక్రవారం ఉదయం పీఠికాపుర సంక్రాంతి మహోత్సవం పేరిట నిర్వహించనున్న ముందస్తు సంక్రాంతి సంబరాలను ఆర్ఆర్‌బీహెచ్‌ఆర్ కళాశాల మైదానంలో ప్రారంభిస్తారు. అనంతరం నియోజకవర్గ పరిధిలో చేపట్టనున్న రూ.186 కోట్ల విలువైన పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శంకుస్థాపనలు, రూ.26 కోట్లతో పూర్తి చేసిన పలు పనులకు ప్రారంభోత్సవాలు చేయనున్నారు. అనంతరం సంక్రాంతి మహోత్సవంలో పాల్గొని సాంస్కృతిక కార్యక్రమాలు, స్టాళ్లను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తిలకిస్తారు. సాయంత్రం పిఠాపురం మున్సిపాలిటీ పరిధిలో ఇటీవల ముంపునకు గురైన ఇందిరానగర్ కాలనీ, రైల్వే స్టేషన్ సమీపంలోని మోహన్‌నగర్‌లను సందర్శిస్తారు. శనివారం ఉదయం గొల్లప్రోలు ప్రాంతంలోని ఇళ్ల స్థలాలను పరిశీలించిన అనంతరం కాకినాడలోని జిల్లా పోలీస్ కార్యాలయానికి చేరుకుని శాంతి భద్రతలపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. కాకినాడలోని రంగరాయ మెడికల్ కళాశాలకు చేరుకుని రూ.10.11 కోట్లతో చేపట్టే పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయనున్నారు.

# అట్లాంటిక్‌లో చమురు యుద్ధం

వెనిజులా నౌకలకు రక్షణగా రష్యా నౌక

క్రెమ్లిన్ నౌకను బందీగా తీసుకున్న అమెరికా

రష్యా ఆగ్రహం... అమెరికా పడవలను ముంచేస్తాం



9లో

తేడాలొస్తే టార్పిడోలతో దాడులు చేస్తామని హెచ్చరిక

రక్షణ బడ్జెట్‌ను పెంచేసిన ట్రంప్ సర్కార్

వెనిజులా ఆయిల్‌ను మేమే నియంత్రిస్తాం

ట్రంప్ పునరుద్ఘాటన

కొలంబియా అధ్యక్షుడికి ఆహ్వానం

## భారత్‌పై 500శాతం సుంకాలు విధింపు

రష్యా చమురుపైనా ఆంక్షలు

చైనా, భారత్‌పై యుఎస్ అక్కసు

మోడీని కించపరుస్తూ వ్యాఖ్యలు

భారత్ తీవ్ర అభ్యంతరం


ఫ్రాన్స్ అధ్యక్షుడు మండిపాటు

# సీమకు మళ్లీ అన్యాయం

రేవంత్‌రెడ్డితో చంద్రబాబు కుమ్మక్కు

రాష్ట్ర ప్రయోజనాలు తాకట్టు

మండిపడ్డ వైసిపి అధినేత జగన్



**విజయవాడ, జనవరి 8 ప్రభాతవార్త ప్రతినిధి:** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డితో కుమ్మక్కై ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యంగా రాయలసీమకు తీరని అన్యాయం చేస్తున్నారని వైఎస్సార్‌సిపి అధినేత జగన్ మండిపడ్డారు. తన స్వార్థ రాజకీయాల కోసం రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నారని ఆరోపించారు. అనుమతులు లేకుండా తెలంగాణలో ప్రాజెక్టులు కడుతున్నా, ఎపికి నీళ్లు లేకుండా చేస్తున్నా పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. తాడేపల్లిలో గురు వారం మీడియా సమావేశంలో జగన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేశారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రానికి, ప్రధానంగా రాయలసీమకు జరుగుతున్న అన్యాయం గురించి ప్రజలంతా ఆలోచించాలని జగన్ పిలుపునిచ్చారు. రాయలసీమ లిఫ్ట్ ఆపించామని రేవంత్ రెడ్డి సభలో చెబితే ముఖ్యమంత్రి చంద్రబాబు ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. మీడియా సమావేశంలో జగన్ ఇంకా ఏమన్నారంటే 'రాయలసీమ ప్రజల పాలిట సిఎం చంద్రబాబు విలన్‌లా మారాడు. రాయలసీమ ఎత్తిపోతలను చంపేయడం అంటే సీమకు తీరని ద్రోహంచేయడమే. చంద్రబాబు తెలంగాణ సిఎంరేవంత్‌తో చీకటి ఒప్పందం >>2

# ఐప్యాక్‌లో ఇడి సోదాలు

ప్రతీక్‌జైన్ ఇంట్లో ఇడి అధికారులతో మమతా బెనర్జీ వాగ్వాదం

కీలక దస్త్రాలు తీసుకెళ్లారని ఇడి ఆరోపణ

అమిత్‌షాపై మమత ఆగ్రహం, టిఎంసి, బిజెపిల మధ్య మాటల యుద్ధం

**కోల్‌కత్తా, జనవరి 8:** పశ్చిమ బెంగాల్‌లో రాజకీయ వేడి మరోసారి భగ్గుమంది. ప్రముఖ ఎన్నికల వ్యూహరచన సంస్థ ఇండియా పొలిటికల్ యాక్షన్ కమిటీ (ఐప్యాక్) కార్యాలయాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దాడులు నిర్వహించడంపై ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది పూర్తిగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా పన్నిన కుట్రేనని, దేశ చరిత్రలోనే ఇంతటి దుర్మార్గపు, నీచమైన హోం మంత్రిని చూడలేదని ఆమె తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గురువారం ఉదయం నుంచి కోల్‌కతాలోని సాల్ట్ లేక్‌లో ఉన్న ఐప్యాక్ ప్రధానకార్యాలయంతో పాటు,సంస్థ సహా >>2





గుర్‌గామ్‌లో ఫుడ్‌ఫెస్టివల్‌ను ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్

# లాజిస్టిక్స్‌లో మనమే పోటీ

>> అమలు కానుంది. రాష్ట్రంలో వివిధ పరిశ్రమల ఏర్పాటుకు పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డులో తీసుకున్న నిర్ణయాలను క్యాబినెట్ లో ఆమోదించారు. బార్లలో అదనపు రీటైల్ ఎక్సైజ్ ట్యాక్స్ ఉపసంహరణపై మంత్రివర్గ ఉపసంఘం నివేదికపై చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో మైక్రో బ్రువరీలు ఏర్పాటుకు సంబంధించి మంత్రివర్గ ఉపసంఘం నివేదికపై చర్చించి ఆమోదం తెలపనున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో జల్‌జీవన్ ద్వారా నీటి సరఫరాకు రూ.5 వేల కోట్ల రుణం పొందేందుకు ప్రభుత్వ గ్యారెంటీకి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళిలో కొత్త ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. 1 నుంచి 10వ తరగతి విద్యార్థులకు పాఠశాల కిట్‌లు పంపిణీకి 944.53 కోట్ల రూపాయల పరిపాలన అనుమతులకు ఆమోదించనున్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో సంప్రదాయేతర ఇంధన, విద్యుత్ ప్రాజెక్టులు ఏర్పాటుకు ఆమోదించింది. సీఆర్డీయే అథారిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలకు ఆమోదం తెలపనుంది. వివిధ సంస్థల భూకేటాయింపులకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో మరో రూ.19,391 కోట్ల పెట్టుబడుల ద్వారా 11,753 ఉద్యోగాలు కల్పించే ప్రతిపాదనాలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. పరిశ్రమలు, పర్యాటకం, ఫుడ్ ప్రాసెసింగ్, ఇంధన రంగాల్లో వివిధ పెట్టుబడులకు సంబంధించి మొత్తంగా 14 సంస్థల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది అమరావతిలో కృష్ణా తీరంలో మెరీనా ప్రాజెక్టు ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదం లభించింది. – ఆర్థ కోస్టల్ రిసార్ట్స్ బాపట్ల జిల్లారూ. 187.58 కోట్లు250 ఉద్యోగాలు సైవెన్, యూనిపై కన్సార్షియం, బాపట్ల జిల్లారూ. 183.87 కోట్లు196 ఉద్యోగాల కల్పన శుభం ఇంద్రనీర్ కన్సార్షియం, బాపట్ల జిల్లారూ. 64.44 కోట్లు100 ఉద్యోగాలు కల్పన.ఇస్కాన్, సత్యసాయి జిల్లా రూ. 425.20 కోట్లు1035 ఉద్యోగాలు,సంఘం మిల్క్ ప్రొడ్యూసర్స్ ,అనంత జిల్లా రూ. 200.82 కోట్లు245 ఉద్యోగాలు కల్పన,నవ ఫుడ్ సెంటర్‌తిరుపతి జిల్లా రూ. 44.42 కోట్లు500 ఉద్యోగాలు కల్పనకు వెబ్ సోల్ రెన్యూవబుల్, నాయుడుపేటరూ. 3538 కోట్లు1980 ఉద్యోగాలు టాటా పవర్‌నెల్లూరు జిల్లారూ. 6675 కోట్లు1000 ఉద్యోగాలు కల్పన,.రామ్ కో సిమెంట్స్ నంద్యాల జిల్లా రూ. 1500 కోట్లు300 ఉద్యోగాలు కల్పన షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్ కడప జిల్లారూ. 5571 కోట్లు5000 ఉద్యోగాల కల్పన,ఎథిరియల్ ఎక్స్ ప్లోరేషన్ గిల్డ్, తిరుపతి జిల్లారూ. 578 కోట్లు382 ఉద్యోగాలు పయనీర్ క్లీన్ యాంప్స్, చిత్తూరు జిల్లారూ. 159 కోట్లు600 ఉద్యోగాలు రాధికా వెజిటబుల్స్ ఆయిల్స్, విజయ నగరం జిల్లారూ. 234 కోట్లు165 ఉద్యోగాలురిలయెన్స్ కన్స్యూమర్స్, అనకాపల్లి జిల్లా రూ. 30కోట్లు పెట్టుబడులకు మంత్రివర్గం సూత్రప్రాయంగా ఆమోదం తెలిపింది. సీఆర్డీఏ(క్రడా) 2015లో జీవో నెంబర్ 81 ద్వారా మంజూరు చేసిన 754 పోస్టుల ర్యాటిఫికేషన్‌కు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.. వాటిలో కొన్ని పోస్టుల్ని డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా, కొన్ని పోస్టుల్ని డిప్యుటేషన్, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ విధానంలో నియమించుకునేందుకు ప్రభుత్వం అప్పుడే వెసులుబాటు కల్పించింది. రాజధానికి భూములిచ్చిన రైతులకు కేటాయించిన వాణిజ్య స్థలాల్లో వీధిశూల ఉన్నవాటికి బదులు వేరే స్థలాల్ని కేటాయించే ప్రతిపాదనలకు మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. పలు సంస్థలకు భూ కేటాయింపులతో పాటు ఇతర కీలక నిర్ణయాలకు క్యాబినెట్ ఆమోదం లభించింది. సూర్యలంకలో కొత్తగా 3 హోటళ్ల ఏర్పాటుకు ఏపి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. గురువారం అమరావతిలో నిర్వహించిన మంత్రివర్గ సమావేశం ముగిసింది. ఈ సందర్భంగా సిఎం చంద్రబాబు మాట్లాడుతూ పోలవరం పూర్తయితే గోదావరి జలాలను విశాఖకు తీసుకెళ్లవచ్చని అన్నారు. వైసిపి అధినేత జగన్ హయాంలోనే రాయలసీమ లిఫ్ట్ ఆగిపోతే తమపై నిందలు వేస్తున్నారని విమర్శించారు. అధికారుల సమన్వయంతో ప్రతీ ప్రాజెక్టు గ్రౌండ్ కావాలని చెప్పారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ దూకుడు

### విచారణకు హాజరైన బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జనవరి 8:** తెలంగాణలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ దర్యాప్తు మరింత ఊపందుకుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అక్రమంగా ఫోన్లు ట్యాప్ చేసిన ఆరోపణలపై సిట్ దూకుడుగా విచారణ చేపడుతోంది. ఈ క్రమంలో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేసిన సిట్.. వారిని విచారిస్తోంది. ఇందులో భాగంగా బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ గురువారం జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో సిట్ ఎదుట విచారణకు హాజరయ్యారు. గతేడాది నవంబర్ 17న కూడా ఆయన సిట్ విచారణకు హాజరైన సంగతి తెలిసిందే. తాజాగా మరోసారి నోటీసు అందడంతో బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ విచారణకు రాగా.. సిట్ అధికారులు ఈ కేసుకు సంబంధించి పలు ప్రశ్నలు సంధించినట్లు తెలుస్తోంది. ఎన్నికల సమయంలో ఈ కేసులో నిందితుడైన అడిషనల్ ఎస్పీ తిరుపతన్న, జైపాల్ యాదవ్ మధ్య ఫోన్ సంభాషణలు జరిగినట్లు సిట్ గుర్తించింది. దర్యాప్తులో భాగంగా.. ఒక కేసులో భార్యాభర్తల మధ్య తలెత్తిన సమస్యపై తిరుపతన్నతో మాట్లాడినట్లు జైపాల్ యాదవ్ వాంగ్మూలం ఇచ్చారు. అయితే సిట్ అధికారులు ఎన్నికల సమయంలో జరిగిన ఈ కాల్స్, సంభాషణలపై లోతుగా విచారించారు. జైపాల్ యాదవ్ ఇచ్చిన స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేసినట్లు సమాచారం. అలాగే ఈ కేసులో మరో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యనూ సిట్ విచారించనుంది. ఇటీవల సిట్ జారీ చేసిన నోటీసుల్లో భాగంగా ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలతోపాటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడు కొండల్ రెడ్డి కూడా విచారణకు హాజరు కానున్నారు. బీఆర్ఎస్ హయాంలో కొండల్ రెడ్డి ఫోన్ ట్యాప్ అయినట్లు దర్యాప్తులో తేలడంతో ఆయనను సాక్షి గా పిలిచినట్లు తెలుస్తోంది.

## ఎసిబి వలలో జిల్లా పౌరసరఫరాల అధికారి

### రూ. 50 వేల లంచం తీసుకుంటూ పట్టుబడిన డిఎం జగన్మోహన్

**వనపర్తి క్రైమ్, జనవరి 8, ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా పౌరసరఫరాల సంస్థ కార్యాలయంలో పనిచేస్తున్న డీఎం జగన్మోహన్ గురువారం సాయంత్రం తన కార్యాలయం నుంచి ఇంటికి వెళుతూ ఐడిఓసి కార్యాలయ ఆవరణలో రూ.50 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. ఓ మిల్లుకు సీఎంఆర్ పర్మిషన్ ఇవ్వడానికి రూ. 1,70,000 ఒక లక్ష డెబ్బై వేల రూపాయలు డిమాండ్ చేశాడు. బాధితుడుతో రూ. 50 వేలకు బేరం కుదరడంతో ఒప్పందంలో భాగంగా గురువారం వనపర్తిలోని తన కార్యాలయం నుంచి ఇంటికి వెళ్తూ ఐడిఓసి కార్యాలయ ఆవరణలో తన కారులో రూ. 50 వేలు లంచం తీసుకుంటుండగా పక్కా సమాచారం మేరకు ఏసీబీ అధికారులు దాడి చేసి పట్టుకున్నట్లు ఏసీబీ డీఎస్పీ బాలకృష్ణ తెలిపారు. నిందితుడిని శుక్రవారం నాంపల్లి ఏసీబీ కోర్టులో ప్రవేశపెట్టనున్నట్లు ఏసీబీ డిఎస్పి తెలిపారు. పౌర సరఫరాల అధికారి జగన్మోహన్ ఏసీబీకి పట్టుబడ్డ తర్వాత ఐడిఓసి భవనం ముందు గుర్తుతెలియని వ్యక్తులు బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకోవడం కొసమెరుపు.



తెలంగాణ సిఎం రేవంత్‌తో భేటీ అయిన హిమాచల్ ప్రదేశ్ విద్యాశాఖ మంత్రి రోహిత్ ఠాగూర్ బృందం

## నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ తరహాలో తెలంగాణ విద్యావిధానం

### మినీవర్సిటీ తరహాలో రూ.200 కోట్లతో రెసిడెన్షియల్ స్కూళ్లను నిర్మిస్తున్నాం

### సిఎం రేవంత్‌రెడ్డిని కలిసిన హిమాచల్‌ప్రదేశ్ విద్యామంత్రి రోహిత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 8:** నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ తరహాలో త్వరలో తెలంగాణ ఎడ్యుకేషన్ పాలసీని తీసుకు రానున్నట్లు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించి ఒక కమిటీని నియమించామని, త్వరలోనే పాలసీని తీసుకువస్తామని పేర్కొన్నారు. గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని హిమాచల్ ప్రదేశ్ విద్యాశాఖ మంత్రి రోహిత్ ఠాగూర్ బృందం మర్యాదపూర్వకంగా కలిసింది.ఈసమావేశంలో పాల్గొన్న విద్యా శాఖ కమిషనర్ యోగితా రాణా, పాఠశాల విద్య డైరెక్టర్ నవీన్ నికోలస్, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి, హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో విద్యా వ్యవస్థలో తీసుకు వస్తున్న సంస్కరణలు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు వివరాలను హిమాచల్ ప్రదేశ్ మంత్రికి సిఎం వివరించారు. 25 ఎకరాల సువిశాల స్థలంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు ఒకే చోట మినీ యూనివర్సిటీ తరహాలో రూ.200 కోట్లతో రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నట్లు సిఎం చెప్పారు.ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల బలోపేతం చేసేందుకు వీలుగా ప్రీ ప్రైమరీ విద్య అందించే విధానం అమలు చేయనున్నట్లు మంత్రికి వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రీ ప్రైమరీ చిన్నారులను పాఠశాలలకు తీసుకెళ్లేందుకు రవాణా సౌకర్యాన్ని కల్పించే యోచన చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఐటిఐలను ఏటీసీలు గా తీర్చిదిద్దుతున్నట్లు వివరించారు. ప్రతి నియోజకవర్గంలో ఏటీసీ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు సిఎం తెలిపారు.మల్లెపల్లి ఐటీసీని సందర్శించాలని హిమాచల్ ప్రదేశ్ మంత్రికి సిఎం సూచించారు.ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణం పైన ఆసక్తి చూపించిన హిమాచల్ ప్రదేశ్ మంత్రి...ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఏర్పాటుకు సంబంధించిన సమగ్ర నివేదికను తమకు అందించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ విద్యావ్యవస్థను పటిష్టతకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజన్‌ను హిమాచల్‌ప్రదేశ్ విద్యా శాఖ మంత్రి రోహిత్‌ఠాగూర్ అభినందించారు.



గురువారం ఢిల్లీలో రిపబ్లిక్ డే వేడుకలకు సంబంధించి రిహార్సల్ చేస్తున్న ఢిల్లీ పోలీసులు

## ప్రధాని మోడీ ఆస్తులెన్నంటే!

**న్యూఢిల్లీ, జనవరి 8:** దేశంలో ఎంపీల ఆస్తులు భారీగా పెరిగాయి. అదే సమయంలో గడచిన పదేండ్లలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆస్తులు కూడా దాదాపు 80 శాతం పెరిగింది. ఈ మేరకు ఏడీఆర్ నివేదిక వెల్లడించింది. సదరు నివేదిక ప్రకారం 2014లో ఎంపీగా పోటీ చేసిన సమయంలో దాఖలు చేసిన అఫిడవిట్ ప్రకారం ప్రధానితన ఆస్తుల విలువ రూ.1.65 కోట్లుగా ప్రకటించారు. ఈ పదేండ్లలో మోదీ ఆస్తుల విలువ భారీగా పెరిగింది. దాదాపు 80 శాతం వృద్ధి కనిపించింది. ప్రస్తుతం ప్రధాని ఆస్తుల విలువ రూ.3,02,06889కు చేరింది. ప్రధానంగా ఫిక్స్‌డ్ డిపాజిట్లు, బ్యాంక్ నిల్వల రూపంలోనే ఈ ఆస్తులు ఉన్నాయి. ఇక ప్రధానికి సొంతంగా కారు గానీ, ఇతర స్థిరాస్తులు గానీ లేవు. ఈ పదేండ్లలో మోదీ ఆస్తుల్లో వృద్ధి నమోదైనప్పటికీ దేశంలోని ఎంపీలతో పోలిస్తే పూరెస్ట్ పర్సన్ కావడం గమనార్హం. అదే సమయంలో కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆస్తుల్లో కూడా భారీ మార్పులు కనిపిస్తున్నాయి. 2014 ఎన్నికల సమయంలో రాహుల్ ఆస్తుల విలువ రూ.9.4 కోట్లుగా ఉంది. 2024 నాటికి అది రూ.20.39 కోట్లకు పెరిగింది. ఈ పదేండ్లకాలంలో ఆయన సంపద దాదాపు 117శాతం వృద్ధిచెందింది. రాహుల్ గాంధీ పెట్టుబడులు ప్రధానం గా షేర్ మార్కెట్, మ్యూచువల్ ఫండ్స్ మరియు స్థిరాస్తుల రూపంలో ఉన్నట్లు ఏడీఆర్ నివేదికవెల్లడించింది. ఇక దేశంలో పదేండ్ల పాటు ఎంపీలుగా కొనసాగుతన్న వారి ఆస్తులు సుమారు 110 శాతం మేర పెరిగినట్లు సదరు నివేదిక పేర్కొంది. ఎంపీల సంపద వృద్ధిపై ఏడీఆర్‌నివేదిక ప్రస్తుతం దేశవ్యాప్తంగా చర్చకు దారితీసింది.

## సీమకు మళ్లీ అన్యాయం

>> చేసుకున్నారు. తాను చెబితేనే చంద్రబాబు రాయలసీమ ఎత్తిపోతల ఆపేశారని రేవంత్ చెప్పడమే అందుకు నిదర్శనం. నాకు పేరొస్తుందనే చంద్రబాబు రాయలసీమ ప్రాజెక్టును అడ్డుకుంటున్నారు. తెలంగాణ రోజూ 78 టిఎంసిల నీటిని ప్రతిరోజూ తీసుకుంటుంది. మనకు మాత్రం 0.6 టిఎంసిలు కూడా తీసుకునే పరిస్థితి లేదు. శ్రీశైలం పవర్ హౌస్ నుంచి 777 అడుగుల నుంచి కూడా నీటిని తీసుకుంటున్నారు. పోతిరెడ్డిపాడులో ఇప్పుడున్న రెగ్యులేటర్ ద్వారా 880 అడుగులు ఉంటే కానీ.. పూర్తిస్థాయిలో నీటిని తీసుకోలేము. 770 అడుగుల నుంచే నీటిని తోడేస్తుంటే.. ఇక పోతిరెడ్డిపాడుకు నీళ్లు ఎప్పుడొస్తాయి..? శ్రీశైలం ఎప్పుడు నిండుతుంది. అందుకే... రాయలసీమ ఎత్తిపోతల పథకం ప్రారంభించాం. రాయలసీమకు అనుమతులు లేవంటున్నారు.... కానీ కల్వకుర్తి విస్తరణ, నెట్టెంపాడు, పాలమూరు రంగారెడ్డి వీటిలో వేటికీ అనుమతులు లేవు.. వాళ్లు బాగానే చేసుకుంటున్నారు కదా. 800 అడుగుల్లో రాయలసీమ లిఫ్ట్ ద్వారా రోజుకు 3 టిఎంసిలు తరలించేందుకు దానిని రూపకల్పన చేశాం. చంద్రబాబు దానిని అడ్డుకోవడానికి తెలంగాణలో తన కార్యకర్తల ద్వారా ఎన్జీటిలో కేసు వేయించారు. అయినా మేం పనులు కొనసాగించాం. అసలు రాయలసీమ లిఫ్ట్ ప్రాజెక్టు వృథా అన్నట్టుగా చంద్రబాబు ప్రచారం చేస్తున్నారని జగన్ మండిపడ్డారు. టిడిపి నేతలతో ఇదే ప్రచారం చేయిస్తున్నారు" అని మండిపడ్డారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కొత్త ప్రాజెక్టు కాదని జగన్ అన్నారు. దీనిపై ఎవరికీ అభ్యంతరం ఉండక్కర్లేదని చెప్పుకొచ్చారు. ప్రాజెక్టుల విషయంలో అధికారంలో ఉన్న వాళ్లు భావోద్వేగానికి గురి చేస్తున్నారని జగన్ మండిపడ్డారు. అలాగని చెప్పి విడిపోయి ఒకటిగా ఉన్న తెలంగాణకు అన్యాయం చేయాలని కూడా చూడటం లేదని చెప్పారు. అదే టైంలో తమ ప్రాంతానికి నష్టం లేకుండా చూసుకోవడం తన ధర్మమని అన్నారు.

## కుట్రలను తిప్పికొట్టండి

>>ఏకతాటిపైకి తెచ్చేందుకు ఇన్‌ఛార్జి మంత్రులు పని చేయాలని మంత్రి నారా లోకేశ్ సూచించారు. సామాజిక మాధ్యమాల్లో విద్వేషపూరిత పోస్టులు పెట్టేవారిపై కఠినంగా వ్యవహరించాలని మంత్రి నారా లోకేశ్ సూచించారు. సామాజిక మాధ్యమాల్లో జవాబుదారీతనం, పౌరుల రక్షణను బలోపేతం చేయడం అనే అంశంపై సచివాలయంలో నిర్వహించిన మంత్రుల బృంద సమావేశంలో లోకేశ్ వ్యాఖ్యానించారు. ఐటీ చట్టంలో ఇందుకు ఉన్న నిబంధనలపై చర్చించారు.

### బాధ్యులపై చర్యలు తీసుకోండి

>> కుటుంబ సభ్యులకు ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నాయని.. సిఐడి, ఎసిబి నివేదికలు పరిశీలిస్తే స్పష్టమవుతుందని తెలిపింది. నిందితుడు రవికుమార్ ఆస్తులు స్వీకరించే క్రమంలో టిటిడి అధికారులు, బోర్డు సభ్యులు, పోలీసులు చట్ట ప్రకారం నిబంధనలను అనుసరించలేదని హైకోర్టు అభిప్రాయపడింది. ఇక మాజీ ఎవిఎస్ఓ సతీష్ కుమార్ మృతిపై దర్యాప్తు వేగవంతం చేయాలని సిఐడి అధికారులను ఆదేశించింది.కేసు తీవ్రత దృష్ట్యా చార్జ్‌షీట్ దాఖలు వరకూ దర్యాప్తును పర్యవేక్షిస్తామని స్పష్టం చేసింది. పరకామణిలో సంస్కరణలపై టిటిడి సమర్పించిన నివేదికపై హైకోర్టు ఒకింత అసంతృప్తి వ్యక్తం చేసింది.అత్యుత్తమ ఆలోచనలతో రావాలని టిటిడి ఈవో అనిల్ కుమార్ సింఘాల్‌కు హైకోర్టు స్పష్టంగా ఆదేశించింది. తిరుమల శ్రీవారి పరకామణిలో చేపట్టాల్సిన సంస్కరణలపై నివేదికను ఇటీవల హైకోర్టుకు టిటిడి సమర్పించింది. ఈ నివేదికను పరిశీలించిన హైకోర్టు గురువారంపై విధంగా స్పందించింది.

## అంతరిక్షంలో డేటా సెంటర్లు

**బెంగళూరు, జనవరి 8:** భారతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో అంతరిక్షంలో డేటా సెంటర్లను ఏర్పాటు చేయాలని యోచిస్తోంది. ఆ ప్రణాళికను అమలు చేసేందుకు ఇస్రో ఓ కార్యాచరణ చేపట్టినట్లు తెలుస్తోంది. భూ కక్ష్యలో ఫిజికల్‌గా డేటా సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు ఇస్రో ఛైర్మన్ వీ నారాయణన్ వ్యాఖ్యానించారు. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న అంతరిక్ష శాఖ కూడా ఈ విషయాన్ని స్పష్టం చేసింది. లో ఎర్త్ ఆర్బిట్‌లో డేటా సెంటర్లను నిర్మించేందుకు ప్లాన్ చేస్తున్నారు. భూమి నుంచి సుమారు 200 నుంచి 2000 కిలోమీటర్ల ఎత్తులో ఉన్న కక్ష్యలో లేదా 36 వేల కిలోమీటర్ల ఎత్తు వరకు ఉన్న జియోస్టేషనరీ కక్ష్యలో ఆ డేటా సెంటర్లను ఏర్పాటు చేసే యోచనలో ఇస్రో ఉన్నది. స్పేస్ డేటా సెంటర్లలో కంప్యూటింగ్ హార్డ్‌వేర్, స్టోరేజ్ సిస్టమ్స్, కమ్యూనికేషన్ ఎక్విప్మెంట్‌ను ఫిక్స్ చేయనున్నారు. భవిష్యత్తుకు కావాల్సిన టెక్నాలజీ కేంద్రాలను నిర్మించాలన్న ఉద్దేశంతో అంతరిక్షంలో డేటా ప్రాసెసింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు ఇస్రో చీఫ్ వీ నారాయణన్ తెలిపారు. అయితే ప్రస్తుతం ప్రాథమిక పనులు మాత్రమే జరిగినట్లు చెప్పారు. ప్రస్తుతం శాటిలైట్లు కేవలం డేటా సేకరణకు మాత్రమే పనిచేస్తున్నాయి. ఇమేజ్‌లు, సిగ్నల్స్ అందుకున్న ఆ ఉపగ్రహాలు ఆ తర్వాత గ్రౌండ్ స్టేషన్‌లో డౌన్‌లింక్ అవుతున్నాయి. అక్కడ వాటికి ప్రాసెసింగ్ జరుగుతుంది. అయితే స్పేస్‌లో డేటా సెంటర్ల ఏర్పాటుతో కొత్త ఒరవడికి ఇస్రో శ్రీకారం చుట్టనున్నది. ఆన్ బోర్డ్ ప్రాసెసింగ్ తో పాటు శాటిలైట్ కమ్యూనికేషన్ డేటా స్టోరేజ్ చేయనున్నారు. కక్ష్యలోనే శాటిలైట్ డేటాను రీకాన్ఫిగరేషన్ చేసే ప్రక్రియపై ఇస్రో దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. మీడియాకు ఇంటర్వ్యూలో కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ కూడా ఈ విషయాన్ని వెల్లడించారు. అపరిమితమైన సౌరశక్తిని వినియోగించే ఉద్దేశంతో డేటా సెంటర్లనుఅంతరిక్షంలో ఏర్పాటు చేయాలని టెకీ కంపెనీలు, అంతరిక్ష సంస్థలు భావిస్తున్నాయి. స్పేస్ డేటా సెంటర్ల ద్వారా ట్రాన్స్‌మిషన్ జాప్యాలను కూడా తగ్గించవచ్చు అని అంచనా వేస్తున్నారు. స్పేస్‌లోనే డేటా ప్రాసెసింగ్ జరగడం వల్ల బ్యాండ్‌విడ్త్ సేవ్ అవుతుందని, దీంతో భూమిపై ఖర్చుల భారం తగ్గుతుందనిఅంతరిక్ష విశ్లేషకుడు గిరీశ్ లింగన్న తెలిపారు. ప్రకృతి విపత్తులు, సైబర్ దాడులు, రాజకీయ ఉద్రిక్తతల నుంచి అంతరిక్ష డేటా సెంటర్లకు ఎటువంటి ప్రమాదం ఉండదని భావిస్తున్నారు.

## ఐప్యాక్‌లో ఇడి సోదాలు

>> వ్యవస్థాపకుడు ప్రతీక్ జైన్ నివాసంలోనూ ఈడీ అధికారులు ఏకకాలంలో సోదాలు ప్రారంభించారు. కేంద్ర సాయుధ బల గాల (సీఏపీఎఫ్)పటిష్ట భద్రత నడుమ ఈ దాడులు జరిగాయి. విషయం తెలుసుకున్న వెంటనే మమతా బెనర్జీ, కోల్‌కతా పోలీస్ కమిషనర్ మనోజ్ కుమార్ వర్మతో కలిసి నేరుగా ప్రతీక్ జైన్ నివాసానికి చేరుకున్నారు. ఇంట్లోకి వెళ్లి ఈడీ అధికారులతో మాట్లాడి, కొద్దిసేపటి తర్వాత బయటకు వచ్చిన ఆమె, మీడియాతోమాట్లాడుతూ కేంద్రంపై నిప్పులు చెరిగారు. నా పార్టీతృణమూల్ కాంగ్రెస్‌కు సంబంధించిన పత్రాలను ఈడీ అధికారులు స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నించారు. నేను వాటిని తిరిగి తీసుకువచ్చాను. ఈ పనికిమాలిన కేంద్ర హోంమంత్రి దేశాన్ని రక్షించలేరు, కానీ ఈడీ ద్వారా నా పార్టీ పత్రాలను లాక్కోవాలని చూస్తున్నారు. నేను ప్రతీక్‌కు ఫోన్ చేశాను. అతని ఫోన్, హార్డ్ డిస్క్‌లను స్వాధీనం చేసుకోవాలని అధికారులు చూశారని మమత ఆరోపించారు. అనంతరం సాల్ట్ లేక్‌లోని ఐప్యాక్ కార్యాలయానికి కూడా వెళతానని ఆమె తెలిపారు. 2021 అసెంబ్లీ ఎన్నికలకు ముందు, అంటే 2020 నుంచి ఐప్యాక్ సంస్థ తృణమూల్ కాంగ్రెస్‌కు ఎన్నికల వ్యూహకర్తగా పనిచేస్తున్న విషయం తెలిసిందే. మమత చర్యలపై పశ్చిమ బెంగాల్ శాసనసభలో ప్రతిపక్ష నేత సువేందు అధికారి తీవ్రంగా స్పందించారు. రాజ్యాంగబద్ధమైన సంస్థ విధుల్లో మమతా బెనర్జీ నేరుగా జోక్యం చేసుకుంటున్నారని ఆయన ఆరోపించారు. గతంలో కోల్‌కతా మాజీ పోలీస్ కమిషనర్ రాజీవ్ కుమార్ ఇంటికి సీబీఐ అధికారులు వెళ్లినప్పుడు కూడా ఆమె ఇదే విధంగా అడ్డుకున్నారు. సీబీఐకి వ్యతిరేకంగా నగరంలో ధర్నాకు దిగారు. ఇప్పుడు కూడా అదే పునరావృతం చేస్తున్నారు. ముఖ్యమంత్రిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. ఒక ప్రైవేట్ కార్పొరేట్ సంస్థ కార్యాలయంపై ఈడీ దాడి చేస్తే ఆమెకెందుకు అంత ఆందోళనా అని సువేందు అధికారి ప్రశ్నించారు. ఈ ఘటనతో బెంగాల్‌లో అధికార, విపక్షాల మధ్య మాటల యుద్ధం మరింత ముదిరింది.

## టెట్‌పై సుప్రీం తీర్పుతో నష్టపోయే టీచర్ల వివరాలు ఇవ్వండి

### 16లోగా ఇవ్వాలని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు కేంద్రం లేఖ

### సమస్య పరిష్కారానికి న్యాయసలహా కోరిన కేంద్రం

### రాష్ట్రం నుంచి 40వేల మందికిపైగా ఉపాధ్యాయులు

**హైదరాబాద్, జనవరి 8, ప్రభాతవార్త:** ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)పై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు మూలంగా ఎంత మంది ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులు నష్టపోతున్నారో వివరాలు ఇవ్వా లని కేంద్ర విద్యా శాఖ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను కోరింది. ఈ మేరకు రాష్ట్రాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శులకు కేంద్ర పాఠశాల విద్య శాఖ జాయింట్ సెక్రటరీ లేఖలు రాశారు. నష్టపోయే ఉపాధ్యాయుల వివరాలను ఈ నెల 16లోగా కేంద్రానికి సమర్పించాలని లేఖలో పేర్కొన్నారు. అలాగే సమస్య పరిష్కారానికి గల న్యాయపరమైన అవకాశాలను కూడా తెలియజేయాలని లేఖలో కోరారు. టెట్‌పై సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలో రాష్ట్రంలో రాష్ట్రంలో సుమారు 40వేల మందికి పైగా ఇన్ సర్వీస్ టీచర్లు ఇబ్బంది పడే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. సుప్రీం కోర్టు టెట్ తప్పనిసరి అని చెప్పడంతో ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న టెట్-2026 పరీక్షలకు ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయుల నుంచి 71వేలకి పైగా దరఖాస్తులు వచ్చాయి. వారు ప్రస్తుతం పరీక్షలకు హాజరవుతున్నారు. టెట్‌పై సుప్రీం కోర్టు తీర్పు కారణంగా రాష్ట్రం, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఎంతమంది ఉపాధ్యాయులు ప్రభావితం అవుతున్నారో వివరాలు ఇవ్వాలని, పరిష్కారానికి గల న్యాయపరమైన అవకాశాలను జనవరి 16 లోపు తెలియజేయాలని రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు కేంద్ర ప్రభుత్వ విద్యాశాఖ లేఖ రాసింది. టెట్‌పై సుప్రీం కోర్టు ఏమిటంటే.. గత ఏడాది సెప్టెంబరు 1న సుప్రీంకోర్టు వెల్లడించిన తీర్పు ప్రకారం.. సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులు ఉద్యోగంలో కొనసాగాలంటే టెట్ పాస్ కావాలని తీర్పును వెలువరించింది. తీర్పు ఇచ్చిన తర్వాత రెండేళ్లలో అంటే 2027 నాటికి టెట్ ఉత్తీర్ణులు కావాలని పేర్కొంది. టెట్ ఉత్తీర్ణత కాని పక్షంలో ఉద్యోగం వదులుకోవల్సి ఉంటుందని తెలిపింది.

అయితే ఐదేళ్లలో పదవీ విరమణ చేయబోయే వారికి మాత్రం టెట్ అవసరం లేదని చెబుతూనే.. వారు పదోన్నతి పొందాలంటే మాత్రం టెట్ పాసవ్వాలని స్పష్టం చేసింది. విద్యా హక్కు చట్టం 2009 ప్రకారం మార్చి 31, 2010 కంటే ముందు ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న వారికి టెట్ అవసరం లేదని ఎన్‌సిటిఈ గతంలో జారీ చేసిన నోటిఫికేషన్‌లో పేర్కొన్నప్పటికీ.. దానిని పరిగణన లోకి తీసుకోకుండా సుప్రీంకోర్టు గత ఏడాది(2025) సెప్టెంబర్ 1న టెట్ తప్పనిసరి అంటూ తీర్పు వెలువరించిన నేపథ్యంలో దేశ వ్యాప్తంగా ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు.

2010 కంటే ముందు ఉన్న వారికి టెట్ అవసరం లేకపోవడంతో.. వారు ఉపాధ్యాయ వృత్తిలో చేరి ఇప్పటికే 15 సంవత్సరాలు దాటిపోయింది. అంతకంటే ముందు టీచర్లుగా నియమితులైన వారు అయితే సుమారు 20 నుంచి 25 సంవత్సరాలుగా ఉపాధ్యాయులుగా కొనసాగుతున్నారు. వారిలో సర్వీస్ మరో 10 నుంచి 12 ఏళ్ల వరకు ఉన్న వారు సైతం ఉన్నవారు ఉన్నారు. ఇప్పటికే 25 సంవత్సరాలకుపైగా టీచింగ్ వృత్తిలో ఉన్నవారు సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఇపుడు టెట్ పరీక్షలకు హాజరవుతున్నారు. ఈ నెల 3 నుంచి జరుగుతున్న టెట్ పరీక్షలకు ఇన్ సర్వీస్ ఉపాధ్యాయుల నుంచి 71670 దరఖాస్తులు వచ్చాయి. వాటిలో ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పటికే పాఠాలు బోధిస్తున్న వారి నుంచి పేపర్-1 పరీక్షకి 15,672 మంది, పేపర్-2 పరీక్షకి 33,564 మంది దరఖాస్తు చేసుకున్నారు. రెండు పేపర్లకి కలిపి 11,719 మంది దరఖాస్తు చేసుకున్నారు. మొత్తంగా ప్రభుత్వం టీచర్ల నుంచి 60,955 దరఖాస్తులు టెట్-2026కి వచ్చాయి. టెట్-2026కి దరఖాస్తు గడువు లోపు పేపర్-1కి ఇన్ సర్వీస్ ఉపాధ్యాయుల నుంచి 27,389 దరఖాస్తులు రాగా.. పేపర్-2కి 44,281 దరఖాస్తులు వచ్చాయి.

## వారం - వర్జ్యం

09-01-2026, శుక్రవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
పుష్యమాసం, దక్షిణాయణం
హేమంత ఋతువు, కృష్ణపక్షం, పూర్వాఫల్గుణి
షష్ఠి ఉ.7.06
ఉత్తరఫల్గుణి మ.1.44
వర్జ్యం : రా.10.49-12.33
దు.ఉ.8.53-9.38
2) మ.12.37-1.22
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

మేషం: సాంకేతిక పరమైన కారణాల వలన అభిప్రాయ భేదాలు చోటుచేసుకుంటాయి. పుణ్యక్షేత్రాలను సందర్శిస్తారు.

వృషభం: స్వయం ఉపాధి పథకాలు లభిస్తాయి. వివాదాస్పద వ్యవహారముల పరిష్కారమునకు మీరు చేసే కృషి ఫలిస్తుంది.

మిథునం: మీలో లౌక్యం లోపించిన సంతవరకూ ఈ రోజు చెప్పుకోదగిన ఇబ్బందులేవీ చోటుచేసుకోవు.

కర్కాటకం : ఉపయుక్తమైన పరిచయాలు చోటుచేసుకుంటాయి. బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తారు.

సింహం: గృహ నిర్మాణ ఆలోచనలు కలిసి వస్తాయి. కుటుంబసభ్యుల ప్రోత్సాహంతో ముందుకు సాగుతారు.

కన్య : శత్రువులను, మొండివారిని ఒప్పించడానికి మీరు చేసే యత్నాలు నల్లేరు మీద నడకలా సాగుతాయి.

తుల: ఉద్యోగ యత్నాలు కలిసి వస్తాయి. ప్రయత్నాలు ఫలిస్తాయి. అపురూపమైన వస్తువులు సేకరిస్తారు.

వృశ్చికం: పెద్దవారలకు తగిన సహాయం అందుకుంటారు. ముఖ్యమైన విషయాలు తెలుసుకుంటారు.

ధనుస్సు: వ్యవహారాలలో పురోగతి ఉంటుంది. ప్రముఖుల నుండి సహాయ సహకారాలు అందుతాయి.

మకరం: కాలం కలిసిరాకపోయినా మనస్సు మారుమూలలో అప్రశాంతత చోటు చేసుకుంటుంది. ప్రశంసలు లభిస్తాయి.

కుంభం: ప్రచార మాధ్యమాలకు ఎక్కువ ప్రాముఖ్యతనిస్తారు. నూతన వ్యక్తులతో పరిచయాలు పెరుగుతాయి.

మీనం : వివాదాలతో కష్టా పాడుచున్నా వ్యవహారించడం వల్లనే పనులు సాగుతాయి పడతాయి. మిత్రులు కలుస్తారు.

- శ్రీమతి ముదిగొండ శివశక్తి, ఫోన్, హైదరాబాద్

09-01Pg3exHMNWJQECKT 3 GV_09-01Pg3exHMNWJQECKT.qxd 08/Jan/26 11:56 PM Page 1



# డ్వాక్రాతో మహిళల ఆర్థిక ప్రగతికి బాటలు వేశాం

- సొంత కాళ్లపై ఆడబిడ్డలు నిలబడాలనే డ్వాక్రా స్థాపన
- మహిళలతో టిడిపికి ప్రత్యేక అనుబంధం
- దీపం కింద ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నాం
- సంజీవనితో ఐదు కోట్ల ప్రజల ఆరోగ్యానికి భరోసా
- గుంటూరులో సరస్ మేళాలో సిఎం చంద్రబాబు



సెర్ప్ నుంచి రూ.2171 కోట్లను స్వయం సహాయక సంఘాలకు రుణంగా చెక్కు రూపంలో అందిస్తున్న సిఎం చంద్రబాబు

**గుంటూరు, జనవరి 8 ప్రభాతవార్త ప్రతినిధి:** మహిళల ఆర్థిక ప్రగతి కోసం తాను స్థాపించిన డ్వాక్రా సంఘాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని సిఎం చంద్రబాబు అన్నారు. పొదుపు సంఘాల ద్వారా మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించినందుకు సంతోషంగా ఉందన్నారు. గుంటూరులో సరస్ మేళా 2026ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళలు ఏర్పాటు చేసిన స్టాళ్లను సీఎం సందర్శించారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ... "డ్వాక్రా సంఘాలను చూస్తే ఎంతో గర్వంగా ఉంటుంది. మహిళలు ఆర్థికంగా వారి కాళ్లపై సొంతగా నిలబడాలనే ఉద్దేశంతో తాను 30 ఏళ్ల క్రితం డ్వాక్రా వ్యవస్థను తీసుకొచ్చాను. ఆనాడు డ్వాక్రా మహిళలు మీటింగుల కోసం బయటకు వస్తే ఎంతోమంది ఎగతాళి చేశారు. కానీ నేడు డ్వాక్రా సంఘలు తిరుగులేని వ్యవస్థగా దేశంలోనే రికార్డు సృష్టించాయి. డ్వాక్రా, మెప్మా సంఘాలు నాకు ఎప్పుడూ ప్రత్యేకమే. రాష్ట్రంలో కోటీ 13 లక్షలమంది డ్వాక్రా మహిళలు రూ.26 వేల కోట్ల నిధిని, రూ.5,200 కోట్ల కార్పస్ ఫండ్‌ను ఏర్పాటు చేసుకోవడం గొప్ప విషయం. 2024-25లో డ్వాక్రా సంఘాలు రూ.46,590 కోట్ల బ్యాంకు రుణాలు తీసుకున్నారు. దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహించే ఇలాంటి కార్యక్రమాన్ని మన రాష్ట్రంలోనూ ఏర్పాటు చేసిన కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను అభినందిస్తున్నాను. ఈ ఎక్స్‌పోను చూస్తుంటే మినీ ఇండియాను తలపిస్తోంది. అంతటా పండుగ వాతావరణం నెలకొంది. సరస్ మేళా సంప్రదాయ హస్తకళలు, హ్యాండ్లూమ్స్, స్థానిక ఆహార ఉత్పత్తులకు బ్రాండింగ్ తీసుకురావడంతో పాటు మార్కెట్ లింకేజీ సదుపాయాన్ని కల్పిస్తుంది' అని ముఖ్యమంత్రి అన్నారు.



సతీమణి భువనేశ్వరికి చీర కొనుగోలు చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

**ఆడబిడ్డలతో ప్రత్యేక అనుబంధం:** 'ఆడబిడ్డలతో తెలుగుదేశం పార్టీ అనుబంధం ఈ నాటికి కాదు. ఆనాడు ఎన్టీఆర్ మగవారితో సమానంగా మహిళలకు ఆస్తిహక్కు కల్పించారు. మహిళల కోసం తిరుపతిలో పద్మావతీ యూనివర్సిటీ ఏర్పాటు చేశారు. నేను ముఖ్యమంత్రి అయ్యాక డ్వాక్రా సంఘాల ద్వారా మహిళకు ఆర్థిక భరోసా కల్పించాను. రాష్ట్రంలో డ్వాక్రా సంఘాల్లో 89 లక్షలమంది, మెప్మా సంఘాల్లో 24 లక్షల మంది సభ్యులున్నారు. తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లిస్తే బ్యాంకులు మరిన్ని రుణాలు ఇస్తాయని నేను చెప్పిన మాటను పొదుపు మహిళలు తూచా తప్పకుండా పాటించి ఆర్థిక ప్రగతి సాధించారు. 202425లో రూ.46,590 కోట్లు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్నారు. నేనిచ్చిన ఐటీ పిలుపుతో ఎంతోమంది దేశ విదేశాల్లో ఆర్థికంగా ఉన్నతంగా స్థిరపడ్డారు. ఇంటికో పారిశ్రామిక వేత్తను తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇప్పటికే 93 వేలమంది మైక్రో, ఎంఎస్ఎంఈ ఎంట్రప్రెన్యూర్లు అయ్యారు. డ్వాక్రా మహిళలు విదేశాలు కూడా వెళ్లి ఎంతోమందికి ట్రైనింగ్ ఇచ్చారు. డ్వాక్రా సంఘాలను సమర్థవంతంగా తయారుచేసే బాధ్యత నాది అన్నారు సిఎం చంద్రబాబు.

## పెద్దపులుల సంరక్షణలో ప్రజలు భాగస్వామ్యం కావాలి

మహాశివరాత్రి శ్రీశైలం వెళ్లే భక్తులకు ఫిబ్రవరి 8 నుంచి 16 వరకు అనుమతులు

**శ్రీశైలం, నాగులూటి, ఆత్మకూరు రేంజ్లలో కెమెరాల ఏర్పాటు , ఆత్మకూరు వన్యప్రాణి డిప్యూటీ డైరెక్టర్ విగ్నేష్ అపావో**

**ఆత్మకూరు జనవరి 8 ప్రభాతవార్త :** దేశంలోనే పెద్దపులుల లెక్కింపు ప్రతి నాలుగు సంవత్సరాలకు ఒక్కసారి వస్తుందని నంద్యాల జిల్లా ఆత్మకూరు వన్యప్రాణి డిప్యూటీ డైరెక్టర్ విగ్నేష్ అపావో అన్నారు గురువారం పట్టణంలోని అటవీశాఖ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మహాశివరాత్రి పండుగను పురస్కరించుకునేందుకు శ్రీశైలం పాదయాత్రగా అడవి మార్గంలో వెళ్లే భక్తులకు ఫిబ్రవరి 8వ తేదీ నుంచి 16వ తేదీ వరకు అటవీశాఖ అనుమతి ఇస్తుందని శివ భక్తాదులకు తెలిపారు పెద్దపులుల సంరక్షణలో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలని వివరించారు ముఖ్యంగా శ్రీశైలం, నాగులూటి, ఆత్మకూరు, రేంజ్ లలో పెద్ద పులుల లెక్కింపు కోసం ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు ఆల్ ఇండియా జాతీయ పులుల లెక్కింపు సందర్భంగా ఎన్ ఎస్ టి ఆర్ పరిధిలోని ఆత్మకూరు డివిజన్లో విడతలవారీగా పులుల గణంకాలు లెక్కింపు కొనసాగుతుందని వివరించారు అడవి మార్గంలో శ్రీశైలం భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆశీస్సుల కోసం పాదయాత్రగా తరలి వెళ్లే భక్తాదులు అడవి నిబంధనలు పాటించాలన్నారు ప్లాస్టిక్ నివారణ చేపట్టే విధంగా శివ భక్తులు అవగాహన కల్పించుకోవాలని అటవీ శాఖ అధికారులు మీడియా సమక్షంలో తెలియజేశారు అడవికి నిప్పు పెట్టకుండా అగ్గిపెట్టెలు మత్తు పదార్థాలైన వస్తువులను వెంట తీసుకొని వెళ్తే అటవీ హక్కుల చట్టం కింద కేసులు నమోదు చేయక తప్పదని హెచ్చరించారు పాదయాత్రీకులకు అడవి మార్గంలో అన్నదాన శిబిరాలు. మంచినీటి వసతులు.. పర్యావరణం. వన్య ప్రాణుల సంరక్షణపై అటవీ శాఖ అధికార యంత్రాంగం ప్రత్యేక చొరవ తీసుకొని ఉందని తెలిపారు నల్లమల్ల అటవీ ప్రాంతంలో పెద్దపులుల గణంకాలను దృష్టిలో ఉంచుకొని శివ భక్తులు పాదయాత్రికులు, ప్రజలు, నిశబ్దంతో అడవిలో పాదయాత్రగా తరలి వెళ్లి పాదయాత్రికులు అటవీశాఖ అధికారులకు సహకరించే విధంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు అడవిలో పాదయాత్రగా వెళ్లే సమయంలో ప్రజలు పెద్దపులుల సంరక్షణలో భాగస్వామ్యం కావాలని మీడియా సమక్షంలో తెలియజేశారు.



## ఆర్‌డిఎస్‌ఎస్ పనులు వేగవంతం

- ఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి

**తిరుపతి, జనవరి 8ప్రభాతవార్త ప్రతినిధి:** ఎస్‌పిడిసిఎల్ పరిధిలో పునర్వ్యవస్థీకరణ విద్యుత్ పంపిణీ పథకం (ఆర్‌డిఎస్‌ఎస్) పనులను త్వరి తగతిన పూర్తి చేయాలని సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి ఆదేశించారు. సంస్థ పరిధిలో ఆర్డిఎస్ఎస్ పనుల పురోగతిపై గురువారం తిరుపతిలోని కార్పొరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో సంస్థ కన్స్ట్రక్షన్ విభాగపు అధికారులు, కాంట్రాక్టర్లతో సిఎండి శివశంకర్ లోతేటి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలతో పాటు నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేయడమే ధ్యేయంగా ఆర్ డి ఎస్ ఎస్ పనులను చేపడుతున్నామని తెలిపారు. ఈ పథకంలో భాగంగా వ్యవసాయ విద్యుత్ ఫీడర్లను, 11కెవి ఫీడర్లను వేరు చేయడం, ఓవర్ లోడ్ సమస్యను అధిగమించేందుకు వీలుగా అదనంగా 33 కెవి ఫీడర్ల ఏర్పాటు, గ్రామీణ ప్రాంతాలకు నిరంతరాయ, నాణ్యమైన త్రీ ఫేజ్ విద్యుత్తును సరఫరా చేసేందుకు అవసరమైన పనులను చేపడుతున్నామని వివరించారు. అలాగే వినియోగదారులకు మరింత మెరుగైన సేవలను అందించేందుకు వీలుగా స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ పథకానికి సంబంధించిన పనులను త్వరితగతిన పూర్తి చేయడం ద్వారా రైతులకు మరింత మెరుగ్గా పగటిపూట 9 గంటల విద్యుత్తును సరఫరా చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ పనుల నిర్వహణలో ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. పనుల్లో జాప్యాన్ని సహించబోమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్,ఐటి) పి. అయూబ్ ఖాన్, డైరెక్టర్ (టెక్నికల్,హెచ్ఆర్డి) కే. గురవయ్య, చీఫ్ జనరల్ మేనేజర్ జె. రమణాదేవి, జనరల్ మేనేజర్లు రామచంద్రరావు, శ్రీనివాసులు, తొమ్మిదిజిల్లాల కన్స్ట్రక్షన్ విభాగపు అధికారులు, కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి నియోజకవర్గంలో ఒక ఎంఎస్ఎంఇ పార్కును అందుబాటులోకి తేవాలి : సిఎస్

**సచివాలయం,జనవరి 8,ప్రభాతవార్త :** రాష్ట్రంలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో మూడు దశల్లో 175ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తుండగా మొదటి దశలో 55ఏర్పాటు చేయాల్సి ఉండగా ఇప్పటికే 16ప్రారంభం కాగా మరో 39పార్కులకు శంకుస్థాపన చేయడం జరిగిందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ వెల్లడించారు.ఎంఎస్ఎంఈ పార్కుల గ్రేడింగ్ ప్రగతి,2025పార్టనర్‌షిప్ సమిట్‌లో కుదుర్చుకున్న అవగాహన ఒప్పందాలకు సంబంధించిన కంపెనీల గ్రౌండింగ్ ప్రగతి,జిల్లా పరిశ్రమల మరియు ఎక్స్‌పోర్టు ప్రమోషన్ కమిటీ సమావేశాల నిర్వహణ,కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి ఇచ్చిన ఆదేశాలకు సంబంధించిన అంశాలు, పాజిటివ్ పబ్లిక్ పెరసెప్షన్, డాక్యూమెంట్ అప్లోడ్ ఏజెంట్ స్పేస్ అంశాలపై గురువారం రాష్ట్ర సచివాలయం నుండి ఆయన జిల్లా కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు ప్రక్రియను వేగంగా పూర్తిచేయాలని కలెక్టర్లను ఆదేశించారు.రెండోదశ కింద 45అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులను ఏర్పాటు చేయాల్సి ఉండగా ఇప్పటికే 3ప్రారంభించగా 42పార్కులకు శంకుస్థాపన జరిగిందన్నారు. మూడవ దశకింద ఈనెలాఖరు లోగా 75ఎంఎస్ఎంఈ పార్కులను ఏర్పాటు చేయాల్సి ఉండగా 6పార్కులకు అవసరమైన భూమి ఎపిఐఐసికి అప్పగించగా మిగతా వాటికి సంబంధించి భూమి గుర్తింపు ప్రక్రియ జరుగుతోందని ఆప్రక్రియను వేగవంతంగా పూర్తిచేసి 175నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులను అందుబాటులోనికి తెచ్చేలా కలక్టర్లు తగిన చర్యలు తీసుకోవాలని సీఎస్ విజయానంద్ ఆదేశించారు.రాష్ట్ర పరిశ్రమలు వాణిజ్య శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్ మాట్లాడుతూ జిల్లాల వారీ ఎంఎస్ఎంఈ పార్కుల ప్రగతిని వివరించారు.ఈపార్కులు ఏర్పాటుకు సంబంధించి భూమి గుర్తింపు వేగవంతంగా పనులు జరిగేలా చూడాలని కలెక్టర్లకు సూచించారు.అన్ని జిల్లాలోను జిల్లా పరిశ్రమలు మరియు ఎక్స్‌పోర్టు ప్రమోషన్ కమిటీలను ఏర్పాటు చేసి ఆ సమావేశాలను నిర్వహించాలని కలెక్టర్లకు సూచించారు. ఈ సమావేశంలో ఆర్టీజీఎస్ సిఈఓ ప్రఖర్ జైన్,డ్రోన్ కార్పొరేషన్ సిఈఓ సూర్యమన్ పటేల్ పాల్గొన్నారు. వర్చువల్‌గా ఎపిఐఐసి విసి అండ్ ఎండి అభిషిక్త్ కిషోర్, వివిధ జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.



అనంతపురం మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ హర్షదుల్లాను సన్మానిస్తున్న కెఎం.షకిల్ షఫి, తదితర ముస్లిం పెద్దలు

## మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ హర్షతుల్లాకు ఘన సత్కారం

**అనంతపురం, జనవరి 8 ప్రభాతవార్త బ్యూరో** అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ కెఎం హర్షదుల్లాను గురువారం రాష్ట్ర ముతవల్లిల సంఘం అధ్యక్షులు కెఎం.షకిల్ షఫి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కెఎం.షకిల్ షఫితోపాటు టిడిపి జిల్లా కార్యాలయ కార్యదర్శి తాజుద్దీన్, కె.ఎం.డి.జునైద్‌తోపాటు అనంతపురంలోని అనేక మంది ముతవల్లిలు, ఇమాంలు, మౌజాంలు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు. అనంతపురం మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్‌గా కెఎం హర్షదుల్లాను నియమించినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు, మంత్రి నారాలోకేష్‌కు, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌కు మార్కెట్‌యార్డు చైర్మన్‌బల్లా పల్లవికి కెఎం షకిల్ షఫి, తాజుద్దీన్, కెఎండి జునైద్ తదితరులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## అమరావతిలో ఎన్టీఆర్ విగ్రహం, స్మృతివనం ఏర్పాటు : మంత్రి నారాయణ

**సచివాలయం,జనవరి 8,ప్రభాతవార్త :** రాజధాని అమరావతిలో దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు విగ్రహం ఏర్పాటు స్మృతివనం నిర్మించడానికి మంత్రుల కమిటి గురువారం సమావేశమైంది.ఈ సందర్భంగా పురపాలక శాఖ మంత్రి నారాయణ మాట్లాడుతూ రాజధాని అమరావతి గుర్తింపుతో పాటు ఆత్మగౌరవ నినాదంతో తెలుగు ప్రజలు రాజకీయ చప్పుడు వినిపించిన ఎన్టీ రామారావు విగ్రహం ఏర్పాటు చేసుకోవడం హర్షదాయకమని తెలిపారు.మంత్రుల కమిటీ సమావేశంలో ఎన్టీ రామరావు నమూనా విగ్రహాలను మంత్రుల కమిటీ పరిశీలించారు.రాజధాని పరిధిలోని నీరుకొండ గ్రామం కొండపైన భారీ విగ్రహం ఏర్పాటు చేయా లని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. 3500టన్నులతో భారీ కంచు విగ్రహం నిర్మాణానికి శ్రీకారం చుడతామని తెలిపారు.విగ్రహంతోపాటు ఇతర డిజైన్లు ఫైనల్ చేసేందుకు సబ్‌కమిటీ నిర్ణయం తీసకుంటుందని తెలిపారు. విగ్రహం ఏర్పాటు బాధ్యతలను ఏజిఐసిఎల్ సంస్థ పర్యవేక్షిస్తుందని తెలిపారు.ఈ సమావేశానికి మంత్రులు నారాయణతోపాటు పయ్యావుల,కందుల దుర్గేష్ తదితరులు ఉన్నారు.



మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ డి.శ్రీనివాసులును ఘనంగా సత్కరిస్తున్న దృశ్యం

## విద్యార్థులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి

మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ డి. శ్రీనివాసులు

**రాప్తాడు, జనవరి 8 ప్రభాతవార్త** యువతలో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించాలనే ఉద్దేశంతో మండల పరిధిలోనే హంపాపురం సమీపన ఉన్న శ్రీ వెంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, అనంతపురంలో విద్యార్థుల కోసం రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ డి. శ్రీనివాసులు ముఖ్య అతిథిగా పాల్గొని రోడ్డు భద్రతా నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..దేశంలో రోజు రోజుకు పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలకు నిర్లక్ష్య డ్రైవింగ్ ప్రధాన కారణమని తెలిపారు. విద్యార్థులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించడం, సీటుబెల్ట్ వినియోగించడం, వాహనం నడుపుతూ మొబైల్ ఫోన్ ఉపయోగించకూడదని సూచించారు. ఈ నిబంధనలను పాటించడం ద్వారా ప్రమాదాల తీవ్రతను గణనీయంగా తగ్గించవచ్చని ఆయన అన్నారు. ఈ అవగాహన కార్యక్రమాలు రోడ్డు ప్రమాదాల నివారణలో కీలక పాత్ర పోషిస్తాయని, విద్యార్థులు రోడ్డు భద్రతకు సంబంధించిన నియమాలను తమ జీవితంలో అమలు చేసి, ఇతరులకు కూడా అవగాహన కల్పించాలని శ్రీనివాసులు పిలుపునిచ్చారు.

## చిత్తూరు కోర్టుకు బాంబు బెదిరింపు

- రంగంలోకి దిగిన పోలీసులు, బాంబ్ డిస్పోజల్ టీమ్
- బాంబు లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్న పోలీసులు

**చిత్తూరు, జనవరి 8 ప్రభాతవార్త:** చిత్తూరు జిల్లా కోర్టుకు గురువారం బాంబు బెదిరింపు మెయిల్ రావడంతో కోర్టులో విధులు నిర్వర్తిస్తున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు, కక్షిదారులు, ఇతర సిబ్బంది ఒక్కసారిగా హడలిపోయారు. చిత్తూరు కోర్టులో బాంబు పెట్టారని పోలీసులకు సమాచారం అందించడంతో వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ మహేశ్వర్ సత్వరం ఈ విషయంను ఎస్పీ తుషార్ డూడి దృష్టికి తీసుకెళ్ళారు. ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు ఏఆర్ ఎస్పీ దేవదాస్, చిత్తూరు డిఎస్పీ సాయినాథ్, జిల్లా ఫైర్ ఆఫీసర్ పెద్దిరెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డిటి సుధారాణిలకు సమాచారం అందించారు. ఏఆర్ ఎస్పీ దేవదాసు, చిత్తూరు డిఎస్పీ సాయినాథ్, బాంబ్ డిస్పోజల్ టీమ్, ఫైర్ సిబ్బంది హుటాహుటిన కోర్టు ప్రాంగణం చేరుకుని నాలుగు బృందాలుగా ఏర్పడి క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించి కోర్టు భవనాల్లో ఎక్కడా బాంబు లేదని తేల్చడంతో అందరు ఊపిరి పీల్చుకున్నారు. ఎప్పటిలా గురువారం సైతం యథావిధిగా కోర్టు ప్రారంభమైన కొద్ది సేపటిలోనే మధ్యాహ్నం 12 గంటల సమయంలో జిల్లా కోర్టు సూపరిటెండెంట్ అధికారిక ఇ-మెయిల్‌కు ఒక తెలియని వ్యక్తి నుండి ఒక బెదిరింపు మెయిల్ వచ్చింది. ఈ మెయిల్‌లో కోర్టు ప్రాంగణంలో బాంబు పెట్టామని, ప్రేలుడు పదర్థాలతో కోర్టును ధ్వంసం చేస్తామని, మధ్యాహ్నం 1.15 గంటలకు కోర్టులో ప్రేలుడు సంభవిస్తుందని బెదిరింపు మెయిల్ పెట్టారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పలు కోర్టులకు బాంబు బెదిరింపులు రావడం కలకలం రేపింది. ఏలూరు జిల్లా కోర్టుకు బాంబు బెదిరింపు వచ్చింది. అదే సమయంలో చిత్తూరు జిల్లా కోర్టుకు కూడా బాంబు బెదిరింపులొచ్చాయి. బాంబులు పెట్టినట్లు మెయిల్ ద్వారా దుండగులు సందేశం పంపించారు. దీంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. రంగంలోకి దిగిన పోలీసులు కోర్టు ప్రాంగణాన్ని ఖాళీ చేయించి అణువణువు బాంబు స్క్వాడ్‌తో గాలిస్తున్నారు. అనంతపురం జిల్లా కోర్టుకు బాంబు బెదిరింపు మెయిల్ కలకలం రేపింది. రికార్డ్ అసిస్టెంట్, ఫస్ట్ క్లాస్ జిల్లా అడిషనల్ మెజిస్ట్రేట్‌లకు బాంబు బెదిరింపు మెయిల్ వచ్చినట్లు సమాచారం. ఈ ఘటనతో పోలీసులు అప్రమత్తమయ్యారు. వెంటనే అక్కడకు చేరుకుని డాగ్ స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్‌తో కలిసి జిల్లా కోర్టు పరిసరాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. కోర్టు అంతా పోలీసులు గాలింపు చర్యలు నిర్వ హించారు.



# తిరుమల సమాచారం

## గురువుగా మంచి విద్యార్థులను తయారుచేయాలి

- వేదవిజ్ఞానపీఠం ప్రిన్సిపాల్ శివసుబ్రమణ్యఅవధాని



**తిరుమల,జనవరి 8ప్రభాతవార్తప్రతినిధి:** పట్టాలు పొందిన స్నాతకులు విద్యార్థిగా నేర్చుకున్న జ్ఞానంతో గురువుగా మారిన తరువాత మంచి విద్యార్థులను తయారుచేయాలని తిరుమల వేద విజ్ఞానపీఠం ప్రిన్సిపాల్ కుప్పా శివసుబ్రమణ్యఅవధాని ఆకాంక్షించారు. దేనికైనా అంతం ఉంటుంది కానీ విద్యకు అంతం ఉండదని తెలిపారు. 141ఏళ్ళ చరిత్ర కలిగిన తిరుమల ధర్మగిరి వేద విజ్ఞానపీఠం 129వ స్నాతకోత్సవం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శివ సుబ్రమణ్యఅవధాని మాట్లాడుతూ వేదవిజ్ఞానపీఠంలోని 146 మంది విద్యార్థులను వేద,ఆగమ, స్మార్త పండితులుగా తీర్చిదిద్దడం జరిగిందన్నారు. పట్టాలు పొందిన విద్యార్థులు మంచి విద్యార్థులను తయారుచేయాలన్నారు. వేదవిద్యపూర్తిచేసుకున్న 146మంది స్నాతకులకు పట్టాలతో పాటు శ్రీవారి వెండి డాలర్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో పండితులు, విజ్ఞానపీఠం సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## టైమ్‌స్లాట్ టోకెన్ల జారీ ప్రారంభం

- సామాన్యభక్తులతో కౌంటర్లు కిటకిట



**తిరుమల,జనవరి 8ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామిని సామాన్యభక్తులు సమయం ప్రకారం దర్శనం చేసుకునేందుకు వీలుగా జారీచేస్తున్న ఉచిత సర్వదర్శన టైమ్‌స్లాట్ టోకెన్లు పునంప్రారంభమైంది. పదిరోజుల వైకుంఠద్వార దర్శనాల కారణంగా డిసెంబర్ 28వతేదీ నుండి నిలుపుదలచేసిన ఈ ఉచిత టోకెన్లు జారీ గురువారం మధ్యాహ్నం నుండి ప్రారంభించారు. తిరుపతిలోని శ్రీనివాసం, విష్ణునివాసం, అలిపిరి భూదేవి కాంప్లెక్స్‌లో ఈ టోకెన్లు జారీచేస్తున్న విషయం విదితమే. ఈ టోకెన్లకు భక్తులు ఉదయం నుండి బారులుతీరుతున్నారు. గురువారం 10వేల టైమ్‌స్లాట్ టోకెన్లు, 2వేల దివ్యదర్శనం టోకెన్లు జారీచేశారు.

## తిరుమలేశుని ఆశీస్సులతో అందరికీ శుభాలు కలగాలి

- వైకుంఠద్వార దర్శనంలో సినీప్రముఖులు



**తిరుమల,జనవరి 8ప్రభాత వార్తప్రతినిధి:** అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడు తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామిని వైకుంఠ ద్వారంలో దర్శించుకోవడం శుభమని పలువురు సినీప్రముఖులు విశ్వాసం వ్యక్తం చేశారు.తెలుగుప్రజలకు శుభాలు కలగాలని వేడుకున్నారు. ధనుర్మాసంలో వైకుంఠ ద్వారంలో గురువారం ఉదయం హాస్యనటుడు బ్రహ్మానందం, తమిళనటుడు శ్రీకాంత్, సినీగాయకురాలు మంగ్లీ, సినీనటి వాసుకి తదితరులు సాంప్రదాయదుస్తులు ధరించి నుదుటిన తిరునామంతో గోవింద నామస్మరణతో శ్రీవారిని దర్శనం చేసుకున్నారు. టిటిడి అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## రథసప్తమికి సమష్టిగా సేవలందించాలి

- టిటిడి అదనపు ఇఒ వెంకయ్యచౌదరి



**తిరుమల,జనవరి 8ప్రభాతవార్తప్రతినిధి:** మాఘమాసం సప్తమితిధి ఆదివారం ఉదయం 25వతేదీ సూర్య జయంతి(రథసప్తమి) వేడుకలు అంగరంగవైభవంగా జరగనున్నాయి. ఉదయం 5.30గంటల నుండి రాత్రి 9గంటల వరకు ఒకేరోజు ఏడు వాహనాలపై ఏడుకొండలస్వామి ఆలయ మాఢ వీధుల్లో ఊరేగనున్నారు. ఆరోజు ఆలయంలో జరిగే అన్ని ఆర్జితసేవలు, ప్రత్యేకదర్శనాలు టిటిడి రద్దుచేసింది. అన్ని రకాల ఏర్పాట్లు, భక్తులకు సేవలందించేందుకు సీనియర్ అధికారులు, సిబ్బందిని నియమించుకుని, కలసి సమన్వయంతో భక్తులకు తిరుమలలోని మాఢవీధుల్లో, గ్యాలరీల్లో నిరంతరాయంగా సేవలందించాలని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి సూచించారు. పదిరోజుల వైకుంఠద్వార దర్శనాలను పూర్తిస్థాయిలో సమష్టిగా విజయవంతం చేసినట్లే మినీబ్రహ్మోత్సవాన్ని విజయవంతం చేయాలన్నారు. రథసప్తమి పర్వదినం ఏర్పాట్లు, భక్తులకు సౌకర్యాలు, భద్రత అంశాలపై ,సేవలపై టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, జెఇఒ వీరబ్రహ్మం,టిటిడి సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ, తిరుమల అదనపు ఎస్పీ రామకృష్ణ, డిఎస్పీ విజయశేఖర్ విజిలెన్స్,పోలీసు విభాగాల అధికారులతో గురువారం మధ్యాహ్నం పద్మావతి విశ్రాంతి భవనంలో సమీక్షించారు. ఆలయం ముందు, మాఢవీధుల్లో గ్యాలరీలు, జర్మన్‌షెడ్లను ఏర్పాటుచేసి, 25న ఉదయం నుండి రాత్రి వరకు నిరంతరాయంగా భక్తులకు అన్నప్రసాదాలు, తాగునీరు. టీ,కాఫీ,పాలు అందించేలా శ్రీవారిసేవకులు, టిటిడి ఉద్యోగులకు విధులు కేటాయించాలన్నారు .భక్తులకు ఉదయం నుండిరాత్రి వరకు చలికి, ఎండకు ఇబ్బందులు కలగకుండా మాఢవీధుల్లో అవసరమైన ప్రాంతాల్లో అదనపు ఏర్పాట్లు చేసేలా చూస్తున్నారు. ఉదయం 5.30గంటలకు తొలివాహనంగా సూర్యప్రభవాహనం మొదలై ఉదయం 8గంటల వరకు మాఢవీధుల్లో ఊరేగనుండటంతో భద్రతా పరంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రవేశ,నిష్క్రమణ మార్గాలను కూడా సాఫీగా ఏర్పాటుచేయాలని అదనపు ఇఒ చౌదరి సూచించారు.

## పద్మావతి ఆసుపత్రి పనులు వేగిరం చేయండి

- టిటిడి ఇఒ ఎకెసింఘాల్



**తిరుమల,జనవరి 8ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతిలో అలిపిరి వద్ద నిర్మాణంలో ఉన్న పద్మావతి చిన్న పిల్లల ఆస్పత్రిలో అక్కడక్కడా భక్తిభావం, రోగులకు మనోధైర్యం కల్పించేలా దేవతామూర్తుల చిత్రాలను అమర్చాలని టిటిడి ఇఒ అనిల్‌కుమార్ సింఘాల్ అధికారులకు సూచించారు. ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచనలు చేశారు. ఆస్పత్రి నిర్మాణాన్ని వేగంగా పూర్తిచేసి వీలైనంత త్వరగా నూతన ఆస్పత్రిని ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని ఇఒ ఆదేశించారు. గురువారం ఉదయం తిరుపతిలోని పద్మావతి చిన్నపిల్లల ఆస్పత్రిని ఆయన సందర్శించారు. నూతనభవనం పూర్తయ్యే సమయానికి భవనానికి అవసరమయ్యేమానవ వనరులు,శస్త్రచికిత్స యంత్రాలు, ఫర్నీచర్, విద్యుత్ తదితర మౌళిక సదుపాయాలను సమకూర్చుకోవాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. నూతనంగా నిర్మాణంలో ఉన్న భవనంలో వైద్యసేవలు, పరిపాలన కోసం ఒక్కొక్కఫ్లోర్‌లో ఏమేమి ఉపయోగిస్తున్నారని పరిశీలించారు. ఆరవ అంతస్థులో పూర్తిగా శస్త్రచికిత్సల కోసం వినియోగించనున్నట్లు, ఏడవఫ్లోర్ కేవలం హెలిపాడ్ కోసం ఉపయోగించనున్నట్లు డాక్టర్ శ్రీనాథ్ ఇఒకు వివరించారు. అక్కడే చిన్నపిల్లల హృదయాలయంను ఇఒ సింఘాల్ పరిశీలించారు. ఎన్టీఆర్ వైద్యసేవ, ఎస్వీ ప్రాణదానట్రస్ట్ ద్వారా రోగులకు అందిస్తున్న సేవలపై సిబ్బందితో మాట్లాడి ఆన్‌లైన్ నమోదు తదితర అంశాలపై పలు సూచనలు చేశారు. గుండె సంబంధిత శస్త్ర చికిత్సలు చేసుకున్న అనంతపురం, ప్రొద్దుటూరు, చిత్తూరు,కాకినాడ ,తెనాలి, రాయచోటి,కర్నూలు ప్రాంతాలకు చెందిన చిన్నారులు వారి సంరక్షకులతో ఇఒ సింఘాల్ మాట్లాడారు. హృదయాలయంలో అందుతున్న వైద్యసేవలు, ఉచిత వైద్యసేవలు, మందులు అందిస్తుండటంపై ఆరా తీశారు. పద్మావతి చిన్నపిల్లల ఆస్పత్రిలో అందుతున్న వైద్యసేవలు, సిబ్బంది సేవలపై పిల్లల సంరక్షకులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటివరకు 4,950మందికి గుండె శస్త్రచికిత్సలు, 23 గుండె మార్పిడి శస్త్రచికిత్సలు నిర్వహించినట్లు వైద్యులు ఇఒకు వివరించారు. ఐసియు 1లోని నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గుండెకు ఉన్న రంధ్రాలను సరిచేసే క్యాత్ ల్యాబ్‌మిషన్‌ను,ఐసియు 2లోని ఐసోలేషన్ గదిని, జనరల్ వార్డుల్లో చికిత్స పొందుతున్న చిన్నారులను ఇఒ ఆప్యాయంగా పలకరించారు.


వార్త

> ఒక రాజ్యంలో నివసించే ప్రజల భాషను తెలుసుకోకుండా, ప్రజాభిప్రాయం తెలుసుకోవడం సాధ్యం కాదు.
>
> -బార్కర్

# పెరుగుతున్న పేదరికం

ధనిక పేదల మధ్య వ్యత్యాసం తగ్గించి సమ సమాజాన్ని నిర్మించడమే ధ్యేయంగా పని చేస్తున్నామని, అందుకోసం పేదల అభ్యున్నతికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి లక్షలాది కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నట్లు పాలకులు పదేపదే చెప్పుకుంటున్నారు. కానీ ధనికులు మరింత లక్ష్మీపుత్రులుగా ఎదిగిపోతున్నారు. పేదలు మరింత పేదలుగా దిగజారిపోతున్నారు. భారతదేశం మొత్తం సంపదలోయాభైఎనిమిది శాతంపైగా కేవలం పిడికెడు మంది గుప్పెట్లో చిక్కుకుపోయిందనే విషయం గతంలో ఎన్నో నివేదికలు వెల్లడించాయి. ఒక్క భారత్‌లోనే కాదు ప్రపంచవ్యాప్తంగా ఈ అంతరాయం అంతకంతకు పెరిగిపోతున్నది. గతంలో ఈ విషయంలో జరిగిన ఎన్నో ప్రపంచ ఆర్థిక సదస్సులోనూ కూడా వెల్లడైంది. దేశ జనాభాలో డెబ్బైశాతం మంది వద్ద ఎంత సంపద ఉందో కేవలం అంత సంపద దాదాపు అరవై మంది వద్ద ఉన్నట్లు సర్వేలు స్పష్టం చేస్తున్నాయి. నిరుపేదల ఆదాయం గత దశాబ్దంలో పది శాతంపెరిగితే లక్ష్మీపుత్రుల ఆదాయం నూట ఎనభై శాతం పెరిగిందని చెబుతున్నారు. ఇండోనేషియా, చైనా, లావోస్,బంగ్లాదేశ్, శ్రీలంక, తదితర దేశాలు పది శాతం ధనికుల సంపద ఇరవైయేళ్లలో పదిహేను శాతం పెరిగింది. అదే సమయంలో దేశంలో ఆర్థికంగా అట్టడుగునున్న పది శాతం మంది ప్రజల సంపాదన దాదాపు పదిహేను శాతానికి పడిపోయింది. కూలీల చెల్లింపుల విషయంలో ఆసియా దేశాల్లో మహిళలపై వివక్ష తీవ్రంగానే ఉంది. ఒకే పని చేస్తున్నా పురుషులకు ఇచ్చే కూలి,మహిళలకు ఇవ్వడం లేదు. వేతనాల చెల్లింపుల్లో వివక్ష భారత్‌లోనే ఎంతో ఉన్నట్లు అనేక నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ప్రపంచంలోని అతిపెద్ద వస్త్ర కంపెనీలన్నింటికి భారత్‌లోని కాటన్ స్పిన్నింగ్ మిల్లులతో వ్యాపార లావాదేవీలు ఉన్నాయి. ఈ మిల్లుల్లో బాలికలతో తక్కువ వేతనాలతో పని చేయిస్తున్నారు. ఏదిఏమైనా భారతదేశంలో సంపద అసమానత పెచ్చుమీరుతుండడం పట్ల ఆందోళన వ్యక్తమవుతున్నది. అయితే మరొకపక్క ప్రభుత్వ లెక్కలు ఇందుకు విరుద్ధంగా కన్పిస్తున్నాయి. గత పదేళ్ల వ్యవధిలోదాదాపు ఇరవైఐదు కోట్ల మంది భారతీయులు పేదరికం కోరల నుంచి బయటపడ్డారని నీతి ఆయోగ్ తాజాగా విడుదల చేసిన పత్రంలో స్పష్టం చేసింది. 2013-14లో 29.7 శాతం నమోదైన పేదరిక నిష్పత్తి 2022-23నాటికి 11.28 శాతానికి దిగివచ్చిందని స్పష్టం చేసింది. నిరుపేదల సంఖ్య తగ్గుదలలో బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్‌తోపాటు ఒడిశా, ఛత్తీస్‌గడ్ లాంటి రాష్ట్రాలు ముందంజలో ఉన్నాయి. క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులకు ఈ అంకెలకు పొంతన కుదరడం లేదు. ఇదే విషయాన్ని గతంలో ఎందరో మేధావులు స్పష్టమైన అంకెలతో విమర్శనాస్త్రాలు సంధించారు. దారిద్ర్య రేఖకు దిగువన ఆకలితో అలమటిస్తున్న అభాగ్యులెందరో నిగ్గు తేల్చడానికి అనుసరిస్తున్న విధివిధానాలు తప్పుల తడకలుగా ఉన్నాయని నోబెల్ పురస్కార గ్రహీత అమర్త్యసేన్ గతంలో తూర్పారబట్టారు. దేశ జనాభాలో 30 శాతం వరకు పేదరికంలో మునిగితేలుతున్నారని 2014లో నిర్ధారించిన రంగరాజన్ కమిటీ నివేదిక ఇందుకు అద్దం పడుతున్నది. దేశంలో ఆకలితో నకనకలాడుతున్నవారి సంఖ్య యాభైకోట్లని సక్సెనా కమిటీ వెల్లడించింది. దేశవ్యాప్తంగా ఎనభైఒక్క కోట్ల ముప్పైఐదు లక్షల మంది అన్నార్తులకు ఉచితంగా తిండిగింజలు పంపిణీ చేసే కార్యక్రమాన్ని మరో ఐదేళ్లు పొడిగిస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటికీ కోట్లాది మంది జీవితాలు అర్ధాకలి, పస్తులతోనే గడుస్తున్నాయనే విషయం తెలియంది కాదు. నూట ఇరవైఐదు దేశాలను పరిగణనలోకి తీసుకున్నా అంతర్జాతీయ క్షుద్బాధ సూచికలో భారత్‌కు నూట పదకొండో స్థానం దక్కింది.దక్షిణ ఆసియా, కొన్ని ఆఫ్రికా దేశాల్లో పేదరికం ఛాయలు అధికంగానే ఉన్నాయి. ప్రపంచంలో పేదలు అధికంగా దక్షిణాసియా, సబ్ సహారా, ఆఫ్రికా దేశాల్లోనే ఉన్నారు. ఆయా దేశాల్లో జనాభాఎంత పెరిగిందో పేదల సంఖ్య కూడా అదే స్థాయిలో పెరిగిపోతున్నది. భారతదేశంలో పేదరికాన్ని పారద్రోలేందుకు చేస్తున్న ప్రయత్నాలు అంతగా సఫలీకృతం కావడంలేదు. పేద కుటుంబాలకు ఆకలి బాధలు లేకుండా చేయాలనే లక్ష్యంతో ఎన్నో సబ్సిడీ పథకాలను ప్రభుత్వం నిర్వహిస్తున్నది. సబ్సిడీలో బియ్యం, మధ్యాహ్నభోజన పథకం లాంటివి ఎన్నో ఉన్నాయి. ప్రజాపంపిణీ వ్యవస్థ ఇందులో కీలకపాత్ర వహిస్తున్నది. లబ్దిపొందే వారి సంఖ్య అంతకంతకు పెరిగిపోతుండడం పేదరికం విస్తరిస్తున్నదనే సంకేతాలు ఇస్తున్నది. ఒకపక్క నీతి ఆయోగ్‌తో పాటు గ్రామీణాభివృద్ధి సంస్థ లాంటివి సర్వే నిర్వహించి పేదరికం గణనీయంగా తగ్గిందని చెప్తుంటే ప్రజాపంపిణీవ్యవస్థ రికార్డులు అందుకు అంగీకరించడంలేదు. ఆ లెక్కల ప్రకారం పేదల సంఖ్య తగ్గిపోతుంటే ప్రజాపంపిణీ సంస్థ లెక్కల్లో ఊహించని రీతిలో పేదరికం పెరిగిపోతున్నది. దేశంలో ఎన్ని పథకాలు రూపొందించినా, మరెన్ని లక్షల కోట్ల నిధులు వెచ్చించినా పేదరికంపై పోరాటం ఆశించిన ఫలితాలు ఇవ్వడం లేదు. పేదరికం దానంతటదే తగ్గిపోతుందనుకుంటే భ్రమే అవుతుంది. ఆఫ్రికా దేశాల్లోనూ ప్రభుత్వాలు కీలకమైన పాత్ర పోషిస్తూనే పేదరికాన్ని నిర్మూలించడం సాధ్యపడుతుందనే విషయాన్ని కొన్ని దేశాలు రుజువు చేశాయి. ప్రభుత్వ విధానాలు ఇందుకు అనుగుణంగా ఉండాలి. ఆర్థికాభివృద్ధితోపాటు సంపద పంపిణీ, వ్యవసాయరంగంలో సంస్కరణలు, వైద్యసేవల విస్తరణ, విద్య తదితర అంశాలపై దృష్టి పెట్టాలి.

> అందరూ జోక్యం చేసుకునే విషయం ఏ ఒక్కరి సొంత విషయమూ కాదు.



సిసిరో

> కలలు మన అంతర్గత కోర్కెలకు నిజమైన భాష్యాలు. వాటిని అర్థం చేసుకోవడానికి కళా నైపుణ్యం కావాలి.



యావా చర్చిల్

## ప్రజావాక్కు



### అమెరికాను అదుపు చేయడం కష్టం

వెనిజువెలా అధ్యక్షుడైన నికోలస్ ముదురోను ఆయన భార్యనుఅమెరికా సైనిక దళాలు ఆ దేశం వెళ్ళి అధ్యక్షుని చేతికిసంకెళ్ళు వేసికళ్ళకు గంతలు కట్టి అమెరికా తీసుకు వెళ్ళిఅక్కడ జైలులో పెట్టారు.ఇంతఘోరం జరుగుతుంటే భద్రతా దళాలు ఏమి చేస్తున్నాయి? అక్కడి అధికారులు అమెరికాతోలాలూచి పడ్డారా? అక్కడి సైనిక బలగాలు ప్రజలు తమకేమీ పట్టనట్టు వ్యవహరించడమేమిటి? ఏ న్యాయ సూత్రాలనుపాటించి ఈ ఎత్తుగడ సాగింది?అంతర్జాతీయ న్యాయస్థానంఏంచేస్తోంది? ఇతర ప్రపంచ దేశాలు అమెరికా చేసినఈఘాతుకానికి గట్టిగా ప్రతిస్పందన చేసినట్టు వార్తలేమీ రాలేదు.రష్యా, బ్రెజిల్, చైనా యితర కొన్ని చిన్న దేశాలు మాత్రమే అమెరికా చర్యనుతప్పుబట్టాయి. అన్ని దేశాలుఒకే త్రాటిపై నిలబడక పోతే అమెరికాను అదుపు చేయడం కష్టం.

- ఎన్. రామలక్ష్మి,సికింద్రాబాద్

### 15 సార్లు పెరోల్ బెయిలా ?

ఒకసామాన్యుడు అరెస్టు అయితే సంవత్సరాల తరబడి జైల్లో మగ్గుతుంటాడు. అదే ఒక బాబా నేరం రుజువై జీవిత శిక్షపడిన వానికి ఆరేళ్లలో 15 సార్లు పెరోల్ బైలు! 2020 సంవత్సరంలో హత్యనేరం, అత్యాచార నేరం రుజువై 20 సంవత్సరాల జీవిత శిక్షపడిన దేరాబాబాకు నిన్న 15వసారి పెరోల్ బైలు వచ్చింది.ఉత్తర భారతంలో దొంగ బాబాలకు ప్రత్యేక గుర్తింపు, గౌరవం ఉంటుంది అనడానికి ఇదిఒక నిదర్శనం. ఈబాబా అరెస్టు అయినపుడు నాలుగైదు రాష్ట్రాల్లో భక్తులు నానాహంగామా చేసారు. ఇలాంటి నేరగాళ్లు, ఇలాంటి డేరా బాబాలు వ్యవస్థలను, పాలకులను నడిపిస్తున్నారా అనుమానంగా ఉంది.

- నార్నె వెంకటసుబ్బయ్య, ఒంగోలు

### వ్యవస్థలు బాగా పని చేయాలి

దేశంలోని ముఖ్యమైనవ్యవస్థలు సక్రమంగా పని చేయాలి. పోలీసు, చట్టాలు, చట్ట సభలు, ఇతర రంగాల ఉద్యోగులు,పౌరులు బాగా పని చేయాలి. వ్యవస్థలను నియంత్రించి అణచి వేసేది రాజకీయ శక్తులు కాబట్టి వ్యవస్థలు అప్రమత్తంగా ఉంటే సరిపోతుంది. వ్యవస్థలు ఎవరి వత్తిళ్లకు లొంగకూడదు. ప్రజా సేవలో ఉన్న ప్రతి ఒక్క పౌరులు నిజాయితీగా పనిచేయాలి.

- కె.రామారావు, నల్గొండ జిల్లా

### నిర్లక్ష్యమే అన్ని సమస్యలకు కారణం

ప్రపంచ క్రీడా వేదికపై భారత్ సాధిస్తున్న పురోగతితో పాటు ఒక చేదు వాస్తవం దేశాన్ని కలవరపెడుతోంది. అంతర్జాతీయ గణాంకాలప్రకారం డోపింగ్ కేసులసంఖ్యలో భారత్ అగ్రస్థానంలో నిలవడం దేశ ప్రతిష్ఠకు గట్టి దెబ్బ. ఇది కొందరు క్రీడాకారుల వ్యక్తిగత తప్పిదంగా కాకుండా, మొత్తం క్రీడా వ్యవస్థలో పాతుకుపోయిన వైఫల్యంగా చూడాలి. ఈ పరిస్థితి కొనసాగితే 2036 ఒలింపిక్స్ నిర్వహణపై భారత్ పెట్టుకున్న ఆశలే ప్రశ్నార్థకమవుతాయి. డోపింగ్‌న్యాయమైన పోటీని ఖండించడమే కాకుండా నిజాయితీగా శ్రమించే క్రీడాకారుల కలలను చిదిమేస్తుంది.యువతకు విజయం కోసంఏదైనా సరే" అన్న ప్రమాదకర సందేశాన్ని పంపుతుంది.అవగాహన లోపం, అనుభవం లేని కోచ్‌లు, పోషకాహారం-నిషేధిత పదార్థాల తేడా తెలియకపోవడం, ఫలితాల కోసం అతివాద ఒత్తిడి ఇవన్నీ భారత్‌లో డోపింగ్ విస్తృతికి కారణాలు.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### డాలర్‌కు గడ్డుకాలం

ఇప్పుడు కొత్త సంవత్సరం అంత యుద్ధకాలమే. తన మాట మాత్రమే చెల్లుబాటు కావాలె అని అయితేఇక్కడో మెలిక ఉంది. ఇప్పుడు డాలర్‌కు గడ్డుకాలం నడుస్తోంది. అంటే క్వాడ్ రూపంలోనోఆసియాన్ రూపంలోనో లేక షాంఘై రూపంలోనో సంస్థలు తమ అవసరాలు తీర్చుకోవడానికి సొంత ఆర్థిక సంస్థలు ఫామ్ చేసుకోవడానికి ప్రయత్నం చేయడం ఆఫ్రికన్ యూనియన్ కూడా జీ 20లో 21 వ కూటమిగా చేరడం మూలంగా చిన్న దేశాలు, పశ్చిమాన పెద్ద దేశాలకు భయపడడం లేదు. తమ వ్యాపారాన్ని తమ సొంత కరెన్సీలోనే నిర్వహించుకోవడానికి ప్రయత్నం చేయడం అభివృద్ధి చెందిన దేశాలకు కంటగింపుగా మారింది.

-భారత అవినాష్, జనగామ

### భూ కబ్జాలను ఆపండి

తెలంగాణ రాష్ట్రంలోని మండల కేంద్రాలలో ఉన్న ఎస్సీ ఎస్టీ కాలనీలలో భూకబ్జాలు, భూ అక్రమణలు, అక్రమ కట్టడాలు జరుగుతున్నాయి.న్యాయం కోసం పోలీస్ స్టేషన్, రెవెన్యూ అధికారులకు, ఎస్సీ ఎస్టీ కమిషన్ వికలాంగుల సంక్షేమ శాఖ. జిల్లా కలెక్టర్‌లకు కూడా ఫిర్యాదు చేసినా కూడా సమస్యలు పరిష్కారం కావడం లేదు. సంవత్సరాలు గడిచినా కూడా భూ సమస్యలు పరిష్కారం కావడం లేదు.

-రాపాక రవీందర్, జనగాం

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# అమెరికా ఆగడాలకు అదుపులేదా?

**విదేశీ సైన్యం దేశంలోకి చొరబడటం ప్రజల్లో తీవ్రఆగ్రహాన్ని రగిలించింది. మరోసారి దాడి జరిగితే దేశమంతా ప్రతిఘటిస్తామని ప్రజలుహెచ్చరిం చారు. తాత్కాలిక అధ్యక్షురాలిగా ఎన్నికైన డెల్సీ రోడ్రిగ్స్ వెనెజువెలా గగనతలంలో విదేశీ విమానాలపై నియంత్రణ విధించారు. స్వతంత్ర సార్వభౌమ దేశమైన వెనెజువెలాలోకి చొరబడి అమెరికా చేపట్టిన అత్యంత అమానుషమైన దాడిపై ప్రపంచవ్యాప్తంగా తీవ్ర నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. అమెరికా పై ధిక్కారం న్యాయ అవగాహన, ప్రజాస్వామ్య ఆలోచనలు కలిగిన ప్రతి ఒక్కరినీ షాక్‌కు గురిచేసింది. వామపక్ష ప్రభుత్వాలు ఉన్న దేశాల నాయకులే కాకుండా, ఇతర రాజకీయ ధోరణులు అనుసరించే పాలకులు కూడా ట్రంప్ ప్రభుత్వ చర్యను తీవ్రంగా ఖండించారు. వెనెజువెలాలో జరిగిన దాడిలో తమ పాత్రలేదని, అంతర్జాతీయ చట్టాలను పాటించాల్సిందేనని అమెరికాకు అత్యంత సన్నిహిత మిత్ర దేశమైన బ్రిటన్ ప్రధాని కియర్ స్టార్మర్ తక్షణమే స్పందించడం గమనార్హం.**

టి.నాగరాజు

ఇరవై ఒకటవ శతాబ్దంలోకి ప్రపంచం అడుగుపెట్టినప్పటికీ, ప్రపంచం చూస్తుండగానే ఏదైనా చేయడానికి వెనకాడని అమెరికా సామ్రాజ్యవాదం అసలైన రూపాన్ని శనివారం వెనెజువెలాలో చూశాం. ఎనిమిది దశాబ్దాల క్రితం రెండో ప్రపంచ యుద్ధం ముగిసిన తరువాత జపాన్‌పైఅణు బాంబులు వేసి పసిపిల్లలతో సహా లక్షలాది మందిని కాల్చి చంపిన అమెరికా భీకరత్వాన్ని ప్రపంచం చూసింది. అనంతరం వియత్నాంలో రెండు దశాబ్దాల పాటు సాగిన ఆక్రమణలో లక్షలాది మందిని పొట్టన పెట్టుకోవడాన్ని, చివరికి ఆ రైతు ప్రజల పోరాటం ముందు మోకారిల్లి వెనక్కి తగ్గిన దృశ్యాన్ని కూడా చూశాం. తరువాత కూడా అనేక దేశాల్లో అమెరికా ఆక్రమణలు, కుట్రలు కొనసాగాయి.అయినప్పటికీ, మానవులు మరింత సంస్కృతులుగా మారిన ఈ ఆధునిక కాలంలో కూడా మానవత్వ విరుద్ధమైన సామ్రాజ్యవాద యుద్ధోన్మాదానికి ఏమాత్రం మార్పులేదని, కొత్త సంవత్సరంలో తనతొలి దాడితోనే అమెరికా మరోసారి నిరూపించింది. వెనెజువెలాఅధ్యక్షుడు నికోలాస్ మదురోను, ఆయన భార్యను అపహరించిన ఈ అఘాయిత్యం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌లోని నియంతృత్వ దురాశకూ, ఆర్థిక లాభానికీ నిదర్శనం మాత్రమే కాదు. అమెరికా సైనిక చర్యకు అరగంట కూడా పట్టలేదని వార్తలు చెబుతున్నాయి. అయితే కనీసం ఐదు నెలలుగా దీనికి సంబంధించిన ఏర్పాట్లు అమెరికా చేస్తోందన్నది స్పష్టమే.ఈ కుట్రలో భాగంగానే గత అక్టోబరులో నార్వేజియన్ కమిటీ,వెనెజువెలాలోయుద్ధోన్మాదాన్ని ప్రోత్సహించే తీవ్ర రైట్ వింగ్ భావజాలమచ్చాడోకు నోబెల్ శాంతి బహుమతి అందించింది. దాని ద్వారా మదురోను, వెనెజువెలా ప్రభుత్వాన్ని అంతర్జాతీయంగా విలన్ చేసిన తరువాతే అమెరికా దాడి జరిగింది. ఈ ఘటనలో నోబెల్ శాంతి కమిటీ కూడా సహనిందితురాలే. ఇంతకుముందు వెనెజువెలాలో కూలదోపే ప్రయత్నాలను అక్కడి తన అనుచరుల చేత చేయించిన అమెరికా, ఈసారి నేరుగా సైనిక దాడికేదిగింది. అమెరికాకు వెనెజువెలా నుంచి ఎలాంటి భద్రతా ముప్పులేదు. ఈ రెండు దేశాలకు మధ్యసరిహద్దులు కూడాలేవు. భౌగోళికంగా వీటి మధ్య 4500 కిలోమీటర్లకు పైగా దూరం ఉంది. సామ్రాజ్యవాద ఆధిపత్యానికి లొంగడానికి సిద్ధంగా లేనందుకే వెనెజువెలా అమెరికాకు కంటిలో ముల్లుగా మారింది.తమ సహజ వనరులనుదేశం, ప్రజల ప్రయోజనాల కోసం వినియోగించుకునే హక్కును, సార్వభౌమాధికారాన్ని వెనెజువెలా వామపక్ష ప్రభుత్వం గట్టిగా నిలబెట్టింది. అదే కారణంగా నిర్బంధం లేకుండా దోచుకున్న అమెరికా,అక్కడి చమురు కంపెనీలు వెనెజువెలాపై శత్రుత్వంతోదాడులు ప్రారంభించాయి.2002లోహ్యూగో చావెజ్‌ను కూలదోసేందుకు చేసిన ప్రయత్నం ప్రజాప్రతిఘటనతో విఫలమయ్యాక, అమెరికా ఏకపక్ష ఆంక్షలు విధించి ఆర్థిక యుద్ధాన్ని ప్రకటించింది. దాంతో వెనెజువెలాఆర్థికంగా నలిగిపోయేలా చేసి, ప్రజలను కష్టాల్లోకి నెట్టడం ద్వారా అట్టడుగు తిరుగుబాటుకు వేదిక సిద్ధం చేసింది. మదురో మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు సహకరిస్తున్నాడని ట్రంప్, అమెరికా ఆరోపిస్తున్నాయి. కానీ ఆ ఆరోపణలకు ప్రపంచాన్ని నమ్మించే ఒక్కఆధారాన్నీచూప లేకపోయాయి. నిజానికి లాటిన్ అమెరికా నుంచిఅమెరికాకు చేరే మాదక ద్రవ్యాల్లో వెనెజువెలా తీరాలద్వారా వెళ్లేవి అతిస్వల్ప శాతం మాత్రమే.అవి అమెరికాకు చేరుతున్నాయంటే, సరిహద్దుల్లో, నౌకాశ్రయాల్లో, విమానాశ్రయాల్లో అడ్డుకోవాల్సిన బాధ్యత ట్రంప్ ప్రభుత్వానిదే అది చేయకుండా అట్టడుగు కుట్రకు కథలు అల్లుతూ పచ్చిఅబద్ధాలు చెప్పడమే ట్రంప్ చేస్తున్న పని. దక్షిణ అమెరికా మొత్తాన్ని అమెరికా ఆధిపత్యంలోకి తెచ్చే పాత మాన్‌రో సిద్ధాంతాన్ని మళ్లీ అమలు చేయడంలో వెనెజువెలా ప్రధాన అడ్డంకిగా మారిందన్నదే, అంతర్జాతీయ



చట్టాలు, ప్రపంచ మర్యాదలను ఏ మాత్రంలెక్కచేయకుండా అక్కడ తిరుగుబాటు చేయడానికి ట్రంప్‌ను ప్రేరేపించింది. 'బెల్ట్ అండ్ రోడ్' ప్రాజెక్ట్ ద్వారా ఆ ప్రాంతంలో భారీగా పెట్టుబడులు పెంచుతున్న చైనా ప్రభావాన్ని తగ్గించాలన్నదీ ట్రంప్ లక్ష్యమే. పచ్చి అబద్ధాల ఆధారంగా జార్జ్‌బుష్ జూనియర్ ఇరాక్‌పై దాడి చేసినప్పటికీ, ముందుగా అమెరికా కాంగ్రెస్ అనుమతితీసుకున్నాడు. కానీ ట్రంప్ దానికి కూడా సిద్ధంగా లేకపోవడం ద్వారా అమెరికా ప్రజాస్వామ్యాన్నే సవాలు చేశాడు. ఎన్నికల్లో ఓడినప్పుడు తన అనుచరులతో కలిసి పార్లమెంట్‌పై దాడి చేసి తిరుగుబాటుకు యత్నించిన ట్రంప్‌కు ప్రజాస్వామ్యంపై మాట్లాడే నైతిక హక్కుఏముంది? క్యూబాసహా ఈ ప్రాంతంలోని ఇతర వామపక్ష పాలితదేశాలపై కూడా ఈ యుద్ధోన్మాద పాలకుడి సైన్యం ఎక్కుపెట్టవచ్చు. ట్రంప్ నేతృత్వంలోని అమెరికా దక్షిణ అమెరికా దేశాలకు మాత్రమే కాదు,దాని మిత్రదేశాలకు కూడా ముప్పుగానే మారింది. కెనడాను అమెరికా 51వ రాష్ట్రంగా విలీనం చేయాలన్న కోరికను ట్రంప్ బహిరంగంగానే వ్యక్తంచేశాడు. దేశంపై దాడిచేసి వెనెజువెలా అధ్యక్షుడు నికోలాస్ మదురోను, ఆయన భార్య సీలియా ఫ్లోరెస్‌ను అమెరికా సైన్యం అపహరించినఘటనకు వ్యతిరేకంగా వెనిజువెలా అంతటా తీవ్ర నిరసనలు ప్రజలు చేస్తున్నారు. రాజధాని కరాకస్‌తో పాటు ప్రధాన నగరాల్లో వృద్ధులు, యువకులు, మహిళలు, పిల్లలు వేల సంఖ్యలో రోడ్లపైకి వచ్చారు.మదురోకు మద్దతుగా బ్యానర్లు పట్టుకొని,నినాదాలు చేస్తూ ప్రజలుప్రదర్శనలు నిర్వహించారు. వెనెజువెలా సార్వభౌమాధికారంపై ఎవరి చేయి పడనివ్వబో మని,తమ ప్రియ నాయకుడు మదురోను ఎంతటి మూల్యం చెల్లించైనా తిరిగి తీసుకువస్తామని వెనెజువెలా ప్రజలుగట్టిగా ప్రకటించారు. విదేశీ సైన్యం దేశంలోకి చొరబడటం ప్రజల్లో తీవ్రఆగ్రహాన్ని రగిలించింది. మరోసారి దాడి జరిగితే దేశమంతా ప్రతిఘటిస్తామని ప్రజలుహెచ్చరించారు. తాత్కాలిక అధ్యక్షురాలిగా ఎన్నికైన డెల్సీ రోడ్రిగ్స్ వెనెజువెలా గగన తలంలో విదేశీ విమానాలపై నియంత్రణ విధించారు. స్వతంత్ర సార్వభౌమ దేశమైన వెనెజువెలాలోకి చొరబడి అమెరికా చేపట్టిన అత్యంత అమానుషమైనదాడిపై ప్రపంచ వ్యాప్తంగా తీవ్ర నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. అమెరికా పై ధిక్కారం న్యాయ అవగాహన, ప్రజాస్వామ్య ఆలోచనలు కలిగిన ప్రతిఒక్కరినీ షాక్‌కు గురిచేసింది. వామపక్ష ప్రభుత్వాలు ఉన్న దేశాల నాయకులే కాకుండా, ఇతర రాజకీయ ధోరణులు అనుసరించే పాలకులు కూడా ట్రంప్ ప్రభుత్వ చర్యను తీవ్రంగా ఖండించారు. వెనెజువెలాలో జరిగిన దాడిలో తమ పాత్రలేదని, అంతర్జాతీయ చట్టాలను పాటించాల్సిందేనని అమెరికాకు అత్యంత సన్నిహిత మిత్ర దేశమైన బ్రిటన్ ప్రధాని కియర్ స్టార్మర్ తక్షణమే స్పందించడం గమనార్హం.మదురో ప్రభుత్వాన్ని అధికారికంగా గుర్తించని స్పెయిన్ ప్రధాని పెడ్రో సాంచెజ్ కూడా అమెరికా దాడిని తిరస్కరించారు. అంతర్జాతీయ నియమాలను ఉల్లంఘించి, దేశాన్ని అనిశ్చితిలోకి నెట్టేలా జరిగిన జోక్యాన్ని అంగీకరించ లేమని సాంచెజ్ స్పష్టంగా చెప్పారు. సాధారణంగా అమెరికాకు మద్దతు ఇచ్చే ఫిలిప్పీన్స్,దక్షిణ కొరియా వంటి దేశాల్లో కూడా విస్తృత స్థాయిలో నిరసన ర్యాలీలు జరిగాయి. వెనెజువెలాపై ఆక్రమణ దాడికి వ్యతిరేకంగా అమెరికాలో కూడా తీవ్రఆగ్రహం వెల్లువెత్తుతోంది.వాషింగ్టన్, న్యూయార్క్, లాస్ ఏంజెలెస్, బోస్టన్‌సహా వందకు పైగా నగరాల్లో వేలాది మంది వీధుల్లోకి వచ్చి నిరసన తెలిపారు. మరో దేశాధ్యక్షుడిని అపహరించే అధికారం అమెరికా ప్రభుత్వానికి లేదని వారునినాదించారు.ఈ ఆందోళనలు ప్రపంచమంతా జరుగుతుండగానే వెనెజువెలాలో మదురోకు జరిగినట్లు మరె ఎక్కడైనా జరగవచ్చన్న బెదిరింపును ట్రంప్, అతని అనుచరులు పదేపదే చెబుతూ బెదిరింపులు చేస్తున్నారు. తానుచెప్పిన దానికి సరైన పనిచేయకపోతే మదురో చెల్లించిన దానికన్నా ఎక్కువ మూల్యంచెల్లించాల్సి వస్తుందని వెనె జువెలా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగెస్‌ను ట్రంప్ బెదిరిస్తున్నారు. డెన్మార్క్‌కు చెందిన గ్రీన్‌ల్యాండ్‌ను తమకు అప్పగించాలని ట్రంప్‌డిమాండ్ చేస్తున్నాడు. ప్రపంచం మొత్తం ఈఅంశంపై కదిలిపోతున్నా, మోడీ ప్రభుత్వం మాత్రం మౌనంలోనే ఉంది. నూనెసంపదపై లాభం, రాజకీయ విద్వేషం పెరిగి ట్రంప్‌ఆదేశాల మేరకు జరిగిన సైనిక చర్యను పేరుకైనా ఖండించడానికి భారత్ సిద్ధంగా లేదు. వెనెజువెలాలో పరిణామాలు ఆందోళనకరమని,రెండు పక్షాల మధ్యశాంతి చర్చలవసరమని మాత్రమే విదేశాంగ మంత్రిత్వశాఖ ప్రకటన చేసింది. కేంద్రప్రభుత్వ అతివాద విధానాలకు, ట్రంప్ ప్రభుత్వంతో ఉన్న వ్యూహాత్మక సంబంధాలకు అనుగుణంగానే ఈ విషయంలోనూ వైఖరి తీసుకుంది. •

# గ్రామీణ జీవనాన్ని కుదిపేస్తున్న కోతుల సమస్య

కె. శ్రీనివాస్ రెడ్డి

వ్యవసాయం అనేది కేవలం ఒక వృత్తి మాత్రమే కాదు.. గ్రామీణ జీవనానికి ప్రాణాధారం. అయితే నేటి పరిస్థితుల్లో ఆ వ్యవసాయం రైతుకు లాభం కాకుండా భారంగా మారుతోంది. ఇందుకు ప్రధాన కారణంగా మారిన అంశం అదుపు తప్పిన కోతుల జనాభా. ఇది ఇక అటవీ ప్రాంతాలకు మాత్రమే పరిమితమైన సమస్య కాదు. గ్రామాలు,పంట పొలాలు, ఇళ్ల ముంగిట వరకూ విస్తరించి, వ్యవసాయంతో పాటు గ్రామీణ జీవన విధానాన్నే కుదిపేస్తున్న తీవ్రమైన సంక్షోభంగా మారింది. ఒకప్పుడు పల్లెల్లో ప్రతి ఇంట్లోనూ తీగజాతి కూరగాయలు, ఆకుకూరలు, వంకాయ, మిర్చి, టమాట వంటి పంటలు సహజంగా పండేవి. ఇంటి అవసరాలకు సరిపడేంత కూరగాయలు ఇంటి ముందర పందిళ్లు, పొలాల గట్ల వెంట ఉండేవి. నేడు ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. కోతుల బెడద కారణంగా గ్రామాల్లో కూరగాయల సాగు దాదాపు అంతరించిపోయింది. ఇక కూరగాయలకే పరిమితం కాకుండా మొక్కజొన్న, మిర్చి, కంది, పెసర, మినుము వంటి పంటలు కూడా కోతుల ధ్వంసానికి గురవుతున్నాయి. పంటలు పండే దశలోనే కోతులు పొలాల్లోకి దూసుకెళ్లి నాశనం చేస్తున్నాయి. రైతు పెట్టిన పెట్టుబడి కళ్లముందే మట్టిపాలవుతుండటంతో సాగు చేయాలనే ఉత్సాహమే కోల్పోతున్నాడు. ఇది కేవలం పంట నష్టంతోనే ఆగడం లేదు. కోతులు ఇళ్లలోకి చొరబడి ధాన్యాలను, వంట సామాగ్రిని ధ్వంసం చేయడం, పిల్లలు-వృద్ధులపై దాడులకు పాల్పడటం వంటి ఘటనలు రోజురోజుకు పెరుగుతున్నాయి. గ్రామాల్లో భయాందోళన వాతావరణం నెలకొంది. గ్రామాల్లో ప్రజలు కోతుల భయంతో బతికే పరిస్థితి దాపురించడం అత్యంత ఆందోళనకరం. కూరగాయలు, పప్పుధాన్యాలు, ఇతర వాణిజ్య పంటలు సాగు చేయలేని పరిస్థితుల్లో రైతులు తప్పనిసరిగా వరి పంటవైపు మొగ్గు చూపుతున్నారు. ఫలితంగా ఒకే పంటపై ఆధారపడే ప్రమాదకర పరిస్థితి ఏర్పడింది. వరిసాగు విస్తృతంగా పెరగడంతో యూరియా వినియోగం విపరీతంగా పెరిగింది. దీని వల్ల యూరియా కొరత, భూసార నాశనం, భూగర్భజలాల కాలుష్యం, సాగు వ్యయం పెరుగుదల వంటి సమస్యలు రైతును మరింత కుంగదీస్తున్నాయి. వ్యవసాయం లాభసాటిగా కాకుండా అప్పుల కూపంగా మారుతోంది. ఈ సమస్య తీవ్రతను ఇటీవల జరిగిన తెలంగాణ రాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికలే స్పష్టంగా ప్రతిబింబించాయి. ముఖ్యంగా సర్పంచ్ ఎన్నికల్లో ప్రజలు అభ్యర్థుల ముందు ఉంచిన ప్రధాన సమస్య కోతుల బెడద కావడం గమనార్హం. రోడ్లు, తాగునీరు, పారిశుద్ధం వంటి అంశాలకంటే ముందుగా -కోతుల నుంచి గ్రామాన్ని ఎలా కాపాడతారు? అనే ప్రశ్నే ప్రధానంగా వినిపించింది. పలువురు అభ్యర్థులు తాము గెలిస్తే కోతుల సమస్యకు పరిష్కారం చూపుతామని హామీ ఇవ్వడం, ఈ సమస్యఎంత తీవ్రమైందో స్పష్టంగా తెలియజేస్తోంది.కోతుల సంఖ్యను నియంత్రించడంలో ప్రభుత్వ నిర్లక్ష్యంకొనసాగితే, వ్యవసాయం మాత్రమే కాదు, గ్రామీణ జీవన విధానం మొత్తం కూలిపోయే ప్రమాదం ఉంది. ఈ సమస్యను ఇకపై అటవీశాఖ పరిధిలోని అంశంగా కాకుండా,వ్యవసాయ అత్యవసర సమస్యగా ప్రభుత్వం పరిగణించాల్సిన అవసరం ఉంది. కోతుల సంఖ్యను శాస్త్రీయంగా అంచనా వేయడం, కుటుంబ నియంత్రణ కార్యక్రమాలను విస్తృతంగా అమలు చేయడం, అడవులు-గ్రామాల మధ్య రక్షణ చర్యలు తీసుకోవడం, పంట నష్టానికి తగిన పరిహారం ఇవ్వడం, పంట మార్పిడి విధానాలను ప్రోత్సహించడం వంటి చర్యలు తక్షణమే చేపట్టాలి. లేకపోతే రైతు సాగు మానేస్తాడు.గ్రామాలు ఖాళీ అవుతాయి. ఆహార భద్రతకే ముప్పు ఏర్పడుతుంది. అప్పుడు వ్యవసాయం పండగగా కాదు, దండగగా మారిపోతుంది. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి గ్రామీణ ప్రజలు ఒకటే విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ సమస్యను తక్షణమే పరిగణలోకి తీసుకుని, సమగ్ర విధానంతో పరిష్కరించాలి.లేకపోతే పంటల నాశనం, రైతుల నిరుత్సాహం, వ్యవసాయ వ్యవస్థ పతనం అనివార్యం. ఇది హెచ్చరిక కాదు వ్యవసాయ భవిష్యత్తును కాపాడుకునేందుకు ఇచ్చే గట్టి సంకేతం. •

# ఓటు బ్యాంకులుగా ప్రవాస భారతీయులు

రామకిష్టయ్య సంగన భట్ల

ఒకనాడు ఉన్నత విద్య అనంతరం మోహన్ దాస్ కరమ్ చాంద్ గాంధీ దక్షిణా ఆఫ్రికా వెళ్లి న్యాయ వాద వృత్తి చెప్పట్టేలా చేసింది. 1893లో దక్షిణాఫ్రికాకు వెళ్ళిన మహాత్మాగాంధీ, దేశం బానిస రాజుల చేతిలో మగ్గిపోతుంది అనే వాస్తవాన్ని గ్రహించి, 9 జనవరి 1915 న దక్షిణాఫ్రికా నుంచి భారతదేశానికి జాతిపిత మహాత్మాగాంధీ తిరిగి వచ్చిన దినం సందర్భంగా, మహాత్ముడు ప్రవాసీ నాయకుడే అనేభావనతో, ప్రవాస భారతీయుల దినోత్సవం జనవరి 9న జరుపుకొన బడుతున్నది. భారతదేశఅభివృద్ధికి విదేశీ భారతీయ వర్గాల సహకారాన్ని గుర్తించడానికి భారతదేశపు రిపబ్లిక్ ద్వారా జనవరి 9న ఏటా జరిగే వేడుక రోజు. ఎల్.ఎమ్. సింఘ్వి నేతృత్వంలోని ఉన్నత స్థాయి కమిటీ జనవరి 2002లో ఈ దినోత్సవాన్ని సిఫారసు చేసింది. 2003 నుండి ప్రతి సంవత్సరం జనవరి 9న ప్రవాస భారతీయుల దినోత్సవాన్ని జరుపుతున్నారు.భారత ప్రభుత్వ విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ సమాఖ్య, భారత పరిశ్రమల సమాఖ్య, నార్త్ ఈస్టర్న్ రీజియన్ అభివృద్ధి మంత్రిత్వశాఖ చేత స్పాన్సర్ చేయబడింది. దేశం యావత్తు ప్రవాసీ భారతీయ దివస్ పేరిట ఎన్నో కార్యక్రమం నిర్వహిస్తూ వస్తున్నది భారత ప్రభుత్వం. వివిధ దేశాల్లో భారత సంతతి వారు అందరూ కలిసి దాదాపు 3కోట్ల వరకూ వివిధ దేశాల్లో స్థిరపడ్డారు. మాతృదేశ అభివృద్ధికి ఎందరో దేశాభిమానంతో విశేషకృషి చేస్తున్నారు. నేడు భారత జాతి ప్రగతిలో ప్రవాస భారతీయుల భాగస్వామ్యం చిరస్మరణీయం. ప్రవాస భారతీయుల దినోత్సవం సందర్భంగా వివిధ రంగాల్లో ప్రశంసనీయమైన కృషి చేసిన ప్రవాస భారతీయులకు భారతదేశ వృద్ధిలో ప్రవాసి భారతీయుల పాత్రను అభినందించడానికి, వారిలో అసాధారణమైన యోగ్యత కలిగిన వ్యక్తులకు, భారత రాష్ట్రపతి ప్రతిష్టాత్మక ప్రవాసీ భారతీయ సమ్మాన్ పురస్కారాలను ప్రతి సంవత్సరం అందజేస్తారు. మానవ జాతి పరిణామ క్రమంలో వలస ఒక ముఖ్యమైన మార్గం, విశ్వవ్యాప్తంగా నా భారతావని అనే స్వామి వివేకానందుల మాటలను నిజం చేస్తూ భారతీయ మూలాలు లేని మనుషులులేరు.ఈ దేశంలో అని ప్రపంచ దేశాల్లో ఒక్కదేశాన్ని కూడా చూపించలేం. భారతీయుల మేధాశక్తి ఒక దశలో వలసపోయిందిఅనకుండా మేధో వలస అనే పరిస్థితి వచ్చింది. చదువు మేధా సంపత్తి వైట్ కాలర్ ఉద్యోగాల పేరిట యూరోప్‌వైపు వలసలు జరిగితే, అపార కండర బలం ఉండి శ్రామికులుగా గల్ఫ్ దేశాలకు నిరక్షరాస్యులైన కార్మిక వర్గం విస్తృత స్థాయిలో




వలసలు జరిగాయి. వలసల ప్రక్రియ భారతజాతి వికాసానికి గణనీయమైన బాటలు పరిచింది. వ్యక్తిగత అభివృద్ధితో పాటు దేశాభివృద్ధి శరవేగంగా జరగడం ప్రారంభమైంది. 90వ దశకంలో వచ్చిన ఆర్థిక సరళీకరణ, ప్రపంచీ కరణ విధానాలు కూడా కొంత అభివృధికి దోహదపడ్డాయి. ఈ వలసలకు అభివృద్ధికిగల ప్రముఖమైన సంబంధాన్ని కాదనలేం, విస్మరించలేం. కానీ ఈ ప్రవాసీ భారతీయ దివస్ బడా పారిశ్రామిక వేత్తల పెట్టుబడిని ఆహ్వానించే ఒక సంపన్నుల కార్య స్థలంగా రూపు దిద్దుకొన్నదే కానీ, శ్రమజీవులను ఒక్క తాటికి తీసుకొచ్చి శ్రమైక జీవన సౌందర్యాన్ని ఒక వేదికపై ఆవిష్కరించలేకపోయింది. ఈ వలసలను విస్తృత కోణంలో అర్థం చేసుకోగలిగితే ప్రతి ఒక్కరి ప్రయోజనాలు నెరవేరుతాయి, సమిష్టి ప్రయోజనాలు మెరుగు పడుతాయి. ఒక వైపు ప్రపంచం ఒక కుగ్రామం అయినా నేడు సంపన్న పాశ్చాత్య దేశాల భారతీయుల సేవలు ఇంకా అవసరమైన దేశాలు స్థిర నివాసం ఏర్పరుచుకొనుట కోసం ఎన్నో రాయితీ ప్రయోజనాలు వలస మార్గాలను సులభతరం చేశాయి. అనేక దేశాలలో ప్రవాస భారతీయులు అక్కడి దేశపు చట్టసభల్లో ప్రముఖమైన స్థానాల్ని కైవసం చేసుకుంటున్నారు. మరో వైపు ఈ గల్ఫ్ దేశాలకు పెద్ద సంఖ్యలో మన దేశంనుండి కార్మికుల వలసలు 1970 నుండిమొదలై, నేటికీ కొనసాగుతున్నాయి. వీరి ఆర్జన మొత్తం ఈ దేశానికి పంపుతున్న ఆర్థిక సైనికులైన గల్ఫ్‌వలస కార్మికుల వలస జీవితాల్లో గణనీయమైన మార్పు రావాల్సి ఉంది.కార్మికులుగా వలస వెళ్లిన వీరు తిరిగికుటుంబాన్ని కలవాలిఅంటే అది ఒక గొప్ప విజయమే. ఇట్టి కార్మికులు గల్ఫ్ నుండి 48 డిగ్రీల పై ఉండే అధిక ఉష్ణోగ్రతలో తమ రక్తాన్ని చెమట చుక్కలుగా, ఆపై విదేశీ మారకంగా మార్చి పంపుతున్న క్రమంలో, విదేశీ మారకంతో క్రూడాయిల్, పెట్రోల్ వంటివి కొనడానికి ఉపయోగపడుతున్నాయి. కార్మికుడిగా వెళ్లి ఎన్నో వ్యాపారాల్లో ఉన్నత స్థాయి అందుకున్న మన భారతీయ గల్ఫ్ ప్రవాసీలు, ప్రవాసీ భారతీయ దివస్‌లో ప్రవాసీ సమ్మాన్ అవార్డు అందుకోలేకపోతున్న అంశమే బాధాకరం. టాక్స్‌ల రూపంలో అందుకుంటున్న ప్రభుత్వాలు, వారిదీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి విధాన పరమైన నిర్ణయాలు తీసుకున్న దాఖలాలే లేకపోగా వారిని ఓటు బ్యాంక్‌గా మార్చుకుంటూ, ఆచరణకు నోచులోని హామీలతో కాలం వెళ్లదీయడం అత్యంత శోచనీయం. గల్ఫ్ వలస కార్మికులకు కనీస ప్రాతినిధ్యలేని, ప్రవాసీ భారతీయ దివస్‌ను 'మజ్దూర్ ప్రవాసీ భారతీయ దివస్' గా మార్చాలని దశాబ్దానికి పైగా ప్రవాసుల సంక్షేమ వేదిక అధ్యక్షులు నిరంతరం కార్మికుల హక్కులకోసం అవిశ్రాంతంగా పోరాడుతూనే ఉన్నారు. కార్మికుల జీవిత భీమా,ఆరోగ్య సంరక్షణ, మృత ధనసహాయం, పునరావాసం పునరేకీకరణ, నైపుణ్యంతో తిరిగి వచ్చినకార్మికులకు తోడ్పాటు, ప్రధానంగా గల్ఫ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని, అప్పుడే ప్రవాసీల కృషికి గుర్తింపు ఇచ్చినట్లు అవుతుందని ప్రవాసీ లేబర్ యూనియన్ అధ్యక్షులు స్వదేశ్ పరికి పండ్ల అభిప్రాయపడుతున్నారు. •

# లూయిస్ బ్రెయిలీ సేవలు చిరస్మరణీయం

## జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

**విజయవాడ తూర్పు, జనవరి 8 (ప్రభాతవార్త ) :** లూయిస్ బ్రెయిలీ అందించిన సేవలు చిరస్మరణీయమైనవని, ఎలాంటి సౌకర్యాలూ లేని రోజుల్లో చేతివేళ్లతో చుక్కలను స్పృశించడం ద్వారా చదవగలిగే లిపిని ఆవిష్కరించడం ద్వారా లూయిస్ బ్రెయిలీ మహా మనిషిగా నిలిచారని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీ శ అన్నారు. విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విజయవాడ ఠాగూర్ గ్రంథాలయంలో గురువారం జరిగిన ప్రపంచ బ్రెయిలీ దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పాల్గొన్నారు. విభిన్న ప్రతిభావంతులు, అధికారులు, చిన్నారులతో కలిసి లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ దృష్టికి సంబంధించిన సమస్యలు ఉన్నాయని కలత చెందకుండా బ్రెయిలీ చూపిన మార్గంలో నడిచి తామెవరికీ తక్కువ కాదని నిరూపిస్తున్న వారు ఎదిగినప్పుడే బ్రెయిలీకి నిజమైన నివాళులు అర్పించినవారమవుతామన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ బ్రెయిలీ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా డిసెంబర్ 3న నిర్వహించిన విభిన్న ప్రతిభావంతుల ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన దివ్యాంగ ఉద్యోగులకు మెరిట్ అవార్డులు అందించారు. విజయవాడలో లూయిజ్ బ్రెయిలీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని వివిధ సంఘాల ప్రతినిధులు కోరగా ఈ అంశాన్ని పరిశీలిస్తామని తెలిపారు. విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల సహాయ సంస్థ ఛైర్‌పర్సన్ జి.నారాయణ స్వామి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విభిన్న ప్రతిభావంతులకు విద్య, ఉద్యోగ అవకాశాలు కల్పించి చేయూతనందిస్తోందన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని బాగా చదువుకునేందుకు అవసరమైన ఉపకరణాలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దృష్టిలోపం కలిగిన విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి కృషిచేస్తున్న వివిధ సంఘాల ప్రతినిధులు, దృష్టిలోపం కలిగిన విభిన్న ప్రతిభావంతులు పాల్గొన్నారు. అదేవిధంగా జిల్లా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు వాణీదేవి కామరాజు, ఠాగూర్ గ్రంథాలయ అధికారి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



### నేడు చీమలపాడులో తెదేపా నాయకుల సమావేశం

**ఎ కొండూరు, జనవరి 8, ప్రభాతవార్త :** ఎ కొండూరు మండలం చీమలపాడు గ్రామంలో టిడిపి సీనియర్ నాయకుడు స్వర్గీయ కొండిపాటి సత్యనారాయణ (సత్యం) తనయుడు గ్రామ పార్టీ అధ్యక్షుడు కొండెపాటి వెంకట సుబ్బారావు స్వగృహం వద్ద శుక్రవారం ఉదయం 11 గంటలకు టిడిపి సమావేశం నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు కె.వి సుబ్బారావు సెక్రటరీ జంగా స్టాలిన్ గురువారం మీడియాకు తెలిపారు. ఈ గ్రామ పార్టీకి చెందిన పార్టీశ్రేణులు, నాయకులు, కార్యకర్తలు సానుభూతిపరులు పాల్గొని జయప్రదం చేయాలని కెవి సుబ్బారావు స్టాలిన్ మీడియా సమావేశంలో కోరారు.

# విజయవాడ వార్త

## జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవము

**తిరువూరు, జనవరి 8, ప్రభాతవార్త :** ఏపీఎస్ఆర్టీసీ తిరువూరు డిపో నందు జాతీయ రోడ్డు భద్రత మాసో త్సవాల సందర్భంగా గ్యారేజ్ (ట్రాఫిక్ ఆఫీస్ ఇన్చార్జ్‌లు మరియు ఎస్‌డిఐ సమక్షంలో యాక్సిడెంట్ ఫ్రొన్ డ్రైవర్ సోదరులకు, డిపో మేనేజర్ ఏ సుబ్రహ్మణ్యం చాంబర్లో ఫ్యామిలీ కౌన్సిలింగ్ ఇవ్వబడినది. ట్రాఫిక్ నిబంధనలను పాటించవలెనని సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని మద్యపానము సేవించరాదని ప్రయాణికుల పట్ల మర్యాదగా ప్రవర్తించాలని వారి వారి కుటుంబ బాధ్యతలను, విస్మరించరాదని, యాక్సిడెంట్ ఫ్రొన్ డ్రైవర్ సోదరుల కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సిలింగ్ నిర్వహించబడినది.



# పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలి

## సిపి రాజశేఖరబాబు

**విజయవాడ కార్పొరేషన్, జనవరి 8, ప్రభాతవార్త:** మరిన్ని రికార్డులు కైవసం చేసుకొని పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షిస్తూ హెడ్ కానిస్టేబుల్ మోతుకూరి తులసి చైతన్యను సిపి రాజశేఖరబాబు అభినందించారు. ఆల్ ఇండియా 30-45 సంవత్సరాల వయస్సు కేటగిరిలో 10 కిలోమీటర్ల



సముద్ర స్విమ్మతాన్‌లో మొదటి స్థానం ఈయన సాధించారు. అంతేకాక ఆల్ ఇండియా 30-45 సంవత్సరాల వయస్సు కేటగిరిలో కిలోమీటర్ సముద్ర స్విమ్మతాన్‌లో మొదటి స్థానం సాధించారు. గతంలో 2022 సంవత్సరానికి గాను వాటర్ అడ్వంచర్ విభాగంలో ప్రతిష్టాత్మక టెన్సింగ్ నాప్కె నేషనల్ అవార్డ్ సాధించారు. రాష్ట్రపతి భవన్ దర్బార్ హాల్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డును ఆయన అందుకున్నారు. ఐదు జల సంధులను(సప్త సముద్రాలలో ఐదు సముద్రాలను) విజయవంతంగా ఈదిన ప్రపంచంలోనే మొట్టమొదటి ఇండియన్ పోలీస్‌గా రికార్డును సాధించారు. ట్రిపుల్ క్రౌన్ (ఇంగ్లీష్ ఛానల్, కాటలీనా ఛానల్, 20 బ్రిడ్జిలు)లను ఈదారు. 2012లో విజయవాడ పోలీస్ కానిస్టేబుల్‌గా ఎంపికై నేషనల్ మరియు ఇంటర్నేషనల్ స్విమ్మింగ్‌లో ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖ తరపున 2012 నుండి ఇప్పటి వరకు పలు ఆల్ ఇండియా పోలీస్ కాంపిటేషన్లలో పాల్గొని 24 బంగారు పతకాలు, 23 వెండి పతకాలు మరియు 9 కాంస్య పతకాలను సాధించారు. ఈ క్రమంలో కాటలీనా ఛానల్ (ఫసిఫిక్ మహా సముద్రం) ఈదిన మొట్టమొదటి ఇండియన్ పోలీస్‌గా రికార్డును కైవసం చేసుకున్నారు. అనంతరం శ్రీలంక నుండి ఇండియా వరకు (రామసేతు) పాల్క్ స్ట్రైట్ ను అతి తక్కువ సమయంలో ఈది ఫాస్టెస్ట్ స్విమ్మర్‌గా రికార్డు సాధించారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తులసీ చైతన్యను 2022 సంవత్సరానికి గాను టెన్సింగ్ నార్కే నేషనల్ అడ్వంచర్ అవార్డుకు ఎంపిక చేసింది. జనవరి 2024లో ఢిల్లీ లోని రాష్ట్రపతిభవన్ దర్బార్ హాలులో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ప్రతిష్టాత్మక టెన్సింగ్ నార్వే అవార్డును తీసుకున్నారు. ఈ నెల 3,4 తేదీలలో గుజరాత్ రాష్ట్రం లోని పోర్ బందర్ అరేబియన్ సముద్రంలో శ్రీరామ్‌సే స్విమ్మింగ్ క్లబ్ వారు నిర్వహించిన 25వ ఆల్ ఇండియా, 30-45 సంవత్సరాల వయస్సు కేటగిరిలో ఒక కిలోమీటర్, 10 కిలోమీటర్స్ సముద్ర స్విమ్మితాన్‌లలో విజయవాడ సిటీ స్పెషల్ బ్రాంచ్ నందు విధులు నిర్వహించే హెడ్ కానిస్టేబుల్ తులసీ చైతన్య పాల్గొని రెండు పోటీలలో మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఒక కిలోమీటర్ స్విమ్‌తాన్‌కు బంగారు పతకంతో పాటు 2,500 నగదును, ఒక 10 కిలోమీటర్ల స్విమ్‌తాన్‌కు బంగారుపతకంతో పాటు 20వేల నగదును చేజిక్కించుకున్నారు. ఈ ప్రశంసాపత్రాలకు సంబంధించిన వివరాలను తెలుసుకున్న సిపి రాజశేఖరబాబు తులసి చైతన్యను అభినందించారు. మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

# రాజధాని అమరావతిలో పర్యటించి పనుల పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన నాబార్డ్ బృందం


విజయవాడ, జనవరి8, ప్రభాతవార్త: జాతీయ వ్యవసాయ గ్రామీణ అభివృద్ధి బ్యాంకు నాబార్డ్ డిజిఎం అబువురాజన్ గురువారం ప్రజారాజధాని అమరావతిలో పర్యటించారు. రాజధాని అమరావతి అభివృద్ధికై నాబార్డ్ సంస్థ గతంలో రూ.7,387.70 ఆర్థిక సహకారం ప్రకటించిన విషయం విదితమే..ఆ నిధులలో కొంత మేర రాష్ట్ర ప్రభుత్వానికి విడుదల కాగా..ఏపిసిఆర్‌డిఏ, ఏడిసిఎల్



ఆధ్వర్యంలో ఆనిధులతో అమరావతిలో ప్రస్తుతం 9 ప్రాజెక్టులను చేపట్టడం జరిగింది. గురువారం ఆయా ప్రాజెక్టు సైట్‌లలో నిర్మాణ పనుల పురోగతిని అబువురాజన్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. డిజిఎంకు ఆయా ప్రాజెక్టుల వద్ద ఏడిసిఎల్ ఎస్‌ఈ నరసింహ, సిఆర్‌డిఏ(అకౌంట్స్ విభాగం) కంపెనీ సెక్రటరీ కె.రాజేష్ బాబు రహదారులు, మౌలిక వసతుల అభివృద్ధి పనులు జరుగుతున్న తీరును వివరించారు.

# సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే కొలికపూడి

**ఎ కొండూరు, జనవరి 8, ప్రభాతవార్త :** గత వైసిపి ప్రభుత్వంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన ముఖ్యమంత్రి సహాయనిధి (సిఎంఆర్ఎఫ్) పథకాన్ని రాష్ట్రంలో తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సిఎం చంద్రబాబు మానవతా దృక్పదం ఉదార స్వభావంతో వివిధ రకాల ఆరోగ్య సమస్యలతో సతమవుతున్న పేద ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని సిఎంఆర్ఎఫ్ పథకాని తిరిగి ప్రవేశపెట్టి పేదలకు అండగా నిలబడ్డారని తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అన్నారు. తిరువూరు టౌన్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో గురువారం నియోజకవర్గ స్థాయిలో తిరువూరు అర్బన్ ఎ కొండూరు విసన్నపేట గంపలగూడెం మండలాలకు చెందిన 50మంది లబ్దిదారులకు 21వ విడత మంజూరైన రూ.5.2869 కోట్లు చెక్కులను ఎమ్మెల్యే శ్రీనివాసరావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాసరావు మాట్లాడుతూ ఒక మంత్రి నియోజకవర్గంలో కూడా పెద్ద మొత్తంలో మంజూరు అవ్వని సిఎం ఆర్ఎఫ్ ఒక ఎమ్మెల్యేగా వెనుకబడ్డ తిరువూరు నియోజకవర్గంలో రూ.5.2869 కోట్లు సిఎంఆర్ఎఫ్ మంజూరు చేయడం సిఎం చంద్రబాబు ఉదార స్వభావం మానవతా దృక్పధం పట్ల ఎమ్మెల్యే ఈ సందర్భంగా సిఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. నియోజకవర్గంలో 4మండలాల్లో వివిధ గ్రామాల్లో పనిచేస్తున్న పార్టీ శ్రేణులు



నాయకులు వివిధ అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడే పేదలను గుర్తించి వారిని తన కార్యాలయానికి తీసుకొని వస్తే వారికి సిఎంఆర్ఎఫ్ మంజూరయ్యే విధంగా కృషి చేస్తానని ఎమ్మెల్యే పార్టీ శ్రేణులకు నాయకులను కోరారు. ఇంకా ఈ కార్యాలయంలో రాష్ట్ర మాదిగ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మాజీ ఎంపిపి వాసం మునియ్య, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు గడ్డి కృష్ణారెడ్డి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు మేకల రామారావు (జాన్) వనపర్ల డేవిడ్ రాజు, టిడిపి గిరిజన సంఘం రాష్ట్ర నాయకుడు బి.గోపిరాజు తదితరులు పాల్గొన్నారు.

# 4వ రోజు కొనసాగిన సహకార సంఘ ఉద్యోగుల రిలే నిరాహార దీక్షలు

**మైలవరం, జనవరి8, ప్రభాతవార్త :** న్యాయమైన తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సహకార సంఘ ఉద్యోగులు కృష్ణాజిల్లా కోపరేటివ్ సెంట్రల్ బ్యాంకు మైలవరం బ్రాంచ్ ఎదుట చేస్తున్న రిలే నిరాహార దీక్షలు



గురువారం నాటికి 4 రోజుకు చేరుకున్నాయి. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల సమాఖ్య రాష్ట్ర జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు దశల వారి ఆందోళన కార్యక్రమాలలో భాగంగా మైలవరం మండలంలోని ఏడు సహకార సంఘాల ఉద్యోగులు స్థానిక కేడీసీసీ బ్యాంకు ఎదుట రిలే నిరాహార దీక్షలు చేస్తున్న విషయం తెలిసిందే. సహకార సంఘాల ఉద్యోగులంతా తమ తమ కార్యాలయాలను మూసివేసి డిమాండ్ల పరిష్కారం కోసం చేస్తున్న సమ్మె కారణంగా రైతులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా కొత్త రుణాలు మంజూరు, గతంలో తీసుకున్న రుణాలు తిరిగి చెల్లింపులు పూర్తిగా నిలిచిపోవడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. సహకార సంఘ ఉద్యోగులు మాత్రం తమ సమస్యలను పరిష్కరించే వరకు సమ్మెను దశలవారీగా కొనసాగిస్తామని హెచ్చరిస్తున్నారు. సహకార సంఘ ఉద్యోగుల ఐక్యత వర్ధిల్లాలి, సహకార సంఘాల జేఏసీ జిందాబాద్, జీవో నెంబర్ 36ను అమలు చేయాలని, ప్రభుత్వం పై భారం పడని తమ సమస్యలను పరిష్కరించాలని ఉద్యోగులు రిలే నిరాహారదీక్ష శిబిరంలో పెద్ద ఎతున విహెచ్ అండ్ యాడ్ ఫర్ జిందాబాద్, జీవో నెంబర్ 36ను అమలు చేయాలని, ప్రభుత్వంపై భారం పడని తమ సమస్యలను పరిష్కరించాలని ఉద్యోగులు రిలే నిరాహారదీక్ష శిబిరంలో పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ రిలే నిరాహార దీక్షలు ఈనెల 9 వరకు కొనసాగిస్తామని అనంతరం రాష్ట్ర జేఏసీ పిలుపుమేరకు ఆందోళన కార్యక్రమాలను రైతులతో కలిసి మరింత ఉధృతం చేస్తామని మైలవరం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం సీఈవో షేక్ ఫరీద్ హెచ్చరించారు. ఇదిలా ఉండగా న్యాయమైన, దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మైలవరం మండలంలోని ఏడు సహకార సంఘాల త్రిసభ్య కమిటీ ఛైర్మన్ లను ఒక్కొక్కరిని సహకార సంఘ ఉద్యోగులంతా వారి వారి ఇళ్లకు వెళ్లి కలిసి వినతి పత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో మైలవరం మండలంలోని మైలవరం, వెల్వడం, చంద్రాల, తోలుకోడు, చంద్రగూడెం, పుల్లూరు, మొర్సుమిల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల సీఈఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

# గుళ్ళపూడి రహదారి పనులకు శంఖుస్థాప

గంపలగూడెం, జనవరి 8, ప్రభాతవార్త:గంపలగూడెం మండలం గుళ్ళపూడి రోడ్డు పనులకు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు గురువారం శంఖుస్థాపన చేశారు. గంపలగూడెం నుంచి గుళ్ళపూడికి 6.8 కిలోమీటర్లు, తిరువూరు



నుంచి అక్కపాలెం రహదారి 5.75 కిలోమీటర్ల నిడివి వెళ్ళే ఆర్ అండ్ బీ రహదారి నిర్మాణ పనులకు అక్కపాలెం రహదారి పనులకు రూ.3 కోట్లు చొప్పున మంజూరైనట్లు ఆర్ అండ్ బీ అధికారులు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినాక రహదారుల అభివృద్ధికి ప్రథమ ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అన్నారు. ఆర్ అండ్ బి డి ఇ,

# కోడిపందాల నిర్వాహకుల బైండోవర్

**గంపలగూడెం, జనవరి 8, ప్రభాతవార్త:** గంపలగూడెం మండలం ఊటుకూరులో సంక్రాంతి సంబరాల పేరుతో కోడిపందాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్న నలుగురిని పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. ఊటుకూరుకు చెందిన రామిశెట్టి సాయిరాం, దూళ్ళ నరసింహారావు, అనంత కృష్ణారావు, బత్తుల రామకృష్ణలు గ్రామ శివారులోని మామిడితోటలో పందాల నిర్వ హణకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు దాడి నిర్వహించారు. ఎస్ఐ అనిల్ వారిని అదుపులోకి తీసుకుని గంపలగూడెం తహసీల్దారు రాజకుమారి ఎదుట బైండోవర్ చేసి స్వంత పూచీకత్తుపై విడుదల చేశారు.

# పారిశుద్ధ్యంలో లోపం ఉండరాదు

## చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అర్జునరావు

**విజయవాడ కార్పొరేషన్, జనవరి 8, ప్రభాతవార్త:** ఆవకాయ-అమరావతి మహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పారిశుధ్య నిర్వహణలో ఎటువంటి లోపం ఉండరాదని నగరపాలక సంస్థ చీఫ్




మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జునరావు పేర్కొన్నారు. గురువారం ఉదయం పున్నమి ఘాట్, కుమ్మరిపాలెం ప్రాంతాలన్నీ పర్యటించి క్షేత్రస్థాయిలో పారిశుధ్య నిర్వహణను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆవకాయ అమరావతి మహోత్సవంలో ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పిస్తున్నామన్నారు. జనవరి 8 నుండి 10వ తేదీ వరకు జరిగే ఆవకాయ అమరావతి మహోత్సవంలో వచ్చే ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించేందుకు నిత్యం పారిశుధ్య నిర్వహణలో ఎటువంటి లోపం ఉండరాదని అలన్నారు. మరో వైపు తాత్కాలిక మరుగుదొడ్లు, ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేటట్లు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ పర్యటనలో అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, శానిటరీ సూపర్‌వైజర్ శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

# ఇంటర్ పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

- అధికారులు ప్రణాళికతో పనిచేయాలి
- ఎక్కడా ఏ చిన్న పొరపాటుకూ తావులేకుండా చూడాలి

## జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**విజయవాడ తూర్పు, జనవరి 8 (ప్రభాతవార్త ) :** ఎన్‌టీఆర్ జిల్లాలో ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించేందుకు సమన్వయ శాఖల అధికారులు ప్రణాళికాయుతంగా వ్యవహరిస్తూ పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. ఇంటర్ పబ్లిక్ పరీక్షల నిర్వహణపై కలెక్టరేట్ శ్రీ ఏపీఎస్ రెడ్డి హాల్‌లో కలెక్టర్ లక్ష్మీశ గురువారం సమన్వయ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఇంటర్మీడియెట్ విద్య, పాఠశాల విద్య, రెవెన్యూ, పోలీస్, ప్రజా రవాణా, వైద్య ఆరోగ్యం, విద్యుత్, పోస్టల్, సమాచార, పౌర సంబంధాలు తదితర శాఖల అధికారులు హాజరైన ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఇంటర్మీడియెట్ వొకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలు జనవరి 27 నుంచి ఫిబ్రవరి 10 వరకు, జనరల్ ప్రాక్టికల్ పరీక్షలు ఫిబ్రవరి 1 నుంచి పదో తేదీ వరకు జరుగుతాయన్నారు. థియరీ పరీక్షలు ఫిబ్రవరి 23 నుంచి మార్చి 24వ తేదీ వరకు 98 కేంద్రాల్లో జరుగుతాయని వివరించారు. థియరీ పరీక్షలు ఉదయం 9 గం. నుంచి మధ్యాహ్నం 12 గం. వరకు జరగనున్నట్లు తెలిపారు. 36,734 మంది మొదటి సంవత్సరం విద్యార్థులు, 39,534 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మొత్తం 76,268 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు వివరించారు. జిల్లా స్ట్రాంగ్ రూమ్, 17 స్టోరేజ్ పాయింట్ల భద్రతపై ప్రత్యేకంగా దృష్టి సారించాల్సిన అవసరముందన్నారు. పరీక్ష పత్రాలను స్టోరేజ్ పాయింట్ల నుంచి పరీక్షా కేంద్రాలకు తరలింపు మొదలు ప్రతి దశలోనూ అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. రిసెప్షన్, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నిర్వహణ, బందోబస్తు ఏర్పాటు, భద్రతా చర్యలు, సీసీ కెమెరాల నిఘా విషయంలో పోలీసు శాఖతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. అన్ని పరీక్షా కేంద్రాల్లోనూ నో సెల్ ఫోన్ జోన్‌గా ఉంటుందని స్పష్టం చేశారు. ప్రాక్టికల్, థియరీ పరీక్షలకు నాలుగు చొప్పున ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, థియరీ పరీక్షలకు మూడు సిటింగ్ స్క్వాడ్‌ల ఏర్పాటుకు అవసరమైన అధికారులు, సిబ్బందిని సిద్ధం చేయాలన్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రానికి చేరుకునేలా ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరు, విద్యుత్ సరఫరాకు ఇబ్బంది లేకుండా చూడాలని, పారిశుద్ధంపైనా దృష్టిసారించాలని సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, ప్రాథమిక చికిత్స కిట్లను అందుబాటులో ఉంచాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు సూచించారు.

సమావేశంలో జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి బి.ప్రభాకరరావు, డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహం, డీఈసీ సభ్యులు జి.ఝాన్సీ, ఎన్.వెంకటరావు, జి.వెంకటరమణ, కె.విష్ణుకాంత్, డీఈవో ఎల్.చంద్రకళ, డీఎంహెచ్‌వో డా. ఎం.సుహాసిని, ఏపీఎస్ఆర్టీసీ అధికారి టి.సాయిచరణ్‌తేజ, పోస్టల్, విద్యుత్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మడ అడవుల పరిరక్షణకు మిస్టీ పథకం ద్వారా పటిష్ట చర్యలు

**విజయవాడ, జనవరి 8 (ప్రభాతవార్త ) :** మడ అడవులు ప్రకృతి సిద్ధమైన రక్షణ గోడలా పనిచేసి తుపానులు, ఉప్పెనల వంటి ప్రకృతి వైపరీత్యాల నుండి తీర ప్రాంతాలను కాపాడతాయని అటవీకరణ నిధి నిర్వహణ, పరిహార మరియు ప్రణాళికా అధికార జాతీయ సంస్థ (కేంపా) ముఖ్య ప్రణాళికా అధికారి ఆనంద్ మోహన్ అన్నారు. సముద్ర తీర ప్రాంతాల్లో క్షీణిస్తున్న మడ అడవులను పునరుద్ధరించడం అత్యంత ఆవశ్యమని, దీంతో పాటుగా ఆ ప్రాంతాల్లో నివసించే ప్రజల జీవనోపాధిని మెరుగుపరచడం కూడా ముఖ్యమని ఈ కార్యక్రమాలు నిర్వహించడం మిస్టీ పథకం ప్రధాన ఉద్దేశ్యం అని ఆనంద్ మోహన్ తెలిపారు. కేంద్ర పర్యావరణ మరియు అటవీ మంత్రిత్వ శాఖ, రాష్ట్ర అటవీ శాఖ ల సంయుక్తంగా తీరప్రాంత ఆవాసాలు, స్పష్టమైన ఆదాయాల కోసం మాంగ్రోవ్ ఇనీషియేటివ్ (మిస్టీ) పై విజయవాడలోని ప్రముఖ హోటల్ ప్రాంగణంలో రెండు రోజులపాటు నిర్వహించనున్న జాతీయ సదస్సు గురువారం జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. కార్యక్రమానికి హాజరైన ఆనంద్ మోహన్ మాట్లాడుతూ సముద్ర తీరప్రాంతాల్లో క్షీణిస్తున్న మడ అడవులను రక్షించి, సముద్రం కోత నుంచి కాపాడటమే లక్ష్యంగా మిస్టీ పథకం పనిచేస్తుందన్నారు. సుమారు రెండున్నర ఏళ్లుగా కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తుందన్నారు. ఈ పథకానికి జాతీయ కాంపా నిధుల నుండి 10 కేటాయిస్తున్నారన్నారు. మొత్తం 825 కోట్ల రూపాయల కేటాయింపుల్లో ఇప్పటివరకు కేవలం 100 కోట్లు మాత్రమే వినియోగించబడ్డాయన్నారు. గుజరాత్ మరియు ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో మడ అడవుల విస్తీర్ణం ఎక్కువగా ఉందని, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు మరియు కేరళ వంటి రాష్ట్రాలు ఈ పథకంలో ఆశించిన స్థాయిలో భాగస్వామ్యం లేదన్నారు. మడ అడవుల క్షీణత వల్ల భూగర్భ జలాల్లో ఉప్పు నీరు చేరి వ్యవసాయ భూములు దెబ్బతింటున్నాయన్నారు. వీటిని కాపాడుకోవడం వల్ల స్థానిక రైతుల భూములు సురక్షి తంగా ఉంటాయన్నారు. రాష్ట్ర ముఖ్య అటవీ సంరక్షణాధికారి, అటవీ దళం అధిపతి డాక్టర్ పీ.వీ.చలపతిరావు ఈ సదస్సులో స్వాగతోపన్యాసం చేస్తూ దేశవ్యాప్తంగా తీర ప్రాంత రాష్ట్రాల అటవీ శాఖ అధికారులు, జాతీయ సంస్థల ప్రతినిధులు, కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులను ఈ వర్క్ షాప్‌లో భాగస్వామ్యం చేశామన్నారు. గత నాలుగు దశాబ్దాలుగా ఆంధ్రప్రదేశ్‌లో మడ అడవుల విస్తీర్ణం పెరుగుతూ ఉండటం ఒక




సానుకూల అంశమని, భవిష్యత్తులో తీర ప్రాంతాన్ని మరింత సురక్షితంగా మార్చడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.

మడ అడవులను ఎలా అభివృద్ధి చేయాలి, తీర ప్రాంత రక్షణలో వాటి పాత్రపై లోతైన చర్చలు జరిగుతున్నాయన్నారు. పశ్చిమ బెంగాల్, గుజరాత్ తర్వాత, ఆంధ్రప్రదేశ్‌లోనే అత్యధికంగా మడ అడవులు ఉన్నాయన్నారు. మన రాష్ట్రంలో సుమారు 50,000 హెక్టార్లలో ఈ అడవులు ఉండగా, అందులో 40,000 హెక్టార్లు నోటిఫై చేయబడ్డాయన్నారు. మడ అడవులు తుఫానులు, సునామీలు మరియు ఉప్పెనల నుండి ప్రాథమిక స్థాయి రక్షణగా నిలుస్తాయని, డెల్టా ప్రాంతాల్లోకి ఉప్పు నీరు చొచ్చుకు రాకుండా అడ్డుకుంటాయన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన మిస్టీ పథకం ద్వారా మడ అడవుల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నారని, 2028 వరకు ఈ పథకం కొనసాగుతుందన్నారు. రాష్ట్ర తీర ప్రాంతంలో దాదాపు 30 కంటే ఎక్కువ భాగం కోతకు గురవుతోందని, దీనిని అరికట్టడానికి జాతీయ తీర పరిశోధన కేంద్రం సహకారంతో నిర్వహణ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారన్నారు. కృష్ణాగోదావరి డెల్టా ప్రాంతం ఆంధ్రప్రదేశ్‌కు అన్నపూర్ణ లాంటిదని, ఇక్కడ లభించే చేపలు, ఇతర వనరులు మన దేశానికి అవసరమైన ప్రోటీన్, కార్బోహైడ్రేట్లను అందిస్తాయన్నారు. ఈ సదస్సులో జాతీయ తీర పరిశోధన కేంద్రం సంచాలకులు డాక్టర్ ఆర్.ఎస్.కంకార, జాతీయ అటవీకరణ మరియు పర్యావరణ అభివృద్ధి బోర్డు ఇన్ స్పెక్టర్ జనరల్ ఆఫ్ ఫారెస్ట్ వీఎల్ రాయ్ కుల్లయ్, డిప్యూటీ ఇన్ స్పెక్టర్ జనరల్ ఆఫ్ ఫారెస్ట్స్ (డీఐజీఎఫ్) ప్రశాంత్ రాజగోపాల్, ఎన్టీఆర్ జిల్లా అటవీశాఖ అధికారి జి. సతీష్ రెడ్డి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన వివిధ జిల్లాలకు చెందిన అటవీశాఖ అధికారులు తదితరలు పాల్గొన్నారు.

# ప్రిన్సిపాల్స్ అకడమిక్ మీట్ 2026

**విజయవాడ, జనవరి 8, ప్రభాతవార్త :** నిరంతరం విస్తరిస్తున్న సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా బోధకులు నిత్య నూతనత్వంతో విద్యార్థులకు విద్యాబోధన చేయాలని యారో పబ్లికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ సి.వి.బి. కృష్ణ అన్నారు. విజయవాడలో గురువారం జరిగిన ప్రిన్సిపాల్స్ అకడమిక్ మీట్ 2026లో ఆయన ప్రతి రెండు దశాబ్ధాలకు విద్యా వ్యవస్థలో మార్పులను బోధకులు పరిశీలించి తమ ప్రావీణ్యాన్ని మెరుగుపరుచుకోవాలన్నారు. ప్రధానంగా ప్రిన్సిపాల్ స్థాయిలో విద్యాబోధనతో పాటు తరగతి గదుల నిర్వహణలో కూడా విద్యార్థుల తల్లిదండ్రుల మనోభావాలను అర్థం చేసుకునేందుకు ఇదే సరైన సమయం అన్నారు. ఈ సందర్భంగా రెవరెండ్ బాలశౌరి, రెవరెండ్ రాయప్ప రెడ్డి, ఆరో పబ్లికేషన్స్ ప్రై లిమిటెడ్ డైరెక్టర్లు చుకల సురేష్, శ్రీనివాసరావు, సుబ్బారావు, సీనియర్ మేనేజర్ రవీంద్ర తదితరులను ఘనంగా సత్కరించారు. మైండ్‌ఫుల్ అకడమిక్ లీడర్‌షిప్‌పై మారుతి రాంప్రసాద్, కుమార్ నాయర్ విద్యా సెషన్‌లను నిర్వహించారు.

# పల్నాడు జిల్లా వార్త



## ఆధ్యాత్మిక ధ్రువతార చిట్టేటి బాలయ్య గురుస్వామి

### - 51వ సారి శబరిమల మకరజ్యోతి యాత్రకు ప్రస్థానం

వెల్దుర్తి, జనవరి 8 ప్రభాతవార్త: భక్తి మార్గంలో నడుస్తూ, వేలాది మందిని అయ్యప్ప దీక్షా పరులుగా తీర్చిదిద్దిన మాచర్ల పట్టణ ప్రముఖ గురుస్వామి చిట్టేటి బాలయ్య గురుస్వామి మరో అరుదైన మైలురాయిని చేరుకున్నారు. గత 50 ఏళ్లుగా నిరంతరాయంగా శబరిమల యాత్రను కొనసాగిస్తున్న ఆయన, ఈ ఏడాది 51వ మకరజ్యోతి యాత్రకు సిద్ధమయ్యారు. ఈ రోజు అనగా శుక్రవారం నాడు ఆయన ఇరుముడి కట్టుకుని కేరళ పయనం కానున్నారు. మాచర్ల పట్టణ, పరిసర గ్రామాల్లో బాలయ్య గురుస్వామి అంటే తెలియని వారుండరు. తన జీవితాన్ని అయ్యప్ప సేవకే అంకితం చేసిన ఆయన, తన నివాసాన్నే ఒక శబరిమల ఆలయంగా తీర్చిదిద్దారు. వయసు పైబడుతున్నా మొక్కవోని దీక్షతో రోజూ తెల్లవారుజామున 3 గంటలకే పూజా కార్యక్రమాలు నిర్వహించడం ఆయన నిబద్ధతకు నిదర్శనం. ఇప్పటి వరకు కొన్ని లక్షల మంది భక్తులకు స్వయంగా మాలధారణ చేసి, వారిని అయ్యప్ప సన్నిధికి నడిపించారు. మాలధారణ చేసే స్వాములకు భజనలు, పూజల కోసం అవసరమైన మండపం, పడి, దీపారాధన కుందులు, స్వామివారి విగ్రహాలు, అభిషేక పాన్ పట్టాలను తన సొంత ఖర్చుతో కొనుగోలు చేసి ఉచితంగా అందజేస్తున్నారు. శబరిమల యాత్రలో అత్యంత కష్టతరమైన ఎరుమేలి నుంచి సన్నిధానం (పెద్దపాదం) వరకు గల 50 కి.మీ. అటవీ మార్గంలో ఇప్పటి వరకు 20 సార్లు కాలినడకన వనయాత్ర చేసి తన పట్టుదలను చాటుకున్నారు. నా ఊపిరి ఉన్నంత వరకు ప్రతి సంవత్సరం అయ్యప్ప దీక్ష తీసుకుని మకరజ్యోతిని దర్శించుకుంటాను. శ్రీధర్మశాస్త్ర అయ్యప్పస్వామి వారి సేవలోనే నా జీవత పరమార్థం ఉందని బాలయ్య గురుస్వామి తెలిపారు. 50 ఏళ్ల సుదీర్ఘ ఆధ్యాత్మిక ప్రయాణాన్ని పూర్తి చేసుకుని 51వ ఏడాదిలోకి అడుగు పెడుతున్న బాలయ్య గురుస్వామిని మాచర్ల ప్రజలు, అయ్యప్ప భక్త బృందం అభినందిస్తూ వారి యాత్ర జయప్రదం కావాలని ఆకాంక్షిస్తున్నారు.



## నారాయణ స్కూల్‌లో చిన్నారులచే 'మాస్టర్ చెఫ్'

మాచర్ల, జనవరి 8 ప్రభాతవార్త: స్థానిక నారాయణ స్కూల్‌లో చిన్నారులచే మాస్టర్ చెఫ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నారులు ఇంటి వద్ద నుంచి తయారు చేసుకొచ్చిన వంటకాలను పూర్తిస్థాయిలో





అందరికీ క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పాఠశాల ప్రిన్సిపల్ ఉల్లారెడ్డి మాట్లాడుతూ చిన్నారులు కాలక్రమేణా అన్ని విద్యలతోపాటు వంటల రంగంలో కూడా రాణించాలని, చెఫ్ నేర్చుకున్న చాలామంది పెద్దపెద్ద ఫైవ్ స్టార్ హోటళ్లలో ఉద్యోగం చేస్తున్నారని తెలిపారు. ఈకార్యక్రమంలో ఏజీఎం జానకి రామిరెడ్డి, కోఆర్డినేటర్లు భద్రారెడ్డి, గౌసియ, రిహాని, స్కూల్ ఇన్‌ఛార్జిలు ఆంజనేయులు, ఉదయలక్ష్మి, రాజేశ్వరి, రవినాయక్, పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

## జమ్మలమడకలో పోలీసుల కార్డన్ సెర్చ్

మాచర్ల, జనవరి 8 ప్రభాతవార్త: మాచర్ల సీఐ ఆధ్వర్యంలో మండల పరిధిలోని జమ్మలమడక గ్రామంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు సెర్చ్ చేశారు.





ఈ కార్యక్రమంలో 41 బైకులు, 13 కొడవళ్లు, 5 ఇనుపరాడ్లు, 6 గడ్డపలుగులు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు. గొడవలకు, కొట్లాటలకు దూరంగా ఉండాలని గ్రామస్థులకు అవగాహన కల్పించారు. కార్డన్ సెర్చ్‌లో ఇద్దరు సీఐలతోపాటు ఆరుగురు ఎస్సైలు, 48 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## బ్రాహ్మణపల్లి వద్ద మెడికల్ కళాశాలకు 100 సీట్లు కేటాయింపు

### ఎమ్మెల్యే 'యరపతినేని' హర్షం

పిడుగురాళ్ల, జనవరి 8 ప్రభాతవార్త ః గురజాల నియోజకవర్గంలోని పిడుగురాళ్ల సమీపంలో గల బ్రాహ్మణపల్లి వద్ద నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాలకు ఈ విద్యా సంవత్సరం 100 సీట్లు కేటాయించడంపై గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకం కింద బ్రాహ్మణపల్లి మెడికల్ కళాశాలకు



కేంద్ర ప్రభుత్వం రూ.195 కోట్లు మంజూరు చేయగా గత వైసీపీ పాలనలో మెడికల్ కళాశాల నిర్మాణం కొరకు ఒక్క రూపాయి కూడా నిధులు విడుదల చేయలేదన్నారు. పనులు నత్తనడకన కొనసాగాయన్నారు. ఎన్నికల ముందు నిర్మాణాలు పూర్తికాక ముందే ఆర్భాటంగా అప్పటి వైసీపీ నేతలు ప్రారంభించారన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక యేడాదిన్నర పాలనలో మెడికల్ కళాశాల నిర్మాణంపై అధికారులతో కలిసి పలు సమీక్షలు జరిపి మెడికల్ కళాశాలను సందర్శించి పనులు వేగవంతం చేయాలని అధికారులకు సూచించినట్లు చెప్పారు. జాతీయ వైద్య మండలి సిఫార్సు మేరకు ఈ విద్యా సంవత్సరం బ్రాహ్మణపలిన్ల మెడికల్ కళాశాలకు 100 మెడికల్ సీట్లు అడ్మిషన్లు కేటాయింపు జరిగేందుకు కృషి చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఐటి శాఖా మంత్రి నారా లోకేష్, ఆరోగ్య శాఖా మంత్రి సతీష్‌కుమార్ యాదవ్‌కు ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు.

## 10న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

గురజాల, జనవరి 8 ప్రభాతవార్త : పట్టణంలోని ప్రభుత్వోన్నత పాఠశాలలో 1985-1986 సంవత్సరంలో పదో తరగతి విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు ఈనెల 10వ తేదీన పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించనున్నారు. పూర్వ విద్యార్థులు ఈ సమ్మేళనంకు హాజరు కావాలని నిర్వాహణ కమిటి సభ్యుడు పాదత్తి రాంబాబు కోరారు.

## మెడికల్ కళాశాల సీట్లు కేటాయింపు

### మా ఉద్యమ ఫలితమే: మాజీ ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి

గురజాల, జనవరి 8 ప్రభాతవార్త : అధికారంలో ఉన్నప్పుడే కాదు.. ప్రతిపక్షంలో ఉన్నా కూడా ఉద్యమాలతో ప్రభుత్వంపై ఒత్తి తెచ్చి పని చేపించవచ్చని మరోసారి నిరూపించామని గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ 2026-2027 విద్యా సంవత్సరానికి పిడుగురాళ్ల మెడికల్ కళాశాలలో అడ్మిషన్ ప్రక్రియ మొదలుపెడతామని ప్రకటించడం తమ ఉద్యమ ఫలితమేనన్నారు. మా ప్రభుత్వ హయాంలో రూ.500 కోట్లు మంజూరు చేయించి వెనుకబడిన పల్నాడు ప్రాంతానికి ఎంతో అవసరమయిన ప్రభుత్వ మెడికల్ కళాశాల, ప్రభుత్వాసుపత్రి పనులు మొదలుపెట్టి మేము దిగిపోయేనాటికి రూ.217 కోట్లు ఖర్చు చేసి సుమారు 60 శాతం కళాశాల పనులను, 90 శాతం ఆసుపత్రి పనులను పూర్తి చేశామన్నారు. కూటమి ప్రభుత్వ ఏర్పడిన తరువాత నిర్మాణాన్ని విస్మరించిన సమయంలో పెద్ద ఎత్తున సెల్ఫీ ఛాలెంజ్ పేరుతో ఉద్యమం చేసి స్థానిక శాసనసభ్యుడు ఆసుపత్రి వద్దకు వెళ్లి పర్యటించేలా ఒత్తిడి చేశామన్నారు. తరువాత రోజుల్లో మా పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి కూడా రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వాన్ని ఒత్తిడి చేస్తామని మహేష్‌రెడ్డి అన్నారు.



## దుకాణాల్లో తూనికలు, కొలతలశాఖ తనిఖీలు

గురజాల, జనవరి 8 ప్రభాతవార్త : పట్టణ, మండల పరిధిలో పలు దుకాణాలపై గురువారం రాత్రి తూనికలు కొలతల అధికారి జాన్ సైదా ఆకస్మిక దాడులు జరిపారు. పట్టణంలోని ఓ దుకాణంలో బియ్యం కొలత వ్యత్యాసం ఉండడంతో బియ్యం బస్తాలను సీజ్ చేశారు. పట్టణంలోని ఇనుప సామాను దుకాణంలో, మండల పరిధిలోని పలు రేషన్ షాపుల్లో దాడులు జరిపి కొలత వ్యత్యాసం ఉన్న కాటాలను సీజ్ చేశారు.



## రైతుల హక్కులను కాపాడటమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం: ఎమ్మెల్యే డాక్టర్ 'చదలవాడ'

నరసరావుపేట, జనవరి 8 ప్రభాతవార్త :::రైతుల హక్కులను కాపాడటమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష ్యమని, భూమిపై పూర్తి హక్కు రైతుకే ఉండేలా పాస్ పుస్తకాలు ఎంతోగానో తోడ్పడతాయని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు అన్నారు. మండలంలోని పెట్లూరువారిపాలెం గ్రామంలో



ప్రభుత్వంప్రతిష్టాత్మకంగా చేపట్టిన మీ భూమి మీ హక్కు కార్యక్రమం జరిగింది.కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు పాల్గొని, రాష్ట్ర ప్రభుత్వ రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను రైతులకు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, పెట్లూరువారిపాలెం రెవిన్యూ పరిధిలో 1017 మంది రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలను అందజేశామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను మరింత పెంచే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామంలోని ఉపాధి కూలీలందరికీ సంవత్సరానికి కనీసం 125 పని దినాలు కల్పించడం జరుగుతుంని చేశారు. దీని ద్వారా పేద కుటుంబాలకు స్థిరమైన ఆదాయం లభిస్తుందని అన్నారు.కార్యక్రమానికి ఎంపీడీవో టీవీ కృష్ణకుమారి అధ్యక్షత వహించారు... స్వచ్ఛ సంక్రాంతి - స్వచ్ఛ గ్రామ పంచాయతీ .... పెట్లూరువారిపాలెం గ్రామంలో స్వచ్ఛ సంక్రాంతి - స్వచ్ఛ గ్రామ పంచాయతీ కార్యక్రమంలో ఎమ్మెల్యే అరవిందబాబు పాల్గొని, గ్రామంలోని ప్రధాన వీధుల్లో చేపట్టిన పారిశుధ్య పనులను ప్రారంభించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యకరంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ వేణుగోపాలరావు, ఎంపీడీవో టీవీ. కృష్ణకుమారి, ఏపీవో కోటేశ్వరరావు, వీఆర్వో దిలీప్ కుమార్, కూటమి నాయకులు గట్టుపల్లి సత్యనారాయణ, కూరపాటి శ్రీనివాసరావు, పులిమి రామిరెడ్డి, కూటమి కార్యకర్తలు పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనం బోల్తా: ఒకరు మృతి

నరసరావుపేట క్రైమ్, జనవరి 8 ప్రభాతవార్త ::వేగం వస్తున్న బైక్ అదుపుతప్పి బోల్తా పడిన సంఘటన హైవే రోడ్డు పరిధిలో స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు సమీపంలో గురువారం జరిగింది.ఈ సంఘటనలో ఒకరు మృతి చెందగా, ఇద్దరికీ తీవ్రగాయాలు అయ్యాయి.మండలంలో గోగులపాడు గ్రామానికి చెందిన దక్కమడుగుల రాజేష్ (30) తన స్నేహితులతో కలిసి హైవే రోడ్డు మీదుగా మండలంలో అన్నవప్పాడు గ్రామం నుండి స్వగ్రామానికి వస్తున్నారు.వేగంగా వస్తున్న బైక్ స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు సమీపంలో గ్రామంలో వెళ్ళే రోడ్డు మీదుగా రాగానే ఎదురు వస్తున్న ఆర్టీసీ బస్సును తప్పించబోయి అదుపు తప్పి బోల్తాపడింది.ఈ



సంఘటలో బైక్ నడుపుతున్న రాజేష్ (30)క్రింద పడిపోవడంతో తీవ్ర గాయాలు కావడంతో అక్కడక్కడే మృతి చెందారు.వెనుక వైపున ఉన్న ఇద్దరికీ తీవ్రగాయాలు అయ్యాయి. మద్యం మత్తులో ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చునని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేశారు.సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షి ంచారు. మృత దేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు.అదే క్షతగాత్రులను చికిత్స నిమిత్తం నరసరావుపేట ఏరియా వైద్యశాకు తరలించారు.మృతుని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లోకేశ్వరరావు తెలిపారు.

## 'అన్నక్యాంటీన్' లో ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ

నరసరావుపేట, జనవరి 8 ప్రభాతవార్త : : స్థానిక సత్తెనపల్లి రోడ్డులోని అన్న క్యాంటీన్‌ను గురువారం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్యాంటీన్‌లోని ఆహార పదార్థాల నాణ్యత, క్యాంటీన్ లోని పరిశుభ్రత అంశాలను ఎమ్మెల్యే క్షుణ్ణంగా పరిశీలించారు. పట్టణంలోని పేదలు, కార్మికులు, ప్రయాణికులు సహా ఎంతో మంది ప్రజలు అన్న క్యాంటీన్ లో



ఆహారం స్వీకరిస్తున్నారని, వారికి ఎల్లప్పుడూ శుభ్రమైన, రుచికరమైన, ఆరోగ్యకరమైన భోజనం అందించాల్సిన బాధ్యత నిర్వాహకులు, సిబ్బందిపై ఉందని ఎమ్మెల్యే తెలిపారు. క్యాంటీన్ పరిసర ప్రాంతాలు, భోజనం వడ్డించే హాల్లు, వంటశాల, నీటి వసతి ప్రాంతాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ చెప్పారు. .. స్టేడియం అభివృద్ధికి ప్రత్యేక కృషి .... పట్టణంలోని డాక్టర్ కోడెల శివప్రసాదరావు క్రీడా ప్రాంగణంలో అభివృద్ధి పనులను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు పరిశీలించారు. స్టేడియంలో చేపడుతున్న పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, పట్టణ ప్రజలు ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకునేందుకు అనువుగా స్టేడియాన్ని ఆధునీకరిస్తున్నట్లు తెలిపారు. ఉదయం, సాయంత్రం వేళల్లో నడక, వ్యాయామం, యోగా వంటి కార్యక్రమాలు చేసుకునేందుకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తున్నామని చెప్పారు. స్టేడియంలో ట్రాక్‌లు, లైటింగ్, త్రాగునీటి సదుపాయాలు, శుభ్రత వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని పేర్కొన్నారు. అభివృద్ధి పనులు నిర్ణీత గడువులోగా, నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా పూర్తిచేయాలని అధికారులను ఎమ్మెల్యే డాక్టర్ అరవింద్ బాబు ఆదేశించారు. ఈ పరిశీలనలో మున్సిపల్ కమిషనర్ రవికుమార్, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## ముగిసిన అంతర కళాశాలల పురుషుల బాల్ బ్యాడ్మింటన్ పోటీలు

రొంపిచర్ల,జనవరి 8 ప్రభాతవార్త ::ఎంఏఎం కళాశాలలో గత రెండ రోజులుగా జరుగుతున్న అంతర కళాశాలల బాల్ బ్యాట్మెంటన్ పురుషుల పోటీలు గురువారం ముగిసాయి. ఆర్.వి.పి జేసీ ఇంజనీరింగ్ కళాశాల (చౌడవరం) జట్టు బాల్ బ్యాట్మెంటన్ విజేతగా నిలిచింది. రన్నర్స్ గా బాపట్ల ఇంజనీరింగ్ కాలేజ్, మూడవ స్థానంలో ఎంఏఎం ఫార్మసీ (కేశానుపల్లి) కళాశాల జట్టు నిలిచాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంఏఎం కళాశాల ఛైర్మన్ మేదరమెట్ల రామ శేషగిరిరావు, డైరెక్టర్ దరువూరి శ్రావ్య పృధ్వీరాజ్, యూనివర్సిటీ పరిశీలకులు డా. సుంద్ర నారాయణ, ధనలక్ష్మి ్మ వ్యాయామ కళాశాల ప్రిన్సిపిల్ డా. చంద్రు వెంకటరావు, ఎంఏఎం ఫార్మసీ ప్రిన్సిపల్ మరియు టోర్న మెంట్ ఛైర్మన్ డాక్టర్ ఎం. ప్రసాదరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ జాజుల శంకర్ లు విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రములో సెలక్షన్ కమిటీ సభ్యులు దాగా పి. శ్రీనియింస్, డా.రాజు మిక్సెన్ , ఆరు భాయిలు, డా. గౌరి శంకర్ పాల్గొన్నారు.



## సంక్రాంతి సందర్భంగా జిల్లా స్థాయి సాంప్రదాయ క్రీడా పోటీలు

నరసరావుపేట,జనవరి 8 ప్రభాతవార్త :: పట్టణంలోని సత్తెనపల్లి రోడ్డు లో ఉన్న జిల్లా క్రీడా ప్రాంగణంలో పర్వదినాన్ని పురస్కరించుకొని ఆట్ల పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి పి. నరసింహారెడ్డి గురువారం తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు క్రీడా ప్రాధికార సంస్థ, జిల్లా కలెక్టర్ సూచనల మేరకు ఈ పోటీలు జరుగుతాయి అన్నారు. మహిళలకు తాడాట, తొక్కుడు బిళ్ళ విభాగాలు ఉంటాయన్నారు. పురుషులకు ఏడు పెంకులాట, గాలిపటాలు నిర్వహిస్తామన్నారు. కర్ర సాము, తాడు లాగుడు పోటీలలో మహిళలు, పురుషులు పాల్గొనే అవకాశం కల్పించామన్నారు. ఈనెల 10వ తేదీన ఆసక్తి కలిగిన క్రీడాకారులతో పాటు డ్వాక్రా మహిళలు, ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో భాగస్వాములై విజయవంతం చేయాలని జిల్లా క్రీడా అధికారి నరసింహారెడ్డి విజ్ఞప్తి చేశారు.

## 'రహదారి ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలి'

నరసరావుపేట క్రైమ్,జనవరి 8 ప్రభాతవార్త ::జిల్లాలో జాతీయ రహదారులపై జరుగుతున్న రహదారి ప్రమాదాలను పూర్తి స్థాయిలో నివారించేందుకు తమ వంతు కృషి చేస్తున్నట్లు మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్ ఎన్. శివ నాగేశ్వరరావు, అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్ పి. పవన్ కుమార్ అన్నారు. నరసరావుపేట మండలం పెట్లూరివారిపాలెం గ్రామం లోని ఏఎంరెడ్డి స్మారక కళాశాలలో గురువారం జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా రహదారి భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. రహదారి భద్రతా నియమాల ప్రాముఖ్యత, ట్రాఫిక్ నిబంధనలు, వాహనాలను నడిపేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగం, వేగ నియంత్రణ, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల కలిగే ప్రమాదాలను విద్యార్థులకు



వివరించారు. చిన్న నిర్లక్ష ్యం కూడా ప్రాణాంతక ప్రమాదాలకు దారి తీస్తుందన్నారు.కళాశాల ఛైర్మన్ అట్లూరి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రహదారి భద్రత ప్రతి పౌరుడి బాధ్యతని రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం నిర్లక్ష ్యం, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనే అన్నారు. కళాశాల సెక్రటరీ డాక్టర్ అట్లూరి శాంతి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ అనేక కుటుంబాలు రోడ్డు ప్రమాదాల బాధను ఎదుర్కొంటున్నాయని డ్రైవింగ్ చేసే సమయంలో అప్రమత్తంగా వ్యవహరిస్తే ప్రమాదాలను నివారించవచ్చన్నారు. కళాశాల ఇంజినీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ సి.హెచ్ మల్లికార్జున్, డిప్లొమా ప్రిన్సిపాల్ డాక్టర్ కె.కృష్ణా రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ ఏ.పావని విద్యార్థులు పాల్గొన్నారు.

## కొండవీటి ఉత్సవాల నేపథ్యంలో ఆర్డీఓ క్షేత్రస్థాయి పరిశీలన

యడ్లపాడు, జనవరి 8, ప్రభాతవార్త : మండల పరిధిలోని చారిత్రక ప్రాంతమైన కొండవీడు కోటలో ఫిబ్రవరి 7,8వ తేదిలలో ప్రభుత్వం నిర్వహించ తలపెట్టిన కొండవీటి ఉత్సవాలలో భాగంగా గురువారం డివిజనల్ ఆర్‌డివో మధులత క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించారు. ఇందులో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాటుకు స్థల పరిశీలన, విచ్చేసే పర్యాటకులకు వివిధ రకాల రుచుల



పరిచయం చేసేందుకు ఫుడ్ కోర్టు, వివిధ శాఖల తరుపున ఏర్పాటుచేయు స్టాల్స్‌కు స్థల పరిశీలన, ఫ్లవర్ డెకరేషన్ ఏర్పాటుకు మరియు చెరువుల వద్ద తీసుకోవల్సిన జాగ్రత్తలు పర్యాటకులకు బోటింగ్, హార్స్ రైడింగ్, ట్రెక్కింగ్, వ్యూపాయింట్ డెక్, విచ్చేసే పర్యాటకులకు, విఐపిల వాహనాల నిలుపు ప్రదేశం వంటివి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె వివరిస్తూ ఉత్సవాల ఏర్పాటుకు ఏమి చర్యలు చేపట్టాలన్న విషయంపై క్షేత్రస్థాయిలో పరిశీలించి తదుపరి అన్ని శాఖల సమన్వయంతో త్వరలోనే జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించటం జరుగుతుందని తెలిపారు. ఆమెతోపాటు ఆర్‌టీసి, అగ్నిమాపక, రెవెన్యూ, ఫారెస్ట్, మండల పరిషత్ అధికారులు పాల్గొన్నారు.

## ఉత్సవాల్లోనైనా ఘాట్ రోడ్డులో విద్యుత్ కాంతులు విరజిమ్మేనా ?

యడ్లపాడు, జనవరి 8, ప్రభాతవార్త : గత తెలుగు దేశం ప్రభుత్వం హయాంలో కొండవీడు కోటను ప్రతిష్టాత్మకంగా తీసుకుని అభివృద్ధి చేసింది. అప్పటి మంత్రి నేటి స్థానిక శాసన సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తరచుగా కొండవీడును సందర్శించి అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. నూతనంగా ఏర్పాటుచేసిన ఘాట్ రోడ్డు ప్రాంతములో 4.70కోట్ల



రూపాయలు ఖర్చుచేసిన విద్యుధీకరణ చేపట్టటం జరిగింది. నాటి ఉత్సవాల సమయంలో ఘాట్ రోడ్డు నూతన విద్యుధీకరణతో వెలుగులు చిమ్మింది. రాను రాను కాలక్రమేణా దీనిపై అధికారులు దృష్టి సారించక పోవటంతో పూర్తిగా నిరుపయోగంగా మారిపోయింది. మరలా నాటి అభివృద్ధి నిర్వహించిన ప్రభుత్వం, దగ్గర ఉండి పనులను పర్యవేక్షించిన శాసన సభ్యులు మరలా ఉండటం వల్ల ఈ సారి ఉత్సవాల సమయానికైనా విద్యుధీకరణ గావించి మరలా విద్యుత్ వెలుగులు చిమ్ముతాయనే అశాభావాన్ని పర్యాటకులు వ్యక్త పరుస్తున్నారు. దీనిపై అధికారులు, ప్రజా ప్రతినిధులు నిరుపయోగంగా మారిన విద్యుత్ లైన్ తిరిగి మర్మమ్మత్తులు చేపట్టి ఉత్సవాలకు విద్యుత్ వెలుగు విరజిమ్మాలని పర్యాటకులు, స్థానికులు కోరుకుంటున్నారు.

## జిడిసిసి మర్రిపాలెం సొసైటీ ఉద్యోగుల నిరాహార దీక్ష

యడ్లపాడు, జనవరి 8, ప్రభాతవార్త : ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు ప్రత్తిపాడు బ్రాంచ్ వద్ద నిర్వహించుతున్న 4 వ రోజు నిరాహారదీక్ష లో భాగంగా గురువారం ప్రత్తిపాడు బ్యాంక్ నందు సొసైటీ ఉద్యోగులు దీక్షా కార్యక్రమంలో మండల పరిధిలోని మర్రిపాలెం సొసైటి ఉద్యోగులు సంఘీభావం తెలిపి పాల్గొనటం జరిగింది. ఇందులో ప్రదానంగా వారి యొక్క డిమాండ్లు తీర్చాలని దీక్ష చేపట్టి కార్యకలాపాలు నిలిపివేశామని తెలిపారు. వారు వివరిస్తూ ప్రధాన డిమాండ్‌లు జివో 36 వెంటనే అమలు చేయాలని, పెండింగ్ లో ఉన్న రెండు పిఅర్‌సీలను వెంటనే చెల్లించాలని, 2019 తరువాత జాయిన్ అయిన అందరిని రెగ్యులర్ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, గ్రాడ్యుయేట్ చట్టం ప్రకారం అమలు చేయాలన్నారు. సొసైటీ ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొని ధర్నా కార్యక్రమం నిర్వహించి సొసైటీ కార్యకలాపాలు నిలిపివేశారు. ఈ దీక్షలో



వివిధ సొసైటీల సభ్యులు అబ్బినేనీగుంటపాలెం సొసైటీ సెక్రటరీ ఎమ్ శ్రీనివాసరావు, సిబ్బంది ఎ గోపి కృష్ణ, కె కోటేశ్వరరావు, నిమ్మగడ్డవారిపాలెం సొసైటీ సెక్రటరీ బి జయ భారత్ రెడ్డి,సిబ్బంది బి. యేసు దాసు, చిన్నకొండ్రుపాడు సొసైటీ సెక్రటరీ కె జగదీశ్ కుమార్ సిబ్బంది పి హరి నారాయణ, మర్రిపాలెం సొసైటీ సెక్రటరీ జి గోపి కృష్ణ సిబ్బంది టి పెద్దబ్బాయి, పి శ్రీనివాస్, మల్లాయపాలెం సొసైటీ సెక్రటరీ బి శ్రీనివాసరెడ్డి,సిబ్బంది డి ఏడుకొండలు, చింతపల్లిపాడు సొసైటీ సెక్రటరీ ఎమ్ శేషగిరిరావు, సిబ్బంది ఎమ్ వెంకటేష్, మురళి, ఇంజనంపాడు సొసైటీ సెక్రటరీ ఎమ్ శ్రీనివాసరావు ,సిబ్బంది ఎమ్ సురేష్ గోపి తదితరులు పాల్గొన్నారు.

## చింతలపాలెంలో 'స్వచ్ఛ రథం' కార్యక్రమం

నరసరావుపేట, జనవరి 8 ప్రభాతవార్త :: మండలంలోని చింతలపాలెం గ్రామంలో గురువారం స్వచ్ఛ రథం కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో టీవీ కృష్ణకుమారి కార్యక్రమంలో పాల్గొని



ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలలో స్వచ్ఛ రథం కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇంటి నుండి వచ్చే పాత సామాన్లను స్వచ్ఛ రథం స్వీకరించడం జరుగుతుందన్నారు. గ్రామాలలోని నివాసితులు ఇచ్చిన పనికిరాని వస్తువులకు బదులు నిత్యవసర సరుకులు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇళ్లల్లో వృధాగా ఉండే వస్తువులను వీధుల్లోనూ, డ్రైనల్లోనూ వేయ వద్దన్నారు. ప్రభుత్వం కల్పించిన ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని స్వచ్ఛ గ్రామాలకు సహకారం అందించాలన్నారు. సచివాలయ ఉద్యోగులు ప్రజలలో ఈ కార్యక్రమం పై అవగాహన కల్పించి విజయవంతం చేయాలని ఎంపీడీవో టీవీ కృష్ణకుమారి పిలుపునిచ్చారు.

## మున్సిపల్ ఎన్నికల్లో బీసీలకు సముచిత స్థానం కల్పిస్తాం: డాక్టర్ 'గోపిరెడ్డి'

నరసరావుపేట, జనవరి 8 ప్రభాతవార్త : : రానున్న మున్సిపల్ ఎన్నికల్లో బీసీలకు వైసీపీ అధిక ప్రాధాన్యత ఇస్తుందని వైసీపీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. పట్టణానికి చెందిన వైసీపీ సీనియర్ నాయకులు వేముల శివ వైసీపీ పల్నాడు జిల్లా బిసి సెల్



కార్యదర్శిగా నూతనంగా నియమితులైన సందర్భంగా గురువారం స్థానిక వైసీపీ కార్యాలయంలోని డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ పల్నాడు జిల్లా వైసీపీ జిల్లా బీసీ సెల్ కార్యదర్శిగా వేముల శివకి దక్కడం తనకు చాలా సంతోషం ఇచ్చిందన్నారు. వైసీపీ స్థాపించిన నాటి నుండి పార్టీలో ఉంటూ వేముల శివ బీసీలకు అండగా నిలబడ్డారన్నారు. గతంలో శివ పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడుగా మరియు ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడిగా సమర్థవంతంగా పని చేశారని చెప్పారు. మాజీ సీఎం వైఎస్. జగన్మోహన్ రెడ్డి, బీసీలను ఎమ్మెల్సీలుగాను, మంత్రివర్గంలో సముచిత స్థానాన్ని కల్పించాన్నారు. బిసి కులాలకు ఎన్నడు లేని విధంగా కార్పొరేషన్లు ఏర్పాటు చేసి అనేక మందిని కార్పొరేషన్ ఛైర్మన్లుగా నియమించారని గుర్తు చేశారు. రాష్ట్రంలో బీసీలకు ఉన్నత స్థానం కల్పించిన వ్యక్తి జగనన్న ఒక్కరేనని చెప్పారు. భవిష్యత్తులో వైసీపీ బీసీలకు పెద్దపీట వేస్తుందని తెలిపారు. బీసీలలో 130 కులాలు ఉన్నాయనీ, అందరూ ఐక్యతగా ఉండాలని అప్పుడే రాజకీయంగా, సామాజికంగా మేలు జరుగుతుంని అన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, బీసీ నాయకులు అచ్చి శివకోటి కార్యకర్తలు పాల్గొన్నారు.

## నిప్స్ ఫార్మసీ కళాశాలలో ఎంవి రెడ్డి హాస్పిటల్ ఉచిత కంటి పరీక్షలు

నకరికల్లు, జనవరి 8 ప్రభాతవార్త :: నిప్స్ ఫార్మసీ కళాశాలలో డాక్టర్ ఎం వి రెడ్డి కంటి హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలను విద్యార్థులకు గురువారం నిర్వహించారు. డాక్టర్ సృజన ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించి కంటిచూపు భద్రతపై విద్యార్థులకు అవగాహన నిర్వహించారు.



శరీరంలో కళ్ళు ఎంతో ముఖ్యమైన భాగమని డాక్టర్ సృజనా తెలిపారు. అనేక ఆరోగ్య సమస్యలకు కంటి చూపు లోపాలు కారణమవుతుందన్నారు. తలనొప్పి,కళ్ళల్లో నీరు కారటం, అధిక రక్తపోటు, డయాబెటిస్ సమస్యలలో కంటి చూపుకు సంబంధించిన ఇబ్బందులు అధికంగాకారణమవుతాయన్నారు. అవసరమైన ఆరోగ్య సలహాలు,సూచనలు అందజేశారు. అవసరమైన వారికి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ఛైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి, కళాశాల కార్యదర్శి మిట్టపల్లి రమేష్ పాల్గొని ఎంవి రెడ్డి హాస్పిటల్ వైద్యులు, సిబ్బందిని అభినందించారు.

# పల్నాడు జిల్లా వార్త



## పల్లె పండుగతో గ్రామాలకు మహర్దశ : ప్రత్తిపాటి

చిలకలూరిపేట, జనవరి 8, ప్రభాతవార్త: పంచాయతీల అభివృద్ధే ధ్యేయంగా కూటమిప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పల్లె పండుగతో గ్రామాల రూపురేఖలు మారిపోతున్నాయని, పరిశుభ్రత..పచ్చదనం.. సామాజిక బాధ్యత పెంపొందించడంతో పాటు..పల్లెల అభివృద్ధిలో ప్రభుత్వ కృషి స్పష్టంగా కనిపిస్తోందని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. గురువారం ఆయన చిలకలూరిపేట మండలం, గొట్టిపాడు పంచాయతీ పరిధిలోని ఈవూరివారి పాలెం, గోరంట్లవారిపాలెం, నాగభైరుపాలెంలో రూ.7.32 లక్షలతో నిర్మించిన గోకులం షెడ్లను ప్రారంభించారు.ముఖ్యమంత్రి చంద్రబాబు సహకారంతో, గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పంచాయతీరాజ్ శాఖమంత్రి, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తున్నారన్నారు. పల్లె పండుగ 1.0లో భాగంగా ప్రభుత్వం రూ.4,500 కోట్లతో 13,326 గ్రామాల్లో దాదాపు 30,000 అభివృద్ధి పనులు చేపట్టిందన్నారు. పల్లె పండుగ 2.0లో భాగంగా మరోసారి రూ.6,700 కోట్లవరకు కేటాయించిన కూటమిప్రభుత్వం.. రోడ్లు, డ్రైనేజ్ లు, గోకులం షెడ్లు, సామాజిక భవనాల నిర్మాణం, నీటి కుంటలు తవ్వకం, చెరువుల ఆధునీకరణ సహా పలురకాల అభివృద్ధి పనులు చేయిస్తోందన్నారు. మొత్తంగా పల్లెపండుగతో రాష్ట్రంలోని గ్రామాలకు మహర్దశ వచ్చిందన్నారు. గ్రామనాయకులంతా ఐక్యంగా ఉండి, తమ గ్రామాలను బాగుచేసుకోవాలని, అభిప్రాయబేధాల కంటే అభివృద్ధే ముఖ్యమనే వాస్తవాన్ని అందరూ గ్రహించాలని ప్రత్తిపాటి హితవు పలికారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు జవ్వాజి మదన్ మోహన్, బండారుపల్లి సత్యనారాయణ, కామినేని సాయిబాబు, జిల్లా రైతు అధ్యక్షులు మద్దూరి వీరారెడ్డి, టీడీపీ నాయకులు గుర్రం నాగపూర్ణ చంద్రరావు, నాగభైరు ఆంజనేయులు, ఈవూరి బ్రహ్మానందం, కేతినేని శ్రీనివాసరావు, కొత్త మోహన్ రావు, దండా శ్రీను, సాంబశివరావు, శివ, గ్రామ నాయకులు, ఎంపీడీవో శ్రీనివాసరావు , వెటర్నరీ డాక్టర్ దీప్తి, ఏపీఓ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## విద్యాశాఖ మంత్రిగా లోకేశ్... విద్యార్థులకు, ఉపాధ్యాయులకు వరం : ప్రత్తిపాటి

చిలకలూరిపేట, జనవరి 8, ప్రభాతవార్త: విద్యాశాఖ మంత్రిగా లోకేశ్ ఉండటం విద్యార్థినీ, విద్యార్థులు..ఉపాధ్యాయులకు వరమని, రాష్ట్ర విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టడం ద్వారా ఏపీ విద్యారంగాన్ని లోకేశ్ దేశానికే మార్గదర్శిగా నిలుపుతున్నారని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. సమర్థుడు, యువకుడైన మంత్రి ఆలోచనలు..చురుకుతనాన్ని అందిపుచ్చుకుని రాష్ట్ర విద్యార్థులు ఈ ఏడాది ఉత్తమ ఫలితాలు రాబట్టి, జాతీయ స్థాయిలో ఏపీకి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని, ఆ దిశగా ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు శక్తివంచన లేకుండా పనిచేయాలని ప్రత్తిపాటి సూచించారు. గురువారం స్థానిక శారదా జిల్లాపరిషత్ ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో నిర్వహించిన మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయుల శిక్షణా తరగతుల్ని ప్రారంభించిన అనంతరం ప్రత్తిపాటి మాట్లాడారు.



**పది ఫలితాల్లో చిలకలూరిపేటను రాష్ట్రంలోనే ఉత్తమస్థానంలో నిలుపుతాం : డీఈవో**

త్వరలో జరగబోయే పదోతరగతి పరీక్షల్లో నియోజకవర్గ విద్యార్థులు అద్భుతంగా రాణించేలా చూస్తామని, చిలకలూరిపేటను రాష్ట్రస్థాయిలోనే ఉత్తమ స్థానంలో నిలుపుతామని ఈ సందర్భంగా డీఈవో రామారావు తెలియచేశారు. టీడీపీ పట్టణ అధ్యక్షులు పఠాన్ సమాధ్ ఖాన్, ప్రధాన కార్యదర్శి మద్దుమలా రవి, మండల అధ్యక్షులు జవ్వాజి మదన్ మోహన్, బండారుపల్లి సత్యనారాయణ, కామినేని సాయిబాబు, డీఈవో రామారావు, ఎంఈవో లు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరం ప్రారంభం



చిలకలూరిపేట, జనవరి 8, ప్రభాతవార్త: చెన్నుపాటి ఇండో అమెరికన్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరాన్ని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ప్రారంభించారు. పేదలకు నాణ్యమైన ఉచిత వైద్యసేవలు అందించాలన్న బృహత్ లక్ష్యంతో నాదెండ్ల మండలం తూబాడులో గురువారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరం ప్రారంభించిన అనంతరం ప్రత్తిపాటి రోగులతో మాట్లాడారు. మాజీ జిడిసిసి బ్యాంకు చైర్మన్ మానం వెంకటేశ్వర్లు, మండల అధ్యక్షులు బండారుపల్లి సత్యనారాయణ, జవ్వాజి మదన్ మోహన్, కామినేని సాయిబాబు, టీడీపీ నాయకులు నల్లమోతు హరిబాబు, దగ్గుమల్లి సాంబశివరావు, హరిగోపాల్, వెంకటేశ్వర్లు, యాసిన్, డాక్టరులు ఆకుల శివ ప్రసాద్, జి.జ్ఞానేశ్వరి, యనమదల శ్రీ హర్ష, గార్లపాటి శివ శంకర్, సి.హెచ్ రాధిప్రియ, చెన్నుపాటి ఇండో అమెరికన్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ సిబ్బంది, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## టౌన్ 2 సెక్షన్లలో విద్యుత్ అధికారుల తనిఖీ

చిలకలూరిపేట, జనవరి 8, ప్రభాతవార్త: 6,30,000/అపరాధ రుసుముచిలకలూరిపేట టౌన్ 2 సెక్షన్ పరిధిలో సి ఆర్ డి ఎ సర్కిల్, విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజనీర్ యమ్. శ్రీనివాస్ నేతృత్వంలో గుంటూరు టౌన్ 2 ఎక్జిక్యూటివ్ ఇంజనీర్ వై. ఏడుకొండలు,డీ పి ఈ విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.ఎ.కరీమ్ ఆధ్వర్యంలో టౌన్ 2 సెక్షన్ లలో 30బ్యాచ్ లుగా విద్యుత్ దాడులు నిర్వహించి అనధికారికంగా అధిక లోడు విద్యుత్ వినియోగము చేసుకుంటున్న 117సర్వీసులకు మొత్తం రు. 6,30,000/అపరాధ రుసుము వేసినారు డిప్యూటీ ఎక్జిక్యూటివ్ ఇంజనీర్స్ తి.గురునాధ రావు గారు, యన్ . మల్లికార్జున ప్రసాద్,కె.రవి కుమార్ మరియు 11 మంది అసిస్టెంట్ ఇంజనీర్స్ మరియు విద్యుత్ సిబ్బంది పాల్గొన్నట్లు, చిలకలూరిపేట టౌన్ 2 అసిస్టెంట్ ఇంజనీర్ కె.లావణ్య, డిప్యూటి ఎక్జిక్యూటివ్ ఇంజనీర్ ఆర్. అశోక్ కుమార్ తెలిపారు.




## నల్లమోతు రాఘవమ్మ మృతికి సంతాపం

నాదెండ్ల, జనవరి 8, ప్రభాతవార్త: చిలకలూరిపేట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సమన్వయకర్త, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నెల్లూరి సదాశివరావు అత్తయ్య నల్లమోతు రాఘవమ్మ గురువారం ఉదయం మృతిచెందారు. నాదెండ్ల గ్రామంలోని, వారి నివాసం వద్ద ఉంచిన మృతదేహాన్ని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు సందర్శించి నివాళులర్పించారు.



## 18న ఖమ్మంలో సీపీఐ శతాబ్ది సభను జయప్రదం చేయాలి: సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతీ వరప్రసాద్

చిలకలూరిపేట, జనవరి 8, ప్రభాతవార్త: చిలకలూరిపేట: భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఆవిర్భవించి వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఖమ్మం నగరంలో జనవరి 18న జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని పల్నాడు జిల్లా సీపీఐ కార్యదర్శి ఎ మారుతీ వరప్రసాద్ కోరారు. గురువారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో పార్టీ నాయకులతో కలసి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారతదేశ చరిత్రలో ఏ పార్టీకి లేని ఈ వందేళ్ళ చరిత్ర ఘనత భారత కమ్యూనిస్టు పార్టీకి మాత్రమే దక్కుతుందన్నారు. దేశ స్వాతంత్రం కోసం అనేకమంది అమరవీరుల త్యాగాల స్ఫూర్తితో ఏర్పడిన పార్టీ కమ్యూనిస్టు పార్టీ అని అనేక పోరాటాలు త్యాగాలు నిర్బంధాలు ఎదుర్కొని బ్రిటీష్ వారిని ఈ దేశం నుంచి తరిమికొట్టిన చరిత్ర ఒక సీపీఐకే ఉందన్నారు. నుండి నేటి వరకు పేద ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై అలుపెరుగని పోరాటాలు నిర్వహించిందని వెల్లడించారు. కంద్ర, రాష్ట్ర ప్రజావ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని పిలుపు నిచ్చారు. సమావేశంలో సీపీఐ ఏరియా కార్యదర్శి తాళ్లూరి బాబురావు, జిల్లా సహాయ కార్యదర్శి షేక్ హుస్సేన్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి సీపీఐ సుభాని, సీపీఐ పట్టణ కార్యదర్శి చెరుకుపల్లి నిర్మల, ఏరియా సహాయ కార్యదర్శి బొంతా ధన్‌రాజ్ పాల్గొన్నారు.



## క్యాన్సర్ బాధితురాలికి ఆర్థికసాయం

నాదెండ్ల, జనవరి 8, ప్రభాతవార్త: నాదెండ్ల మండలం లోని గణపవరం గ్రామంలోని ఖాశింబి అనే వృద్ధ మహిళ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ నిలువ నీడ లేక మందులు వాడుకోవటానికి ఆర్థిక స్థోమత లేక కుటుంబ సభ్యులు పట్టించుకోక పలు ఇబ్బందులు ఎదుర్కోవడమే కాకుండా బాధలు అనుభవిస్తున్నారు. మా మిత్రులు వాసు ద్వారా సమాచారం రావడంతో ఏపీ ప్రైవేట్ హాస్పిటల్స్ కాంపౌండర్, నర్సుల అసోసియేషన్ అధ్యక్షుడు కొండ్రముట్ల నాగేశ్వరరావు తన మిత్ర బృందంతో ఆమె ఇంటికి వెళ్లి రూ.5000 రూపాయలు డబ్బులు తో పాటు 50 కేజీల బియ్యాన్ని అందించడం జరిగింది. కొండ్రముట్ల నాగేశ్వరరావు, గిరిజన సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.శ్రీను నాయక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్దానం కిడ్నీ బాధితులకి ఏ విధముగా అయితే సహాయం అందిస్తుందో అలానే క్యాన్సర్ బాధితులకు పెన్షన్ ఇవ్వగలిగితే కనీసం మందుల (మెడికల్) ఖర్చులకు ఎంతో కొంత చేయూతనిచ్చిన వారు అవుతారన్నారు. వృద్ధ దంపతులు నివాస గృహం లేదని తెలిపారు. పాలకులు,అధికారులు టిట్కో గృహాల్లో ఇప్పించవలసిందిగా కోరారు. అసోసియేషన్ సభ్యులు అనపర్తి శ్రీనివాసరావు, రాజు, వెంకట్, నాగూర్, మార్టూరు శ్రీనివాసరావు, ఎస్టీ నాయకులు పాలపర్తి శ్రీను, బి.రాంబాబు నాయక్, గీత కులాల సంక్షేమ సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు కంచర్ల శ్రీనివాసరావు, వాసు, సునీల్ తోపాటు పలువురు పాల్గొన్నారు.



## ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ చొరవతో కొండపై నిత్యాన్నదాన కమిటీ ఏర్పాటు

వినుకొండ,జనవరి8,ప్రభాతవార్త: స్థానిక ఏనుగుపాలెం రోడ్డులోని శ్రీ కాశీనాయన ఆశ్రమం నందు గురువారం జరిగిన అన్నదాన కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్‌విప్,ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు,అమ్మ





ఛారిటబుల్ ట్రస్ట్ శ్రీ జ్ఞాన ప్రసూన బాబా ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కొండ వేంచేసి ఉన్న శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద నిత్య అన్నదాన కార్యక్రమం ఏర్పాటు గురించి ఆలయ అభివృద్ధి కమిటీ, ఆశ్రమ నిర్వాహకులు,పురపెద్దలతో కలసి చర్చించారు. కొండపై జరుగుతున్న పనులను శ్రీ జ్ఞాన ప్రసూన బాబా పరిశీలించారు. నిత్యాన్నదాన బాధ్యతలను శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ప్రధాన సేవకులు జాజుల మాల్యాద్రి భక్త బృందంకు అప్పగించి త్వరలోనే ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో కమిటీ ఛైర్మన్ అచ్యుత కోటేశ్వరరావు,కాశీనాయన రామచంద్రరావు,ఘాట్ రోడ్డు కమిటీ సభ్యులు,పురప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

## షెడ్యూల్డ్ కులాల రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి: చీఫ్‌విప్ జీ.వీ

వినుకొండ,జనవరి8,ప్రభాతవార్త: షెడ్యూల్ కులాల పథకం ద్వారా షెడ్యూల్డ్ కులాల రైతులకు జాతీయ వరి పరిశోధనా సంస్థ హైదరాబాద్ నుండి 100 శాతం రాయితీతో బ్యాటరీ స్ప్రేయర్లు,టార్పాలిన్,వరి విత్తనాలు ఐదు కిలోలు,మొక్కజొన్న విత్తనాలు నాలుగు కిలోలు మట్టి నమూనా పరీక్షించే కిట్లు పంపిణీ చేసే కార్యక్రమం వినుకొండ మార్కెట్ యార్డు నందు ప్రభుత్వ చీఫ్‌విప్,ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు అధ్యక్షతన గురువారం నిర్వహించడం జరిగినది. నియోజకవర్గం పరిధిలోని వినుకొండ, శావల్యాపురం, నూజెండ్ల,ఈపూరు,బొల్లాపల్లి మండలాలకు చెందిన రైతులు పాల్గొన్నారు. జాతీయ వరి పరిశోధనా సంస్థ ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ ఎం.బి.బి.ప్రసాద్‌బాబు, డాక్టర్ జై కుమార్,డాక్టర్ బ్రజేంద్ర,కె జస్వంత్‌లు హాజరై రైతులకు భూసార పరీక్ష గూర్చి వివిధ పంటల యాజమాన్య పద్దతులు గూర్చి అవగాహన కల్పించారు. జీ.వీ మాట్లాడుతూ రైతులు ఉద్యానవన పంటలను సాగు చేయటం ద్వారా అధిక లాభాలను పొందవచ్చన్నారు. షెడ్యూల్ కులాల రైతులు రాయితీపై డ్రిప్పు పొంది తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణం సాగు చేసి అధిక లాభాలు పొందాలని చెప్పారు. కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తుందని సబ్సిడీ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆయా మండలాలకు చెందిన వ్యవసాయ,అనుబంధ రంగాల అధికారులు, కూటమి నాయకులు,రైతులు పాల్గొన్నారు.



## సిఎం చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే 'కన్నా'



సత్తెనపల్లి, జనవరి 8, ప్రభాతవార్త: గురువారం గుంటూరులో సేల్స్ ఆఫ్ రూరల్ ఆర్టిసిన్స్ సొసైటీ మేళా కార్యక్రమంలో పాల్గొనడానికి విచ్చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు సాదర స్వాగతంపలికిన సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, కన్నా తనయుడు నాగరాజు.


## 'దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా.. 'వెల్లంపల్లి' వ్యాఖ్యలు'

సత్తెనపల్లి, జనవరి 8, ప్రభాతవార్త: సత్తెనపల్లి పట్టణంలోని ప్రజా వేదిక లో సత్తెనపల్లి నియోజకవర్గం శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ ఆదేశాల మేరకు గురువారం నేతలు మీడియాతో మాట్లాడారు. గురువారం ఉదయం ఒక ప్రైవేట్ కార్యక్రమానికి విచ్చేసిన మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ కూటమి ప్రభుత్వం పై చేసిన వ్యాఖ్యలను ఖండించారు. చౌట శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వము ఏర్పడుటలో ఆర్య వైశ్య సామాజిక వర్గ ప్రజలు యొక్క పాత్ర వెలకట్టలేనది అని అన్నారు. కూటమి ప్రభుత్వం యొక్క 19 నెలల పాలనలో తటస్థము గా ఉన్న ఆర్య వైశ్యులు సైతం కూటమి ప్రభుత్వం పాలన మరియు ఆర్యవైశ్యులకు వేస్తున్న పెద్ద పీట వలన కూటమి ప్రభుత్వం వైపు ఆర్య వైశ్యులు మద్దత్తు రోజు, రోజుకు పెరగటాన్ని ఓర్చు కోలేక మరియు ఆర్య వైశ్యుల్లో లేని అలజడిని కృత్రిమంగా సృష్టించాలి అని వెల్లంపల్లి నూతనంగా మీడియా ముందుకు రావటం ఇటీవల జరుగుతుందని చౌట శ్రీనివాసరావు అన్నారు. వై. సి. పి ప్రభుత్వం లోనే దాదాపు ఆర్య వైశ్యుల పై దాడులు కానీ కొందరు హత్య గావించబడటం మరికొందరు ఆనాటి ప్రభుత్వం వేధింపులకు తాళలేక ఆత్మహత్య లు చేసుకొన్నమాట వాస్తవం కాదా? అని అన్నారు. సత్తెనపల్లి నియోజకవర్గంలో కన్నా లక్ష్మీ నారాయణ ఎమ్మెల్యేగా అయిన్నపటి నుంచి పార్టీలకు అతీతంగా ఆర్య వైశ్యలకు అండదండలు అందిస్తున్నారు అని అన్నారు. అలాగే పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ మాజీ అధికార ప్రతినిధి మరియు ప్రస్తుత సత్తెనపల్లి తెలుగుదేశం పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడు దివ్వెల శ్రీనివాసరావు మాట్లాడుతూ కొణిజేటి రోశయ్య గారి భౌతిక కాయాన్ని సందర్శించని నాయకుడు పెట్టిన పార్టీలో ఉన్న వెల్లంపల్లి మాటలు నమ్మే పరిస్థితిలో ఆర్య వైశ్యులు లేరు అని మరియు ఆయన ఆర్య వైశ్య సంఘాలు గురించి విమర్శించటం యావత్తు ఆర్య వైశ్య సామాజిక వర్గాన్ని కించపరిచటమే అని అన్నారు.ఈ కార్యక్రమంలో చౌట శ్రీనివాసరావు షేక్ మస్తాన్ వలి, దివ్వెల శ్రీనివాసరావు, జవ్వాజి రామోహనరావు, పోతుగంటి రామకోటేశ్వరరావు, బచ్చు వెంకటేశ్వర్లు (కొండలు )పెండ్యాల కాశీ మల్లేశ్వరరావు, నోముల వెంకట రమణ, దేవతి శివ ప్రసాద్, దూపగుంట్ల జానకి రామారావు, అన్నం బాల సుబ్రహ్మణ్యం, బాలనాగు శివ కోటేశ్వరరావు మాడిశెట్టి చిన అప్పారావు తదితరులు పాల్గొన్నారు.




## 'డ్రగ్స్ వద్దు బ్రో' కార్యక్రమం

సత్తెనపల్లి, జనవరి 8, ప్రభాతవార్త: డ్రగ్స్ వద్దు బ్రో కార్యక్రమంలో భాగంగా గురువారం సాయంత్రం అచ్చంపేట రోడ్డులో ఉన్న ఎస్. సి వసతి గృహం (కాలేజీ విద్యార్థులు ఉండే) లో రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు సత్తెనపల్లి మండలం న్యాయసేవాధికార కమిటీ చైర్మన్ మరియు సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్ ) సత్తెనపల్లి వి. విజయ్ కుమార్ రెడ్డి గారి సూచనలమేరకు డ్రగ్స్ వద్దు సోదరా, ఓ విద్యార్థి అనే నినాదంతో విద్యార్థుల కు న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సత్తెనపల్లి న్యాయస్థానం లో ప్యానల్ న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు విద్యార్థులకు మాదక ద్రవ్యాలు వినియోగం వలన ఆరోగ్యం నష్టం, ఆర్థిక నష్టం మరియు అనుకోకుండా కేసుల్లో ఇ రుక్కుంటే ఉజ్వల భవిష్యత్ కోల్పోయే అంశాలను, చట్టపరమైన అంశాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు దివ్వెల శ్రీనివాసరావు, బి. ఎల్. లక్ష్మీ కోటేశ్వరరావు, బుర్రి సైదయ్య పారా లీగల్ వాలంటీర్ షేక్ సుభాని మరియు హాస్టల్ వార్డెన్ పాపయ్య తదితరులు పాల్గొన్నారు.



## శ్రీనివాసునికి ప్రత్యేక పూజలు



సత్తెనపల్లి, జనవరి 8, ప్రభాతవార్త:సత్తెనపల్లి పట్టణంలో రైల్వే స్టేషన్ రోడ్డులోని శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవాలయంలో గురువారం విశేష అభిషేకములో అర్చన కార్యక్రమం జరిగింది,. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పట్టణ సిఐ నరహరి నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

## వెంకన్నను దర్శించుకున్న వైకాపా నేతలు 'వెల్లంపల్లి, డాక్టర్ 'గజ్జల'

సత్తెనపల్లి, జనవరి 8, ప్రభాతవార్త: ధనుర్మాస మహోత్సవ కార్యక్రమంలో భాగంగా సత్తెనపల్లి పట్టణంలోని రైల్వే స్టేషన్ వద్ద గల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో 24వ రోజు కోటి దీపోత్సవ కార్యక్రమంలో సత్తెనపల్లి నియోజకవర్గ వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ రెడ్డి, మాజీమంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ పాల్గొ న్నారు. ఆలయ ప్రధాన అర్చకులు చిత్రకవి శ్యాము రామానుజ ఆచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వ హించారు.



## క్రోసూరు మండలంలో ప్రధానమంత్రి బీమా పథకాలపై అవగాహన



క్రోసూరు, జనవరి 8, ప్రభాతవార్త: క్రోసూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రధానమంత్రి సురక్ష భీమా యోజన, ప్రధానమంత్రి జీవిత భీమా యోజన పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమం ఎంపీడీవో అధ్యక్షతన జరిగింది.ఈ అవగాహన కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, డ్వాక్రా వీఓఏలు, ఎంజీఎన్ఆర్ఇజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు. ప్రతి గ్రామంలో డోర్ టు డోర్ తిరిగి ప్రతి ఒక్కరూ భీమా పథకాల్లో నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని ఎంపీడీవో సూచించారు. అందరూ సమన్వయంతో పనిచేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో జీ. రవికుమార్, ఎంపీడీవో, షేక్ మహబూబ్ సుభాని, ఎమ్‌జీఓ (జీఎస్‌డబ్ల్యూఎస్), కార్యాలయ పరిపాలన అధికారి ఎస్. రాధా రమణ, బి. వెంకటేశ్వరరావు, ఏపీఓ (ఎంజీఎన్ఆర్ఇజీఎస్), ఏపీఎం (వెలుగు) తదితరులు పాల్గొన్నారు.

## వెలుగునీడల బిడ్డలుగా జీవించాలి: ఫాదర్ జై శ్యామ్



పెదకూరపాడు, జనవరి 8, ప్రభాతవార్త: ముగ్గురు రాజుల దేవాలయంలో గురువారం తిరణాల మహోత్సవం నిర్వహించారు. వేలాదిమంది భక్తులు దివ్య పూజా బడిలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆ దేవదేవుని వెలుగునీడలలో ప్రతి ఒక్కరూ జీవించాలని కోరారు. ప్రేమా విశ్వాసము కలిగి ఉండాలని తనను తాను తగ్గించుకున్న వాడు హెచ్చించబడతాడు అన్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫాదర్లు ప్రత్యేక పాటలు పాడి ప్రార్థన నిర్వహించారు. ఈ కార్యక్రమంలోఫాదర్ జై శ్యామ్, వాక్యోపదేశమిచ్చారు. ఫాదర్ రాజారెడ్డి, ఫాదర్ పుట్టి సుందరరాజు, ఫాదర్ గోవింద రాయన్న, ఫాదర్ మర్రెడ్డి పాల్గొన్నారు. కాలచక్ర రహదారిలో స్టాల్స్ ఏర్పాటు చేశారు. జాయింట్ విల్ కనువిందు చేసింది. సాయంకాలం వేలాది మంది భక్తులు పాల్గొని కొవ్వొత్తులు సమర్పించారు. రాత్రి 10 గంటలకు బాణ సంచార నిర్వహించి, మరియమ్మ తల్లి తేరు ఊరేగింపు ప్రారంభించారు.

## 'విద్యా వికాస్'లో సంక్రాంతి సంబరాలు

వినుకొండ,జనవరి8,ప్రభాతవార్త: స్థానిక కారంపూడి రోడ్డు నందు గల విద్యావికాస్ స్కూల్ నందు సంక్రాంతి పండుగ సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు రంగురంగుల





ముగ్గులు,గొబ్బెమ్మలతో పాఠశాల ప్రాంగణాన్ని అందంగా అలంకరించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా చీఫ్‌విప్,ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జీ.వీ మాట్లాడుతూ సంక్రాంతి పండుగ భారతీయ సంస్కృతి,సాంప్రదాయాలకు ప్రతీక అన్నారు. విద్యార్థులు చదువుతోపాటు ఇటువంటి కార్యక్రమంలో పాల్గొనడం ద్వారా భారతీయ సమాజం ఔన్నత్యం విలువ తెలుసుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో కూటమి నాయకులు,పాఠశాల ఉపాధ్యాయులు, యాజమాన్య బృందం పాల్గొన్నారు.

## డిఎల్ఈసి సమావేశం

వినుకొండ,జనవరి8,ప్రభాతవార్త: గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు నందు జరిగిన డిఎల్ఈసీ సమావేశం గురువారం నిర్వహించారు. డీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు పాల్గొని



పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. సీఈవో ఫణికుమార్,నాబార్డ్ డిడిఎం శరత్,డిఆర్,ఓఎస్‌డి విజయలక్ష్మి,బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

## ఈపూరు ఎక్సైజ్ స్టేషన్‌ను తనిఖీ చేసిన జిల్లా అధికారి

ఈపూరు,జనవరి8,ప్రభాతవార్త: పల్నాడు జిల్లా ఎక్సైజ్ అధికారి కె. మణికంఠ మండలకేంద్రమైన ఈపూరు ఎక్సైజ్ స్టేషన్‌ను గురువారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి పెండింగ్ కేసు వివరాలు తెలుసుకున్నారు. మద్యం కేసులో పట్టుబడ్డ రెండు మోటారు సైకిల్స్,ఒక మినీ వ్యాన్‌కు వేలం పాట నిర్వహించారు. పట్టుబడ్డ మద్యం సీసాలను మధ్యవర్తుల సమక్షంలో నశింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటుసారా, గంజాయి, అక్రమ మద్యం అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ప్రజలు ఎక్సైజ్ సంబంధిత నేరాలు గూర్చి సమాచారం ఉంటే తమకు తెలియజేయాలని చెప్పారు.



## నియోజకవర్గ టీఎన్ఎస్ఎఫ్ కార్యవర్గం ఏకగ్రీవం



చిలకలూరిపేట, జనవరి 8, ప్రభాతవార్త: పార్టీ సంస్థాగత ఎన్నికలలో భాగంగా పార్టీ కార్యాలయం నందు జరిగిన సమావేశంలో టీఎన్ఎస్ఎఫ్ నియోజకవర్గ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. నియోజకవర్గ అధ్యక్షునిగా షేక్ నసీరు ద్దీన్, ప్రధాన కార్యదర్శిగా కుర్చేటి అజయ్, ఉపాధ్యక్షులుగా పెనుమల పిచ్చయ్య, కూరాకుల సునీల్ , మాదల మహేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికైన సభ్యులు తమ నియామకానికి సహకరించిన శాసన సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## ఎరువుల నియంత్రణ చట్టం పై అవగాహన

సత్తెనపల్లి, జనవరి 8, ప్రభాతవార్త: సత్తెనపల్లి మార్కెట్ కమిటీ ప్రాంగణంలో సత్తెనపల్లి సబ్ డివిజన్ పరిధిలోని సత్తెనపల్లి, ముప్పాళ్ళ మరియు పెదకూరపాడు మండలాలకు సంబంధించిన ఎరువుల డీలర్లకు ఎరువుల నియంత్రణ చట్టం పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సత్తెనపల్లి సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకుల బి రవిబాబు, అధ్యక్షత వహించగా పల్నాడు జిల్లా వ్యవసాయ అధికారి ఎం జగ్గారావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జగ్గారావు మాట్లాడుతూ ఎరువుల డీలర్లు అందరూ కూడా ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఎరువుల అమ్మకాలు జరపాలని తెలియజేశారు. ఎరువులు అమ్మకాలు జరిపిన వెంటనే ఈ పాస్ మిషన్ నందు కూడా అమ్మకాలు పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించిన డీలర్లపై శాఖపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. మండల వ్యవసాయ అధికారి బి సుబ్బారెడ్డి, ముప్పాళ్ళ మండల వ్యవసాయ అధికారి ఎస్ శ్రీధర్ రెడ్డి , పెదకూరపాడు మండల వ్యవసాయ అధికారి కృష్ణయ్య , సంహిత సాయిల్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు మరియు మూడు మండలాల ఎరువుల డీలర్లు పాల్గొన్నారు.

## 4వ రోజుకు చేరిన వ్యవసాయ పరపతి సంఘం ఉద్యోగుల ఆందోళన

నరసరావుపేట,జనవరి 8 ప్రభాతవార్త:: వ్యవసాయ సహకార సంఘం ఉద్యోగులు నిర్వహిస్తున్న ఆందోళన కార్యక్రమం గురువారం నాలుగో రోజుకు చేరింది. రిలే నిరాహార దీక్షల కార్యక్రమాన్ని సంఘం రాష్ట్ర కార్యదర్శి వైవి నారాయణ,గంగినేని శ్రీనివాసరావు,నాదెండ్ల సీఈవో ధనలక్ష్మి హర్షిని,బాల తెరిసా, సరిత, వీరారెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, సైదాలు నిర్వహించారు. నాయకులు



దొప్పలపూడి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ 36 జీవోను వెంటనే అమలు చేయాలన్నారు. 2019, 2024 రెండు పే రివిజనులను అమలు పరచాలని జేపీసీ డిమాండ్ చేసింది. ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను అమలు చేసే వరకు తమ పోరాటం కొనసాగుతుందని ఈ సందర్భంగా వారు ప్రకటించారు.

## టైప్ రైటింగ్‌తోనే ప్రయోజనం

**రేపల్లె, జనవరి 8, ప్రభాతవార్త:** కంప్యూటర్, ల్యాప్‌టాప్, ట్యాబ్స్ మీద వేగంగా టైప్ చేయాలంటే ముందుగా టైప్ రైటర్ మీద టైపు నేర్చుకుంటేనే వేగం పుంజుకోవచ్చునని రేపల్లె పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.చంద్రశేఖర్ అన్నారు.గురువారం అంతర్జాతీయ టైప్ దినోత్సవం సందర్భంగా ఎపిటిఎస్ఐఎ 2026 సంవత్సరం డైరీ,క్యాలండర్ల ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టైప్ రంగానికి ఎంతో



చరిత్ర,ప్రాధాన్యత ఉందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ టైప్ రైటింగ్ షార్ట్ హా న్యాండ్ ఇనిస్టిట్యూట్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు సి.వి.మోహనరావు,రేపల్లెలోని టైప్ ఇనిస్టిట్యూట్స్ ప్రిన్సిపాల్స్ ఎ.రాంబాబు,కె.భవానీ శంకర్ లింగం తదితరులు పాల్గొన్నారు.




## భార్యను హత్యచేసిన నిందితుడికి జైలుశిక్ష

**తెనాలి మున్సిపాలిటీ జనవరి8(ప్రభాతవార్త):** భార్యను హత్య చేసిన నిందితుడికి జైలుశిక్ష మరియు జరిమానా విధించిన జిల్లా కోర్టు న్యాయమూర్తి. పోలీసుల కథనం ప్రకారం నిజాంపట్నం మండలం ఆముదాల పల్లి గ్రామస్తులు పంచభట్ల శ్రీనివాసరావు కుమార్తెను ఆమె భర్త నర్రా నాగరాజు అలియాస్ దిబ్బడు 2022వ సంవత్సరం డిసెంబర్ 3వ తేదీన, భార్యాభర్తల మధ్య విభేదాల కారణంగా కత్తితో నరికి హత్య చేయగా, పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి,కేసునమోదు చేశారు. ఈ కేసు విచారణ గురువారం తెనాలి 11వ అదనపు జిల్లా కోర్టులో విచారణకురాగా ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ, ఎమ్ వి. సాంబశివరావు తన వాదనలు వినిపించారు. నేరం రుజువు కావడంతో, నిందితుడు నర్రా నాగరాజుకు ఐపిసి సెక్షన్ 450 క్రింద రెండు సంవత్సరములు జైలుశిక్ష మరియు ఐపిసి 320 సెక్షన్ కింద జీవితఖైదు మరియు రు. 2000/ జరిమానా విధించారు.ఒకవేళ జరిమానా రు.2000/రూపాయలు కట్టని యెడల,రెండు నెలలు సాధారణ జైలుశిక్ష అనుభవించేలా సదరు కోర్టు వారు తీర్పు ఇచ్చారు.

# రేపల్లె రైల్వే స్టేషన్ అభివృద్ధికి రూ.25.5 కోట్లు నిధులు

## నిర్మాణపనుల సాంకేతికతపైనే ప్రయాణీకుల సందేహం

**రేపల్లె-ప్రభాతవార్త**

రేపల్లె రైల్వే స్టేషన్లో జరుగుతున్న అభివృద్ధి పనులు సాంకేతిక నిబంధనల ప్రకారమే జరుగుతున్నాయా అనే సందేహం ప్రయాణీకులకు కలుగుతోంది.దశల వారీగా నింపాదిగా జరుగుతున్న నిర్మాణపనుల గురించి చర్చించు కుంటున్నారు.పాత ప్లాట్‌ఫారంపై ఇనుప







చువ్వలను పేర్చి పొడితో కూడిన చిప్స్, ఇసుక,సిమెంట్ కలిపిన మిశ్రమాన్ని సర్దుబాటు చేసి ఎగుడు దిగుడు లేకుండా ప్లాట్‌ఫారం ఎత్తును పెంచేస్తున్నారు.పాత ప్లాట్ ఫారాన్ని పగులగొట్టి చదును చేసి నూతనంగా ప్లాట్‌ఫారం ఎత్తు పెంచే విధంగా నిర్మాణ పనులు జరగకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.పనులను దగ్గర ఉండి పర్యవేక్షించే వారు మాత్రం రైల్వే శాఖ అధికారులు సూచించిన నిబంధనల ప్రకారమే నిర్మాణ పనులు చేపడుతున్నామని పేర్కొంటున్నారు.

రేపల్లె రైల్వే స్టేషన్లో జరిగే అభివృద్ధి పనులకు సంబంధించి నలుగురైదుగురు కాంట్రాక్టర్లు నిర్మాణ పనులు చేపట్టినట్లు చెబుతున్నారు.భారత ప్రధాన మంత్రి నరేంద్రమోడీ ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన అమృత్ భారత్ పథకాన్ని రేపల్లె రైల్వేస్టేషన్‌కు వర్తించే విధంగా అధికారులు చర్యలు తీసుకున్నారు.ప్రతి రోజూ రేపల్లె రైల్వే స్టేషన్ నుంచి 7500 మందికి పైగా రైలు ప్రయాణం చేస్తున్నట్లు గురి_ంచారు.ప్రయాణీకులకు మౌలిక సదుపాయాలను కల్పించేందుకు వీలుగా రేపల్లె రైల్వే స్టేషన్ అభివృద్ధికి రూ.25.5 కోట్ల నిధులను కేటాయించారు.బాపట్ల జిల్లాలోని ముఖ్యమైన రేపల్లె రైల్వే స్టేషన్ నుంచి నిత్యం 14 రైళ్ళు రాకపోకలు సాగిస్తున్నాయి.పెనుమూడి-పులిగడ్డ వారధికి తూర్పు దిక్కున ఉన్న మచిలీపట్నం, చల్లపల్లి,మోపిదేవి,అవనిగడ్డ,నాగాయలంక,హంసలదీవి తదితర ప్రాంతాల ప్రజలకు,బాపట్ల జిల్లాలోని నిజాంపట్నం,నగరం,వేల్లె,భట్టిప్రోలు, చెరుకుపల్లి, వేమూరు,కొల్లూరు మండలాల ప్రజలకు రేపల్లె రైళ్ళు ప్రయోజన కరంగా ఉన్నాయి.రాష్ట్రంలోని ప్రధానమైన రైల్వేస్టేషన్లలో ఒకటైన రేపల్లె రైల్వే స్టేషన్‌లో పెరుగుతున్న ప్రయాణీకులను దృష్టిలో ఉంచుకుని అమృత్ భారత్ స్టేషన్ స్కీం (ఎబిఎస్ఎస్) నిధులతో అభివృద్ధి పనులను పూర్తిచేయాలని కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది.ప్రయాణ ప్రాంగణం, ట్రాఫిక్ వసతులు,వెయిటింగ్ గదులు,ప్రయాణీకులకు అవసరమైన సమాచార సూచికల ఏర్పాటుతో ఉత్తమ శ్రేణి రైల్వే స్టేషన్‌గా రేపల్లెను తీర్చిదిద్దాలని ప్రణాళికలను రూపొందించారు.రైల్వే స్టేషన్ ముఖ ప్రాంగణాలను తక్కువ ఖర్చుతో అభివృద్ధి చేయడంలో భాగంగా విశాలమైన చక్కటి వెలుతురుతో సౌందర్యవంతమైన ఆహ్లాదకరమైన ప్రవేశ ద్వారాలను ఏర్పాటు చేయాలని ,ప్రణాళికాబద్ధమైన పార్కింగ్ ప్రదేశాలు,మెరుగైన లైటింగ్‌తో పాటు సాఫీగా స్టేషన్లోకి ప్రయాణీకులు చేరుకునేలా అభివృద్ధి పనులను ప్రారంభించారు. ల్యాండ్‌స్కేపింగ్,గ్రీనరీతో పాటు రేపల్లె ప్రాంతానికి సంబంధించిన కళల సాంస్కృతిక చిహ్నాల ఏర్పాటు చేయాలని ప్రణాళికలో రూపొందించారు.స్టేషన్లో ప్రయాణీకుల అవసరానికి తగిన విధంగా ప్లాట్‌ఫారం పైకప్పుతో పాటు ఎత్తైన ప్లాట్‌ఫారాల ఏర్పాటుకు నిధులను కేటాయించారు. ప్రస్తుతం రేపల్లె రైల్వే స్టేషన్ 1వ నెంబరు ప్లాట్‌ఫారంపై జరుగుతున్న అభివృద్ధి పనుల సాంకేతికతపైనే ప్రయాణీకుల నుంచి ఆరోపణలు వస్తున్నాయి. 2వ నెంబరు ప్లాట్‌ఫారంపై పడమర దిక్కులో భవన నిర్మాణం జరిగింది.ఓవర్ బ్రిడ్జి,లిఫ్ట్ నిర్మాణపనులు పూర్తికావాల్సి ఉంది.కేవలం రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేయడమే కాకుండా ప్రయాణీకుల సౌలభ్యతకు తగిన విధంగా తీర్చిదిద్దాలనే ఉద్దేశ్యంతో కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ దక్షిణ మధ్య రైల్వే పరిధిలో 6 డివిజన్లలోని 112 స్టేషన్లను అమృత్ భారత్ స్టేషన్ పథకం కిందకు తీసుకురావడం గమనార్హం.ఏదేమైనప్పటికీ ఈ పథకం కింద జరుగుతున్న నిర్మాణ పనులకు సంబంధించి సాంకేతిక పరంగా నాణ్యతా ప్రమాణాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాల్సిన బాధ్యత దక్షిణ మధ్య రైల్వే శాఖ ఉన్నతాధికారులపై ఉందని ప్రయాణీకులు డిమాండ్ చేస్తున్నారు.

## ప్రభుత్వ సేవలన్ని ప్రజలకు సజావుగా అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలి : కలెక్టర్ వినోద్

**బాపట్ల,జనవరి8,ప్రభాతవార్త:** ప్రభుత్వ సేవలన్ని ప్రజలకు సజావుగా అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, తెలిపారు. చీరాలలోని మోటార్ వాహనాల తనిఖీ అధికారి కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్దేశాలకు అనుగుణంగా యంత్రాంగం పనిచేయాలన్నారు. వాట్సాప్ గవర్నెన్స్ అందుబాటులోకి వచ్చిందని, ప్రజలు సద్వినియోగం చేసుకునేలా విస్తృత ప్రచారం చేయాలన్నారు. ఆన్ లైన్ ద్వారా అందుబాటులోకి వచ్చిన సేవలు వివరాలు ఉంచాలన్నారు. వాహన పోర్టల్, సారధి పోర్టల్ లో అందుతున్న సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వం భావించినట్లుగా ప్రజలకు సక్రమమైన పద్ధతిలో సేవలు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. వాహనాల తనిఖీ అధికారి కార్యాలయం చీరాలలో రెండేళ్లుగా కొనసాగుతుండగా, ఇప్పటివరకు 2001 రిజిస్ట్రేషన్లు అయ్యాయన్నారు. ఆరుగురు సిబ్బంది ఉండగా, వారి హాజరు పట్టికను పరిశీలించారు. బయోమెట్రిక్ యంత్రాన్ని ఎందుకు వినియోగించడం లేదని ప్రశ్నించారు. ఆన్ లైన్ హాజరుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారువాహనాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ, ఎల్ ఎల్ ఆర్, లైసెన్సుల స్వీకరణ దరఖాస్తులు, జారీ విధానాన్ని పరిశీలించారు.కార్యాలయంఅంతా కలియతిరిగారు. ప్రతి గదిలో ఉంచిన పాత దస్త్రాలు, ప్రస్తుతం ఉంచిన దస్త్రాల గదిని నిశితంగా పరిశీలించారు. వాహన పోర్టల్, సారధి పోర్టల్స్ ద్వారా ప్రజలకు అందుతున్న సేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు సగటున 15 మంది లైసెన్స్ కొరకు వస్తున్నారని చీరాల మోటార్ వాహనాల తనిఖీ అధికారి కె.రవికుమార్ ఆయన దృష్టికి తెచ్చారు. 378 వాహనాల లైసెన్సులు రెన్యువల్ పొందడానికి ఆన్ లైన్ లో రాగా ఇప్పటికీ పెండింగ్ లో ఉండడం ఏమిటని ప్రశ్నిం చారు. తక్షణమే పరిశీలించి మంజూరు చేయాలని ఆదేశించారు. లైసెన్స్ పొందడానికి వచ్చిన అభ్యర్థులతోనూ ఆయన మాట్లాడారు. కామన్ సర్వీస్ సెంటర్ లో కట్టిన చలానా పత్రాలను పరిశీలించారు. మధ్యవర్తులు, ఏజెంట్ల వద్దకు ప్రజలు వెళ్లరాదని, ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆన్ లైన్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజలు నేరుగా తమ మొబైల్



ఫోన్ల నుంచి ఆన్ లైన్ సేవలు పొందవచ్చని అవగాహన కల్పించారు. ప్రభుత్వం అందిస్తున్న సేవలు తెలుసుకోవడానికే ఆకస్మిక తనిఖీలు చేస్తున్నా మన్నారు. వాహన, సారధి పోర్టల్ ను పరిశీలించామ న్నారు. డ్రైవింగ్ పరీక్షల కొరకు ట్రాక్ ఏర్పాటు చేయాలని, కార్యాలయం సొంత భవనంను కేటాయించాలని ఎం వి ఐ కె.రవికుమార్ కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు. చీరాల తనిఖీలకు కలెక్టర్ వచ్చినట్లు సమాచారం అందుకున్న చీరాల ఆర్డీవో టి.చంద్రశేఖర్ హుటాహుటినా అక్కడకు చేరుకున్నారు.

## డ్వాక్రా మహిళలకు పోటీలు

**నిజాంపట్నం, జనవరి 8, ప్రభాతవార్త:** సంక్రాంతి పర్వదినం సందర్భంగా మండలంలోని డ్వాక్రా మహిళలకు ఆటల పోటీలు మండల సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించామని ఎపిఎం మస్తాన్‌రావు తెలిపారు గురువారం స్థానిక స్త్రీ శక్తి భవనం వద్ద డా క్రా మహిళలకు ముగ్గుల, మ్యూజికల్ ఛైర్, స్కిప్పింగ్, లెమన్ స్పూన్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజేతలైన మహిళలకు సంక్రాంతి



సందర్భంగా బహుమతులు అందజేస్తామన్నారు. మహిళలు ఉత్సాహంగా పోటీలలో పాల్గొన్నారని ఆయన తెలిపారు. న్యాయనిర్ణేతలుగా ఎంపిడిఓ కార్యాలయ సూపరింటెండెంట్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్, సిసిలు శేషగిరి, గాంధీ, బాబూరావు, నాగలక్ష్మీ, అకౌంటెంట్, విఒఎస్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారం కోసం ఉద్యోగుల నిరాహారదీక్ష

**రేపల్లె, జనవరి 8, ప్రభాతవార్త:** దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం రేపల్లెలో సహకార సంఘాల ఉద్యోగులు రిలే నిరాహారదీక్ష చేశారు.ప్రభుత్వ ఉత్తర్వు 36ను తక్షణమే అమలు



చేయాలని,2019-24 కాలంలో పెండింగ్‌లో ఉన్న వేతన సవరణ చేయాలని విజ్ఞప్తి చేశారు.అదే విధంగా ఉద్యోగులకు రూ.5 లక్షలకు తక్కువ కాకుండా ఆరోగ్య బీమా అమలు చేయాలని నినాదాలు చేశారు.ప్రతి ఉద్యోగికి రూ.20 లక్షల ఇన్సురేషన్ పాలసీ చేయించి కుటుంబాలకు అందేలా చర్యలు తీసుకోవాలని సహకార సంఘాల ఉద్యోగులు కోరారు.కో ఆపరేటివ్ శాఖ నిబంధనలతో సంబంధం లేకుండా డిఎల్ఎస్ఎస్ ద్వారా జీత భత్యాలను చెల్లించాలని ప్రభుత్వం స్పందించాలని ఉద్యోగులు తెలిపారు.సమస్యలను పరిష్కరించని పక్షంలో ఆందోళనను తీవ్రతరం చేస్తామని ఉద్యోగులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బొడ్డువారిపాలెం,ఇసుకపల్లి, కైతేపల్లి, తుమ్మల, మంత్రిపాలెం,నూరేపల్లి,పూడివాడ,గూడవల్లి,నగరం పిఏసిఎస్ సిఇఓలు బి.కుమార్‌రాజు, పి.నాగజ్యోతి, బి.సురేష్, కె.జానకీ రామయ్య,కె.న సుబ్రహ్మణ్యం,బి.శ్రీనివాసరావు, రామయ్య,కె.యబ్బేజు,లక్ష్మణరావు,డి.రాము పాల్గొన్నారు.

## స్వర్ణాంధ్ర కెపిఐసి లక్ష్యాలను అధికారులు అధిగమించాలి

**బాపట్ల,జనవరి8,ప్రభాతవార్త:** స్వర్ణాంధ్ర కెపిఐసి లక్ష్యాలను అధికారులు అధిగమించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, తెలిపారు. స్వర్ణాంధ్ర కె పి ఐ సి లక్ష్యాల సాధనపై సంబంధిత శాఖల జిల్లా




అధికారులతో గురువారం ఆయన స్థానిక కలెక్టరేట్ లో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర విజన్ బాపట్ల దిశగా అధికారులు పనిచేయాలన్నారు. స్వర్ణాంధ్ర ప్రగతి సాధనకు అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. ప్రతి ఇంటికి స్వచ్ఛమైన, పరిశుభ్రమైన తాగునీటిని అందించడం చాలా ముఖ్యమని . పబ్లిక్ హెల్త్ నుంచి 49శాతం కుళాయి కనెక్షన్ ఇవ్వాలని లక్ష్యం కాగా, ఇప్పటివరకు కేవలం 43 శాతమే కుళాయి కనెక్షన్ లు ఇవ్వడం ఏమిటన్నారు. మురుగు నీటిని శుద్ధి చేసే కేంద్రాలు మున్సిపాలిటీలలో ఏర్పాటు చేయాలన్నారు. శుద్ధి చేసిన తర్వాత ఆ నీటిని వినియోగించుకోవడం, వాటిని సురక్షితమైన పద్ధతిలో బయటకు విడుదల చేయడం వంటివి చేయాలన్నారు. గ్రామీణ నీటి సరఫరాశాఖ ద్వారా 4,493 కుళాయి కనెక్షన్ లు ఇవ్వాలని లక్ష్యం కాగా, కేవలం 200 మాత్రమే చేయడం ఏమిటన్నారు.గ్రామీణ ప్రాంతాలలోని వాటర్ ప్లాంట్లన్నింటినిలో నీటి పరీక్షలు నిర్వహించాలన్నారు. పంచాయతీరాజ్ కింద 49.93 కిలోమీటర్ల మేర రహదారులు నిర్మించాల్సి ఉండగా, కేవలం రెండు కిలోమీటర్లు నిర్మించడం ఏమిటన్నారు. చాలా పనులు టెండర్ దశలో ఉన్నాయని సంబంధిత శాఖ అధికారులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. వేగంగా నిర్మాణ పనులు చేపట్టాలని ఆదేశించారు. ఆర్ అండ్ బి రహదారుల నిర్మాణ పనుల లక్ష్యాలను చేరుకోవాలన్నారు. మూడు నెలలలో 28.93 కిలోమీటర్ల రహదారులు నిర్మించాలని లక్ష్యం కాగా, కేవలం 14.2 కిలోమీటర్ల నిర్మించడం ఏమిటని ప్రశ్నించారు. త్వరితగతిన లక్ష్యం చేరుకోవడానికి అధికారులు కృషి చేయాలన్నారు. గృహ నిర్మాణశాఖ ద్వారా 700 గృహాలు నిర్వహించాల్సి ఉండగా, ఇప్పటివరకు 259 నిర్మించడం ఏమిటన్నారు. లబ్ధిదారులను చైతన్యపరిచడం, అప్రమత్తంగా నిర్మాణాలు పూర్తి అయ్యేలా చూడాలన్నారు. విద్యుత్ ఉత్పత్తి, వినియోగం పెరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కెపిఐసి ప్రమాణాలను పాటించాలని ఆయన స్పష్టం చేశారు. భూగర్భ ఖనిజ సంపదపై దృష్టి సారించాలన్నారు. పీఎం శ్రీ పథకంలో రూ.ఐదు కోట్లు నిధులు జిల్లాకు మంజూరు కాగా, 87 పనులకు గాను 28 పనులు ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. అమృత్ 2 పనులు చేపట్టాలన్నారు. ఎంపీ ల్యాడ్స్ నిధులతో చేపట్టిన పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో సిపిఓ షాలేము రాజు, విద్యుత్ శాఖ ఎస్ఈ ఆంజనేయులు, గృహ నిర్మాణశాఖ పిడి వెంకటేశ్వర్లు, ఆర్ అండ్ బి డిఈ అరుణకుమారి, తదితర అధికారులు శాఖల తదితరులు పాల్గొన్నారు.

## తీర్థయాత్రలు లేదా ఇతర ప్రాంతాలకు వెళ్లే వారు తప్పనిసరిగా పోలీసు స్టేషన్‌లో ముందస్తుగా సమాచారం ఇవ్వాలి : ఎస్పీ

**బాపట్ల,జనవరి8,ప్రభాతవార్త:** సంక్రాంతి సెలవుల్లో విహార యాత్రలకు, స్వగ్రామాలకు వెళుతున్నారా!దొంగలు తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకొని దొంగతనాలకు పాల్పడే అవకాశం ఉంది.విలువైన వస్తువులను బ్యాంకు లాకర్లలో (లేదా) ఇతర సురక్షితమైన ప్రదేశాల్లో భద్రపరుచుకోవాలిపోలీసులకు ముందస్తు సమాచారం ఇస్తే ఆ ఇంటిపై నిరంతర నిఘా ఉంటుంది.తల్లిదండ్రులు తమ పిల్లలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని, ఒక్క క్షణం ఏమరపాటు కూడా తీవ్ర విషాదానికి దారితీయవచ్చుసంక్రాంతి సెలవుల సందర్భంగా తాత్కాలికంగా ఇళ్లకు తాళాలు వేసి విహార యాత్రలు, తీర్థయాత్రలు లేదా ఇతర ప్రాంతాలకు వెళ్లే వారు తప్పనిసరిగా స్థానిక పోలీస్ స్టేషన్ లో ముందస్తుగా సమాచారం ఇచ్చి వెళ్లాలని జిల్లా ఎస్పీబి. ఉమామహేశ్వర్ జిల్లా ప్రజలకు సూచించారు.స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడుతూ సంక్రాంతి సెలవులను ఆసరాగా చేసుకొని తాళం వేసిన ఇళ్లలో దొంగతనాలు జరగకుండా ప్రజలు పోలీస్ శాఖకు సహకరించాలన్నారు.సెలవుల సమయంలో ఇంటికి తాళాలు వేసి వెళ్లే వారు స్థానిక పోలీసులకు సమాచారం అందిస్తే, ఆ ఇంటిపై నిరంతర పోలీసు నిఘా ఉంచడానికి అవకాశం ఉంటుందన్నారు. ఆయా ప్రాంతాల్లో పెట్రోలింగ్‌ను మరింత సమర్థవంతంగా నిర్వహిస్తూ నిఘాను పటిష్టం చేస్తామన్నారు. సాధారణంగా దొంగలు తాళం వేసి ఉన్న ఇళ్లనే లక్ష్యంగా చేసుకొని దొంగతనాలకు పాల్పడే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు.విహార యాత్రలకు వెళ్లే సమయంలో ఇంట్లో ఉన్న నగదు, బంగారం వంటి విలువైన వస్తువులను బ్యాంకు లాకర్లలో లేదా ఇతర సురక్షితమైన ప్రదేశాల్లో భద్రపరుచుకోవాలన్నారు. ఇంటిని గమనిస్తూ ఉండాలని పొరుగువారికి ముందుగానే తెలియజేయాలని, ఎప్పటికప్పుడు వారికి ఫోన్ చేసి ఇంటి పరిస్థితి గురించి తెలుసుకుంటూ ఉండాలన్నారు. వీలైనంత వరకు ఇంటి చుట్టూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని, వాటిని మొబైల్ ఫోన్‌లకు అనుసంధానం చేసి ఫుటేజ్‌ను ఎప్పటికప్పుడు పరిశీలించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.ఎవరైనా అనుమానాస్పదంగా ఇంటి పరిసరాల్లో సంచరిస్తున్నట్లు గమనిస్తే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. అలాగే ఇంటి లోపల, బయట రాత్రి వేళల్లో లైట్లు వెలిగించి ఉంచాలన్నారు. దాని ద్వారా ఇంట్లో వ్యక్తులు ఉన్నారనే భావన కలిగి దొంగలు దొంగతనాలకు పాల్పడకుండా ఉండే అవకాశం ఉంటుందన్నారు. సంక్రాంతి కాలంలో చోరీలు జరగకుండా ప్రజలు పోలీస్ శాఖకు సహకరించాలన్నారు. అదేవిధంగా, సెలవుల సందర్భంగా విహార యాత్రలకు, బంధువుల గ్రామాలకు లేదా ఇతర ప్రదేశాలకు వెళ్లినప్పుడు తల్లిదండ్రులు తమ పిల్లలపై నిరంతరం నిఘా ఉంచాలని సూచించారు. తెలియని ప్రదేశాల్లో ఉన్న కాలువలు, వాగులు, నదులు, చెరువులు, సముద్ర తీర



ప్రాంతాల్లో నీటిలోకి దిగడం అత్యంత ప్రమాదకరమని హెచ్చరించారు. ముఖ్యంగా యువత సరదా కోసం పరిచయం లేని ప్రదేశాల్లో ఈతకు వెళితే ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. పిల్లలు సముద్రాలు, నదులు, కాలువలు వంటి నీటి ప్రదేశాల్లో ఈతకు వెళ్లాల్సిన పరిస్థితి ఉంటే, తప్పనిసరిగా సురక్షితమైన ప్రదేశాల్లోనే తల్లిదండ్రులు లేదా పెద్దల సంరక్షణలో వెళ్లే విధంగా చూసుకోవాలన్నారు. జలవనరుల వద్దకు వెళ్లే సమయంలో తల్లిదండ్రులు తమ పిల్లలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని, ఒక్క క్షణం ఏమరపాటు కూడా తీవ్ర విషాదానికి దారితీయవచ్చునని తెలిపారు. సముద్ర తీర ప్రాంతాలు, నదులు మరియు ప్రజలు ఎక్కువగా ఈతకు వెళ్లే ఇతర ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. అదేవిధంగా, ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో తాళం వేసి ఉన్న గృహాల వివరాలను సేకరించి, రాత్రి గస్తీ తిరిగే సిబ్బందికి ఆ సమాచారాన్ని అందజేయాలన్నారు. గస్తీ సిబ్బంది సదరు గృహాలను తరచుగా సందర్శించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రాత్రి గస్తీ సమయంలో పోలీస్ సైరన్ వేసుకుంటూ తిరగాలని, అనుమానాస్పదంగా కనిపించే ప్రతి వ్యక్తిని క్షుణ్ణంగా తనిఖీ చేసి విచారించాలని తెలిపారు. మొబైల్ సెక్యూరిటీ చెక్ డివైస్ ద్వారా వారి వేలిముద్రలను స్కాన్ చేయాలని, ఎవరైనా నేరాలకు పాల్పడినట్టు రికార్డుల్లో తేలితే వారిని అదుపులోకి తీసుకొని విచారణ చేయాలన్నారు. దీనివల్ల నేరస్తులను సులభంగా గుర్తించి దొంగతనాలను సమర్థవంతంగా నివారించవచ్చునన్నారు.

## రేపల్లె రక్షిత మంచినీటి పథకానికి కలుషితమైన నీరు

**రేపల్లె, జనవరి 8, ప్రభాతవార్త:** పట్టణ ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించాల్సిన రక్షిత మంచినీటి సరఫరా పథకానికి వినియోగించే కృష్ణానది నీరు






కలుషితం కాకుండా చూడాల్సిన బాధ్యతను విస్మరించే పరిస్థితులు కనిపిస్తున్నాయి.రేపల్లె పట్టణ ప్రజలకు తాగు నీరందించేందుకు అరవపల్లికి సమీపంలో రక్షిత మంచినీటి పథకం పనిచేస్తోంది. కృష్ణా పశ్చిమ బ్యాంకు కెనాల్‌లో ప్రవహించే నీటిని ఈ పథకం కోసం మళ్ళిస్తున్నారు.ఈ నీటిని మోటార్ల ద్వారా చెరువులోకి నింపుకుని శుద్ధి చేసిన నీటిని పట్టణ ప్రజలకు అందిస్తున్నారు.అయితే కాల్వలోని నీటి కలుషితమే ప్రజలను బాధిస్తోంది.ప్రతి రోజూ అరవపల్లి కాల్వ నీటిలో పశువులను శుభ్రం చేస్తున్నారు .అదే విధంగా దుస్తులను శుభ్రం చేసుకుంటున్నారు.చెత్తా చెదారం కాల్వ ఒడ్డునే పడేస్తున్నారు.రేపల్లె-తుమ్మల రహదారి వంతెన దాటాక మున్సిపల్ రక్షిత మంచినీటి పథకం కోసం పైపుల నుంచి నీటిని మళ్ళిస్తున్నారు.ఇక్కడి దృశ్యాలను వీక్షిస్తున్న ప్రజలు బాధపడుతున్నారు.ఇప్పటికైనా అరవపల్లి కాల్వ నీటిలో పశువులను శుభ్రం చేయకుండా దుస్తులను ఉతకకుండా నీరు కలుషితం కాకుండా సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని రేపల్లె ప్రజలు కోరుతున్నారు.

## విద్యాసంస్థల డ్రైవర్లు నిబంధనలు పాటించాలి : ఎంవిఐ రాఘవరావు

**తెనాలి మున్సిపాలిటీ జనవరి8 (ప్రభాతవార్త):** ప్రైవేట్ విద్యాసంస్థల, కాలేజీ బస్సుల డ్రైవర్లు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని తెనాలి డివిజన్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ రాఘవరావు సూచించారు. గురువారం పట్టణంలోని



సుల్తానాబాద్ లో గల భాష్యం స్కూల్ నందు జాతీయ రోడ్డు భద్రతావారోత్స వాలు 2026 భాగంగా పాఠశాలలు మరియు కాలేజీల బస్సు డ్రైవర్ల,తో ప్రత్యేక అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి రోడ్డు భద్రతపై అవగాహనలో భాగంగా,లేన్ డ్రైవింగ్,డిఫెన్స్ డ్రైవింగ్ ఆఫ్ వే ఫ్రీ డ్రైవింగ్ చెక్స్ వంటి అంశాలను వివరించారు.ఈ కార్యక్రమంలో ఆర్టిసి సీఐ ప్రసాద్,భాష్యం స్కూల్ ఇన్చార్జి రాము, పట్టణము మరియు పరిసర ప్రాంతాల్లోని విద్యాసంస్థల డ్రైవర్లు సుమారు 150 మంది పాల్గొన్నారు.

## శ్రీరామ నామస్మరణ కోటి వజ్రోత్సవం

**భట్టిప్రోలు(రేపల్లె), జనవరి 8, ప్రభాతవార్త:** భట్టిప్రోలు పంచాయతీ శివారు అద్దేపల్లిలో కొలువుతీరిన శ్రీరామ నామ క్షేత్రంలో 75వ శ్రీరామ నామస్మరణ కోటి వజ్రోత్సవ



కార్యక్రమం గురువారం ఐదో రోజుకు చేరింది.ప్రభాత సేవ,సహస్ర నామార్చన పూజ,గోత్ర నామ పూజలు,శ్రీరామ సబ్తాక్షరి నగరోత్సవం, లక్ష్మీనారాయణ పూజ,పట్టాభిషేక కలశాలతో ఊరేగింపు,హరే నామ సంకీర్తనలు,బుర్రకథ గానం తదితర కార్యక్రమాలు జరిగాయి.ఈ కార్యక్రమంలో రామనామ క్షేత్రం అధ్యక్షుడు కొన్నిపాటి భాస్కరరావు,కాగిత ఆంజనేయులు,వంగర చలమయ్య సిద్ధాంతి,వంగర వీరాంజనేయులు,మానేపల్లి జగదీష్, గాయత్రి, బట్టు నాంచారయ్య,పద్మ,బి.శివప్రసాద్,దేవి,లక్కరాజు రాధాకృష్ణ మూర్తి,వాకా గోవర్ధన తదితరులు పాల్గొన్నారు.

## రోటరీక్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత కళ్ళ జోళ్ళు పంపిణీ

**తెనాలి టౌన్ జనవరి8(ప్రభాతవార్త):** రోటరీ క్లబ్ తెనాలి వైకుంటపురం మరియు ఆంధ్ర ప్యారిస్ రోటరీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం అంగలకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 43 మంది విద్యార్థులకు ఉచితంగా కళ్ళజోళ్ళ పంపిణీ కార్యక్రమం జరిగింది. ఉచిత కళ్ళజోళ్ళ పంపిణీ కార్యక్రమానికి నల్లమోతు మృత్యుంజయ ప్రసాద్ సుచేత దంపతులు ఆర్థిక సహాయాన్ని అందించారు.ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ తెనాలి అధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వరరావు, అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకట పూర్ణచంద్,రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ పాస్ట్ ప్రెసిడెంట్ విసిరెడ్డి బాలకోటిరెడ్డి ఫౌండేషన్ చైర్ శ్రీకాంత్ సర్వీస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ జాస్తి నరేంద్ర పాఠశాల ప్రధానోపాధ్యాయులు క్లబ్ సభ్యులు గొత్తా వెంకటరత్నం జగదీశ్వరాంబ,జీవీ.లక్ష్మీదేవి, గుమ్మడి సరోజి బాబు,ఏం. అర్జున, జివి.నారాయణ,ఎండి. రఫీ,యు.సూర్యనారాయణ,కే. రాజేంద్రప్రసాద్,డివి. సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



9-1Pg5 9_9-1Pg5.qxd 08/Jan/26 9:31 PM Page 1



# 1.5లక్షల కోట్ల డాలర్లకు రక్షణ బడ్జెట్



## డొనాల్డ్ ట్రంప్ కొత్త ప్రతిపాదనలు

**వాషింగ్టన్, జనవరి 8:** ప్రపంచంలో ప్రమాదకరమైన, సమస్యాత్మకమైన పరిస్థితులు నెలకొన్నాయని చెబుతూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 2027 సంవత్సరానికి గాను దేశ సైనిక బడ్జెట్‌ను ఏకంగా 1.5 ట్రిలియన్ డాలర్లకు పెంచాలని ఆయన ప్రతిపాదించారు. 2026 నాటి సైనిక బడ్జెట్ 901 బిలియన్ డాలర్లుగా ఉన్న నేపథ్యంలో ఈ ప్రతిపాదిత పెంపు చాలా అధికం. వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురోను పట్టుకుని, అమెరికాకు తరలించేందుకు యూఎస్ దళాలు ఆపరేషన్ చేపట్టిన కొన్ని రోజులకే ట్రంప్ ఈ ప్రకటన చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రస్తుతం కరేబియన్ సముద్రంలో అమెరికా దళాలు పెద్ద ఎత్తున మోహరించి ఉన్నాయి.ఇదే సమయంలో జాతీయ భద్రతా కారణాల దృష్ట్యా డెన్మార్క్ అధీనంలోని గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకోవాలని, కొలంబియాలో సైనిక చర్యలు చేపట్టేందుకు కూడా సిద్ధంగా ఉన్నామని ట్రంప్ ఇటీవల సంకేతాలిచ్చారు. మరోవైపు అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో సైతం తమ చిరకాల ప్రత్యర్థి క్యూబా ఇబ్బందుల్లో ఉంది అని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ట్రూత్ సోషల్ వేదికగా ట్రంప్ స్పందించారు.ఈ బడ్జెట్ పెంపుతో మనం ఎప్పటినుంచో కోరుకుంటున్న డ్రీమ్ మిలిటరీని నిర్మించుకోవచ్చు. శత్రువు ఎవరైనా సరే, ఇది మనకు పూర్తి భద్రత, భరోసా ఇస్తుందని ఆయన పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా వివిధదేశాలపై విధించిన సుంకాల ద్వారా ప్రభుత్వఆదాయం గణనీయంగా పెరిగిందని, కాబట్టి సైనిక వ్యయాన్ని పెంచడంలో ఎలాంటిఇబ్బందిఉండదని ట్రంప్‌ధీమా వ్యక్తం చేశారు.

### సోలార్ అలయెన్స్ నుంచి వైదొలిగిన అమెరికా

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. యుఎస్ ప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్న పలు అంతర్జాతీయ సంస్థలు, ఒప్పందాల నుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు కార్యనిర్వాహక ఉత్తర్వులపై ట్రంప్ సంతకం చేశారని వైట్‌హౌస్ ఓ ప్రకటనలో పేర్కొంది. మొత్తం 66 సంస్థలకు యుఎస్ తన మద్దతును నిలిపివేస్తున్నట్లు వైట్‌హౌస్ పేర్కొంది. ఇందులో 31 ఐక్యరాజ్య సమితికి చెందిన సంస్థలతో పాటు మరో 35 ఐక్యరాజ్యేతర సంస్థలు ఉన్నట్లు తెలిసింది. భారత్, ఫ్రాన్స్ నేతృత్వంలోని ఇంటర్నేషనల్ సోలార్ అలయెన్స్ నుంచి కూడా వైదొలుగుతున్నట్లు తెలిపింది. మరికొన్ని కీలక సంస్థల నుంచి కూడా తప్పుకుంటున్నట్లు వెల్లడించింది. ఇక, యుఎన్‌కు చెందినకీలకమైన ఇంటర్నేషనల్ లా కమిషన్, ఇంటర్నేషనల్ ట్రేడ్‌సెంటర్, ఐక్యరాజ్యసమితి పాపులేషన్ ఏజెన్సీ తో పాటు మరికొన్నింటినుంచి కూడా బయటకు వస్తున్నట్లు తెలిపింది.

### రష్యాతో వ్యాపారంచేసే దేశాలపై 500% సుంకాలకు పచ్చజెండా

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఉక్రెయిన్‌లో యుద్ధాన్ని ముగించేందుకు రష్యాపై మరింత ఒత్తిడి పెంచే దిశగా 500 శాతం సుంకాలు వేయాలని నిర్ణయించారు. రష్యాతో వ్యాపారం చేసే దేశాలపై ద్వితీయ ఆంక్షలు విధించే ద్వైపాక్షిక బిల్లుకు ఆయన గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. రష్యా నుంచి చమురు, యురేనియం కొనుగోలు చేసే దేశాలపై అమెరికా అధ్యక్షుడికి 500 శాతం వరకు సుంకాలు పెంచే అధికారాన్ని ఈ బిల్లు ఇస్తుంది. రిపబ్లికన్ సెనేటర్ లిండ్సే గ్రాహం అధ్యక్షుడు ట్రంప్‌తో భేటీ అయిన తర్వాత సోషల్ మీడియాలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ బిల్లు చైనా, భారత్, బ్రెజిల్ వంటి దేశాలపై ఒత్తిడి పెంచి, రష్యా చమురు కొనుగోళ్ల ఆపేలాచేస్తుందని, అదిపుతిన్ చేస్తున్న యుద్ధానికి నిధులు లేకుండా చేస్తుందని గ్రాహంచెప్పారు. ఈబిల్లు వచ్చే వారం సెనేట్‌లో ఓటింగ్‌కు రావచ్చని తెలిపారు. రష్యా నుంచి చమురు కొనుగోలుదారుల్లో చైనా మొదటి స్థానంలో ఉండగా, భారత్ రెండో స్థానంలో ఉంది.



# 111 నగరాలకు పైగా వ్యాపించిన ఇరాన్ నిరసనలు

## ఖమైనీపై పెరుగుతున్న వ్యతిరేకత

**టెహ్రాన్, జనవరి 8:** ఇరాన్‌లో జన్‌జడ్ ఆందోళనలు పెచ్చుమీరిపోతున్నాయి.సుమారు 111కుపైగా నగరాల్లో ఈ ఆందోళనలు హింసాత్మకంగా మారుతున్నాయి. కనీసం 35 మంది ఇప్పటివరకూ చనిపోగా రెండువేల మందికిపైగా అరెస్టులు అయ్యారని తెలుస్తోంది. 12వరోజుకు చేరిన ఈ నిరసనల్లో తాజాగా షాప్‌కీపర్లు వారి మొత్తం షాపులన్నింటినీ ముందుగానే మూసివేసారు. క్షీణిస్తున్న ఇరాన్ కరెన్సీకి నిరసనగాను, ద్రవ్యోల్బణం కట్టడిలో వైఫల్యం చెందడానికి నిరసనగా వారు మొత్తం షాపులు మూసివేసారు. ఇరాన్ కరెన్సీ రియాల్ రికార్డుకనిష్టానికి చేరింది. అమెరికా డాలరుతో పోలిస్తే భారీ స్థాయిలో క్షీణించింది. ద్రవ్యోల్బణం 42.2శాతానికి మించి వెళ్లిపోయింది. ఆహార ద్రవ్యోల్బణం భారీగా పెరిగింది. ఆహార ఉత్పత్తులధరలు 72శాతంపెరిగాయి. ఆరోగ్య, వైద్య ఉత్పత్తులు కూడా 50శాతానికిపైగా ధరలు పెరిగిపోయాయి. ఖ్వాజిన్, బందర్ అబ్బాస్, మషద్, అబాదన్, ఆలిగురుదర్జ్, లార్డెగాన్ నగరాల్లో నిరసనలు హింసాత్మకంగా మారాయి. టెహ్రాన్ వాయవ్య ప్రాంతంలోకూడా భారీ ఎత్తున గుంపులు రోడ్లపైకి వచ్చి నియంతకు మరణం తప్పదు అంటూ నినాదాలు హోరెత్తించారు. ఇరాన్ సుప్రీంనేత అయొతొల్లా ఆలీఖొమైనీకి వ్యతిరేకత భారీ స్థాయిలో పెరిగిపోయింది. ఆలిగురుదర్జ్‌నుంచి వచ్చిన విడియోలు హింస తీవ్రతను స్పష్టంచేస్తున్నాయి. ఆర్మీ దళాలు టియర్‌గ్యాస్ గోళాలు ప్రయోగించాయి. ప్రజలు ప్రతిఘటిస్తున్నట్లు విడియోల్లో కనిపించింది. లార్డెగాన్ నిరసనల్లో ఇద్దరు పోలీసు అధికారులు చనిపోయారు. ఉపాధ్యక్షుడు మహ్మద్ జాఫర్ క్వాపేనాహ్ మాట్లాడుతూ అధ్యక్షుడు పెజెష్కియాన్ నిరసనకారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిపారు. మారణాయుధాలు, కత్తులు, కొడవల్లు వంటి వాటిని కలిగి ఉన్నవారిని వెంటనే అదుపులోకి తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు.



# కొలంబియాపై స్వరం మార్చిన ట్రంప్

## గుస్తావోతో భేటీకి సిద్ధమని ప్రకటన

**బొగోటా, జనవరి 8:** వెనిజులా మాజీ అధ్యక్షుడు నికోలస్ మదురో నిర్బంధం తర్వాత లాటిన్ అమెరికాలోని మెక్సికో, క్యూబా, కొలంబియాలను ఉద్దేశిస్తూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరికలు చేసిన సంగతి తెలిసిందే. అయితే, ఈ విషయంలో ట్రంప్ తాజాగా తన స్వరాన్ని మార్చారు. కొలంబియా అధ్యక్షుడు గుస్తావో పెట్రోతో చర్చలకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. గుస్తావోతో స్నేహపూర్వకమైన ఫోన్ సంభాషణ జరిగిందని ట్రంప్ ట్రూత్ సోషల్ వేదికగా పోస్టు పెట్టారు. మాదకద్రవ్యాలు, ఇతర విభేదాల గురించి తాము చర్చించుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా త్వరలోనే గుస్తావోతో భేటీ కోసం ఎదురుచూస్తున్నట్లు పేర్కొన్నారు. వైట్‌హౌస్‌లో ఈ సమావేశం జరుగుతుందని వెల్లడించారు. ఇక, మదురో నిర్బంధం తర్వాత మెక్సికో, క్యూబా, కొలంబియా సైతం మాదకద్రవ్యాలు తయారుచేసి అమెరికాకు తరలిస్తున్నాయి ట్రంప్ ఆరోపించారు. ఈ పద్ధతి మార్చుకోకపోతే వెనిజులా వంటి పరిస్థితినే వీరు కూడా ఎదుర్కోవాల్సి వస్తుందని బెదరించారు. ఈ హెచ్చరికలపై గుస్తావో కూడా తీవ్రంగా స్పందించారు. 'నన్ను తీసుకెళ్లండి. ఇక్కడే మీకోసం ఎదురుచూస్తున్నా' అని సవాల్ విసి రారు. తమ దేశంపై యుఎస్ సైనిక చర్య చేపడితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయన్నారు.

# నౌక స్వాధీనంపై మాస్కో ఆగ్రహావేశాలు

## అలాగే కొనసాగిస్తే టార్పిడోలతో పేల్చేస్తాం



**మాస్కో, జనవరి 8:** వెనిజులాతో సంబంధం ఉందంటూ, రష్యా జెండా కలిగిన ఆయిల్ ట్యాంకర్‌ను అమెరికా బలగాలు స్వాధీనం చేసుకోవడం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ఉత్తర అట్లాంటిక్ మహాసముద్రంలో జరిగిన ఈ ఘటనపై రష్యా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. అమెరికా తీరు ఇలాగే కొనసాగితే, వారి కోస్ట్ గార్డ్ పడవలను టార్పిడోలతో ముంచివేయాల్సి వస్తుందని రష్యా చట్టసభ సభ్యుడు ఒకరు గట్టి హెచ్చరిక జారీచేశారు. ఐస్‌లాండ్‌కు దక్షిణంగా 190 మైళ్ల దూరంలో మారినెరా అనే రష్యన్ ట్యాంకర్‌ను అమెరికా రక్షణశాఖ, కోస్ట్‌గార్డ్ సంయుక్తంగా సీజ్ చేశాయి. ఈ ఆపరేషన్‌కు బ్రిటన్ కూడా సహక రించింది. హెలికాప్టర్ ద్వారా నౌకపైకి దిగిన అమెరికా మెరైన్ల సిబ్బందిని అదుపులోకి తీసుకున్నారు. ఇదే సమయంలో, జెండా లేని ఎం/టీ సోఫియా అనే మరో నౌకను కూడా స్వాధీనం చేసుకున్నారు. ఈ ఆపరేషన్‌కు సంబంధించిన వీడియోను యూఎస్ కోస్ట్ గార్డ్ విడుదల చేసింది. ఈ ఘటనపై రష్యా ఎంపీ అలెక్సీ జురావ్లెవ్ తీవ్రంగా స్పందించారు. 'ఏం చేసినా శిక్ష పడదన్న ధీమాతో అమెరికా ఉంది. అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘిస్తే సైనిక దాడులకు సిద్ధంగా ఉండాలి. అవసరమైతే అమెరికా కోస్ట్ గార్డ్ పడవలను ముంచేయాల్సి వస్తుంది' అని ఆయన హెచ్చరించారు. ఈ చర్యను 'సముద్రపు దోపిడీ' అని రష్యా అధికారులు అభివర్ణించారు. ఇది అంతర్జాతీయ సముద్ర చట్టాలను ఉల్లంఘించడమేనని రష్యా రవాణా శాఖ ఖండించింది. వెనెజువెలా చమురు ఎగుమతులపై అమెరికా విధించిన ఆంక్షలను అమలు చేయడంలో భాగంగానే ఈ చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. ఆంక్షలను తప్పించుకోవడానికి వెనెజువెలా, ఇరాన్ వంటి దేశాలు ఉపయోగిస్తున్న షాడో ఫ్లీట్ నౌకలను లక్ష్యంగా చేసుకుని అమెరికా ఈ ఆపరేషన్లు నిర్వహిస్తోంది. ఈ తాజా ఘటనతో అమెరికా, రష్యా మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగాయి.

# యాచకునివద్ద రూ.4.5 లక్షల నగదు

## విస్తుపోయిన దర్యాప్తు అధికారులు



**అలప్పూజ, జనవరి 8:** కేరళలోని అలప్పుజలో రోడ్డు ప్రమాదంలో మరణించిన ఓ బిచ్చగాడి వద్ద ఏకంగా రూ.4.5 లక్షలకు పైగా నగదు లభ్యం కావడంతో స్థానికులు, అధికారులు ఆశ్చర్యపోయారు. ఈ ఘటన ఇప్పుడు స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. చారుమ్మూడ్ ప్రాంతంలో అనిల్ కిషోర్ అనే వ్యక్తి భిక్షాటన చేస్తూ జీవించేవాడు. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆతడిని స్థానికులు ఆసుపత్రికి తరలించారు. ఎవరికీ ఏమీ చెప్పకుండా అతడు ఆసుపత్రి నుంచి వెళ్లిపోయాడు. మరుసటి రోజు ఉదయం ఓ దుకాణం ముందు విగతజీవిగా కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించి, అతడి సమీపంలో దొరికిన ఓ కంటైనర్‌ను స్వాధీనం చేసుకున్నారు. స్థానిక పంచాయతీ సభ్యుడు ఫిలిప్ ఉమ్మన్ సమక్షంలో ఆ కంటైనర్‌ను తెరిచి చూడగా, అధికారులు నివ్వెరపోయారు. అందులో ప్లాస్టిక్ డబ్బాల్లో నింపిన కరెన్సీ నోట్ల కట్టలు ఉన్నాయి. మొత్తం రూ.4.5 లక్షలకు పైగా నగదుతో పాటు రద్దయిన రూ.2000 నోట్లు, విదేశీ కరెన్సీ కూడా ఉన్నట్టు గుర్తించారు. రోజూ తిండి ఖర్చుల కోసం అడుక్కునే అనిల్ వద్ద ఇంత పెద్ద మొత్తంలో డబ్బు ఉండటం తమను షాక్‌కు గురిచేసిందని పంచాయతీ సభ్యుడు తెలిపారు. అతడి దగ్గర అంత డబ్బు ఉందని ఎవరూ ఊహించలేదని స్థానికులు చెబుతున్నారు. ఈ నగదును కోర్టుకు అప్పగిస్తామని, అతడి కుటుంబ సభ్యులు ఎవరైనా వచ్చినా రాకపోయినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీసులు వెల్లడించారు.

# మోడీ నన్ను కలవాలని ప్రాధేయపడ్డారు

## ఫ్రాన్స్ మేక్రాన్ తోపాటు భారత్ ప్రధాని పైనా ట్రంప్ వ్యంగ్యం




**వాషింగ్టన్, జనవరి 7:** పెండింగ్ రక్షణ కొనుగోళ్లు, వాణిజ్య అంశాలకు సంబంధించి భారత ప్రధాని నరేంద్ర మోదీ సర్.. ప్లీజ్ మిమ్మల్ని కలవొచ్చా అంటూ తనను ప్రాధేయపడ్డారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రధాని మోదీ తనకు మంచి మిత్రుడని చెబుతూనే ఆయనను కించపరిచే విధంగా ట్రంప్ వ్యాఖ్యలు చేశారు. అపాచీ హెలికాప్టర్ల సరఫరా తోసహా పెండింగ్‌లో ఉన్న రక్షణ కొనుగోళ్లు, వాణిజ్య అంశాలను చర్చించేందుకు భారత ప్రధాని మోదీ తనను వ్యక్తిగతంగా కలుసుకున్నారని ట్రంప్ తెలిపారు. ఓ ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొన్న ట్రంప్ తనకు, మోదీకి మధ్య జరిగిన సంభాషణను గుర్తుచేసుకున్నారు. అపాచీ హెలికాప్టర్ల కొనుగోలు కోసం భారత్ అమెరికాతో ఒప్పందం చేసుకుంది. ఐదేండ్లు గడిచినా భారత్‌కు ఆ హెలికాప్టర్లు అందలేదు.కాగా సుంకాలకు సంబంధించి మోదీ తన పట్ల సంతోషంగా లేరని కూడా ట్రంప్ వ్యాఖ్యానించారు. పైగా భారత్ తమ నుంచి చమురు కొనుగోలు చేయడం లేదని కూడా ఆయన తెలిపారు. రష్యా నుంచి చమురు కొనుగోలును భారత్ గణనీయంగా తగ్గించినప్పటికీ ఇంకా చాలా తగ్గించాల్సి ఉందని వ్యాఖ్యానించారు. సుంకాల ప్రభావం అమెరికా ఆర్థిక వ్యవస్థను ఎంత బలోపేతం చేసిందో కూడా ఆయన ప్రస్తావించారు. సుంకాల వల్ల మనం చాలా సంపన్నులయ్యామని, ఇప్పటికే అందరికీ ఆ విషయం అర్థమై ఉంటుందని ట్రంప్ చెప్పారు.65 వేల కోట్ల డాలర్ల మేరకు సుంకాల ద్వారా అమెరికా లోకి సంపద చేరుతోందని ఆయన చెప్పారు. అదేవి ధంగాతాను విధించిన సుంకాలపై ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ తనను ప్రాధేయపడిన తీరును అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుకరిస్తూ ఎద్దేవా చేశారు. అమెరికాకు ఎగుమతి అయ్యే అన్ని ఫ్రెంచ్ ఉత్పత్తులపై సుంకాలు విధిస్తామని బెదిరించి మందుల ధరలను పెంచేలా ఫ్రాన్స్ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చినట్లు ట్రంప్ వెల్లడించారు. డొనాల్డ్ మా ప్రిస్క్రిప్షన్ మందుల ధరలను 200 శాతం లేదా అంతకుమించి పెంచడానికి మేము సిద్ధం. మీరు చెప్పినట్లే చేస్తాను. కాని దయచేసి మా ప్రజలకు ఈ విషయం చెప్పొద్దు. మిమ్మల్ని వేడుకుంటున్నాను అంటూ మాక్రాన్ తనను ప్రాధేయపడినట్లు ఆయనను అనుకరిస్తూ ట్రంప్ మాట్లాడారు. అమెరికా సుంకాల విషయంలో ప్రపంచ దేశాలు ఏవిధంగా భయపడుతున్నదీ కూడా ఆయన ప్రస్తావిం చారు. ధరలు పెంచాలన్న అమెరికా ప్రతిపాదనను ప్రాథమికంగా ప్రతి దేశం వ్యతిరేకిస్తుందని, అయితే తమ నిర్ణయం తమ వాణిజ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని గుర్తించిన మరుక్షణం అమెరికా చెప్పినట్లు వినడానికి సిద్ధపడుతుందని ట్రంప్ వ్యాఖ్యానించారు.

# యుద్ధం తర్వాత పెరిగిన జెట్ విక్రయాలు: పాక్ రక్షణమంత్రి ఖవాజా ఆసిఫ్



**ఇస్లామాబాద్, జనవరి 8:** ప్రగల్భాలు పలకడం, నవ్వులపాలవడం పాకిస్థాన్‌కు కొత్తేంకాదు. అయినా సరే తీరు మార్చుకోని అక్కడి నేతలు మళ్లీమళ్లీ అలాంటి వ్యాఖ్యలే చేస్తున్నారు. తాజాగా దాయాది రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ మీడియాతో మాట్లాడుతూ భారత్‌తో యుద్ధం తర్వాత తమ యుద్ధ విమానాలకు ఎక్కడలేని గిరాకీ వచ్చిందని, అవి హాట్ కేకుల్లా అమ్ముడవుతున్నాయన్నారు. ఇకపై తమ ఆర్థిక కష్టాలు తీర్చేందుకు ఐఎంఎఫ్ రుణం కూడా అవసరం ఉండకపోవచ్చని పగటి కలలు కంటున్నారు. 'గతేడాది మే నెలలో భారత్‌తో నాలుగు రోజులపాటు జరిగిన యుద్ధం తర్వాత పాకిస్థాన్‌కు రక్షణ ఆర్డర్లు పెరిగాయి. అవి ఏ స్థాయిలో అంటే.. ఆరు నెలల తర్వాత మాకు అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) నుంచి రుణాల అవసరం ఉండకపోవచ్చు. పాక్ మిలిటరీ సామర్థ్యాలు ప్రపంచం దృష్టిలో పడ్డాయి' అని ఖవాజా వ్యాఖ్యలు చేశారు.

# పర్యావరణ శాస్త్రవేత్త మాధవ్ గాడ్గిల్ కన్నుమూత



**ముంబై, జనవరి 8:** ప్రముఖ పర్యావరణ శాస్త్రవేత్త, పశ్చిమ కను మల పరిరక్షణ యోధుడు, పద్మభూషణ్ పురస్కార గ్రహీత మాధవ్ గాడ్గిల్ కన్నుమూశారు. ప్రస్తుతం ఆయన వయసు 83 యేళ్లు. గత కొన్ని రోజులుగా తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన పుణెలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి తుదిశ్వాస విడిచారు. ఆయన మరణవార్త తెలుసుకున్న పలువురు ప్రముఖులు మాధవ్ కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నారు. కాగా, ప్రపంచంలోనే అత్యంత జీవవైవిధ్యాన్ని కలిగిన పశ్చిమ కనుమల్లో పర్యావరణ పరిరక్షణకు ఆయన ఎనలేని కృషి చేశారు. అభివృద్ధి పేరిట అక్కడ జరుగు తున్న పర్యావరణ విధ్వంసంపై అలుపెరుగని పోరాటం చేశారు. పశ్చిమ కనుమల్లో పర్యావరణ పరిరక్షణకు చేసిన కృషికిగానూ 2024యేడాదికి సంబంధించి ఐక్యరాజ్యసమితి (ఐరాస) అత్యు న్నత పర్యావరణ పురస్కారం 'చాంపియన్స్ ఆఫ్ ఎర్త్ అవార్డ్' ఆయ నను వరించింది. ఇప్పుడు ఆయన మృతితో దేశ పర్యావరణ రంగంలో ఓ శకం ముగిసిందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# ప్రభుత్వ ఉద్యోగమంటూ నకిలీ జాయినింగ్ లెటర్లు: ఆరు రాష్ట్రాల్లో ఇడి తనిఖీలు

**న్యూఢిల్లీ, జనవరి 8:** ప్రభుత్వ విభాగాల్లో ఉద్యోగాలంటూ మోసపూరిత జాయినింగ్ లెటర్స్ పంపి నేరాలకు పాల్పడుతున్న ఓ ముఠా కోసం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ రంగంలోకి దిగింది. ఇందులో భాగంగా ఆరు రాష్ట్రాల్లోని 15 ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టింది. బీహార్, పశ్చిమబెంగాల్, కేరళ, తమిళనాడు, గుజరాత్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో గురువారం పెద్ద ఎత్తున సోదాలు నిర్వహించింది. ఈ ముఠా ప్రభుత్వ అధికారిక డొమైన్లను పోలిన నకిలీ మెయిల్స్ నుంచి మోసపూరిత ఆఫర్ లెటర్లను అభ్యర్థులకు పంపింది. ఈ స్కామ్‌లో భాగంగా ఆర్పీఎఫ్, రైల్వే టిటిఇ వంటి ప్రభుత్వ ఉద్యోగాలు పొందారంటూ కొంతమందికి 2,3 నెలల జీతాలు కూడా చెల్లించింది. దాంతో కొత్త అభ్యర్థులను మభ్య పెట్టినట్లు దర్యాప్తులో తేలింది. మొదట రైల్వే విభాగంలో ఈ కుంభకోణం బయటపడటంతో ఇడి దర్యాప్తు చేపట్టింది. ఆ తర్వాత తీగ లాగితే దాదాపు 40కి పైగా ప్రభుత్వ విభాగాల పేర్లను ఈ ముఠా దుర్వినియోగం చేసినట్లు తేలింది. వీటిలో ఆదాయపు పన్ను విభాగం,పోస్టాఫీసు వంటి ప్రభుత్వ విభాగాలు ఉండటం గమనార్హం.

# పాక్ జాతీయతను దాచి ప్రభుత్వ ఉద్యోగం

## విద్యాశాఖ విచారణలో వెల్లడి

**లక్నో, జనవరి 8:** పాకిస్థాన్ జాతీయతను దాచి ప్రభుత్వ ఉద్యోగం పొందిన ఓ ఉపాధ్యాయురాలిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఉత్తరప్రదేశ్‌లో ఈవ్యవహారం వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాంపుర్‌కు చెందిన మాహిరా అక్తర్ ఎలియాస్ ఫర్జానా 1979లో ఓ పాకిస్తానీ వ్యక్తిని పెళ్లి చేసుకుంది. అనంతరం ఆమెకు ఆ దేశపౌరసత్వం లభించింది. కొన్నేళ్లకు విడాకులు కావడంతో ఇద్దరుపిల్లలతో కలిసి పాకిస్తాన్ వీసాపై భారత్‌కు చేరుకుంది. స్థానికంగా ఓవ్యక్తిని వివాహం చేసుకుంది. అదే సమయంలో తనను తాను భారతీయురాలిగా చెప్పుకొంటూ ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా ఉద్యోగంసాధించింది. రాంపుర్ జిల్లా కుమ్హరియా గ్రామంలో విధులునిర్వహించింది. అయితే విద్యాశాఖ అధికారులు నిర్వహించిన అంతర్గతవిచారణలో ఆమె పాకిస్థానీ జాతీయురాలిగా తేలింది.నకిలీ పత్రాలతో ఉద్యోగం సాధించినట్లు గుర్తించారు. మొదట ఆమెపై సస్పెన్షన్ వేటు వేశారు. అనంతరం విధుల నుంచి తొలగించారు.ఈ క్రమంలోనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# ట్రాన్స్‌జెండర్లకు పిఎఫ్ చెల్లింపులు సులభతరం

**న్యూఢిల్లీ,జనవరి 8:** ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) సామాజిక సమానత్వం దిశగా ఒక కీలక నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా ఉన్న ట్రాన్స్‌జెండం ఉద్యోగులు తమ పీఎఫ్ ఖాతా రికార్డులలో పేరు లేదా జెండర్ మార్చుకునే ప్రక్రియను సరళతరం చేసింది. ఇకపై కేంద్ర ప్రభుత్వం జారీ చేసే ట్రాన్స్‌జెండర్ సర్టిఫికేట్ లేదా ఐడీ కార్డును ఈ మార్పుల కోసం అధికారిక ధృవీకరణ పత్రంగా ఆమోదిస్తున్నట్లు ఈపీఎఫ్ఓ ప్రకటించింది. ఈ నిర్ణయంతో లక్షలాది మంది ట్రాన్స్‌జెండర్ ఉద్యోగులకు పెద్ద ఊరట లభించినట్లయింది. ఇంతకుముందు పీఎఫ్ రికార్డులలో పేరు,పుట్టిన తేదీ లేదా జెండర్ వంటి వివరాలు మార్చుకోవాలంటే ఆధార్, పాన్ కార్డు వంటి పత్రాలు అవసరమయ్యేవి. అయితే, లింగమార్పిడి తర్వాత పాత పత్రాలతో వివరాలు మార్చుకోవడం ట్రాన్స్‌జెండర్లకు ఇబ్బందికరంగా మారింది. ఈ సమస్యను అధిగమించేందుకు ఈపీఎఫ్ఓ ఈ కొత్త విధానాన్ని ప్రవేశపెట్టింది. కేంద్ర సామాజిక న్యాయ, సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని నేషనల్ పోర్టల్ ఫర్ ట్రాన్స్‌జెండర్ పర్సన్స్ జారీ చేసే ఐడీ కార్డును చెల్లుబాటయ్యే పత్రాల జాబితాలో చేర్చింది. ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల హక్కుల పరిరక్షణ చట్టం2019కి అనుగుణంగా వారికి సమాన అవకాశాలు కల్పించడంలో భాగంగా ఈ చర్యలు తీసుకున్నారు. అర్హులైన ఉద్యోగులు ఈపీఎఫ్ఓ యూనిఫైడ్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో జాయింట్ డిక్లరేషన్ సమర్పించి, తమ ట్రాన్స్‌జెండర్ ఐడీ కార్డును అప్‌లోడ్ చేయడం ద్వారా వివరాలను సులభంగా అప్‌డేట్ చేసుకోవచ్చు. ఈ నిర్ణయం వల్ల పత్రాల సేకరణలో వారు ఎదుర్కొనే వివక్ష, సాంకేతిక ఇబ్బందులు తొలగిపోతాయి. భవిష్యత్తులో పీఎఫ్ విత్‌డ్రా, పింఛను క్లెయిమ్‌లు కూడా ఎలాంటి ఆటంకాలు లేకుండా సాఫీగా జరిగిపోతాయి.



# షూటర్‌ను వేధించాడని కోచ్‌పై కేసు

**న్యూఢిల్లీ, జనవరి 8:** జాతీయ షూటింగ్ కోచ్ అన్‌కుష్ భరద్వాజ్‌పై హర్యానా పోలీసులు కేసు నమోదు చేశారు. 17 ఏళ్ల జాతీయ స్థాయి షూటర్‌ను లైంగికంగా వేధించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఫరీదాబాద్‌లో ఆ ఘటన జరిగినట్లు తెలుస్తున్నది. గత ఏడాది డిసెంబర్ 16న ఈ ఘటన జరిగింది. దక్షిణ ఢిల్లీలోని డాక్టర్ కర్ణీ సింగ్ షూటింగ్ రేంజ్‌లో జరిగిన పోటీల్లో ఆ అమ్మాయి పాల్గొన్నది. ఆ సమయంలో షూటర్‌ను వేధించినట్లు ఎఫ్‌ఐఆర్‌లో పేర్కొన్నారు. ఫరీదాబాద్‌లోని సూరజ్‌కుండ్ ఏరియాలో ఉన్న హోటల్‌కు వచ్చి కలవాలని భరద్వాజ్ షూటర్‌ను అడిగినట్లు ఫిర్యాదులో తెలిపారు. తొలుత హోటల్ లాబీలో కలుసుకుందామని చెప్పాడు, ఆ తర్వాత రూమ్‌కు రమ్మన్నట్లు తెలిసింది. కెరీర్‌పై ఫోకస్ పెట్టేందుకు చర్చించాలని చెప్పి రూమ్‌కు తీసుకెళ్లినట్లు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఒకవేళ విషయాన్ని బయటకు చెబితే కెరీర్‌ను నాశనం చేస్తానని భరద్వాజ్ బెదిరించాడు. బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఎన్ఐటీ ఫరీదాబాద్ వుమెన్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. పోక్సో చట్టంలోని సెక్షన్ 6 , బీఎన్ఎస్‌లోని సెక్షన్ 351(2) కింద కేసు పెట్టారు.

# తమిళనాట ఎఐఎడిఎంకె, బిజెపిల మధ్య పొత్తు

**చెన్నై,జనవరి 8:** తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ప్రధాన పార్టీలు పొత్తులు, సీట్ల కోసం అప్పుడే కసరత్తు ప్రారంభించాయి. ఈ అంశంపై బీజేపీఏఐఏడీఎంకే మధ్య ఒక అవగాహన కుదిరిందని తెలుస్తోంది. ఈ మేరకు కేంద్ర హోం మంత్రి, బీజేపీ అగ్రనేత అమిత్ షా,ఏఐఏడీఎంకే అగ్రనేత పళనిస్వామి మధ్య సీట్ల విషయంలో ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో రెండు పార్టీలు కలిసి పోటీ చేయాలనే నిర్ణయానికొచ్చాయి.

ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తమిళనాడులో బీజేపీ బలహీనంగా ఉన్న సంగతి తెలిసిందే. అందుకే అసెంబ్లీకి పోటీ చేయబోయే సీట్లు,మంత్రి పదవుల విషయంలో అమిత్ షా ఆచితూచి అడుగులేస్తున్నారు. అక్కడ మొత్తం 234 అసెంబ్లీ సీట్లకుగాను, 56 సీట్లు కావాలని అమిత్ షా పళనిస్వామిని అడిగారు. ఒకవేళ అక్కడ ఏఐఏడీఎంకే బీజేపీ కూటమి అధికారంలోకి వస్తే మూడు క్యాబినెట్ మంత్రి పదవులు కూడా బీజేపీకి కావాలని అడిగారు. అలాగే పార్టీ తిరుగుబాటు నేతలు పనీర్ సెల్వం, దినకరన్‌కు కూడా సీట్లు అడిగినట్లు తెలుస్తోంది. దీంతోపాటు ఎన్డీయే కూటమిలోనే ఇతర పార్టీలకు సీట్ల కేటాయింపుపైనా చర్చించారు. వీటన్నింటిపై పళనిస్వామి ఇంకా నిర్ణయం తీసుకోవాల్సి ఉందని ప్రచారం జరుగుతోంది. పార్టీలో చర్చించి నిర్ణయం చెబుతానని ఆయన అమిత్ షాకు చెప్పారు.

అయితే, బీజేపీతో పొత్తు పెట్టుకుంటే తమ పార్టీకి ఇబ్బంది తప్పదని ఏఐఏడీఎంకే నేతలు భావిస్తున్నారు. ఈ కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే కంట్రోల్ అంతా బీజేపీ చేతుల్లోకి వెళ్తుందని అధికార డీఎంకే విమర్శిస్తున్న విషయాన్ని పార్టీ నేతలు గుర్తుచేస్తున్నారు.

మరోవైపు ఎన్డీయే కూటమిలోకి నటుడు విజయ్ స్థాపించిన టీవీకే కూడా చేరే అవకాశం ఉందనే ఇంకో ప్రచారం కూడా జరుగుతోంది. వచ్చే వేసవిలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల నాటికి ఏ పార్టీ ఎవరితో పొత్తు పెట్టుకుంటుందో తెలుస్తుంది.

# సంక్షిప్తంగా..

## చెన్నై రోడ్లపైకి విద్యుత్ డబుల్ డెక్కర్లు




**చెన్నై, జనవరి 8:** చెన్నై మహానగర రోడ్లపై డబుల్ డెక్కర్ బస్సులు మళ్లీ సందడి చేయనున్నాయి. సుమారు 17 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత, 20ఏసీ ఎలక్ట్రిక్ డబుల్ డెక్కర్ బస్సులను నగరంలో ప్రవేశపెట్టేందుకు మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎంటిసి) ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈ మేరకు గురువారం టెండర్లు ఆహ్వానించింది. ఈ బస్సులను గ్రాస్‌కాస్ట్ కాంట్రాక్ట్ (జిసిసి) పద్ధతిలో సేకరించనున్నారు. దీని ప్రకారం, బస్సుల యాజమాన్యం, నిర్వహణ, ఆపరేషన్ అంతా కాంట్రాక్టు పొందిన ప్రైవేట్ సంస్థ చూసుకుంటుంది. బస్సులు నడిచిన కిలోమీటర్ల ఆధారంగా ఆ సంస్థకు డబ్బులు చెల్లిస్తుంది. ఆసక్తిగల సంస్థల కోసం జనవరి 13న ప్రీ బిడ్ సమావేశం నిర్వహించనున్నారు.

## బిఎన్‌పి నాయకుడి కాల్చివేత


**ఢాకా, జనవరి 8:** బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) స్వచ్ఛంద విభాగం స్వచ్ఛసేవక్ దళ్ నాయకుడు అజీజుర్ రెహమాన్ ముసాబ్బీర్‌ను బుధవారంరాత్రి ఢాకాలో గుర్తు తెలియని దుండగులు కాల్చి చంపారు. ఈ ఘటనలో మరొక వ్యక్తి గాయపడ్డారు. మరికొద్ది రోజుల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో బంగ్లాదేశ్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, అజీజుర్ గతంలో బీఎన్‌పీకి చెందిన ఢాకా మెట్రోపాలిటన్ నార్త్ స్వచ్ఛ సేవక్ దళ్‌కు ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. ఢాకాలోని కర్వాన్ బజార్ వద్ద ఒక హోటల్ సమీపంలో ఈ సంఘటన జరిగింది.

## దీపుదాస్ హత్యకేసు నిందితుడి అరెస్టు




**ఢాకా, జనవరి 8:** బంగ్లాదేశ్ లో గత నెలలో జరిగిన దీపు చంద్రదాస్ అనే హిందువు దారుణ హత్య ఘటనలో ప్రధాన నిందితుడిని బంగ్లా పోలీసులు అరెస్టు చేశారు. దీపుదాస్ హత్యకు స్థానికుల్ని రెచ్చ గొట్టినట్లుగా భావిస్తున్న యాసిన్ అరాఫత్‌ను అరెస్టు చేసినట్లు బంగ్లా పోలీసులు తెలిపారు. గత ఏడాది డిసెంబరు 18న దీపు చంద్రదాస్‌ను కొందరు ఇస్లామిస్టులు తను పనిచేసే ఫ్యాక్టరీ నుంచి బయటకు తీసుకొచ్చి, దాడి చేశారు. అనంతరం అతడిని దహనం చేసి హత్యచేసిన ఘటన సంచలనం సృష్టించింది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఘటన జరిగిన మిమెన్ సింగ్ ప్రాంతంలో నిందితుడు అరాఫత్ కు స్థానిక లీడర్గా పేరుంది. అతడు స్థానిక జనాన్ని పిలిచి, రెచ్చగొట్టి దీపుదాస్ పై దాడి చేసేలా ఉసిగొల్పాడు.

## హాదీ హత్యను రాజకీయం చేస్తున్న యూనస్ సర్కార్



**న్యూఢిల్లీ, జనవరి 8:** బంగ్లాదేశ్ విద్యార్థి నాయకుడు ఉస్మాన్ హాదీ హత్యను భారత్‌తో ముడిపెట్టడాన్ని ఆ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనా ఖండించారు. హాదీ హత్య విషాదకరమని, ఖండించదగినదని అన్నారు. బంగ్లాదేశ్ తాత్కాలిక యూనస్ ప్రభుత్వంలో దేశంలో హింస పెరుగుతుందనడానికి ఇది నిదర్శనమని అన్నారు. ఉస్మాన్ హాదీ మరణాన్ని ప్రభుత్వం రాజకీయ సాధనంగా ఉపయోగించుకుంటోందని ఆమె ఆరోపించారు. ప్రజలను రెచ్చగొట్టడానికి, ప్రజాస్వామ్య సంస్థలపై దాడి చేయించేందుకు తీవ్రవాద గ్రూపులు ఉపయోగించుకుంటున్నాయని అన్నారు.

## దేశంలో 49 లక్షల టైఫాయిడ్ కేసులు: లాన్సెట్ రిపోర్టులో వెల్లడి



**న్యూఢిల్లీ, జనవరి 8:** రెండేళ్లనుంచి దేశంలో సుమారు 49 లక్షల టైఫాయిడ్ జ్వరం కేసులు నమోదు అయినట్లు వెల్లడైంది. ఈ జ్వరంతోనే 7850 మరణించినట్లు వెలుగులోకి వచ్చింది. ఢిల్లీ, మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాల్లో టైఫాయిడ్ జ్వరాల కేసులు అధికంగా ఉన్నాయి. ఆ రాష్ట్రాల్లో సుమారు 30 శాతం కేసులు నమోదు అయినట్లు ద లాన్సెట్ రీజినల్ హెల్త్ సౌత్‌ఈస్ట్ ఏషియాలో ప్రచు రించారు. టైఫాయిడ్ జ్వరం సోకినవారిలో 7.3 లక్షల మంది ఆస్పత్రిలో చేరారని, దాంట్లో ఆరు లక్షల మందికి ఫ్లోరోక్వినోలోన్ రెసిస్టెన్స్ కలిగి ఉన్నట్లు నిర్ధారణ జరిగింది.

## కువైట్‌లో ఇద్దరు భారతీయులకు మరణశిక్ష

**కువైట్‌సిటీ, జనవరి 8:**మాదకద్రవ్యాల అక్రమ రవాణా కేసులో కువైట్‌లోని ఓ న్యాయస్థానం కీలక తీర్పు వెలువరించింది.మాదకద్రవ్యాలతో పట్టుబడిన ఇద్దరు భారతీయులను దోషులుగా తేల్చి, మరణశిక్ష విధించింది. అయితే, వారిద్దరు భారత్‌లో ఏ రాష్ట్రానికి చెందిన వారనే విషయంపై స్పష్టత లేదు. వారి వద్దనుంచి 14 కిలోల హెరాయిన్, 8 కిలోల మెథాంపెటమైన్ స్వాధీనం చేసుకున్నారు. నిందితులకు అంతర్జాతీయ డ్రగ్స్‌నెట్‌వర్క్‌తో సంబంధమున్నట్లు దర్యాప్తులో తేలగా వీటికి సంబంధించిన ఆధారాలను ప్రాసిక్యూటర్లు కోర్టులో ప్రవేశపెట్టగా,మరణశిక్ష విధిస్తూ న్యాయస్థానం తీర్పు చెప్పింది.

# 6వ అంతర్జాతీయ రసాయన శాస్త్ర విభాగం ఐకాన్ ప్యాక్ 2026సదస్సు

తాడేపల్లి,జనవరి 8,ప్రభాతవార్త : కెఎల్ యూనివర్సిటీకి చెందిన కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ శుద్ధ,అనువర్తిత రసాయన శాస్త్ర సదస్సు (ఐకాన్ ప్యాక్-2026) ఈనెల 8నుంచి 10వ తేది వరకు నిర్వహిస్తున్నారు.ఈ సదస్సు ప్రధాన అంశం శక్తి,పర్యావరణం,ఆరోగ్య సంరక్షణ కోసం పదార్ధ రసాయన శాస్త్రంలో ఆధునిక అభివృద్ధులు స్థిరమైన



శక్తి,పర్యావరణ పరిరక్షణ,ఆరోగ్య సంరక్షణ వంటి ప్రపంచ వ్యాప్త సవాళ్ళను ఎదుర్కొనేందుకు పదార్ధ రసాయన శాస్త్రంలో జరుగుతున్న ఆధునిక పరిశోధనలు,ఆవిష్కరణలపై ఈ సదస్సు దృష్టి సారిస్తుంది.గురువారం ప్రారంభించిన ఈ సదస్సుకు ఐఐటి మద్రాస్ ప్రొఫెసర్ డాక్టర్ జి.రంగారావు ముఖ్యఅతిథిగా,ప్రముఖ పదార్ధ శాస్త్రవేత్త డాక్టర్ శ్వేత అగర్వాల్ గౌరవాతిథిగా హాజరయ్యారు.ప్రారంభ ప్రసంగంలో డాక్టర్ జి.రంగారావు శుభ్రమైన శక్తిసాంకేతికతలు క్వాలిటీస్,శక్తి నిల్వవ్యవస్థలు, పర్యావరణ పునరుద్దరణలో పదార్ధ రసాయన శాస్త్రం కీలకపాత్ర పోషిస్తుందని వివరించారు.గౌరవ అతిథి డాక్టర్ శ్వేత అగర్వాల్ మాట్లాడుతూ ఆరోగ్య సంరక్షణ,పర్యావరణ అనువర్తనాలకు సంబంధించిన ఆధునిక కార్యాచరణ పదార్ధాలతో జరిగిన తాజా ఆవిష్కరణలను వివరించారు.సదస్సు కన్వీనర్ నిరంజన్‌పాత్ర మాట్లాడుతూ ఐకాన్ ప్యాక్ 2026యొక్క దృష్టి,లక్ష్యాలను వివరించారు.కెమిస్ట్రీ విభాగాధిపతి డాక్టర్ ఎ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈ సదస్సులో కీ నోట్ ప్రసంగాలు,ఆహ్వానిత ఉపన్యాసాలు,మౌఖిక,పోస్టర్ ప్రదర్శనలు నిర్వహించబడతా యన్నారు.కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్ధసారధివర్మ,ప్రొ విసి లు డాక్టర్ ఎవిఎస్ ప్రసాద్,డాక్టర్ ఎన్.వెంకటరామ్,డాక్టర్ కె.రాజశేఖరరావు,రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు,రసాయనిక శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ వెంకటేశ్వరరావు,విద్యార్ధి సంక్షేమ విభాగం ఇన్‌చార్జీ డీన్ డాక్టర్ కెఆర్ఎస్ ప్రసాద్,డీన్ ఎంహెచ్ ఎస్ డాక్టర్ ఎం.కిషోర్‌బాబు,వివిధ సంస్థలకు చెందిన ప్రముఖ అధ్యాపకులు,శాస్త్రవేత్తలు,పరిశోధకులు,విద్యార్ధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సీసీఎల్‌ఏ నుంచి వచ్చా.. ఎవరి మాట వినను"

## తీర ప్రాంత మండల అధికారి వ్యవహారం బాపట్ల జిల్లాలో తీవ్ర చర్చ

బాపట్ల,జనవరి08,ప్రభాతవార్త: బాపట్ల జిల్లాలోని తీర ప్రాంతంలోని ఓ మండల అధికారిని చుట్టుముట్టిన వివాదాస్పద వ్యవహారం ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. నేను సీసీఎల్‌ఏ కార్యాలయం నుంచి వచ్చాను.నాకు రూల్స్ అన్ని తెలుసు.. ఎవరి మాట వినాల్సిన అవసరం నాకు లేదు.. నా ఇష్టమొచ్చినట్లే చేస్తాను" అంటూ ఆయన బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్న తీరుపై కార్యాలయ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఈ అధికారి గతంలో సీలింగ్ భూములకు సంబంధించి ఆరోపణలు ఎదుర్కొన్నప్పటికీ, తనపై ఎలాంటి చర్యలు తీసుకోలేకపోయారని బహిరంగంగా వ్యాఖ్యానించడం సంచలనంగా మారింది. నా వెనుక ఎవరు ఉన్నారో ఎవరికీ తెలియదు" అంటూ కార్యాలయ సిబ్బందిని బెదిరిస్తున్నాడన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యాఖ్యలు ఉద్యోగుల్లో భయాందోళనలకు కారణమవుతున్నాయని సమాచారం.అధికారి వ్యవహార శైలి కార్యాలయ పరిమితులను దాటి మానసిక వేధింపుల స్థాయికి చేరిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అవసరం లేని పనులతో తీవ్ర ఒత్తిడికి గురి చేస్తున్నాడని ఉద్యోగ సంఘాలు ఆరోపిస్తున్నాయి. తప్పులు జరిగితే మాత్రం వాటికి బాధ్యత తీసుకోకుండా, ఇవి ఉన్నతాధికారుల ఆదేశాలే" అంటూ నెపం నెట్టే ప్రయత్నం చేస్తున్నాడని సిబ్బంది వర్గాలు బహిరంగంగానే ఆరోపిస్తున్నాయి. ఈ వ్యవహారం కేవలం కార్యాలయాల వరకే పరిమితం కాకుండా ప్రజాప్రతినిధుల దృష్టికి కూడా చేరింది. స్థానిక ప్రజాప్రతినిధి ఈ అధికారి తీరుపై జిల్లా కలెక్టర్‌కు అధికారికంగా ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ప్రజలకు సేవ చేయాల్సిన అధికారి తన అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ ప్రభుత్వానికి చెడ్డ పేరు తెస్తున్నాడనే ఆరోపణలు నియోజకవర్గంలో బాగానే వినిపిస్తున్నాయి.ఇదే అధికారి వ్యవహారంపై గతంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి స్వయంగా జోక్యం చేసుకుని హెచ్చరికలు జారీ చేసిన విషయం గమనార్హం. అయినప్పటికి అ అధికారిపై ఇప్పటి వరకు ఎటువంటి శాఖాపరమైన చర్యలు తీసుకోవడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇదిలా ఉండగా, జిల్లాలో కలెక్టర్ నిరంతరం కష్టపడి జిల్లా అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేయడానికి, ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడానికి కృషి చేస్తున్న సమయంలో ఇలాంటి కొంతమంది అధికారుల నిర్లక్ష్య వైఖరితో కూడిన వ్యవహారాలు కలెక్టర్‌కే కాదు, మొత్తం జిల్లా పరిపాలనకే చెడ్డ పేరు తెస్తున్నాయని విమర్శలు వెల్లువెత్తు తున్నాయి. ప్రజాసేవే లక్ష్యంగా పనిచేయాల్సిన అధికారులు అధికార దుర్వినియోగం, బెదిరింపులు, మానసిక వేధింపులకు పాల్పడితే ప్రజల్లో ప్రభుత్వంపై నమ్మకం దెబ్బతినే ప్రమాదం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని.ప్రజా సంఘాలు, ప్రజాప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు.

# సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మాధవి

గుంటూరు వెస్ట్, జనవరి 8,ప్రభాతవార్త: విజేత స్కూల్స్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ ఆధ్వర్యంలో గుంటూరు అన్నపూర్ణ నగర్ లోని వారి క్యాంపస్ లో నిర్వహించిన సంక్రాంతి సంబరాలకు



గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ విజేత స్కూల్స్ యాజమాన్యం సంక్రాంతి పండుగను ఒక వారం ముందుగానే క్యాంపస్‌లోకి తీసుకొచ్చినట్లుగా, పిల్లలందరూ సాంప్రదాయ దుస్తులు, సాంప్రదాయ నృత్యాలతో భారతీయ సంస్కృతిని ప్రతిబింబించేలా ఈ వేడుకలను నిర్వహించడం అభినందనీయమని, భోగిమంటల నుంచి భోగిపళ్ళు, పొంగళ్ళు, గంగిరెద్దులు, హరి దాసులు, గోదాదేవి రూపకల్పన వరకు ప్రతి అంశం సంక్రాంతి పండుగ ఆత్మను ప్రతిబింబించేలా కార్యక్రమాలు సాగాయని ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రశంసించారు. చిన్న వయసు నుంచే పిల్లల్లో భారతదేశం, ఆంధ్రప్రదేశ్ సంస్కృతి-సాంప్రదాయాలపై అవగాహన కల్పించాలనే ఉద్దేశం ఈ కార్యక్రమంలో స్పష్టంగా కనిపిస్తోందని తెలిపారు. పంచకట్టుతో వచ్చిన మగపిల్లలు, పరికిణీలతో అలంకరించుకున్న ఆడపిల్లలు అందరూ ఎంతో సాంప్రదాయబద్ధంగా కనిపించడం ఆనందాన్ని కలిగించిందని అన్నారు.రానున్న సంక్రాంతి సెలవుల్లో పిల్లలు టీవీలు, మొబైల్ ఫోన్లకే పరిమితం కాకుండా, తమ పల్లెటూర్లకు వెళ్లి కుటుంబ సభ్యులతో, బంధువులతో కలిసి గడుపుతూ భారతీయ సంస్కృతి గొప్పతనాన్ని కనీసం ఒక్కరోజైనా తెలుసుకోవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. పెద్దలు కూడా పిల్లలకు ఈ విషయంలో తోడ్పాటు అందించాలని కోరారు.ఈ సందర్భంగా అందరికీ భోగి, సంక్రాంతి, కనుమ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఈ అవకాశాన్ని కల్పించిన విజేత స్కూల్స్ యాజమాన్యానికి, పిల్లల తలి దండ్రులకు, విద్యార్థులకు, టీచర్స్ కు, సిబ్బందికి, ముఖ్యంగా మహానాడు అధినేత శ్రీ సుబ్బారావు గారికి ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# సీ ఎం ఏ ఫౌండేషన్ ఫలితాల్లో శ్రీ మేధ విద్యార్థుల ప్రభంజనం

గుంటూరు విద్య జనవరి 8 ప్రభాతవార్త : ద ఇన్స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా వారు13 డిసెంబర్ 2025 నిర్వహించిన సీ ఎం ఏ ఫౌండేషన్ పరీక్ష ఫలితాలను 8 జనవరి 2026 గురువారం ప్రకటించారు. ఈ ఫలితాల్లో శ్రీ మేధ విద్యార్థులు ఆల్ ఇండియా టాప్ మార్కులతో పాటు 95 ఉత్తీర్ణత సాధించారని సంస్థ చైర్మన్ సిఏ అన్నా నంద కిషోర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా సిఏ, సీఎంఏ కోర్సులలో 450 కి పైగా ఆల్ ఇండియా ర్యాంకులు



సాధించామన్నారు. నేటి ఫలితాలలో తమ విద్యార్థి ఏ. నాగసాయి 400 మార్కులకు గాను 338 మార్కులు పొందారని, కే .చంద్రశేఖర్ 332 మార్కులు, టి శౌర్య సాయి సాకేత్ 316, జాహ్నవి 300 వంటి టాప్ మార్కులు సాధించారని ఆయన పేర్కొన్నారు. ఇంటర్మీడియట్లో సైన్స్ గ్రూప్ చదివిన విద్యార్థులు శ్రీ మేధ సిఏ సీఎంఏ ఫౌండేషన్ డబల్ బెనిఫిట్ ప్రోగ్రాంలో చేరి అనుభవజ్ఞులైన అధ్యాపకులచే కోచింగ్ అందించడం ద్వారా సైన్స్ బ్యాక్ గ్రౌండ్ విద్యార్థులు కూడా సిఏ సీఎంఏ కోర్సుల్లో ఏకకాలంలో ఆలిండియా లెవల్లో టాప్ మార్కులు సాధిస్తున్నారని అన్నానంద కిషోర్ తెలియజేశారు .ఈ ఘనత సాధించడానికి అధ్యాపక అధ్యాపకేతరా బృందం సహకారం ఎంతగానో ఉందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా టాపర్లను ఉత్తీర్ణత సాధించిన విద్యార్థిని విద్యార్థులను శ్రీ మేధా చైర్మన్ అన్నా నందకిషోర్, డైరెక్టర్ శ్రీలక్ష్మి లు ,అధ్యాపక అధ్యాపకేతర బృందం అందరూ కలిసి అభినందించారు.

# సుమేధలో ఘనంగా సంక్రాంతి సంబరాలు

గుంటూరు విద్య జనవరి 8 ప్రభాతవార్త : స్థానిక గుంటూరు ఎన్జీవో కాలనీలోని సుమేధ హైస్కూల్లో గురువారం ముందస్తు సంక్రాంతి వేడుకలు పాఠశాల ఆవరణలో ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సప్తర్షి ఆశ్రమ నిర్వాహకులు హైకోర్టు న్యాయవాది విజయ విశ్వనాథ హాజం "య్యారు. భోగిమంటలను కర్పూరహారతతో వెలిగించి పిల్లలందరికీ భోగి పళ్ళు పోసి



ఆరంభించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు వివిధ బొమ్మలను ఏర్పాటు చేశారు. రకరకాల ముగ్గులు వేసి పాఠశాల ఆవరణానికి సంక్రాంతి శోభను తెచ్చారు. పాఠశాల ప్రాంగణాన్ని రంగురంగుల తోరణాలతో అలంకరించారు. చిన్నారులకు భోగి పండ్లు పోశారు. స్కూల్ డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్ రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్రాంతి అంటే తెలుగు సంస్కృతి సంప్రదాయాలను ప్రతీక అన్నారు. పండగ విశిష్టతను ప్రతి ఒక్కరు తెలుసుకోవడంతోపాటు వాటిని ఆచరించాలని తెలిపారు. విద్యార్థులు ఆటపాటలతో సంక్రాంతి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాంబాబు, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# పాస్ పుస్తకాలతో భూ భద్రత

## తహశీల్దార్ క్షమారాణి

వట్టిచెరుకూరురూరల్, జనవరి 8, (ప్రభాతవార్త): ప్రభుత్వం రైతులకు పంపిణీ చేస్తున్న పట్టాదారు పాసుపుస్తకాల వలన భూమిపై పూర్తి భద్రత హక్కు కల్పించబడిందన్నారు తహసీల్దార్ క్షమారాణి పేర్కొన్నారు. మండలంలోని యామర్రు గ్రామంలో



గురువారం రైతులకు నూతన పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ కార్యక్రమం, రెవిన్యూ సదస్సు గ్రామ పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో జరిగింది. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పాల్గొని మాట్లాడుతూ..ప్రభుత్వ రాజముద్రతో కూడిన నూతన పట్టాదారు పాసు పుస్తకాలను భూమి కలిగిన ప్రతి రైతుకు అందజేస్తున్నట్లు తెలిపారు.రైతుకు సంబంధించిన భూహక్కులకు పూర్తి భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. భూరికార్డుల పారదర్శకతతో రైతులకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు.పాసు పుస్తకాలతో రైతులకు ప్రభుత్వ పథకాలు సులభంగా అందుతాయని, రైతు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. అనంతరం రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేశారు.కార్యక్రమంలో వీఆర్వో బి.రాజేంద్ర పంతులు, రెవిన్యూ సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# లోక కళ్యాణార్ధం దశమహా విద్య హోమం

గుంటూరు వెస్ట్, జనవరి 8,ప్రభాతవార్త: గుంటూరు ఏటుకూరు రోడ్డులోని దత్తాత్రేయ మహాసంస్థానంలో లోకకళ్యాణార్ధం నిర్వహించిన పవిత్రమైన దశమహావిద్య హోమం సందర్భంగా శ్రీ శ్రీ శ్రీ కాళి భగవాన్ బాబా ఆశీస్సులతో నారాయణ సేవా అన్నప్రసాదం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి పూర్ణాహుతి నవర్పించారు. హోమం కార్యక్రమం అనంతరం భక్తులు పెద్ద సంఖ్యలో తీర్థ ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా



ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, ధార్మిక చైతన్యాన్ని పెంపొందిస్తాయని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. ప్రజల సుఖశాంతులు, రాష్ట్ర అభివృద్ధి కోసం నిర్వహించే యాగయజ్ఞాలు సదా ఫలప్రదంగా నిలవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో గర్నెపూడి శివ, తన్నీరు రాజు, గిరిశాల శ్రీనివాసరావు, జిడగు రామ్ బాబు, శ్రీనివాసరావు, లాలా గణేష్, దావులూరి శ్యామ్, పిల్లి నిర్మలతో పాటు భక్తులు పాల్గొన్నారు.

# కొనసాగుతున్న పిఎసిఎస్ ఉద్యోగుల రిలే నిరాహార దీక్షలు

వట్టిచెరుకూరు రూరల్ (కాకుమాను), జనవరి 8, ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు నాలుగవ రోజుకు



చేరుకున్నాయి. సహకార సంఘం ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన రిలే నిరాహార దీక్షలో భాగంగా గురువారం గుంటూరు జిల్లా కాకుమానులో జీడీసీసీ బ్యాంకు ఎదురు కాకుమాను, పెదనందిపాడు, రేటు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగులు తెలిపే నిరసన, నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల ఉద్యోగులు ఎదుర్కొంట ున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జీఓ నెం.36ను తక్షణమే అమలు చేసి, పాక్స్ ఉద్యోగులందరికీ ప్రొసీడింగ్స్ ఇవ్వాలని, జిల్లా స్థాయి నిధి ఏర్పాటు ద్వారా జీతభత్యాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే వేతన సవరణ చేపట్టి, తాత్కాలిక ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యోగుల గ్రాడ్యుటి చట్టాన్ని అమలు చేయాలని, ప్రతి ఉద్యోగికి రూ.5లక్షల వరకు ఆరోగ్య బీమా కల్పించాలని కోరారు. అలాగే 2019 తర్వాత సహకార సంఘాల్లో చేరిన సిబ్బందిని వెంటనే రెగ్యులర్ చేయాలని, రిటైర్మెంట్ వయసు 62 సంవత్సరాలకు పెంచాలంటూ నినాదాలు చేశారు.ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని తక్షణ పరిష్కారం చూపాలని, లేదంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఈఓలు కె.భాస్కరరావు, ఎస్.శ్రీనివాసరావు, కె.శేషసాయి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులను డ్రగ్స్ బారినుండి కాపాడటమే సంకల్పం లక్ష్యం : ఎస్సై బాబురావు

వట్టిచెరుకూరు రూరల్, జనవరి 8, ప్రభాతవార్త: విద్యార్థులను డ్రగ్స్ బారినుండి కాపాడటమే సంకల్పం లక్ష్యమని ఎస్సై బాబురావు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలపై పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్సై బాబురావు హాజరై మాట్లాడుతూ..మాదక ద్రవ్యాలకు వ్యతిరేక పోరాటమే సంకల్పం ముఖ్య ఉద్దేశం అన్నారు. డ్రగ్స్ ఉచ్చులో విద్యార్థులు, యువత ఎలా చిక్కుకుంటున్నారో, వాటివల్ల కలిగే శారీర, మానసిక, సామాజిక, న్యాయపరమైన నష్టాల గురించి వివరించారు.జడ్పీ పాఠశాలలో విద్యార్థులతో మమేకమవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రస్తుతం డ్రగ్స్ సమస్య యువతపై చాలా తీవ్ర ప్రభావం చూపుతోందని, ఇది



రాష్ట్రానికే కాక దేశవ్యాప్తంగా ఎదురవుతున్న పెద్ద సవాలుగా మారిందన్నారు. ముఖ్యంగా చిన్న వయస్సులోనే చాలా మంది విద్యార్థులు సరదాగా డ్రగ్స్‌కు అలవాటు పడుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు.గతంలో డ్రగ్స్ వినియోగం మెట్రో నగరాలకే పరిమితమై ఉండేదని, కానీ ఇప్పుడు గ్రామాలు, పాఠశాలల వరకు విస్తరించడం అత్యంత ప్రమాదకర పరిణామమని విచారం వ్యక్తం చేశారు. అందుకే పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పాఠశాలలు, కళాశాలలలో సంకల్పం కార్యక్రమం ద్వారా విద్యార్థులకు డ్రగ్స్ గురించి విస్తృత అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. డ్రగ్స్ బారిన పడినవారిని అడిక్షన్ సెంటర్ల ద్వారా చికిత్స అందించి సాధారణ జీవనంలోకి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నామన్నారు.బి స్మార్ట్, డోంట్ స్టార్ట్ అనే నినాదంతో విద్యార్థులను డ్రగ్స్‌కు దూరంగా ఉంచేందుకు పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ వయస్సులో వచ్చే తప్పుడు ఆలోచనలు,ఆకర్షణలు జీవితాన్ని నాశనం చేస్తాయని, తల్లిదండ్రులు ఇచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. సంకల్పం వంటి కార్యక్రమాన్ని ప్రారంభించిన జిల్లా పోలీస్ అధికారులను హృదయపూర్వకంగా అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శాంతమ్మ, బీసీలు పోతురాజు, శివశంకర్, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు, పాల్గొన్నారు.

# శాంసంగ్ నుండి ప్రపంచ మొదటి 130 అంగుళాల మైక్రోఆర్జీబి టీవీ

విజయవాడ, జనవరి 8, ప్రభాతవార్త : సిఈఎస్ 2026లో ప్రపంచంలోనే మొట్టమొదటి 130 అంగుళాల మైక్రో ఆర్జీబి టీవీని ఆవిష్కరించామని శాంసంగ్ ఎలక్ట్రానిక్స్ విజువల్ డిస్ప్లే బిజినెస్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ హన్ లీ తెలిపారు. నెక్స్ట్ జనరేషన్ కలర్ టెక్నాలజీ, అద్భుతమైన డిజైన్, ఇంజనీరింగ్ శ్రేష్ఠత, ప్రీమియం సౌందర్యంతో మెరుగైన ఆడియోతో కేవలం ఒక టెలివిజన్‌లా కాకుండా, గదిని దృశ్యమానంగా విస్తరిస్తుందన్నారు.

# ఎస్ఆర్ఎం వర్సిటీలో సీఎంయూ సహకారంతో ఏఐ ఇనిస్టిట్యూట్

## - రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో క్వాంటమ్ సెంటర్

## -వైస్ ఛాన్సలర్ డాక్టర్ సతీష్ కుమార్

మంగళగిరి, జనవరి 8, ప్రభాతవార్త : అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా బోధన, పరిశోధనలను విద్యార్థులకు అందించడమే కాకుండా శాస్త్ర సాంకేతిక రంగాల్లో నూతన పరిశోధనల దిశగా వారిని కార్యోన్ముఖుల్ని చేయాలన్న లక్ష్యంతో ఏపీఎస్ఆర్ఎం వర్సిటీ ప్రపంచ ప్రఖ్యాతి చెందిన కార్నెగీ మెలన్ యూనివర్సిటీతో భాగస్వామ్య ఒప్పందం చేసుకుందని ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య సిహెచ్ సతీష్ కుమార్ పేర్కొన్నారు. గురువారం



మధ్యాహ్నం విజయవాడలో ఏర్పాటు చేసిన మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ సతీష్ కుమార్ మీడియాకు పలు వివరాలను వెల్లడించారు. ప్రపంచ వ్యాప్తంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కు విశేషమైన ప్రాధాన్యత పెరిగిన నేపథ్యంలో ఎస్ఆర్ఎం వర్సిటీలో ఏఐ ఇనిస్టిట్యూట్ను ఏర్పాటు చేయనున్నామని సతీష్ కుమార్ వెల్లడించారు. ఇందుకోసం కార్నెగీ మెలన్ యూనివర్సిటీ సహకారం తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఏపీ ఎస్ఆర్ ఎం మాదిరి కాలపరిమితితో కార్నెగీ మెలన్ తో ఎంఓయూ చేసుకుందని, దీనివల్ల ఫ్యాకల్టీ కెపాసిటీ బిల్డింగ్, సంయుక్త పరిశోధనలు, విద్యార్థుల ఇంటర్న్ షిప్పు వంటివి సాధ్యమౌతాయన్నారు. ఇప్పటికే ఎస్ఆర్ఎంకు చెందిన నలుగురు ప్రొఫెసర్లు కార్నెగీ మెలన్ యూనివర్సిటీలో 'కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రామ్' పూర్తి చేశారని, ఈ వారంలో మరో నలుగురు వెళ్లేందుకు సిద్ధమయ్యారని వివరించారు. అంతేకాకుండా రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో త్వరలో క్వాంటమ్ రిఫరెన్సు సెంటర్ను ఏర్పాటు చేయనున్నామని వీసీ సతీష్ కుమార్ వివరించారు. ఎమర్జింగ్ టెక్నాలజీ ప్రోగ్రామ్స్ ను ఏర్పాటు చేసే చర్యల్లో భాగంగా డిఫెన్స్ ఇంజినీరింగ్, ఫైనాన్సియల్ ఇంజినీరింగ్, సెమికండక్టర్ ఇంజినీరింగ్, మరియు హెల్త్ ఇంజనీరింగ్ కోర్సులను ప్రారంభించనున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ డీన్ డాక్టర్ సినీ టామ్, రీసెర్చ్ డీన్ డాక్టర్ రంజిత్ , అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ శివశంకర్, చీఫ్ ఎక్స్ పీరియన్స్ ఆఫీసర్ శంతన్ గార్గ్ తదితరులు పాల్గొన్నారు.

# 10 ,11 తేదీలలో యుటిఎఫ్ 51 వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు

గుంటూరు విద్య జనవరి 8 ప్రభాతవార్త : ప్రభుత్వ బడిని కాపాడుకోవడం ద్వారా సమాజానికి బాధ్యతాయుత పౌరుల్ని అందించగలుగుతున్నామని, ప్రభుత్వ బడిలో బోధించే ఉపాధ్యాయులకు బోధనకు మాత్రమే పరిమితం చేయాలని, ఎలాంటి బోధ నేతర కార్యక్రమాలు ఉండకూడదనే నినాదంతోటి యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు గుంటూరు పట్టణంలో ఏసీ కాలేజీ లో జనవరి 10, 11 తేదీల్లో నిర్వహిస్తున్నామని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ వెంకటేశ్వర్లు తెలియజేశారు. గుంటూరు యుటిఎఫ్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వెంకటేశ్వర్లు వెల్లడించారు. మాజీ లీలిది కేఎస్ లక్ష్మణరావు, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు యు. రాజశేకర రావు, ఎం. కళాధర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ 1974 ఆగస్టు 10 ఏర్పడిన తర్వాత ఆరవ రాష్ట్ర మహాసభలు 1993లో ఏసీ కళాశాల ప్రాంగణంలోనే అత్యంత విజయవంతంగా జరిగాయని, 32 సంవత్సరాల తర్వాత యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభలు అదే ప్రాంగణంలో ఈ జిల్లాల్లో జరుగుతున్నాయని తెలియజేశారు .ప్రభుత్వ విద్యారంగాన్ని ప్రపంచ బ్యాంకు విధానాలతో ముడిపెట్టి పాలకులు బలహీన పరుస్తున్నారని, ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవడం ద్వారానే నైతిక విలువలు పెరుగుతాయని, తెలిపారు. ప్రభుత్వ విద్య విధానాన్ని బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలను ఈ కౌన్సిల్లో చర్చించి పోరాట కార్యక్రమాలు ఇవ్వనున్నట్లు తెలియజేశారు.బోధనకు పరిమితం కావలసిన ఉపాధ్యాయులను బోధనేతర కార్యక్రమాల చుట్టూ తిప్పుతూ, డేటా అప్లోడ్ చేసేవారిగా ఉపాధ్యాయులు మార్చడం వల్ల ప్రభుత్వ పాఠశాలలో



నాణ్యమైన విద్య రావటం లేదని ,సమాజానికి ప్రభుత్వ పాఠశాలల పట్ల నమ్మకం కోల్పోవడం వల్ల విద్యార్థుల సంఖ్య క్రమేపి తగ్గిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా బోధ నేతర కార్యక్రమాలు రద్దుచేసి ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే పరిమితం చేయాలని డిమాండ్ చేశారు.తాము అధికారంలోకి వస్తే సకాలంలో డిఏలు మెరుగైన, పిఆర్సి ఇస్తామని చెప్పి హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం కూటమి ప్రభుత్వం 18 నెలలు పూర్తికావస్తున్న 12వ పిఆర్సి చైర్మన్ ఇంతవరకు నియమించకపోవటాన్ని తీవ్రంగా దుయ్యబట్టారు. 2010 ముందు నియామకం పొందిన ఉపాధ్యాయులందరిని టెట్ నుంచి మినహాయిస్తూ రివ్యూ పిటిషన్ రాష్ట్ర ప్రభుత్వం వేయాలని, అవసరమైతే విద్య హక్కు చట్టంలో సవరణ కోసం పార్లమెంటులో సవరణ చేసే విధంగా తగు చర్యలు తీసుకోవాలని కోరారు.విద్యారంగ,ఆర్థిక రంగ సమస్యలన్నిటిపై ఈ రెండు రోజులు కూలంకషంగా చర్చించి నిర్ణయాలు చేయడంతో పాటు, భవిష్యత్తులో ఉద్యోగ ఉపాధ్యాయ హక్కులను కాపాడుకునే దానికోసం పోరాట కార్యాచరణ కూడా రూపొందిస్తున్నామని వెల్లడించారు. విలేకరుల సమావేశం లో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు షేక్. షకీల బేగం, బి. ప్రసాద్ మాజీ జిల్లా అధ్యక్షులు బి. ఆదిలక్ష్మి ,జిల్లా కార్యదర్శి సిహెచ్ ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కౌన్సిల్ సమావేశాలకు సంబంధించిన గోడ ప్రతులను ఆవిష్కరించారు.

# పాఠశాల అభివృద్ధికి రూ 1.11.116 విరాళం అందజేత

పెదనందిపాడు, జనవరి8, (ప్రభాతవార్త): పెదనందిపాడులో 100 సంవత్సరాలు పైగా చరిత్ర కలిగిన పెదనందిపాడు జడ్పీహెచ్ పాఠశాల అభివృద్ధికి



పాఠశాల పూర్వ విద్యార్థులు అప్నా జడ్పీహెచ్ఈఎస్ సంక్షేమ సంఘాన్ని ఏర్పాటు చేసి. పలువురు పూర్వ విద్యార్థుల నగదు సహాయ సహకారాలతో ఆనాడు నిర్మించిన పాఠశాల రూపం చెడిపోకుండా పునరుద్ధరణ మరమ్మత్తులు చేసే కార్యక్రమాన్ని అప్నా జెడ్ పి హెచ్ ఎస్ సంక్షేమ సంఘం అధ్యక్షులు సిహెచ్ కోదండ రామయ్య ఆధ్వర్యంలో. సభ్యులు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత విశ్రాంత ఉపాధ్యాయురాలు ఎం జవహర్ రాణి. రావి శివరామకృష్ణయ్య. గుంటుపల్లి అప్పారావు. వెల్లంకి శివరామ ప్రసాద్. షేక్ సలీం. ఎన్ఆర్ఐ ఆళ్ల వెంకట్. ఆళ్ల భాస్కర్ . ఉపాధ్యాయులు ఎస్ టి యు రాష్ట్ర నాయకులు గేరా మోహనరావు తదితరు సభ్యులు చేపట్టారు. ఈ నేపథ్యంలో హైదరాబాదులో ఉంటున్న 1965లో ఎస్ ఎస్ ఎల్ సి పూర్తి చేసిన ఈ పాఠశాల పూర్వ విద్యార్థి (నాటి వరగాని నివాసి) డాక్టర్ బొడ్డు దిబ్బలరావును మర్యాదపూర్వకంగా కలసిన పాఠశాల అభివృద్ధి సంఘం అధ్యక్షులు సిహెచ్ కోదండరామయ్య. పాఠశాల అభివృద్ధి విషయం తెలియజేయటం తో సంతోషించిన డాక్టర్ దిబ్బల రావు తన వంతు సహకారంగా ఆనాడు తాను చదువుకున్న పాఠశాల అభివృద్ధికి రూ 1.11.116. లు విరాళంగా అందజేశారు. ఈసందర్భంగా సంఘ అధ్యక్షుడు కోదండ రామయ్య దిబ్బలరావును పాఠశాల తరఫున ఘనంగా సత్కరించారు. డాక్టర్ గారిని స్ఫూర్తిగా తీసుకొని. పాఠశాల పూర్వ విద్యార్థులు మన వారసత్వ పాఠశాల అభివృద్ధికి తోడ్పడాలని విజ్ఞప్తి చేశారు. సంఘ సభ్యులకు కూడా దాత డాక్టర్ దిబ్బల రావుకు తమ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

# లింగ నిర్ధారిత వీర్యంతో ఆడ దూడలు పుట్టే అవకాశం

వట్టిచెరుకూరు రూరల్, జనవరి 8, ప్రభాతవార్త : పశువుల కృత్రిమ గర్భధారణ ప్రక్రియ లింగ నిర్ధారిత వీర్యమును ఉపయోగించడం వల్ల ఎక్కువ శాతం ఆడదోడలు పుట్టే అవకాశం ఉందని గుంటూరు డిటిసి డిఆర్సి సునీత పేర్కొన్నారు. మండల పరిధిలోని గారపాడులో గత రెండు రోజులు నుండి జరుగుతున్న పాడి పశువుల యాజమాన్యం, లింగ నిర్ధారిత వీర్యం ప్రాధాన్యతపై శిక్షణ తరగతులు గురువారం ముగిశాయి. ఈ సదస్సులో గుంటూరు డిటిసి డిఆర్సి సునీత పాల్గొని మాట్లాడుతూ.. లింగ నిర్ధారిత వీర్యమును ఉపయోగించడం వల్ల ఎక్కువ శాతం ఆడదూడలు పుట్టే అవకాశం ఉన్నందువల్ల పాడి రైతులకు అధిక ప్రయోజనం చేకూరే అవకాశం ఉందన్నారు. ఆధునిక శాస్త్ర సాంకేతిక పద్ధతులను ఉపయోగించి పశువులలో ఎంబ్రియో ట్రాన్స్ఫర్ టెక్నాలజీని అందుబాటులో తెచ్చారని వివరించారు. ఈ ప్రక్రియ ఏడు రోజుల పిండాన్ని శాస్త్రీయ పద్ధతుల ద్వారా నేరుగా పశువుల గర్భాశయంలో ప్రవేశ పెట్టుట ద్వారా ఖచ్చితమైన ఫలితాలు సాధించవచ్చని తెలియజేశారు. పాడి రైతులు పాటించవలసిన యాజమాన్య పద్ధతులను వివరిస్తూ దూడల సంరక్షణ, పడ్డ దూడలు త్వరగా ఎదకు రావడానికి తీసుకోవలసిన చర్యలు మరియు అధిక పాల దిగుబడి, పాడిపశువులకు సమకూర్చాల్సిన దాణా మరియు పోషకాహారం గురించి అవగాహన కల్పించారు. వ్యవసాయ రంగానికి నాలుగు శాతం వార్షిక వ్యవసాయ వృత్తిని సాధించడంలో మద్దతు ఇవ్వడానికి రాష్ట్రీయ కృషి వికాస్ యోజనను 2007లో ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. తరువాత దీనిని వ్యవసాయం మరియు అనుబంధ రంగాల పునరజీవనానికి రెమ్యునరేటివ్ ఆప్రోచెస్ గా మార్చారని చెప్పారు. సదుపాయాలను సృష్టించడంలో ఆర్కెవివై సహాయపడుతుందని, అలాగే మార్కెట్ సౌకర్యాలను అందించడం ద్వారా రైతుల ప్రయత్నాలను బలోపేతం చేస్తుందన్నారు. ఇది దేశవ్యాప్తంగా వ్యవసాయ రంగంలో ప్రవేట్ పెట్టుబడులను ప్రోత్సహించడంలో సహాయపడుతుందని తెలియజేశారు. చలికాలంలో పాడిపశువుల పట్ల రైతులు జాగ్రత్తగా ఉండాలని లేకుంటే పాల ఉత్పత్తి తగ్గుతుందన్నారు. గేదె సాధారణ శరీర ఉష్ణోగ్రత 101 102 డిగ్రీలు ఫారెన్హీట్ మధ్య ఉంటుందని, పరిసర ఉష్ణోగ్రత 6575 డిగ్రీల ఫారెన్హీట్ ఉండాలన్నారు. సాధారణంగా 100 కిలోల బరువు ఉన్న పాడి పశువులకు శరీర బరువు నుంచి ఆరవ వంతుతో కూడిన సమతుల్య ఆహారాన్ని అందించాల్సి ఉంటుందన్నారు. దూడల పోషణ జున్నుపాలు యొక్క ప్రాముఖ్యత, పాడి పశువుల యొక్క గృహ వసతి మరియు పునరుత్పత్తి యాజమాన్యం గురించి వివరించారు. అప్పుడే పుట్టిన దూడలకు మొదటి అరగంటలో జున్నుపాలు తాగించాలని, తద్వారా దూడలలో రోగనిరోధక శక్తి పెరుగుతుందని చెప్పారు. టీకాల షెడ్యూల్, సీజనల్ వ్యాధులను నివారించడానికి అనుసరించాల్సిన నివారణ, పశువుల పెంపకంలో మెలకువలు పాటించడం ద్వారా అధిక పాల దిగుబడి సాధించవచ్చునని తెలియజేశారు. దూడ పుట్టిన 15 రోజుల నుండి క్రమం తప్పకుండా వైద్యుల సలహా మేరకు నత్తల నివారణ మందులు వాడడం, పశువు ఎద లక్షణాలను గమనించాలని వివరించారు. కార్యక్రమంలో పెదనందిపాడు ఏడి (ఏవిహెచ్) డాక్టర్ ఎన్.శైలజ, కాట్రపాడు విఐఎస్ డాక్టర్ ఏ.భవ్యశాంతి,చింతపల్లిపాడు విఎల్ఓ బి.నాగేశ్వరరావు, ఏహెచ్ఏ ఖాదర్, ఓఎస్ పుష్ప, టిడిపి సీనియర్ నేత తాటి వీరయ్య, తెలుగు రైతుసేన అధ్యక్షులు విజయ్ కుమార్, పశు పోషకాలు, తదితరులు పాల్గొన్నారు.



# తిరువూరు-అక్కపాలెం ఆర్అండ్‌బి రోడ్ల నిర్మాణానికి రూ.3 కోట్లు నిధులు మంజూరు

**తిరువూరు, జనవరి 8, ప్రభాతవార్త :** ఎన్టీఆర్ జిల్లా, తిరువూరు నియోజకవర్గం గురువారం తిరువూరు పట్టణం నుండి అక్కపాలెం గ్రామం 5.75 కిలోమీటర్లు వరకు 3 కోట్లు నిధులతో నూతనంగా నిర్మించనున్న ఆర్ అండ్ బి రోడ్డుకి మరియు గంపలగూడెం గ్రామం నుండి గుళ్లపూడి గ్రామం వరకు 6.8 కిలోమీటర్లు వరకు 3 కోట్లు నిధులతో నిర్మించనున్న ఆర్ అండ్ బి రోడ్డుకు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు భూమి పూజ చేసి ప్రారంభించారు. తిరువూరు నియోజకవర్గంలో రోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయించినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, రోడ్ల భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి'లకు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



## చిచ్చరపిడుగు వరుణ ఆటపాటలకు ముగ్ధులైన మెగాస్టార్

**అమరావతి, జనవరి 8, ప్రభాతవార్త :** అత్యంత ప్రజాదరణ పొందిన సింగింగ్ రియాలిటీ షో సరిగమప లిటిల్ చాంప్స్ మెగా గ్రాండ్ ఫినాలే జనవరి 10 (శనివారం) రాత్రి 9 గంటలకు ప్రసారం కానుందని జి తెలుగు ప్రతినిధులు తెలిపారు. ఈ షో ప్రోమోలో మెగాస్టార్ చిరంజీవి అద్భుత ప్రతిభతో ఆకట్టుకుంటున్న చిన్నారి వరుణవిని కలిసి ఆశీర్వదించారు. యాంకర్ సుధీర్, జడ్జీలు అనిల్ రావిపూడి, అనంత్ శ్రీరామ్, వరుణవి తల్లిదండ్రులు పాల్గొన్నారు, అలాగే ఆదివారం సాయంత్రం 6 గంటలకు సంక్రాంతి అల్లుళ్ల పండగకి వస్తున్నారు కూడా తప్పక చూడండన్నారు.

## విజ్ఞాన కేంద్రం ప్రారంభం

**వత్సవాయి, జనవరి 8, ప్రభాతవార్త :** బొగ్గవరపు వెంకటేశ్వర్లు విజ్ఞాన కేంద్రంను వత్సవాయిలో గురువారం బీవివికె ట్రస్ట్ కమిటీ చైర్మన్ చిరుమామిళ్ల హనుమంతరావు అధ్యక్షతన ప్రారంభించారు. స్థలదాత, స్థానికులు, ప్రముఖ వైద్యులు డాక్టర్ పులిపాటి చంద్రశేఖర్ సతీమణి పుష్పలత ఆధ్వర్యంలో నాలుగున్నర సెంట్లు స్థలం



ఉచితంగా అందించడంతో వారితో ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రముఖ వ్యాపారవేత్త బొగ్గవరపు వెంకట రాజారావు, మరియు మండే పూడి చంద్రశేఖర్ లు వీరిద్దరూ రెండు లక్షల రూపాయలతో రెండు సెంట్లు స్థలాన్ని అదనంగా కొని ఇవ్వటం జరిగడంతో వారు కూడా ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. గ్రామానికి చెందిన ప్రవాస భారతీయులు చిరుమామిల్ల రాంబాబు ముఖ్యంగా పాల్గొని మాట్లాడారు. ఆయన కూడా విజ్ఞాన కేంద్రానికి ఇదోదికంగా సహాయాన్ని అందించారు. మొత్తం ఆరున్నర సెంట్లలో బొగ్గవరపు వెంకటేశ్వర్లు విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ కమిటీ పేరుతో నూతన భవనాన్ని నిర్మించడం జరిగిందని తెలిపారు. సుమారు 40 లక్షల రూపాయలతో దాతల సహకారంతో నిర్మించడంతో గ్రామానికి చెందిన అజ్ఞాత వ్యక్తి 5 లక్షల రూపాయలు విరాళాన్ని విజ్ఞాన కేంద్రానికి ప్రకటించారు. జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ తాతయ్య, వెనిగళ్ళ సురేష్ తదితర దాతలు కూడా ఈ కేంద్రానికి తమ సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర విజ్ఞాన కేంద్ర బాధ్యులు పిన్నమనేని మురళీకృష్ణ, డివి కృష్ణ, వెంకట రాజారావు, డిడి దాత పులిపాటి చంద్రశేఖర రావు దంపతులు, బతినేని వెంకటేశ్వరరావు, మండేపూడి చంద్రశేఖర రావు, రాము, రమేష్ పాల్గొన్నారు.

## 11న పూర్వ విద్యార్థుల సమావేశం

**గంపలగూడెం జనవరి 8, ప్రభాతవార్త:** గంపలగూడెం మండలం పెనుగొలను కోట మార్కండేయ జడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం ఈనెల



11న స్కూల్ ఆవరణలో నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. 1961 నుంచి 2025 వరకు (65 ఏళ్ల) బడిలో చదివిన పూర్వ విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. పాఠశాలలో చదివిన 65 బ్యాచ్ ల విద్యార్థులను ఒకే వేదిక పైకి తీసుకొచ్చేందుకు చేపట్టిన ఈ బృహత్తర కార్యక్రమానికి పూర్వ విద్యార్థులు సహకరించి విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు కోరారు.

## గ్లో బై కీర్తిలాల్స్ పై టు ఫుకెట్ ప్రచారం ప్రారంభం

**విజయవాడ, జనవరి 8, ప్రభాతవార్త :** తమ వద్ద నగలు కొనుగోలు చేసి, స్లోగన్ ను పంపుకోవడం ద్వారా ఫుకెట్‌కు రొమాంటిక్ జంటల విహారయాత్రను గెలుచుకునే అవకాశాన్ని పొందవచ్చని కీర్తిలాల్స్ ప్రతినిధి సూరజ్ శాంత కుమార్ తెలిపారు. గ్లో బై కీర్తిలాల్స్ షోరూమ్‌లో గురువారం పై టు ఫుకెట్ ప్రచారాన్ని ప్రారంభించిన ఆయన , పరిమిత కాలానికి మేకింగ్ ఛార్జీలపై 20 శాతం మరియు డైమండ్ విలువపై 26 శాతం ప్రత్యేక తగ్గింపులను అందిస్తోందన్నారు.

## రియల్‌మీ 16ప్రో సిరీస్ ఆవిష్కారం

**విజయవాడ, జనవరి 8, ప్రభాతవార్త :** భారతీయ యువత ఆసక్తిగా ఎదురుచూస్తున్న రియల్‌మీ 16 ప్రో సిరీస్ ను విడుదల చేసినట్లు ఆ సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఫ్లాగ్‌షిప్‌స్థాయి రియల్ మీ 16 ప్రో+ అందుబాటులో ఉండే అన్ని విధాలుగా ఉపయోగకరమైనా ఈ సిరీస్ పనితీరు, డిజైన్‌లో నైపుణ్యంతో రూపొందించిన అత్యుత్తమతతో, పోర్ట్రెయిట్ ఇమేజింగ్ ప్రమాణాలను కొత్తగా నిర్వచించనుందన్నారు.

## మాజీ సర్పంచ్ శామ్యూల్ మృతి

**గంపలగూడెం జనవరి 8, ప్రభాతవార్త:** మండలంలోని గోసవీడు గ్రామ మాజీ సర్పంచ్ గద్దల శామ్యూల్ (80) వయోభారంతో బాధపడుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయనకు భార్య, నలుగురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. శామ్యూల్ మృతదేహాన్ని వైసిపి తిరువూరు ఇన్చార్జి నల్లగట్ల స్వామిదాసు, జడ్పీటిసి సభ్యుడు కోట సామ్యూల్, గోసవీడు, కొత్తపల్లి సర్పంచ్ లు కందిమల్ల ప్రశాంత్, నరెడ్ల ఒగిరెడ్డి, సీనియర్ నాయకులు రాఘవరపు రామ్మోహన్రావు, సానికొమ్ము గోపాల్ రెడ్డి, ఆలపాటి ఉమామహేశ్వరరావు, చెరుకు నరసారెడ్డి, మందపాటి ఉమామహేశ్వర్ రెడ్డి, తదితరులు సందర్శించి, ఘనంగా నివాళులర్పించారు.



## విద్యారంగంలో ప్రతి ఒక్కరూ రాణించాలి

**కొల్లిపర, జనవరి 8, ప్రభాతవార్త:** విద్యారంగంలో రాణించాలంటే పట్టుదల, కృషి, లక్ష్యంతో ప్రతి విద్యార్థి ముందుకు సాగాలని నోడల్ అధికారి కిరణ్‌కుమార్ స్పష్టం చేశారు. గురువారం మండల కేంద్రంలోని కొల్లిపర జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 100 రోజుల ప్రణాళిక అమలు తీరు తెన్నులను క్షుణ్ణంగా ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు ఉత్తమ మార్కుల సాధనకు సమయం వృధా చేయకుండా చదువుపైనే ధ్యాస ఉంచాలని చెప్పారు. ప్రణాళిక ప్రకారం విద్యను అభ్యసిస్తే సులువుగా లక్ష్యాన్ని చేరుకోవచ్చని ఆయన తెలిపారు. సవ్యంగా విద్యార్థులకు పౌష్టికాహారం అందుతున్నదీ లేనిదీ ఉపాధ్యాయులను అడిగి తెలుసు కున్నారు. పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులు అత్యంత శ్రద్ధతో చదవాలని ఆయన సూచించారు. ఉపాధ్యాయులు తగిన శ్రద్ధ చూపాలని విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాలని కిరణ్‌కుమార్ కోరారు. ముఖ్యంగా విద్యార్థులు పోటీతత్వంతో చదివితే రాణిస్తారని ఆయన వెల్లడించారు. ఈ సమావేశంలో మండల విద్యాశాఖ అధికారి ఝాన్సీ లత, ప్రధానోపాధ్యాయురాలు సౌజన్య, ఉపాధ్యాయులు నందివెలుగు ఫణి, భీమవరపు శ్రీనివాస రెడ్డి, స్నేహలత తదితరులు పాల్గొన్నారు.



## అలరించిన అనిరుధ్ శాస్త్రీయ సంగీత గాత్ర కచేరి

**గుంటూరు కల్చరల్, జనవరి 8, ప్రభాతవార్త :** స్థానిక లక్ష్మీపురంలోని శ్రీత్యాగరాజ సాంస్కృతిక సంఘం కార్యదర్శి వల్లూరి కృష్ణకిషోర్ ఆధ్వర్యంలో శ్రీ త్యాగరాజ స్వామి ఆరాధన సంగీత మహోత్సవాలు నిర్వహిస్తున్న క్రమంలో శ్రీత్యాగరాజ స్వామి కళావేదికపై ప్రధాన కచేరీలో భాగంగా ప్రముఖ విద్వాంసులు, చెన్నై వాసులు అనిరూద్ శాస్త్రీయ సంగీత గాత్ర కచేరి వీనుల విందుగా జరిగింది. ఆరాధన సందర్భంగా త్యాగరాజ కృతులను వీనుల విందుగా గానం చేసి సంగీతాభిమానులకు శ్రవణానందంకలిగించారు. వయోలిన్‌పై ఏ. కామాక్షి, మృదంగంపై ఎస్. ఎస్. కళ్యాణరామన్, ఘటంపై ఎస్. తాడేపల్లి హనుమంతరావు చక్కటి వాయిద్య సహకారంతో కచేరీ అత్యంత శ్రావ్యంగా సాగింది. తొలుత 4గంటల నుండి జరిగిన లఘు కచేరీల్లో తుళ్ళూరి పద్మావతి, ఆర్. సూర్యలక్ష్మి, ఆర్‌పిఎల్ నరసింహారావు, వామన్ కుమార్, తమ గానంతో త్యాగరాజ స్వామిని ఆరాధించుకున్నారు. లఘు కచేరీలకు చావాలి శ్రీనివాస్ వయోలిన్, మృదంగం వరుణ్ రవిచందర్ వాయిద్య సహకారాన్ని అందించారు. ఈ సందర్భంగా కార్యదర్శి కృష్ణకిషోర్ మాట్లాడుతూ నేటి ఉదయం ఉంచవృత్తి, శోభాయాత్ర, సాయంత్రం నాట్యాచార్య కాజా సుబ్రహ్మణ్యం నిర్వహణలో ప్రహ్లాద విజయం నృత్యరూపకం జరుగుతుందన్నారు.

## ముందుగానే గుర్తించి ప్రజాసమస్యలు పరిష్కరించాలి

**కొల్లిపర, జనవరి 8, ప్రభాతవార్త:** ప్రజల నుంచి ఏ విధమైన సమస్యలు రాకుండా ఉండాలంటే అక్కడి సమస్యలు ముందుగానే గురి_ంచి పరిష్కరించాలని మండల ప్రత్యేక



అధికారి కిరణ్‌కుమార్ తెలిపారు. గురువారం కొల్లిపర మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారుల సమావేశం జరిగింది. ప్రభుత్వ శాఖల అధికారులతో వారి శాఖలకు సంబంధించి సమీక్ష చేశారు. అనంతరం మండల ప్రత్యేక అధికారి కిరణ్‌కుమార్ ప్రసంగిస్తూ గ్రామాలలో నిర్వహిస్తున్న సమగ్ర సర్వే కార్యక్రమాన్ని నిర్దేశించిన సమయంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా గ్రామాల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. పారిశుధ్యం సమస్య తలెత్తకుండా గ్రామ కార్యదర్శులు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన చెప్పారు. ప్రజలకు సేవ చేయాలనే భావన ప్రతి అధికారి, ఉద్యోగిలో విధిగా ఉండాలని సూచించారు. ప్రజల ఆరోగ్య సంరక్షణా బాధ్యత వైద్య సిబ్బందిదేనని, ప్రజలకు మెరుగైన వైద్య సౌకర్యాలు కలి ్పంచాలని కిరణ్‌కుమార్ వివరించారు. ఈ సమావేశంలో మండల తహశీల్దార్ సిద్ధార్థ, మండల పరిషత్ అభివృద్ధి అధికారి విజయలక్ష్మి, డిప్యూటీ ఎంపిడివోలు భార్గవ్, దానయ్య తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన శ్రీ త్యాగరాజ స్వామి ఆరాధన మహోత్సవాలు

**గుంటూరు కల్చరల్, జనవరి 8, ప్రభాతవార్త :** స్థానిక లక్ష్మీపురంలోని శ్రీ త్యాగరాజ సాంస్కృతిక సంఘం కార్యదర్శి వల్లూరి కృష్ణకిషోర్ ఆధ్వర్యంలో శ్రీ త్యాగరాజ స్వామి ఆరాధన సంగీత మహోత్సవాలు విశేష కార్యక్రమాలతో ఆనందోత్సాహాలతో ముగిసాయి. తొలుత శ్రీ త్యాగరాజ స్వామికి శ్రీకాంత్ బృందం నాదస్వరం, ఉంచవృత్తి, పంచామృతాభిషేకార్చన, విశేషాలంకణతో ప్రారంభించారు. శ్రీ త్యాగరాజ స్వామిని పల్లకిలో స్థానిక కళాకారులు, సంగీతజ్ఞులు, ఔత్సాహికులు శ్రీత్యాగ రాజ పంచరత్న కీర్తనల గానంతో తిరువీధుల్లో శోభాయాత్ర, అనంతరం స్థానిక స్థానికేతర కళాకారులతో పంచరత్న సేవ విశేషహారతి, అన్నప్రసాద వితరణ జరిగింది. సాయంత్రం నాట్యాచార్య డాక్టర్ కాజా వెంకట సుబ్రహ్మణ్యం శిష్యబృందం చే ప్రహ్లాద భక్తివిజయం నృత్యరూపకం కనుల విందుగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా గౌరవసల హాదారులు, గవర్నమెంట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, దేవాదాయ శాఖ, బ్రహ్మశ్రీ చుండూరి సీతారామాంజనేయ ప్రసాద్, ప్రముఖవక్తగా ఆధ్యాత్మిక వేత్త వేదాంతం రాజగోపాల చక్రవర్తి పాల్గొని చిన్నారులను ప్రశంసించి, త్యాగరాజ స్వామి విశిష్టతను వివరించారు. సంస్థ ఉపాధ్యక్షులు ఎస్. గిరిజాశంకర్, కోశాధికారి రవీంద్రనాథ్, సలహాదారు నేతి విశ్వేశ్వరరావు అతిధులను, కళాకారులను ఘనంగా సత్కరించారు.

## ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రాన్ని సందర్శించిన రైతులు

**వట్టిచెరుకూరు రూరల్, జనవరి 8, ప్రభాతవార్త:** మండలంలోని కొర్నె పాడు గ్రామం నుంచి రైతులు ఆత్మ వారి సౌజన్యంతో నిర్వహించిన రైతుల విజ్ఞాన యాత్రలో భాగంగా కృష్ణా జిల్లా, ఘంటసాలలోని కృషి విజ్ఞాన కేంద్రంను గురువారం సందర్శించడం జరిగిందని మండల వ్యవసాయాధికారి సునీత తెలిపారు. కార్యక్రమంలో భాగంగా రైతులకు గుర్రపు డెక్క నుంచి సేంద్రియ ఎరువుల తయారీ విధానం, మట్టి నమూనాల సేకరణ, మట్టి పరీక్షా విధానం, సాయిల్ హెల్త్ కార్డుల ఆవశ్యకత గురించి రైతులకు వివరించడం తెలిపారు. అదేవిధంగా రెండు కిలోల ట్రైకోడెర్మా విరిడిమీ 90 కిలోల పశువుల ఎరువుతో కలిపి శనగ పంటలో వినియోగించడం వల్ల ఎండు తెగులు నివారించవచ్చని శాస్త్రవేత్తలు వివరించారు. అలాగే కృషి విజ్ఞాన కేంద్రం హెచ్ఓడి డాక్టర్ సుధారాణి ఆధ్వర్యంలో అపరాలలో చేపట్టవలసిన సస్యరక్షణ చర్యలు (పురుగులు, తెగుళ్ల నివారణ పద్ధతులు) గురించి రైతులకు స్పష్టంగా వివరించారు. ఈ సందర్భంగా రైతులకు సంబంధిత కరపత్రాలు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. ప్రదర్శన క్షేత్రంలో శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో సాగుచేస్తున్న వివిధ రకాల ప్రయోగాత్మక మినుము, పెసర పంటలను రైతులు పరిశీలించారు. అనంతరం వెటర్నరీ విభాగానికి సంబంధించి వివిధ రకాల కోళ్ళు, గొర్రెల పెంపకం, దేశీ ఆవుల ప్రాముఖ్యత గురించి డాక్టర్ నవీన్ కుమార్ రైతులకు సమగ్రంగా తెలియజేశారు. విజ్ఞాన యాత్రలో పాల్గొన్న రైతులందరూ వ్యవసాయం, పశుపోషణకు సంబంధించిన నూతన సమాచారం తెలుసుకొని సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి చందవోలు సునీత, గ్రామ వ్యవసాయ సహాయకులు సుభాని, ఎంపీఈఓ చరణ్, రైతులు పాల్గొన్నారు.



# పారిశుద్ధ్య రహిత గ్రామంగా కంభంపాడు

### - గ్రామ పంచాయతీ సెక్రటరీ రాచమళ్ల వెంకటేశ్వరరావు వెల్లడి

**ఎ కొండూరు, జనవరి 8, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ జిల్లా ఎ కొండూరు మండలం కంభంపాడు గ్రామ పంచాయతీ మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో మేజర్ పంచాయతీ స్థాయిగా ఉంది. ఈ కంభంపాడు గ్రామ పంచాయతీని స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్రప్రదేశ్‌లో భాగంగా సర్పంచ్ కోట పుల్లమ్మ ఎంపిటిసి మెంబర్ కోట పుల్లారావు దంపతులు పాలకవర్గం ఎంపిడివో బి. శ్రీనివాసరావుల సాకారంతో 100శాతం సంక్రాంతి పండుగ సంబరాలు ఘనంగా నిర్వహించేందుకు సెక్రటరీ రాచమళ్ల వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సంక్రాంతికి గ్రామంలో విజయవాడ తిరువూరు హైవేతో పాటు ప్రధాన అంతర్గత సిసిరోడ్లు రహదారుల్లో శానిటేషన్ కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహిస్తున్నట్లు పారిశుధ్య రహిత గ్రామ పంచాయతీగా కంభంపాడును తీర్చిదిద్దడానికి అధికారుల ప్రజా ప్రతినిధుల సాకారంతో



పారిశుధ్య కార్మికులతో పూర్తి స్థాయిలో నిర్వహిస్తున్నట్లు సంక్రాంతి పండుగకు ముందే గ్రామంలో ప్రధాన రహదారిపై మిరిమిట్లు గొలిపే కాంతితో రంగురంగుల విద్యుద్దీపాలు, ప్రధాన రహదారికి సంక్రాంతి పండుగ స్వాగతం ముఖద్వారం ఏర్పాటు చేసి పుట్టింటికి వచ్చే ఆడపిల్లల ఉత్సాహాన్ని మరింత రెట్టింపు చేసి సంక్రాంతి పండుగ ప్రాముఖ్యతను తెలియచేస్తూ మహిళలకు ముగ్గుల పోటీలు రంగవల్లుల పోటీలు నిర్వహించి పండుగ సంస్కృతి సాంప్రదాయాలు ప్రతిబింబించే విధంగా ప్రణాళిక రూపొందించినట్లు సెక్రటరీ ఆర్. వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సంక్రాంతి సంభరాల నిర్వహణకై శానిటేషన్ పనులకు అధిక ప్రాధాన్యతనిచ్చి పారిశుధ్య కార్మికులు కోట రవి, బి. విజయరావు, బి. రవి, మర్సకట్ల కృష్ణ, భీమాల సుకాలు, కొంగల అజరయ్య బాలమర్తి కనక వజ్రం పాల్గొని పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్‌కు, డిపివోకు డిఎల్‌పివోకు ఎంపిడివోకు డిప్యూటీ ఎంపిడివోకు సర్పంచ్‌కు ఎంపిటిసి మెంబర్‌కు పంచాయతీ పాలక వర్గానికి సెక్రటరీ రాచమళ్ల వెంకటేశ్వరరావుకు గ్రామ ప్రజలు ఈ శానిటేషన్ పనులు సంక్రాంతి సంబరాల ముమ్మర ఏర్పాట్లు పట్ల గ్రామ ప్రజలు మహిళలు ప్రశంసించారు.

## వైకాపా పంచాయిరాజ్ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడిగా బోయిన

**పొన్నూరు, జనవరి 8, ప్రభాతవార్త:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా పంచాయితీ విభాగం ఉపాధ్యక్షుడిగా పట్టణానికి చెందిన బోయిన శివనాగరాజును నియమిస్తూ పార్టీ అధిష్టానం ఉత్తర్వులు జారీ చేసింది. బోయిన శివనాగరాజు గతంలో



మునిసిపల్ కౌన్సిలర్‌గా గెలుపొందారు. మునిసిపల్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్‌గా పనిచేసి తనదైన వాణి వినిపించారు. వైకాపా పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ బలోపేతానికి విశేషంగా కృషి చేశారు. దీంతో ఆయన సేవలను జిల్లాస్థాయిలో వినియోగించుకు నేవిధంగా పార్టీ అధిష్టానం నిర్ణయం తీసుకొంది. ఈ సందర్భంగా బోయిన శివనాగరాజు మాట్లాడుతూ పార్టీ ఏ పదవి కట్టబెట్టినా పార్టీ న్యాయం చేశానని, గతంలో కౌన్సిలర్‌గా ఉంటూ కౌన్సిల్‌లో ప్రజా సమస్యలపై పోరాటాలు చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం జిల్లా పంచాయితీరాజ్ విభాగం ఉపాధ్యక్షుడిగా నియమించారని, రానున్న రోజుల్లో పార్టీని బలోపేతం చేసి పార్టీ అధికారంలోకి వచ్చే విధంగా కృషి చేస్తానన్నారు. తనకు ఈ పదవి కట్టబెట్టిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి, సమన్వయకర్త అంబటి మురళీకృష్ణలకు కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో పోరాటాలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సిద్దంగా ఉండాలన్నారు. అధికార పార్టీ ఆగడాలను అడ్డుకునేందుకు, సుపరిపాలన అందించే విధంగా అధికార పక్షంపై ఒత్తిడి తెచ్చేందుకు ఐక్యంగా పోరాటాలు చేద్దామని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బోయినకు పలువురు అభినందనలు తెలిపారు.

## భక్తి విశ్వాసాలతో ముందుకు సాగితే లక్ష్యాలను చేరుకోవచ్చు

### -పవచనాచార్యులు అక్కిరాజు సుందర రామకృష్ణ

**పొన్నూరు, జనవరి 8, ప్రభాతవార్త:** సమాజంలో ఎవరైతే భక్తి విశ్వాసాలతో ముందుకు సాగుతారో వారే నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోగలుగుతారని ప్రముఖ రంగస్థల నటులు, గాయకులు, రచయిత అక్కిరాజు సుందర రామకృష్ణ అన్నారు. స్థానిక సాక్షి శ్రీ భావనారాయణస్వామి దేవాలయం ప్రాంగణంలో ధనుర్మాసాన్ని పురస్కరించుకొని భగవత్ వైశిష్ట్యం అనే అంశంపై జరిగిన ప్రవచనంలో ఆయన ఉపన్యసించారు. అప్రయత్నంగా ఎన్ని వృత్తులు కొనసాగించినా తాను నమ్మిన వృత్తిలో తరించడం భక్తికి సోపానమన్నారు. తమ కవితాశక్తితో శ్రావ్యంగా, భక్తితో, భావయుక్తంగా భగవంతుని నిలదీసి భక్తిని ప్రదర్శించిన మహానుభావుల్లో ధూర్జటి, పింగళి, వేమన, కాళిదాసు, తెనాలి రామకృష్ణకవి లాంటి గొప్ప కవులు ముందు వరుసలో నిలుస్తారన్నారు. సరళమైన భాషలో తత్వాన్ని బోధించిన మహాను భావుల్లో వేమన ముందున్నారన్నారు. ఆయన తెలుగు భాషలో భక్తి పామరునికి సైతం అర్థమయ్యే రీతిలో శతక రచన చేయడం ప్రశంసనీయమన్నారు. భక్తికి నిర్వచనం ఏమీ చెప్పలేమని భక్త కన్నప్ప తన మూఢభక్తితో భగవంతున్ని చూడగలిగిన మహా భక్తుడని చెప్పారు. భోగి అయిన బిల్వమంగళుడు చింతామణి అయిన వేశ్య సాంగత్యంతో, తదనంతరం మహాభక్తుడుగా మారడం భగవత్ వైశిష్ట్యమేనన్నారు. తల్లిదండ్రులను విస్మరించి చెడు సాంగత్యాలకు గురై భ్రష్టుడైన పుండరీకుని మహా భక్తునిగా మలచిన పాండురంగ మహాత్మ్యం గొప్ప వైశిష్ట్యమేనన్నారు. అర్జునునికి ఉపదేశించిన గీతాసారాంశం ప్రపంచానికి బోధించారని, తద్వారా కృష్ణ భగవానుడు విశ్వ గురువుగా నేటికీ



కీర్తింపబడుతున్నారన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి అధ్యక్షత వహించిన బ్రాహ్మణ మహాసభ పూర్వాధ్యక్షుడు పివిఎస్‌ఎస్‌వి ప్రసాద్ మాట్లాడుతూ ధనుర్మాసాన్ని పురస్కరించుకొని ఇంతటి గొప్ప కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ముందుకు వచ్చిన దేవాలయం అర్చకస్వామి గోవర్ధనం రామకృష్ణను అభినందించారు. ఇలాంటి ప్రవచనాలను వినడం ద్వారా మనసుకు ప్రశాంతత లభించడంతో పాటు భాషపైన పటుత్వం ఉంటుందన్నారు. విశ్రాంత తెలుగు పండితులు ఎం. కృష్ణకిషోర్ మాట్లాడుతూ భగవంతుని తాత్వాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మన ప్రాచీన గ్రంథాలు హైందవ సాంప్రదాయాన్ని, మానవులు ఏ విధంగా నడుచుకోవాలో, ఏ విధంగా నడుచుకోరాదో అనే విషయాలను గ్రంథాల్లో తెలియజేయడం జరిగిందన్నారు. గొప్ప వక్తల ఉపన్యాసాలను వినడం ద్వారా ఆధ్యాత్మికత తెలుస్తుందన్నారు. అనంతరం ప్రవచనాచార్యుడు అక్కిరాజు సుందర రామకృష్ణను దేవాలయం అర్చకులు గోవర్ధనం రామకృష్ణ, గురుమూర్తి, గౌతమ్, ధర్మకర్తల మండలి సభ్యులు శిఖాకొల్లి గుర్నాధరావు, గుడివాడ పవన్, కాట్రగడ్డ రామ చంద్రరావు, ఆకురాతి శ్రీనివాసరావు, సూరా రామారావు, పిన్నమనేని గాంధీ, నారాయణం మురళీధర్ తదితరులు ఘనంగా సత్కరించారు.

## రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలి

### -రెడ్‌క్రాస్ యూత్ జిల్లా కన్వీనర్ ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ

**చేబ్రోలు(పొన్నూరు), జనవరి 8, ప్రభాతవార్త:** రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని రెడ్‌క్రాస్ యూత్ జిల్లా కన్వీనర్ ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. మండల కేంద్రమైన చేబ్రోలు ఆర్‌విఐటి ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన రక్తదాన




శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పాశ్చాత్య దేశాలతో పోల్చుకుంటే మన భారతదేశంలో రక్తదానం చేసేవారి సంఖ్య అతి తక్కువగా ఉందన్నారు. ప్రతి రోజు ప్రమాదాలకు గురైన వారికి, గర్భిణీస్త్రీలకు, శస్త్ర చికిత్సలలో, తల సేమియా వ్యాధిగ్రస్తులకు నిరంతరం రక్తం యొక్క అవసరం ఉందన్నారు. సమయానికి రక్తం అందుబాటులో లేకపోవడం వల్ల అనేక మంది మృత్యువాత పడుతున్నారన్నారు. ఆర్‌విఐటి కళాశాల ఛైర్మన్ రావెళ్ళ కృష్ణయ్య మాట్లాడుతూ తమ కళాశాల ఆధ్వర్యంలో అంతర్జాతీయ సేవా సంస్థ అయిన రెడ్‌క్రాస్ సహకారంతో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. ప్రతి సంవత్సరం ఉత్తమ విద్యార్థులు వందలాది మంది రక్తదానం చేసి అనేకమంది ప్రాణాలు కాపాడుతున్నారన్నారు. కళాశాల తరపున రక్తదాలందరికీ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మల్లికార్జున్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ సుబ్బయ్య, తెనాలి రెడ్‌క్రాస్ ఛైర్మన్ ముమ్మనేని భానుమతి, పొన్నూరు రెడ్‌క్రాస్ ఛైర్మన్ రావిపాటి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులు తప్పనిసరిగా ఈ క్రాప్ బుకింగ్ చేయించాలి

### -జిల్లా వ్యవసాయాధికారి ఎం.పద్మావతి

**చేబ్రోలు(పొన్నూరు), జనవరి 8, ప్రభాతవార్త:** రబీ సీజన్‌కు సంబంధించి రైతులు వేసిన పంటలను తప్పని సరిగా ఈక్రాప్‌బుకింగ్ చేయించుకోవాలన్నారు. చేబ్రోలు మండల



పరిధిలోని నారాకోడూరు గ్రామంలో మొక్కజొన్న పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి పద్మావతి మాట్లాడుతూ రైతులు దగ్గరలోని రైతు సేవా కేంద్రానికి వెళ్ళి ఈ పంట నమోదు చేయించుకోవాలన్నారు. వ్యవసాయ సిబ్బంది రైతుల క్షేత్రాన్ని సందర్శించే సమయాన్ని, తేదీని ముందుగానే రైతులకు తెలియజేయాలన్నారు. రైతులకు అవసరమైన మేరకు ఎరువులు సిద్ధంగా ఉన్నాయన్నారు. రైతులు రసాయన ఎరువులను తగ్గించే విధంగా ఆలోచన చేయాలన్నారు. పొన్నూరు ఎడిఎ వి. రామకోటేశ్వరి మాట్లాడుతూ రైతులు మొక్కజొన్న, జొన్న పంటల్లో సస్యరక్షణా చర్యలు చేపట్టాలన్నారు. దీని ద్వారా వచ్చే తెగుళ్ళను నివారించుకో వచ్చన్నారు. ప్రతి రైతు భూసార పరీక్షలు చేయించుకున్నట్లయితే భూమి యొక్క స్వభావాన్ని బట్టి మాత్రమే ఎరువులు వాడాలన్నారు. యూరియా వాడకాన్ని తగ్గించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పి. ప్రియదర్శిని, విహెచ్ఎ విజయ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ పేదలను ఆదుకునేందుకు ముందుకు రావాలి

### -లయన్స్‌క్లబ్ స్వర్ణపురి మహిళ అధ్యక్షురాలు ఝాన్సీరాణి

**పొన్నూరు, జనవరి 8, ప్రభాతవార్త:** ప్రతి ఒక్కరూ పేదలను, వృద్ధులను ఆదుకునేందుకు ముందుకు రావాలని లయన్స్‌క్లబ్ స్వర్ణపురి మహిళ అధ్యక్షురాలు బేతాళ ఝాన్సీ రాణి పిలుపునిచ్చారు. లయన్స్‌క్లబ్ ప్రక టించిన వారోత్సవాలలో భాగంగా గురువారం స్థానిక సాయినగర్‌లోని సాయి మందిరం వద్ద పేదలకు లయన్స్‌క్లబ్ స్వర్ణపురి మహిళల ఆధ్వర్యంలో ఫీడ్ ద హంగర్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. వారం రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని క్లబ్ పెద్దలు ఆదేశించారన్నారు. అందులోభాగంగా ఇలాంటి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో రీజియన్ ఛైర్మన్ పరాశరం రంగవల్లి, జి. కృష్ణకమారి, బి. శబలాదేవి, విజయలక్ష్మి, అనసూయదేవి తదితరులున్నారు.



## ఓటర్ల జాబితా పారదర్శకతకు నాయకులు సహకరించండి

### -నియోజకవర్గ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి కంభంపాటి

**పొన్నూరు, జనవరి 8, ప్రభాతవార్త:** ఓటర్ల జాబితా పారదర్శకతకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని



నియోజకవర్గ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి కంభంపాటి శ్రీనివాస్ కోరారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో గురువారం అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కంభంపాటి మాట్లాడుతూ త్వరలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రారంభమవుతుందన్నారు. ప్రతి బిఎల్వో ఇంటింటికి తిరిగి ఓటర్ల జాబితాను సరిచూస్తారన్నారు. ప్రతి ఓటరుకు సంబంధించి ఓటును మ్యాపింగ్ చేస్తార న్నారు. ఆ సమయయంలో బిఎల్వోతోపాటు బిఎల్యే కూడా ఉన్నట్లయితే ఓటర్ల జాబితా పారదర్శకంగా తయారు అయ్యే అవకాశం ఉంటుందన్నారు. మృతి చెందినవారి ఓట్లను, డబుల్ ఎంట్రీ అయినవారి ఓట్లను తొలగించాలన్నారు. 18సంవత్సరాలు నిండిన ప్రతి పౌరుడికి ఓటు హక్కు ఇవ్వాలన్నారు. సమావేశంలో పొన్నూరు, చేబ్రోలు తహశీల్దార్లు మహమ్మద్ జియావుల్ హక్, కళ్ళెం శ్రీనివాసశర్మ, పట్టణ సర్వేయర్ శ్రీనివాసరాజు, కంప్యూటర్ ఆపరేటర్లు సయ్యద్ లాల్, షేక్ సిరాజుద్దీన్, నాయకులు బండ్లమూడి చింపిరయ్య, కలపాల శ్రీనివాసరావు, గోవాడ వెంకటకృష్ణారావు, షేక్ కరీముల్లా, ఎరసారి నాగభూషణం, ఆరేటి రామారావు, గోపిశెట్టి వాసు, చింతలపూడి మురళీకృష్ణ, దేశంశెట్టి సూర్య, అందె దిలీప్ తదితరులున్నారు.

## 11న అవగాహనలో ఆరోగ్యసభ

**గుంటూరు కల్చరల్, జనవరి 8, ప్రభాతవార్త :** అవగాహన సంస్థ గత 19సంవత్సరాలుగా క్రమం తప్పకుండా నిర్వహి స్తున్న ఆరోగ్యసభల్లో భాగంగా ఈవారం చెవి, ముక్కు, గొంతు మరియు దంతసమస్యలపై ఆరోగ్య అవగాహన సభ నిర్వహించనుందని సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి తెలిపారు. జనవరి 11వ తేది ఆదివారం ఉదయం 11గంటలకు సంస్థ కార్యాలయంలో నిర్వహించే ఆరోగ్య సభలో ఇఎన్‌టి వైద్యురాలు డాక్టర్ శ్రావ్య కొమ్మినేని, దంతవైద్యులు డాక్టర్ సాత్విక్ నల్లూరి వక్తలుగా పాల్గొంటారన్నారు

## హర్ ఘర్ యోగాను ప్రారంభించిన హాబిల్డ్

**అమరావతి, జనవరి 8, ప్రభాతవార్త :** తమ 21 రోజుల ఉచిత యోగా హర్ ఘర్ యోగాను ప్రారంభించి నట్లుగా భారతదేశ మొట్టమొదటి అలవాటు నిర్మాణ వేదిక (హ్యాబిట్ బిల్డింగ్ ప్లాట్‌ఫామ్) అయిన హాబిల్డ్ హాబిల్డ్ ప్రతినిధి సౌరభ్ బోత్రా తెలిపారు. అన్ని వయస్సుల వారిని కూడా లింగ భేదం లేకుండా, అన్ని ప్రాంతాల్లో కూడా ఎలాంటి ఒత్తిడి, పరిపూర్ణత ఆవశ్యకత లేదా ఖరీదైన సెటప్‌ల అవసరం లేకుండా తమ యోగా ప్రయాణాన్ని ప్రారం భించడానికి లేదా పునఃప్రారంభించడానికి ప్రోత్సహిస్తోందన్నారు.

## డాబర్ రెడ్‌పేస్ట్‌తో శీతాకాలపు దంత సంరక్షణ

**అమరావతి, జనవరి 8, ప్రభాతవార్త :** శీతాకాలంలో దంతసంరక్షణ ను డాబర్ రెడ్ పేస్ట్‌తో చేసుకోవచ్చని పబ్లిక్ హెల్త్ డెంటిస్ట్రీ ప్రొఫెసర్.. డా సోనియా దత్తా అన్నారు. ఆమ్లాలను తటస్థీకరించే లాలాజలం కోసం తగుమోతాదులో నీరు తప్పక తీసుకోవాలని, దాహం వేయకపోయినా హైడ్రేటెడ్‌గా ఉంచడం, సున్నితంగా బ్రష్ చేయడం, నల్ల మిరియాలు, లవంగా నూనెతో రూపొందిన ఐడిఎ ముద్ర ఆమోదం ఉన్న డాబర్ రెడ్ టూత్‌పేస్టులను వాడాలన్నారు.

09-01pg10 MN 12 VJA_09-01pg10.qxd 08/Jan/26 9:36 PM Page 1



# మలేసియా ఓపెన్‌లో క్వార్టర్స్‌కు సింధు, సాత్విక్-చిరాగ్ జోడీ





**న్యూఢిల్లీ:** మలేషియా ఓపెన్ సూపర్ 1000లో భారత బ్యాడ్మింటన్ ఆటగాళ్ళు మిశ్రమ ప్రదర్శన ఇచ్చారు. రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత పివి సింధు, పురుషుల డబుల్స్ జోడీ సాత్విక్-చిరాగ్ ముందుకు సాగగా, లక్ష్య సేన్-ఆయుష్ శెట్టి గురువారం కౌలాలంపూర్‌లో తమ పురుషుల సింగిల్స్ ప్రచారాన్ని ముగించారు. సింధు ప్రపంచ 9వ ర్యాంకర్ జపాన్‌కు చెందిన టోమోకా మియాజాకిని 21-8, 21-13 తేడాతో 30 నిమిషాలకు పైగా జరిగిన మ్యాచ్‌లో ఓడించి క్వార్టర్ ఫైనల్‌కు చేరుకుంది. పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్ రాంకిరెడ్డి-చిరాగ్ శెట్టి జోడీ మలేషియాకు చెందిన ఆర్‌కె యాప్-జునైది ఆరిఫ్‌పై 21-18, 21-11 వరుస గేమ్‌ల విజయం సాధించి పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నారు. అంతకుముందు లక్ష్య-ఆయుష్ వారి వారి పురుషుల సింగిల్స్ రౌండ్ ఆఫ్ 16 మ్యాచ్‌లలో ఓడిపోయారు. లక్ష్య 53 నిమిషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో లీ చెయుక్ యియు చేతిలో 20-22, 15-21 తేడాతో ఓడిపోగా, ఆయుష్ శెట్టి 1 గంట 10 నిమిషాల పాటు జరిగిన హోరాహోరీ పోరులో టాప్ సీడ్ యు క్వి షి చేతిలో 18-21, 21-18, 12-21 తేడాతో ఓడిపోయాడు.

# నేటి నుండి మహిళల ప్రీమియర్ లీగ్

### టైటిల్ లక్ష్యంగా ఐదు టీమ్‌లు.. ముంబయి ఇండియన్, రాయల్ ఛాలెంజర్స్ మధ్య తొలి మ్యాచ్




**న్యూఢిల్లీ:** వుమెన్స్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) 2026 సీజన్‌కు రంగం సిద్ధమైంది. ఈ నెల 9 నుంచి ఈ మెగా టోర్నీకి తెరలేవనుంది. టైటిల్ లక్ష్యంగా ఇప్పటికే ఐదు ఫ్రాంచైజీలు తమ సన్నాహకాలను కూడా ప్రారంభించాయి. ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ మొదటి దశ ఈ నెల 9 నుంచి 17 వరకు నవీ ముంబయిలో జరుగుతుంది. రెండో దశ ఈ నెల 19 నుంచి ఫిబ్రవరి 5 వరకు వడోదర (బరోడా)లో జరుగుతుంది. ఫైనల్ మ్యాచ్ వడోదరలోనే జరుగుతుంది. నవీ ముంబైలో డిఫెండింగ్ ఛాంపియన్ ముంబై ఇండియన్స్‌కు, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు మధ్య మ్యాచ్‌తో ప్రారంభమవుతుంది. మొత్తం 22 మ్యాచ్‌లకు లీగ్ దశలో 20 మ్యాచులు జరుగుతాయి. ఎలిమినేటర్ ఫిబ్రవరి 3న జరుగుతుంది. తదుపరి రెండు రోజుల తర్వాత ఫిబ్రవరి 5న ఫైనల్ జరుగుతుంది. షెడ్యూల్‌లో కేవలం రెండు మాత్రమే డబుల్ హెడర్స్ మ్యాచులు ఉన్నాయి. పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉన్న జట్టు నేరుగా ఫైనల్‌కు చేరుకుంటుంది. రెండు, మూడో స్థానాల్లో ఉన్న జట్లు ఎలిమినేటర్ ఆడాల్సి ఉంటుంది. ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ 2026 కోసం మొత్తం 277 మంది ఆటగాళ్లు వేలానికి అందుబాటులో రాగా, ఇందులో 67 మంది ఆటగాళ్లను మాత్రమే ఆయా ఫ్రాంచైజీలు కొనుగోలు చేశాయి. ఇందులో 23 మంది విదేశీ ఆటగాళ్లు ఉన్నారు. ఫ్రాంచైజీలు ప్లేయర్ల కోసం మొత్తం రూ.40.8 కోట్లు ఖర్చు చేశాయి. కాగా 2023 సీజన్‌లో ముంబయి ఇండియన్స్ టైటిల్ నెగ్గా, 2024లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు టైటిల్‌ను ఎగరేసుకొని పోయింది.

### పురుషుల హాకీ ఇండియా లీగ్..

# హెచ్‌ఐఎల్ జిసి విజయం

### 6-3 తేడాతో బెంగాల్ టైగర్స్ ఓటమి

**న్యూఢిల్లీ:** పురుషుల హాకీ ఇండియా లీగ్ 2025-26 పోరులో హెచ్‌ఐఎల్ జిసి 6-3 తేడాతో శ్రాచి బెంగాల్ టైగర్స్‌ను ఓడించింది. జిసి తరపున కేన్ రస్సెల్ (19, 36, 44), సామ్ వార్డ్ (19), సుదీప్ చిర్మాకో (38), జేమ్స్ అల్బేరీ (59) గోల్స్ సాధించగా, శ్రాచి బెంగాల్ టైగర్స్ తరపున కెప్టెన్ జుగ్‌రాజ్ సింగ్ (12), టామ్ గ్రాంబుష్ (40), క్రిస్టోఫర్ రుహ్ర్ (40) గోల్స్ సాధించారు. మొదటి క్వార్టర్ మిడ్‌ఫీల్డ్‌లో రెండు జట్ల మధ్య చాలా గట్టి పోటీతో ప్రారంభమైంది. 11వ నిమిషంలో శ్రాచి బెంగాల్ టైగర్స్‌కు వరుసగా నాలుగు పెనాల్టీ కార్నర్లు లభించాయి. కెప్టెన్ జుగ్‌రాజ్ సింగ్ (12) హెచ్‌ఐఎల్ గోల్ కీపర్ జేమ్స్ గోల్‌గా మార్చాడు. రెండవ క్వార్టర్‌లో హెచ్‌ఐఎల్ 19వ నిమిషంలో రెండు త్వరిత గోల్స్ చేసి ఆధిక్యాన్ని సాధించడంతో ఆట మలుపు తిరిగింది. మొదట, కేన్ రస్సెల్ (19) శక్తివంతమైన




డ్రాగ్‌ఫ్లిక్‌తో ఈ అవకాశాన్ని విజయవంతంగా మలిచాడు. బెంగాల్ (28) రెండు క్వార్టర్లు ముగిసే సమయానికి ఒక గోల్ వెనుకబడి ఉంది. మూడవ క్వార్టర్‌లో కేన్ రస్సెల్ మరోసారి గోల్స్ సంఖ్యను పెంచాడు. సుదీప్ చిర్మాకో (38) మూడు గోల్స్ ఆధిక్యాన్ని సాధించడంతో హెచ్‌ఐఎల్ ఫీల్డ్ గోల్‌తో వారి గోల్ స్కోరింగ్ ఫామ్‌ను పెంచుకుంది. అయితే టైగర్స్ 40వ మిషంలో రెండు త్వరిత గోల్స్ చేసి లోటును తగ్గించింది. టామ్ గ్రాంబుష్ (40) పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మార్చాడు. తరువాత క్రిస్టోఫర్ రుహ్ర్ (40) మూడవ గోల్‌ను నమోదు చేశాడు. కేన్ రస్సెల్ (44) తన మూడవ గోల్‌ను సాధించి రెండవ హ్యాట్రిక్‌ను పూర్తి చేశాడు. టైగర్స్‌కు (49) పెనాల్టీ కార్నర్ లభించింది. జేమ్స్ ఆల్బరీ (59) గోల్‌తో జిసి జట్టు 6-3 తేడాతో ఈ మ్యాచ్‌ను గెలుచుకుంది.



### న్యూజిలాండ్‌తో వన్డే:

# రిషబ్ ఔట్

### గిల్, అయ్యర్ ఇన్.. ఓపెనింగ్‌లో శుభ్‌మన్, రోహిత్

**న్యూఢిల్లీ:** న్యూజిలాండ్‌తో మూడు వన్డేల సిరీస్‌కు టీమిండియా సిద్ధమైంది. ఈ నెల 11న వడోదర వేదికగా జరిగే తొలి వన్డేతో ఈ సిరీస్‌కు తెరలేవనుంది. సౌతాఫ్రికాపై వన్డే సిరీస్ గెలిచిన టీమిండియా అదే జోరును కొనసాగించాలనే పట్టుదలతో ఉంది. ఇటీవల ఈ సిరీస్ బరిలోకి దిగే భారత జట్టును బీసీసీఐ ప్రకటించింది. గాయాలతో జట్టుకు దూరమైన కెప్టెన్ శుభ్‌మన్ గిల్, వైస్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌లు తిరిగి జట్టులోకి వచ్చారు. రిషభ్ పంత్ తన స్థానాన్ని నిలబెట్టుకోగా, జస్‌ప్రీత్ బుమ్రా, హార్దిక్ పాండ్యాకు ఈ సిరీస్ నుంచి రెస్ట్ ఇచ్చారు. మహమ్మద్ షమీని పట్టించుకోని సెలెక్టర్లు మహమ్మద్ సిరాజ్‌ను ఎంపిక చేశారు. దాంతో టీమిండియా కాంబినేషన్ ఎలా ఉంటుందనేది ఆసక్తికరంగా మారింది. కాగా ఈ సిరీస్‌లో కెప్టెన్ శుభ్‌మన్ గిల్, రోహిత్ శర్మ ఓపెనింగ్ చేయనుండగా, విరాట్ కోహ్లీ మూడో స్థానంలో ఆడనున్నాడు. విజయ్ హజారే ట్రోఫీలో హాఫ్ సెంచరీతో ఫిట్‌నెస్ నిరూపించుకున్న శ్రేయస్ అయ్యర్ నాలుగో స్థానంలో బరిలోకి దిగనున్నాడు. ఐదో స్థానంలో వికెట్ కీపర్‌గా కేఎల్ రాహుల్ ఆడనుండగా, రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్ స్పిన్ ఆల్‌రౌండర్లుగా బరిలోకి దిగనున్నారు. పేసర్లుగా అర్ష్‌దీప్ సింగ్, మహమ్మద్ సిరాజ్, హర్షిత్ రాణా పేస్ బాధ్యతలు పంచుకోనున్నారు. స్పెషలిస్ట్ స్పిన్నర్‌గా కుల్దీప్ యాదవ్ చోటుకు డోకా లేదు. పిచ్ పేస్ కండిషన్స్‌కు అనుకూలంగా ఉంటే వాషింగ్టన్ సుందర్ స్థానంలో పేస్ ఆల్‌రౌండర్ నితీష్ కుమార్ రెడ్డి బరిలోకి దిగుతాడు. న్యూజిలాండ్‌తో తొలి వన్డే ఆడే భారత తుది జట్టు(అంచనా) శుభ్‌మన్ గిల్(కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్(వైస్ కెప్టెన్), కేఎల్ రాహుల్(కీపర్), రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్/ నితీష్ కుమార్ రెడ్డి, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్, కుల్దీప్ యాదవ్, మహమ్మద్ సిరాజ్..

# ఆస్ట్రేలియాదే 'యాషెస్'

### ఆఖరి టెస్టులో ఇంగ్లండ్‌కు ఘోర పరాభవం

**న్యూఢిల్లీ:** ప్రతిష్టాత్మక యాషెస్ సిరీస్ 2025-26లో భాగంగా ఆఖరి టెస్ట్‌ను ఆస్ట్రేలియా విజయంతో ముగించింది. ఇప్పటికే సిరీస్ కైవసం చేసుకున్న ఆస్ట్రేలియా సిడ్నీ వేదికగా జరిగిన ఆఖరి టెస్ట్‌లోనూ 5 వికెట్లతో ఇంగ్లండ్‌ను చిత్తు చేసింది. ఈ సిరీస్‌లో పూర్తి ఆధిపత్యం చెలాయించిన ఆసీస్ 41తో యాషెస్ సిరీస్‌ను నిలబెట్టుకుంది. నాలుగో టెస్ట్‌లో గెలిచి ఉత్సాహం కనబర్చిన ఇంగ్లండ్‌కు ఆఖరి టెస్ట్‌లో ఘోర పరాభావం ఎదురైంది. 302/8 ఓవర్‌నైట్ స్కోర్‌తో ఆఖరి రోజు ఆటను ప్రారంభించిన ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో 88.2 ఓవర్లలో 342 పరుగులకు కుప్పకూలింది. ఓవర్‌నైట్ బ్యాటర్, సెంచరీ హీరో జాకోబ్ బెతెల్( 265 బంతుల్లో 15 ఫోర్లతో 154)ను మిచెల్ స్టార్క్ ఔట్ చేశాడు. ఓవర్‌నైట్ స్కోర్‌కు అతను 12 పరుగులు మాత్రమే చేశాడు. జోష్ టంగ్(6) సాయంతో మాథ్యూ పోట్స్(18 నాటౌట్) కాసేపు పోరాడినా.. మిచెల్ స్టార్క్ ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌కు తెరదించాడు. జోష్ టంగ్‌ను క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. ఆస్ట్రేలియా బౌలర్లలో మిచెల్ స్టార్క్(3/72), బ్యూ వెబ్‌స్టార్(3/64)మూడేసి వికెట్లు తీయగా.. మైఖేల్ నేసర్ ఒక వికెట్ పడగొట్టాడు. స్కాట్ బోలాండ్ రెండు వికెట్లు తీసాడు. 183 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యాన్ని అందుకున్న ఆస్ట్రేలియా ముందు 160 పరుగుల లక్ష ్యం నమోదైంది. వన్డే తరహా బ్యాటింగ్‌తో ఆసీస్ 31.2 ఓవర్లలో 5 వికెట్లకు 161 పరుగులు చేసి సునాయస విజయాన్నందుకుంది. ట్రావిస్ హెడ్(29), జాక్ వెదరాల్డ్(34), మార్నస్ లబుషేన్(37) రాణించారు. ఇంగ్లండ్ బౌలర్లలో జోష్ టంగ్(3/42) మూడు వికెట్లు తీయగా.. విల్ జాక్స్ ఒక వికెట్ పడగొట్టాడు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 97.3 ఓవర్లలో 384 పరుగులకు ఆలౌటైంది. జోరూట్(160) సెంచరీతో చెలరేగగా.. హ్యారీ బ్రూక్(84) హాఫ్ సెంచరీతో రాణించాడు. ఆసీస్ బౌలర్లలో మైఖేల్ నేజర్(4/60) నాలుగు వికెట్లు తీయగా.. మిచెల్ స్టార్క్, స్కాట్ బోలాండ్ రెండేసి





వికెట్లు పడగొట్టారు. కామెరూన్ గ్రీన్, మార్నస్ లబుషేన్ తలో వికెట్ తీసారు. అనంతరం ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 567 పరుగుల భారీ స్కోర్ చేసింది. ట్రావిస్ హెడ్(163), స్టీవ్ స్మిత్(138) సెంచరీలతో చెలరేగగా.. బ్యూ వెబ్‌స్టర్(71 నాటౌట్) హాఫ్ సెంచరీతో రాణించాడు. ఇంగ్లండ్ బౌలర్లలో బ్రైడన్ కార్స్, జోష్ టంగ్ మూడేసి వికెట్లు తీయగా.. బెన్ స్టోక్స్ రెండు వికెట్లు పడగొట్టాడు.

# 90%కి పైగా ఉద్యోగార్థులు ఎఐ వినియోగం!

### లింక్డ్‌ఇన్ సర్వేలో తాజా అంశాలు వెల్లడి




**న్యూఢిల్లీ, జనవరి 8:** దేశంలోని 90 శాతానికి పైగా నిపుణులు ఉద్యోగాల కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)ను ఉపయోగించుకోవాలని యోచిస్తున్నారని ప్రముఖ ప్రొఫెషనల్ నెట్‌వర్క్ ప్లాట్‌ఫామ్ లింక్డ్‌ఇన్ తన తాజా నివేదికలో వెల్లడించింది. ఏఐ కేవలం ఉత్పాదకతను పెంచే సాధనంగానే కాకుండా, ఉద్యోగార్థులలో ఆత్మవిశ్వాసాన్ని నింపే సాధనంగా కూడా మారుతోందని పేర్కొంది. 66 శాతం మంది అభ్యర్థులు ఏఐ వాడకం వల్ల తమ ఇంటర్వ్యూ కాన్ఫిడెన్స్ పెరిగిందని అభిప్రాయపడ్డారు. అదే సమయంలో మరో ఆసక్తికరమైన విషయం కూడా బయటపడింది. దేశంలో 72 శాతం మంది చురుకుగా కొత్త ఉద్యోగం కోసం చూస్తున్నప్పటికీ, వారిలో 84 శాతం మంది తాము సిద్ధంగా లేమని తెలిపారు. నియామక ప్రక్రియలో ఏఐ వినియోగం పెరగడం, ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలు వేగంగా మారడం, తీవ్రమైన పోటీ వంటివి ఈ అభద్రతకు కారణాలుగా ఉన్నాయి. ప్రస్తుత నియామక ప్రక్రియ చాలా పెద్దదిగా ఉందని 77 శాతం మంది, ఇది వ్యక్తిగతం కానిదిగా మారిందని 66 శాతం మంది అభిప్రాయపడ్డారు. ఈ పరిణామాలపై లింక్డ్‌ఇన్ ఇండియా న్యూస్ సీనియర్ మేనేజింగ్ ఎడిటర్ నిరజితా బెనర్జీ స్పందించారు. భారత జాబ్ మార్కెట్‌లో కెరీర్లను నిర్మించడంలో, ప్రతిభను అంచనా వేయడంలో ఏఐ ఇప్పుడు ఒక పునాదిగా మారింది. తమ నైపుణ్యాలు అవకాశాలుగా ఎలా మారతాయో, నియామక నిర్ణయాలు ఎలా తీసుకుంటారో అభ్యర్థులకు స్పష్టత అవసరం. ఏఐ టూల్స్ ఈ అంతరాన్ని తగ్గించగలవని వివరించారు. 2022 ఆరంభంతో పోలిస్తే ప్రస్తుతం ఒక్కో ఉద్యోగానికి దరఖాస్తుదారుల సంఖ్య రెట్టింపు అయిందని, పోటీని తీవ్రతరం చేసిందని లింక్డ్‌ఇన్ డేటా చెబుతోంది. మరోవైపు అర్హులైన అభ్యర్థులను గుర్తించడం గతేడాదితో పోలిస్తే కష్టంగా మారిందని 74 శాతం మంది రిక్రూటర్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రాంప్ట్ ఇంజనీర్, ఏఐ ఇంజనీర్, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ వంటి ఉద్యోగాలకు ఈ ఏడాది డిమాండ్ శరవేగంతో పెరుగుతున్నట్లు లింక్డ్‌ఇన్ అంచనా వేసింది.

## వాణిజ్యం




# వెనిజులా చమురు కొనుగోలుకు రిలయన్స్ ఆసక్తి!

**జామ్‌నగర్, జనవరి 8:** భారత్‌లో ప్రైవేటురంగ చమురు దిగ్గజం రిలయన్స్ గురువారం తాము వెనిజులా చమురును కొనుగోలుచేసేందుకు యోచిస్తున్నట్లు వెల్లడించింది. అయితే అమెరికాయేతర బయ్యర్లను అనుమతిస్తే తాము కొనుగోలుచేస్తామని రిలయన్స్ వెల్లడించింది. వెనిజులాతో కలుపుకుని ప్రపంచ వ్యాప్తంగా ఇంధన వాణిజ్యంపై జరుగుతున్న చర్చల క్రమంలో రిలయన్స్ ఈప్రకటన చేసింది. ఇందుకు ప్రభుత్వ అనుమతులు కూడా సాధించాల్సి ఉంటుంది. అలాగే అంతర్జాతీయ ఆంక్షలు రిలయన్స్‌పై ప్రభావం పడకుండా ఉంటేనే తాము వె నిజులా చమురును కూడా కొనుగోలుచేసి శుద్ధిచేస్తామని ప్రకటించింది. జామ్‌నగర్‌లోప్రపంచంలోనే అతిపెద్ద చమురుశుద్ధి కర్మాగారం ఉన్న రిలయన్స్ రష్యా చమురుపై ఆంక్షలు ఎదుర్కొన్న క్రమంలో ఇపుడు వెనిజులా చమురు కొనుగోలుకు ఆసక్తి చూపిస్తోంది. రష్యా చమురు కొనుగోలుచేస్తున్నందుకుగాను భారత్‌పై అమెరికా అదనంగా 25శాతం సుంకాలు విధించిన సంగతి తెలిసిందే. ఇపుడు రష్యాతో వాణిజ్యసంబంధాలున్న అన్ని దేశాలపైనా 500శాతం సుంకాలు విధించేందుకు ట్రంప్ ప్రతినిధులు, సెనేట్‌లలో బిల్లును ప్రతిపాదిస్తున్నారు. అదే జరిగితే రష్యా చమురుకొనుగోలుచేసే అన్ని దేశాలు ట్రంప్ కత్తికి గురికాక తప్పదు. గ్లోబల్ చమురు వాణిజ్య ధోరణులపై మంచి పట్టు ఉన్న రిలయన్స్ వీటన్నింటినీ అధిగమించేందుకు వెనిజులా చమురు కొనుగోలుచేయగలమని అయితే ట్రంప్ సుంకాలు ప్రభావం లేకుండా ఉంటే వెనిజులా చమురు మేమే కొంటామని ప్రకటించింది.




### ట్రంప్ 500శాతం

# సుంకాల ఎఫెక్ట్

### రూ.9 లక్షలకోట్ల కంపెనీల సంపద ఆవిరి!

### భారీ నష్టాలు చవిచూసిన సెన్సెక్స్, నిఫ్టీ

**ముంబయి, జనవరి 8:** దేశీయ స్టాక్ మార్కెట్‌లు గురువారం భారీ నష్టాలతో ముగిశాయి. సూచీలు వరుసగా నాలుగో సెషన్‌లోనూ నష్టాలను చవిచూశాయి. భారత్, అమెరికా మధ్య నెలకొన్న వాణిజ్య సందిగ్ధత సూచీలపై ఒత్తిడి పెంచింది. రష్యాకు చెక్ పెట్టేందుకు భారత్ తదితర దేశాలపై 500 శాతం సుంకాలు విధించేందుకు ఉద్దేశించిన బిల్లుకు ట్రంప్ ప్రభుత్వం సిద్ధం కావడం మార్కెట్ సెంటిమెంట్‌ను తీవ్రస్థాయిలోప్రభావితంచేసింది. దీనితో మార్కెట్లలో భారీ కంపెనీల షేర్లన్నీ నష్టాలు చవిచూసాయి.

అదే సమయంలో విదేశీ పెట్టుబడిదారులు అమ్మకాలకు మొగ్గు చూపడం, భౌగోళిక ఉద్రిక్తతలు వంటి అంశాలు మార్కెట్ నష్టాలకు మరింత ఆజ్యం పోశాయి. సెన్సెక్స్ ఒక దశలో 800 పాయింట్లకు పైగా నష్టపోయింది. చివరకి 780 పాయింట్ల నష్టంతో 84,181 పాయింట్ల వద్ద స్థిరపడింది. నిఫ్టీ 50 రోజుల కనిష్ఠానికి చేరుకుని, 26,000 దిగువన ముగిసింది. మార్కెట్లు భారీగా నష్టపోవడంతో పెట్టుబడిదారుల సంపదగా భావించే బీఎస్ఈలో కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ ఒక్కరోజే రూ.9 లక్షల కోట్లు ఆవిరైంది. బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.480 లక్షల కోట్ల నుంచి రూ.472 లక్షల కోట్లకు తగ్గింది. సెన్సెక్స్ ఉదయం 84,778 పాయింట్ల వద్ద నష్టాలతో ప్రారంభమైంది. రోజంతా అమ్మకాల ఒత్తిడితో నష్టాల్లోనే కొనసాగుతూ, 84,180 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ 264 పాయింట్లు నష్టపోయి 25,876 పాయింట్ల వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ 30 సూచీలో ఎటర్నల్, ఐసీఐసీఐ బ్యాంకు, బజాజ్ ఫైనాన్స్, బీఎస్ఎన్ఎల్ మినహా మిగిలిన అన్ని స్టాక్స్ నష్టాల్లో ముగిశాయి.

గడిచిన నాలుగు రోజుల్లో మొత్తంగా 1,500 పాయింట్లు (1.7 శాతం) నష్టపోయిన సెన్సెక్స్ రూ.9.19 లక్షల కోట్ల నష్టాల్ని మిగిల్చింది. దీంతో ప్రస్తుత భారత కంపెనీల విలువ రూ.472 లక్షల కోట్లకు దిగజారింది. 500శాతం సుంకాలు వేస్తామన్న ట్రంప్ హెచ్చరికలతో మార్కెట్లు భారీ నష్టాల్ని చవిచూడాల్సి వచ్చింది. విదేశీ ఇన్వెస్టర్లు అమ్మకాలకు పాల్పడటం, వెనెజులా సంక్షోభం వంటి అంతర్జాతీయ రాజకీయ పరిణామాలు కూడా మార్కెట్ నష్టాలకు కారణాలుగా మారాయి. సెన్సెక్స్ నష్టాలతోనే ప్రారంభమైంది. ఏ దశలోనూ కోలుకోలేకపోయింది. ఒకదశలో సెన్సెక్స్ 800 పాయింట్ల వరకు నష్టపోయింది. ఇక డాలర్ తో రూపాయి మారకం విలువ 89.95గా ఉంది. దేశీయ సంస్థల్లో ఐసిఐసిఐ, బజాజ్ ఫైనాన్స్, ఎటెర్నల్, బీఈఎల్ వంటి సంస్థలు మినహా మిగిలిన సంస్థలు నష్టాల బాటలోనే ముగిశాయి. బిఎస్ఇలో 1039 కంపెనీల షేర్లు పెరిగితే ఏకంగా 3157 కంపెనీలషేర్లు డీలాపడ్డాయి. 170 కంపెనీలు మాత్రం స్థిరంగా కొనసాగాయి.

బిఎస్ఇలో మిడ్‌క్యాప్ సూచీ 1.99శాతం, స్మాల్‌క్యాప్‌సూచీ 1.97శాతం చొప్పున క్షీణించాయి. ఇక ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు ఫిబ్రవరి 25 నాటి సెటిల్‌మెంట్ 0.79శాతం దిగజారి ఔన్స్ ఒక్కింటికి రూ.1,36,924చొప్పున కొనసాగింది. కమోడిటీ మారెనకట్‌లో బ్రెంట్ ముడిచమురు మార్చి సెటిల్‌మెంట్ నాటికి 64 సెంట్లు పెరిగి బ్యారెల్‌కు 60.60 డాలర్ల ధరలు కొనసాగాయి.

# టాప్ 20 బ్యాంకుల్లో మార్కెట్‌క్యాప్ భారీ వృద్ధి!




**ముంబయి, జనవరి 8:** స్టాక్ ఎక్ఛేంజిల్లో జాబితా అయిన టాప్ 20 బ్యాంకుల్లో మార్కెట్ విలువలు మూడోత్రైమాసికంలో భారీ లాభాలు చూసాయి. మరింతగా వృద్ధి అంచనాలు కూడా పెరిగాయి. ఈక్విటీ సూచీలు పండుగ డిమాండ్; ఇటీవల జీఎస్టీ పన్నుల హేతుబద్ధీకరణ సంస్కరణలు వంటివి బ్యాంక్ సూచీలకు లాభాలు పండిస్తాయని ఎస్అండ్‌పి గ్లోబల్ మార్కెట్ ఇంటెలిజెన్స్ వెల్లడించింది.ప్రైవేటు బ్యాంకులు మరింతగా దూసుకుపోతాయని, ప్రభుత్వరంగ బ్యాంకులు మాత్రం గత త్రైమాసికంలో వెనకబడినట్లు తెలుస్తోంది. ఐడిఎఫ్‌సి ఫస్ట్‌బ్యాంకు భారీ పెరుగుదలను నమోదుచేసింది. 43.8శాతం త్రైమాసికంలో వృద్ధిని నమోదుచేసింద.ఇ ముంబయి కేంద్రంగా ఉన్న ఈ బ్యాంకు 17వ స్థానంనుంచి 13వ ర్యాంక్‌కు ఎగబాకింది. ఫెడరల్‌బ్యాంకు, ఎయు స్మాల్‌ఫైనాన్స్ బ్యాంకులు 38.6శాతం, 36.1శాతం చొప్పున వృద్ధిని నమోదుచేసాయి. టాప్ పది మార్కెట్ క్యాప్ రాంకులపరంగాచూస్తే హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు నంబర్‌వన్‌గానే నిలిచింది. 4.4శాతం పెరిగింది. ఐసిఐసిఐబ్యాంకు రెండోస్థానంలో నిలిచి 0.3శాతం క్షీణించింది. 12.6శాతం మార్కెట్ క్యాప్ వృద్ధితో భారతీయ స్టేట్‌బ్యాంకు భారీ దూకుడును కనబరిచింది. స్పెక్ట్రమ్ చివరిలో ప్రభుత్వరంగ ఇండియన్ ఓవర్సీస్‌బ్యాంకు, యూకో బ్యాంకులు మరింతగా వెనకబడ్డాయి. వాటి మార్కెట్ విలువలు 8.6శాతం, 3.4శాతం చొప్పున క్షీణించడం గమనార్హం.

# పుత్రశోకంలో వేదాంత అగర్వాల్

### సంపాదనలో 75% సమాజసేవకే వెచ్చిస్తా: వేదాంత చీఫ్ అనిల్ అగర్వాల్



**ముంబయి, జనవరి 8:** కుమారుడు అగ్నివేశ్ అగర్వాల్ (49) అమెరికాలో అకాల పాలవడంతో పుత్రశోకంలోమునిగిపోయిన అనిల్‌అగర్వాల్ తన సంపాదనలో 75 శాతం సమాజ సేవకు కేటాయిస్తానని గతంలో చేసిన వాగ్దానాన్ని ఆయన మరోసారి పునరుద్ఘాటించారు. అమెరికాలో స్కీయింగ్ ప్రమాదంలో గాయపడిన అగ్నివేశ్, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకుంటున్న సమయంలో గుండెపోటుతో కన్నుమూశారు. కుమారుడి మరణంతో తీవ్ర ఆవేదనకు గురైన అనిల్ అగర్వాల్, సోషల్‌మీడియాలో భావోద్వేగపూరిత పోస్ట్ పెట్టారు. నా కొడుకు అగ్ని మమ్మల్ని ఇంత త్వరగా విడిచి వెళ్ళిపోయాడు. నా స్నేహితుడిలా ఉండేవాడు. మా సంపాదనలో 75 శాతం సమాజానికి ఇస్తానని వాగ్దానం చేశాను. ఆ మాటను ఈరోజు మరోసారి పునరుద్ఘాటిస్తున్నాను. నువ్వు లేకుండా ఈ మార్గంలో ఎలా నడవాలో తెలియడం లేదు, కానీ నీ ఆలోచనలను ముందుకు తీసుకెళతాను" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మరణించిన అగ్నివేశ్, వేదాంత అనుబంధ సంస్థ తల్వండి సాబో పవర్ లిమిటెడ్‌కు ఛైర్మన్‌గా వ్యవహరించారు. సుమారు రూ. 27వేల కోట్ల సంపద కలిగిన అనిల్ అగర్వాల్‌కు అగ్నివేశ్‌తో పాటు కుమార్తె ప్రియా అగర్వాల్ కూడా ఉన్నారు. అగ్నివేశ్ మృతి పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సైతం దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ కష్టకాలంలో భగవంతుడు అగర్వాల్ కుటుంబానికి ధైర్యాన్ని ఇవ్వాలని ఆకాంక్షిస్తూ ట్వీట్ చేశారు. కుమారుడిని కోల్పోయిన తీవ్ర దుఃఖంలోనూ తన దాతృత్వ సంకల్పాన్ని అనిల్ అగర్వాల్ మరోసారి చాటడం గమనార్హం.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No. 64861/96 , Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14